ఆంధ్ర ప్రదేశ్

అక్టోబరు - నవంబరు, 1972

50 పైసలు

875/APP/71

గ్రామీణ సమాజ వ్యవస్థలో
వున్న ఆసమానత్వాలను
తొలగించడానికి భూ సంస్క-
రణలు సమర్థవంతంగా
అమలు పరచబడుతాయి

--- ముఖ్యమంత్రి

ముల్కీ నిబంధనల విషయంలో

ప్రధాని పంచసూత్ర పథకం

ముల్కీ నిబంధనలకు సంబంధించి నవంబరు 27వ తేదీన లోక్‌సభలో ప్రధాన మంత్రి ప్రకటించిన పంచసూత్ర పథకంలోని అంశాలు :—

1. ముల్కీ నిబంధనలలో నిర్దేశించబడిన నివాసార్హత కేవలం తెలంగాణా ప్రాంతంలోని నాన్ గజెటెడ్ ఉద్యోగాలలోనూ, తహసిల్దారు, సివిల్ అసిస్టెంట్ సర్జను, జూనియర్ ఇంజనీరు ఉద్యోగాలలోనూ జరిగే నియామకాలకు మాత్రమే వర్తిస్తుంది.

   అయితే ఇరుప్రాంతాలకు సంబంధించిన సచివాలయం, శాఖాధిపతుల కార్యాలయాలు, రాష్ట్రప్రభుత్వ సంస్థలవంటి సమిష్టి కార్యాలయాల విషయంలో నాన్ గజెటెడ్ ఉద్యోగాల ఖాళీలను నేరుగా నింపేటప్పుడుమాత్రం ప్రతిమూడు ఖాళీల విభాగంలోనూ రెండవ ఖాళీ నింపడానికి యీ నిబంధనలు వర్తిస్తాయి.

2. ఈ ప్రత్యేక రక్షణలు తెలంగాణా ప్రాంతంలో 1980 డిసెంబరు మాసాంతం వరకు అమలులో ఉంటాయి. అయితే హైదరాబాదు, సికింద్రాబాదు నగరాలలో ఈ ప్రత్యేక రక్షణలు 1977 డిసెంబరు మాసాంతంవరకు మాత్రమే కొనసాగుతాయి.

3. ఈ రెండు ప్రాంతాల్లోనూ ఆయా ప్రాంతాల్లో పనిచేస్తున్న ప్రభుత్వోద్యోగులకు ప్రమోషన్ల విషయంలో తగినన్ని అవకాశాలకు వీలుకల్పించే నిమిత్తం వివిధ స్థాయిలకు చెందిన ఉద్యోగాలు మొదటి లేక రెండవ గజెటెడ్ స్థాయివరకు ప్రాంతీయీకరణ చేయబడతాయి. అయితే అఖిల భారత సర్వీసులలో నియామకాలకు నేరుగా మార్గం ఏర్పరచే ఉద్యోగాలకు యిది వర్తించదు.

4. ప్రస్తుతం హైదరాబాదు, సికిందరాబాదు నగరాలలోని విద్యా సౌకర్యం విషయంలో, సాంకేతిక. వృత్తి రంగాలతో సహా తెలంగాణా విద్యార్థులకు గల విద్యా సౌకర్యాలకు ఏ విధంగానూ భంగం వాటిల్లదు. ఈ నగరాలలో తగువిధంగా విద్యా సౌకర్యాలు విస్తరింపబడుతాయి. నివాసార్హత ప్రాతిపదికగా గల ఏ విధమైన పరిమితులు యీ అదనపు సౌకర్యాలకు వర్తించవు.

5. హైదరాబాదు, సికిందరాబాదు నగరాలలో సమిష్టి పోలీసు ఫోర్సు ఉంటుంది. రాష్ట్రప్రభుత్వంతో సంప్రదించి దీనికి సంబంధించిన వివరాలను రూపొందించడం జరుగుతుంది.

ఈ ఏర్పాట్లు సక్రమంగా అమలు జరిగేందుకు కేంద్రప్రభుత్వం తగిన యంత్రాంగాన్ని రూపొందిస్తుంది.

ఈ నిర్ణయాన్ని అమలు పరచడానికి అవసరమైన శాసనాన్ని త్వరలోనే సభలో ప్రవేశపెట్టడం జరుగుతుంది.

ఆంధ్ర ప్రదేశ్

సంపుటి : 16	అక్టోబరు - నవంబరు, 1972	సంచిక : 12
సంపుటి : 17	ఆశ్వయుజ - మార్గశిర, 1894	సంచిక : 1

ప్రధాన సంపాదకులు : పెండ్యాల వామనరావు సంపాదకులు : కప్పగంతుల లక్ష్మణశాస్త్రి

దేశమును ప్రేమించుమన్నా
మంచియున్నది పెంచుమన్నా
వట్టిమాటలు కట్టిపెట్టోయ్
గట్టిమేల్ తలపెట్టవోయ్

సాలు చందా ఆరు రూపాయలు

వెల : 50 పైసలు

రిజిష్టర్డు నెం : 133

చివరి అట్ట :— మనోహరమైన ఒక గ్రామీణ దృశ్యం

ఈ సంచికలోని రచయితలు వెలిబుచ్చిన అభిప్రాయాలు తప్పనిసరిగా ప్రభుత్వానికి సంబంధించినవిగా భావించనక్కరలేదు.

సంచికలో

పేజీ

విమానంలో తిరుపతి యాత్ర


తిరుపతికి ప్రతిరోజు హైదరాబాదు, బెంగుళూరు, మద్రాసులనుంచి విమాన సర్వీసు ప్రారంభం కావడంతో పర్యటనల అభివృద్ధి విషయంలో—ముఖ్యంగా యాత్రిక పర్యటనల అభివృద్ధి విషయంలో ఒక గొప్ప విజయాన్ని సాధించినట్లయింది తిరుపతిలో విమానాశ్రయాన్ని నిర్మించి దానిని ఇండియన్ ఎయిర్ లైన్స్ సర్వీసుతో కలపాలనే ఆలోచన చాలా కాలం నించి వుంది. ఆంధ్రప్రదేశ్ ఏర్పాటైన తర్వాత యీ అవసరం మరింత ఎక్కువయింది. తిరుపతికి వెళ్ళ దలచుకున్న వారుగాని, రాష్ట్రంలోని దక్షిణాది జిల్లాలకు పోవాలనుకున్న వారుకాని తక్కువ సమయంలో చేరుకోవాలంటే మద్రాసుకు విమానంలో వెళ్ళి అక్కడనుంచి ఓ వందమైళ్ళు కారులో ప్రయాణం చేయాల్సి వుండేది. నిజానికి తిరుపతి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వున్నప్పటికీ మద్రాసుతో చాలా సన్నిహితంగా ముడిపడి వుంది. అందువల్లనే ఇటీవల ఒక ఔత్తరాహుడు మన ముఖ్యమంత్రి శ్రీ పి.వి. నరసింహారావుగారిని "తిరుపతి మీ రాష్ట్రంలో వుందా!" అని అమాయకంగా ప్రశ్నించవలసి వచ్చింది. నవంబరు 7వ తేదీన తిరుపతిలో విమానాశ్రయానికి ప్రారంభోత్సవం జరుగుతున్న సందర్భంలో ముఖ్యమంత్రి యీ సంగతి చెప్తూ ఇకముందు యిలాంటి తప్పుడు అభిప్రాయానికి తావులేదు అన్నారు

ఏడాది పొడుగునా దేశంలోని అన్ని ప్రాంతాలనుంచీ అధికసంఖ్యలో యాత్రికులు ఏడుకొండలస్వామిని సందర్శించడానికి వస్తూవుండడంవల్ల తిరుపతిని ఒక జాతీయ యాత్రా కేంద్రంగా చెప్పవలసి వుంటుంది ఈ క్షేత్రం భక్తులకు పుణ్యవంతమూ, పవిత్రవంతమైనదిగా విలసిల్లడంవలనే గాక, అక్కడ నెలకొన్న గంభీర వాతావరణము. కొండచరియలు సానువుల నుండి సుమనోహర ప్రకృతి సౌందర్యంవల్ల కూడా యీ అపూర్వ యాత్రాకేంద్రం ప్రాముఖ్యం మరింతగా యినుమడిస్తున్నది

తిరుపతికి విమానాల్లో వచ్చేవాళ్ళూ, వెళ్ళేవాళ్ళూ, అధికసంఖ్యలో వుండడం చూస్తే అన్ని ప్రాంతాల్లోని ప్రజలూ యీ విమానసర్వీసు గురించి ఎంత ఆతురతతో ఎదురుచూసారో అర్థమవుతుంది ఈ నాడు తిరుపతికి విమాన సౌకర్యం కల్పించబడింది. ఇప్పుడు తిరుపతి విమానాశ్రయంలో రోజుకు ఎనిమిదిసార్లు విమానాలు ఆగుతున్నాయి కొత్తగా ఏర్పాటైన విమానాశ్రయానికి యిది కాస్త పెద్దసంఖ్యే ఇక్కడ చక్కటి టెర్మినల్ భవనం వుంది

వైశాల్యంలోనూ, జనాభాలోనూ దేశంలో అయిదవ స్థానాన్ని ఆక్రమించే ఆంధ్రప్రదేశ్ వంటి సువిశాల రాష్ట్రంలో ముఖ్యపట్టణాలను కలుపుతూ యింకా ఎక్కువగా విమానసర్వీసులు వుండడం అవసరం ప్రస్తుతం తిరుపతి కాక విశాఖపట్టణం, విజయవాడ, హైదరాబాదు నగరాలకు విమానసర్వీసు పనిచేస్తున్నది. ఇప్పటికే విమానాశ్రయం వున్న నాగార్జునసాగర్‌కు విమానాలు నడిపే ఏర్పాటునుగురించి ముఖ్యమంత్రి, యూనియన్ పౌర విమానయాన యాత్రికశాఖ మంత్రి డా. కరణ్‌సింగ్‌తో చర్చించినప్పుడు ఆయన ఆ విషయం పరిశీలించబడుతుందని హామీ యిచ్చారు. కోస్తా ఆంధ్ర ప్రాంతం మధ్యలోవున్న రాజమండ్రిలోనూ రాయలసీమ నడిబొడ్డున వున్న కడప పట్టణంలోనూ విమానాశ్రయాలున్నాయి. వీటిని కొన్ని ప్రత్యేక సందర్భాలతో మాత్రమే ఉపయోగిస్తున్నారు. ఈ రెండు పట్టణాలను, మంచి విమానాశ్రయం వున్న మరోపట్టణం వరంగల్లును త్వరలో విమానసర్వీసుతో కలపాలని రాష్ట్ర ప్రభుత్వం ఆకాంక్షిస్తున్నది. కేరళలోని కోవలం, తమిళ నాడులోని మహాబలిపురంలలో లాగా నాగార్జునసాగర్‌ను అంతర్జాతీయ యాత్రాకేంద్రంగా అభివృద్ధి చేయాలని రాష్ట్రప్రభుత్వం ఇంతకుముందే కేంద్రాన్ని కోరింది

పైన పేర్కొన్న చర్యలతోపాటు వసతి సౌకర్యములను విస్తృత పరచడంవల్లా, యాత్రాస్థలాలను అభివృద్ధి పరచడంవల్లా, అవసరమైన సౌకర్యాలను కల్పించడంవల్లా ఆంధ్రప్రదేశ్‌లో యాత్రా పర్యటనలు ఎక్కువ కావచ్చు. హుస్సేన్‌సాగర్ వద్ద 10 ఎకరాల స్థలాన్ని ముఖ్యమంత్రితోపాటు డా. కరణ్‌సింగ్ పరిశీలించి, బెంగుళూరులోని అశోకాహోటల్ మాదిరిగా హైదరాబాదులో 5-స్టార్ హోటల్‌ను కేంద్రప్రభుత్వం నిర్మించాలనే రాష్ట్రప్రభుత్వ అభ్యర్థనను సానుభూతితో పరిశీలించడం జరుగుతుందని హామీ యిచ్చారు. ఇది శుభావహం. —పి.వి.ఆర్.



ఆంధ్ర కేసరి ఆదర్శంగా తెలుగువారికి ఒక వ్యక్తిత్వం

పి. వి. నరసింహారావు

భారత దేశంలో యీనాడు ఆంధ్రప్రదేశ్ ప్రముఖమైన స్థానాన్ని ఆక్రమించి వున్నది. అన్ని రంగాలలో పురోగమిస్తూ, తన వ్యక్తిత్వాన్ని మరింతగా ఋజువు చేసుకోవడానికి ప్రయత్నం చేస్తూ వున్నది. అయితే, యితర రాష్ట్రాలతో పోల్చిచూస్తే, యింకా తెలుగువారికి ఒక వ్యక్తిత్వం ఏర్పడలేదు అనిపిస్తుంది. కారణమేమంటే వీరు యితర రాష్ట్రాల్లో చాలా కాలం వరకు యితరులతో కలిసి ఉండడం, కలిసినా కలవకున్నా కలిసి ఉండవల్సిరావడం యివన్నీ చరిత్రలో జరిగినటువంటి ఘట్టాలు. కనుక తెలుగువాళ్ళకొక వ్యక్తిత్వం పునర్నిర్మించుకోవడం అవసరం. ఆ వ్యక్తిత్వం అనే దానిని మనం నిర్మించాలంటే ఒక వ్యక్తి కూడా అవసరం. ఆ వ్యక్తి చుట్టూ అది నిర్మించబడుతూ వుంటుంది. మనం చూస్తుండగానే, మనకు తెలియకుండానే అది నిర్మించబడుతూ ఉంటుంది. ఇప్పుడితర రాష్ట్రాల్లో చరిత్ర ప్రసిద్ధిపొందిన మహావ్యక్తులు ఆయా రాష్ట్రాలకొక వ్యక్తిత్వాన్ని అందించినటువంటివారు, వారిచుట్టూ, వారి గొప్పదనం చుట్టూ అల్లుకొని ఆయా రాష్ట్రాలకొక వ్యక్తిత్వం వచ్చింది. మన ప్రత్యేకత ఏమిటంటే ఎవరికీ వ్యక్తిత్వం రాకుండా చేసుకోవడం. అటువంటి ప్రత్యేకత మనకొకటుంది. ఇంతవరకూ అట్లా పనిచేసుకుంటూ వచ్చినాము. కనీసం యికమీదనైనా ఆ వ్యక్తిత్వాన్ని మన రాష్ట్రానికి, మన తెలుగు వాళ్ళకు కల్పించడానికి మనం దోహదం చేస్తే తొందరగా అది నిర్మాణం అవుతుందనే ఆశగా కూడా ఉంది.

ప్రకాశమానమైన ప్రకాశం

స్వాతంత్ర్య సమరంలో పాల్గొని నాయకత్వం వహించిన అందరు నాయకుల్లో ప్రకాశం పంతులుగారు తెలుగువాళ్ళకు యీ వ్యక్తిత్వాన్ని సంపాదించి పెట్టడంలో, నిర్మాణం చేయించడంలో సమర్థవంతమైనటువంటి వ్యక్తిత్వాన్ని స్వయంగా కలిగి ఉన్నారని నేను నమ్ముతున్నాను. అందుకని ఒక ప్రత్యేక వ్యక్తిత్వాన్ని మనం బాగా నిర్మాణం చేసుకుంటే యిది. కేవలం మన స్వార్థం కొరకు చేసుకుంటున్నదే యిప్పుడున్నటువంటి తెలుగువాళ్ళే కాకుండా రేపు రాబోయేటువంటి తరాల తెలుగువాళ్ళు కూడా యేదో ఒక మనిషిపేరు చెప్పుకుని, ఆ మనిషికి ఉన్నటువంటి పేరు ప్రతిష్ఠలలో వీళ్ళుకూడా భాగస్వాములయేటటువంటి పరిస్థితి కల్పిస్తూ ఉన్నాము. దీనికి యిటీవల జరిగిన కొన్ని సంఘటనలు బాగా పుష్టి యిస్తూ ఉన్నాయి. తెలంగాణా జిల్లాల్లో పెద్దగా ప్రకాశంగారితో స్వయంగా పరిచయాలు ఉన్నటువంటి పరిస్థితి ఏమీ లేదు. ఆదిలాబాదులో, నిజామాబాదులో, మహబూబ్‌నగర్‌లో ఊరికే పుస్తకజ్ఞానంవల్ల తెలుసుకున్నదే కానీ పత్రికల్లో చదివి తెలుసుకున్నదేగానీ, ప్రకాశంగారిని చూచినవాళ్ళగానీ, వారితో స్వయంగా పరిచయం ఉన్నటువంటివారుగానీ, వారితో హృదయపూర్వకంగా బాగా కలిసిపోయి ఉన్నటువంటివారుగానీ చాలా అరుదు. కానీ తెలంగాణా జిల్లాల్లో, ప్రకాశంగారితో స్వయంగా పరిచయం లేనటువంటి యీ వెనుకబడిన జిల్లాల్లో కూడా ప్రకాశంగారి పేరుతో ఎంత ఉత్సాహం వచ్చిందంటే అది అందరికీ కాస్త ఆశ్చర్యాన్నే కలిగించింది. ఎల్లా వస్తుందా ఉత్సాహం? సంబంధంలేని, పరిచయములేని ఉత్సాహం. యీ తెలుగువాళ్ళంతా దౌర్భాగ్యవశాత్తు వేరు వేరు చోట్ల ఉన్నప్పటికీ, ప్రకాశం పేరు మీద వీళ్ళంతా యిప్పుడు ఉత్సాహంగా పని చేస్తున్నారు. ఎందుకిలా కలిసి పనిచేయాలంటే అదే అసలు, వీళ్ళను ఒకటిగా చేసేటటువంటి సూత్రం. మనం నిర్వచించరానటువంటిది, అనిర్వచ

నీయమైనటువంటిది. ఆ సూత్రం తెలుగు వాళ్ళది. ఆ ఐక్యతా సూత్రం యిప్పుడు కనబడుతూ ఉన్నది.

ప్రేరణ

ప్రకాశంగారిని స్మరించుకోవడం, ఆయనకు స్మారక చిహ్నాలు నిర్మించుకోవడం వచ్చేటటువంటి తరాలవారికి కూడా ప్రకాశం పంతులుగారి జీవిత చరిత్ర నుండి వారు ఏ ఆదర్శాలకొరకు పోరాడినారో, ఆ ఆదర్శాలతో ప్రేరణపొందే అవకాశం కల్పించడం మనందరిమీదా ఒక బాధ్యతగా ఉంది. ప్రకాశం పంతులు గారి శత జయంతి ఉత్సవాలు జరుపుకునే సందర్భంలో ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం ఒక సంఘాన్ని నియమించింది. ఆ సంఘానికి ముఖ్యమంత్రి అధ్యక్షులుగా ఉన్నారు. పెద్దలు విశ్వనాథం గారు తదితర 15, 18 మంది సభ్యులు ముఖ్యంగా ప్రకాశం పంతులుగారికి చాలా సన్నిహితులుగా వున్నటువంటివారు సభ్యులుగా వున్నారు. ఈనాడు యీ సంఘం ద్వారా ప్రారంభించబడిన కార్యక్రమాల ఉద్దేశం ఒకటే. ప్రకాశం పంతులుగారి జీవితాన్ని ప్రజలకు అందివ్వడం. భావి తరాలవారికి అందివ్వడం. స్మారక చిహ్నాలద్వారా కేవలం ఏదో ప్రకాశం పంతులుగారికి మనం ఒరగ బెడుతున్నామనే మాట కాకుండా, భావి తరాల లాభం దృష్ట్యా యీ కార్యక్రమాన్ని మనం జరపడమనేది ముఖ్యమైన ఉద్దేశం. అనేక స్మారకాలు మనం చేసుకుంటూ వుంటాం. కాని అవి కేవలం లాంఛనప్రాయంగా మాత్రమే వుండిపోతాయి. కాని ప్రకాశం పంతులు గారి వ్యక్తిత్వాన్ని గురించి ఆ వ్యక్తిత్వానికి సంబంధించిన ఒక మహోహ. అంటే ప్రజల మనస్సుల్లో ఆయనను గురించి ఉన్నటువంటి ఒక ఉదాత్తమైన అభిప్రాయం, ప్రగాఢమైనటువంటి ఒక ప్రేమానురాగం, భక్తి, యీ అన్నింటికి అనుగుణంగా మనం యీ కార్యక్రమాన్ని రూపొందించవలసి వుంటుంది, అని ప్రకాశం గారి శతజయంతి సంఘంవారు నిర్ణయించినారు.

ఆంధ్రులకు ఏకైక నాయకుడుగా వుండి యావద్భారత దేశంలో తెలుగువారికి ఒక వన్నె తెచ్చినటువంటి యీ మహా నాయకుణ్ణి మనం హృదయాలలో నిలుపుకోవడమే కాకుండా, మన చరిత్రలో తెలుగు వాళ్ల చరిత్రలో చిరస్థాయిగా ఆయనవల్ల మనకు రావలసినటువంటి ప్రేరణను ఎప్పుడుకూడా మాసిపోనివ్వకుండా చేయాలనేటువంటి కృతనిశ్చయం మనకు యీ నాడు ఆంధ్రప్రదేశ్ లోని అన్ని జిల్లాల్లో, అన్ని గ్రామాల్లో కనిపిస్తున్నది. యీ సంవత్సరంలోపల ఏ కార్యక్రమం ఎక్కడ చేసినప్పటికీ, ఏ భవనం ఎక్కడ కట్టుకున్నప్పటికి ఏ ప్రాజెక్టు ఎక్కడ నిర్మించుకున్నప్పటికి, అది ప్రకాశం పంతులుగారి పేర నిర్మించుకుందాం. దానికి ప్రకాశం గారి నామకరణం చేద్దామని ఒక నిర్ణయానికి వచ్చినాము.

ప్రకాశంగారి పేరుమీద భవనాలు కట్టుకుందాం. ఇదివరకు కట్టిన వాటికి ప్రకాశం గారి పేరు పెట్టుకుందాం. ఏదంటే అది మేము చేస్తామని ఎన్నడూ లేనంత ఉత్సాహంతో యీనాడు యీ అపరిచితమైనటువంటి ప్రాంతాలు ముందుకొస్తున్నాయంటే, అదీ యిటీవలి చరిత్రలో జరిగిన సంఘటనల తర్వాత యివి జరుగుతున్నదంటే చాలా ప్రత్యేకమైనటువంటి విషయం. ఇది కొంతవరకు తెలుగువాళ్ళ ఐక్యత కొరకు గ్యారంటీగా ఉంటుందని కూడా నేననుకుంటూ ఉన్నాను. అందుకని యిదంతా మనం మన చరిత్రను, మన వ్యక్తిత్వాన్ని, మన ఐక్యతను పటిష్ఠం చేసుకోవడానికి చేస్తున్న కార్యక్రమమే గాని మరొకటి కాదు.

ప్రతి గ్రామంలో ఏదో ఒక కార్యక్రమం ఏదో స్మారకం, ఏదో ఒక భవనం, ప్రకాశంగారి పేర మన రాష్ట్రంలో వుండి తీరాలని ఒక నిర్ణయం తీసుకోవడం జరిగింది. దానికి ఉత్తరువులు కూడా జారీ చేస్తాము. ఈ ఒక సంవత్సరంలోపల ఏమి జరిగినప్పటికి ప్రకాశం పంతులు గారి పేర జరిగి తీరాలని అనుకున్నాము. ఏమైనా సరే, యీ ప్రేరణ ఎన్నడు కూడా మాసిపోకుండా, ప్రజలు మరచిపోకుండా, భావితరాలవారు దీన్ని గూర్చి సంపూర్ణమైనటువంటి పరిజ్ఞానం కలిగి వుండేట్లు చేయాలని నిర్ణయం చేశాము.

చరిత్ర

ప్రకాశం పంతులుగారి రచనలు జీవిత చరిత్ర అధికారికంగా రాయడమనేది కూడా జరుగవలసి వున్నది. ఇదికాక వారి జీవిత చరిత్ర అంటే ఆంధ్రదేశ రాజకీయ చరిత్ర అనే దృష్టితో కూడా వ్రాయించవలసిన అవసరం వున్నది. దానికి సంబంధించినటువంటి పూర్తి భోగట్టా సేకరించి, దానికి సంబంధించిన పరిజ్ఞానం వున్నటువంటి పెద్దలను అందరిని కూడా సంప్రదించి, అధికారికంగా వ్రాయించవలసిన అగత్యాన్ని కూడా గుర్తించి దానికి కావలసిన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

సమగ్రమైనటువంటి, సర్వతోముఖమైనటువంటి వ్యక్తిత్వం. ఎన్ని రంగాల్లో ప్రకాశించిందో, అన్ని రంగాల్లో కూడా యింతో అంతో ఆయనకు స్మారక చిహ్నంగా, ఆయన వదలి పోయినటువంటి అడుగుజాడలు ఆ రంగాల్లో ఉంటే మంచిది. ఆ రంగాల్లో పనిచేసే వారందరు ఆయన స్మారకాన్ని అన్నిరంగాల్లో కూడా చిరస్థాయిగా ఉండేటట్లు ప్రయత్నాలు చేసుకోవాలి. ప్రకాశంగారి వ్యక్తిత్వం, మనకొక ధరావత్తుగా అమూల్యమైనటువంటి వారసత్వంగా భావించి యిది ఎక్కడా పొల్లుపోకుండా దీన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉంది.

ఆంధ్ర ప్రదేశ్‌లో ప్రకాశం గారి వ్యక్తిత్వం ద్వారా ఆబాల గోపాలానికి తర తరాలుగా, ఆ బ్రహ్మాండమైనటువంటి ప్రేరణ మనం కల్పించడం ఎంత వరకు సాధ్యమో దానికి కావలసిన చర్యలు తీసుకోవడానికి వెనుదీయము.



మహా మనీషి

గాంధీజీ

కర్లపాలెము కుటుంబశాస్త్రి

గీతాశాస్త్ర పునీత నూతన కురుక్షేత్రాభి నిర్మాతయై
చేతన్ శస్త్రములేక, శాంతియుతమౌ సేనాధిపత్యమ్ముతో
చాతుర్యమ్మున రాజనీతి నడిపెన్, సత్యాగ్రహ స్థాయిలో
ఈతండెంత మహాత్ముడో, జగతిలో, ఏతాదృశుం గంటిమే

స్వాతంత్ర్యంపు వెలుంగుజూపి, చిరదాస్యధ్వాంతమున్ బాపి, యే
జాతీయోద్యమ నీతినేత, జనతా చైతన్య సంధాత, యే
ప్రాతర్భానుడు, భారతావనికి నారాధ్యుండుగా నిల్చె, ఆ
జ్యోతిర్మూర్తియె, గాంధి, జాతిపిత, మీ జోహారులర్పింపుడీ

విస్తారమ్ముగ రామనామ విలసత్ పీయూషమున్ గ్రోలి
విశ్వస్తుత్యుండయి, జైన, బౌద్ధ, మత విశ్వాసంబు లందేలి, శ్రీ
క్రీస్తుంబోలి, దయార్ద్రమూర్తి యని కీర్తిం గన్నమా బాపూజీ
స్వస్తిన్ గూర్చుచు నున్నవాడదె, సదా, స్వర్లోక సంవాసియై

నీ మహిమ హిమాలయగిరి
నీ మాటలు నిగమచయము, నీమూర్తియొ,మా
భూమిని దివ్యస్వర్గము
గా మార్చగ దిగిన గగన గంగయె, గాంధీ

నీ జ్యోతి వెలిగి నంతనె
రాజ్యాంగ రథంబు విడిచె రక్త పథంబున్
పూజ్య స్వతంత్రమలరె, సు
భోజ్యంబయ్యెను, ప్రజాప్రభుత్వము గాంధీ

కూటికి, గుడ్డకు బడు ఆ
రాటము దీర్చితివి నీవు రాటముతో, నీ
మాటల మంత్రములై, మా
కాటకముల దొలగజేయు గాదే, గాంధీ

నన భారత జనకుడవై
భువి పై నలరితివి పరమపూజ్యుడ విట నీ
అవతారమంతమయ్యెను
దివి నుండియె మాకు నిడుమ దీవన గాంధీ

మాంధాత్రాది మహీపతుల్ గననియే మాహాత్మ్యమో నీది. శ్రీ
గాంధీ! నీ హితబోధ పావన మతగ్రంథంబు, హిందూస్థాన్
అంధ ప్రక్రియనున్న వారలకు నయ్యా! పారతంత్ర్యంపు వి
ర్బంధమ్ముల్ వదిలింప జేసితివి, మా బాపూ! నమోవాకముల్

కరుణామూర్తివి, సత్యకీర్తివి, జగత్ కళ్యాణమున్ గోరు ఈ
శ్వర భక్తుండవు, సర్వతోముఖ మహాసంస్కర్తవా బుద్ధుడే
సరి నీకెట్లగు? సద్గృహస్థువయి, సంసారమ్ము నందుండియే
తరణోపాయమ్ము జూపినాడవు, మహాత్మా! గాంధి! సర్వోదయా

భగీరథ ప్రయత్నంగా సాధించిన



పొట్టి శ్రీరాములు

ఆంధ్ర ప్రదేశ్ అవతరణోద్యమ గాథ

—కంచి వాసుదేవరావు

1956 నవంబరు 1 వ తేదీన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అవతరించడంతో 43 యేండ్లు ఆంధ్రులు స్వరాష్ట్రం కోసము జరిపిన పోరాటములో సంపూర్ణ విజయము సాధించుకున్నారు. భాషా ప్రయుక్త రాష్ట్ర విభజన సిద్ధాంతానికే అఖండ విజయం సమకూరింది. ఈసమయంలో ఆంధ్రరాష్ట్రోద్యమాన్ని సింహావలోకనం చేసుకోవడం ఉచితము

స్వాతంత్ర్యోద్యమంలో ఒక అంతర్భాగముగా ఆంధ్ర రాష్ట్రోద్యమము సాగింది. దీనికి బీజాలు వందేమాతర ఉద్యమంతోనే పడ్డాయి.

ఒకే భాషవారయిన బెంగాలు ప్రజలను రెండుగా చీల్చడంతో తీవ్రమైన వంగజాతీయ భావము వందేమాతర ఉద్యమానికి దారితీయబడటంతో ఆ ఉద్యమానికి ప్రభావితులైన ఆంధ్రులలో కూడా జాతీయభావంతో పాటు రాష్ట్రాభిమానము వెల్లివిరిసింది. తమ సంపూర్ణ వికాసానికి ప్రత్యేకరాష్ట్రం ఏర్పడవలెనన్న కోరిక వారిలో ప్రబలము కాసాగింది.

1913 లో బాపట్లలో ప్రథమ ఆంధ్రమహాసభ శ్రీ బయ్యా నరసింహశర్మగారి అధ్యక్షతన జరిగింది. ఆహ్వాన సంఘాధ్యక్షులు దేశభక్త కొండా వెంకటప్పయ్య పంతులుగారు. ఈ సమావేశానికి ఆంధ్రప్రాంతము నలుమూలలనుండి పెక్కుమంది ప్రతినిధులు హాజరయ్యారు. కాని ఈ సమావేశములో ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం కావలెనని తీర్మానించలేదు. ఈ విషయంపై జనాభిప్రాయం సేకరించవలెనని తీర్మానించారు.

1911 లో బెజవాడలో జరిగిన ద్వితీయ ఆంధ్రరాష్ట్ర మహాసభలో ఆంధ్రులకు ప్రత్యేక రాష్ట్రం కావలెనన్న తీర్మానం మొట్ట మొదటిసారి చేయబడింది. ఈ సభకు ఆంధ్రభీష్మ న్యాపతి సుబ్బారావుగారు అధ్యక్షత వహించారు.

1917 లో భారత రాజ్యాంగ చట్టానికి సవరణలు చేయు ఉద్దేశంతో మాంటేగ్యూ, చెమ్సుఫర్డ్ కమిటీ ఏర్పడినప్పుడు ఆంధ్ర మహాసభ నాయకులైన న్యాపతి సుబ్బారావు, దేశభక్త కొండా వెంకటప్పయ్య, డా. పట్టాభిగార్లు మద్రాసునుండి తెలుగు జిల్లాలను విడదీసి ప్రత్యేక రాష్ట్రముగా ఏర్పాటు చేయవలసిందిగా వినతి పత్రము సమర్పించారు.

డా. పట్టాభిగారి నిర్విరామ కృషివలననే డా. అనీబిసెంటు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నా దేశంలో అన్ని భాషల ప్రజల సమగ్ర వికాసానికి దేశాన్ని భాషా ప్రయుక్తంగా విభజించాలన్న తీర్మానం ఆమోదింపబడింది. తదనుగుణంగానే ప్రత్యేకంగా ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు సంఘము ఏర్పడింది.

పానగల్లు రాజాగారు మద్రాసురాష్ట్ర ప్రీమియరుగా వుండగా ఆంధ్ర విశ్వవిద్యాలయం ఏర్పడింది. అయితే మొదట ఇది బెజవాడలో నెలకొల్పబడగా, సర్ కట్టమంచి రామలింగారెడ్డిగారు విశ్వవిద్యాలయానికి అనువైన ప్రదేశం వాల్తేరు అని భావించి



కొండా వెంకటప్పయ్య

ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని బెజవాడనుండి వాల్తేరుకు తరలించడముతో రాయలసీమ నాయకులకు ఆంధ్రరాష్ట్రములో తమ భవిష్యత్తు గురించి కొన్ని అపోహాలు ఏర్పడ్డాయి. ఆంధ్రరాష్ట్రంలో రాయలసీమ చేరరాదన్న భావం కొంతవరకు బలము పుంజుకోసాగింది

ఈ అపోహలు తొలగించి, రాయలసీమ వారిని ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం పట్ల సుముఖులను చేయడానికి 1937 నవంబరు 6వ తేదీన దేశోద్ధారక కాశీనాధుని నాగేశ్వరరావుగారి గృహమయిన శ్రీబాగ్‌లో సర్కారు, రాయలసీమ నాయకుల మధ్య ఒక అంగీకారము కుదిరింది. దీనికే శ్రీబాగ్ పాక్టు అనిపేరు.

దాని ప్రకారము రాయలసీమలో ఇరిగేషను ప్రాజెక్టుల గురించి మరింత శ్రద్ధ వహించడానికి, రాయలసీమకు ప్రత్యేక ప్రాతినిధ్యము యివ్వడానికి రాజధాని, హైకోర్టులలో ఒకటి రాయలసీమ ప్రాంతములో ఏర్పాటు చేయడానికి నిర్ణయించడం జరిగింది.

1927-29 సంవత్సరాల మధ్య సైమను కమీషను భారత దేశము పరిపాలనా సంస్కరణలను సిఫార్సు చేయడానికి భారత దేశం పర్యటించింది. గాంధీమహాత్ముని ఆదేశానుసారం యావన్మంది ఆంధ్రులు ఆ కమీషనుకు వ్యతిరేక ప్రదర్శనలు చేయడంతో ఆంధ్రరాష్ట్రాన్ని ఆ కమీషను సిఫార్సు చేసే అవకాశం పోయింది.

లండన్‌లో మొదట రౌండుటేబుల్ సమావేశము జరిగినప్పుడు బొబ్బిలి రాజాగారు పాల్గొని మద్రాసు రాష్ట్రమునుండి తెలుగు మాట్లాడే ప్రాంతాలను విడదీసి ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు చేయవలసిన అవసరంగురించి విజ్ఞప్తి చేశారు. రెండవ రౌండు టేబులు సమావేశానికి ఆంధ్రమహాసభ ఆంధ్రరాష్ట్ర నిర్మాణావశ్యకత గురించి నచ్చచెప్పడానికి ఒక ప్రతినిధి వర్గాన్ని పంపింది.

కేంద్ర శాసనసభలో సర్ బయ్యా నరసింహ శర్మగారు మద్రాసునుండి తెలుగు జిల్లాలను విడదీసి ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం ఏర్పాటు చేయవలెనన్న తీర్మానాన్ని ఆమోదింప జేశారు. 1937 లో వేమవరపు రామదాసు పంతులుగారు కూడా అదే తీర్మానాన్ని ప్రతిపాదించి ఆమోదింప జేశారు. 1946 లో రాజ్యాంగ పరిషత్తులో మొసలికంటి తిరుమలరావుగారు ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర తీర్మానాన్ని ఆమోదింప జేశారు. మద్రాసు రాష్ట్ర శాసనసభలో యీ తీర్మానము నాలుగుసార్లు అంగీకరింప బడింది. ఐతే చిత్రమేమంటే ఎప్పటికప్పుడు ఏదో కారణంతో మన ఆంధ్ర రాష్ట్ర నిర్మాణము వాయిదా పడుతూ వచ్చింది.

1947 లో భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. కాంగ్రెసు, యితర రాజకీయ పక్షాలు పదే పదే అంగీకరిస్తూ వచ్చిన ఆంధ్ర రాష్ట్రం ఎట్టి జాప్యంలేక అవతరిస్తుందన్న ఆశలు అడియాసలయ్యాయి



పట్టాభి సీతారామయ్య

మద్రాసు నగరం ఎవరికిచెందాలిఅన్న విషయంపై ఆంధ్రులు తమిళుల మధ్య తీవ్ర అభిప్రాయభేదాలు ఏర్పడ్డాయి. చారిత్రికంగా చెన్నపట్టణము అని పిలువబడే మద్రాసు ఆంధ్రులందరిదనీ, దాని అభివృద్ధికి ఆంధ్రులు విశేష కృషి గావించారనీ, అందువలన ఆంధ్రులకు మద్రాసు నగరంపై హక్కు వుందనీ కనీసం కూము నదికి ఉత్తరానవున్న మద్రాసు నగర ప్రాంతము ఆంధ్రులకు చెందాలనీ, లేదా అది చీఫ్ కమిషనరు పాలిత ప్రాంతంగా వుండాలనీ ఆంధ్ర నాయకులు వాదించారు. కాని మద్రాసు నగరం పూర్తిగా తమిళులదేననీ, అది కాదన్ననాడు మద్రాసులో రక్తపుటేరులు ప్రవహిస్తాయని బాధ్యతగల తమిళనాయకులు సైతం బెదిరించడంతో దేశ విభజన కాలంలో మతకలహాల కారణంగా జరిగిన రక్తపాతపు విషాద అనుభవాలకు తల్లడిల్లిపోయిన నెహ్రూ, పటేలు ప్రభృతి నాయకులు ఆంధ్ర రాష్ట్ర నిర్మాణ కారణంగా మరోసారి రక్తపాతం జరగడానికి అంగీకరించలేక ఆంధ్ర రాష్ట్ర



మాడపాటి హనుమంతరావు

నిర్మాణంపట్ల కొంత విముఖభావం చూపుతూవచ్చారు. దేశాన్ని భాషా ప్రయుక్తంగా విభజించడం ఎంతవరకు వాంఛనీయము అన్న విషయాన్ని పరిశీలించడానికి కేంద్ర ప్రభుత్వం ధార్ కమిషనును ఏర్పాటు చేసింది. ఆ సంఘం కొన్ని ప్రత్యేక కారణాల వలన ఆంధ్రరాష్ట్ర నిర్మాణానికి అంగీకరించినా, భాషా ప్రయుక్తంగా దేశ విభజన చేయడం అనర్థదాయకమనే నివేదించింది. దాదాపు 1920 నుండి కాంగ్రెసు ఏకగ్రీవంగా ఆమోదిస్తూ వచ్చిన భాషా ప్రయుక్త రాష్ట్ర విభజన సిద్ధాంతానికే ఎసరు పెట్టడం ఆంధ్రులకే కాక భాషాప్రయుక్త రాష్ట్ర విభజనకోరే భారతీయులందరికీ అసంతృప్తి కలిగించింది.

ఆంధ్రరాష్ట్ర నిర్మాణం గురించి పరిశీలించి ఏర్పాటు చేసేందుకు 1949లో జె.వి.పి. కమిటీ—అనగా జవహర్‌లాల్ నెహ్రూ, వల్లభాయిపటేలు, పట్టాభిగార్లతో ఒక కమిటీ ఏర్పడి ఈ సమస్యను క్షుణ్ణంగా పరిశీలించి ఆంధ్ర రాష్ట్ర నిర్మాణానికి మద్రాసు నగరం భవితవ్యం ఒక ఆటంకముగా వుందని దానిపై ఆంధ్రులు తమకుగల హక్కు పూర్తిగా బేషరతుగా వదలుకున్న యెడల ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు చేయవచ్చుననీ సిఫార్సు చేసింది.

ఇది ఆంధ్ర నాయకులకు కొంత ఆశాభంగము కలిగించినా, ఆంధ్ర రాష్ట్ర నిర్మాణంలో జాప్యాన్ని భరించలేక ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెసు జె.వి.పి. నివేదికను 1949లో అంగీకరించింది. కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర విభజన కమిటీని కూడా ఏర్పర్చింది. ఆస్తి, అప్పుల పంపకం విషయంలోనూ, మద్రాసు నగరాన్ని వదలుకున్నందుకు లభించవలసిన నష్టపరిహార విషయములోనూ కమిటీ తీర్పుకు అంగీకరింపజాలక ఆ కమిటీ సభ్యులైన శ్రీ ప్రకాశం గారు ఒక డిస్సెంటునోట్ పెట్టారు. ఈ డిస్సెంటు నోటును కారణంగా పెట్టుకుని కేంద్ర ప్రభుత్వం ఆంధ్రరాష్ట్ర నిర్మాణాన్ని వాయిదా వేయడంతో రిపబ్లిక్ అవతరణకు ముందే ఆంధ్రరాష్ట్రం ఏర్పడుతుంది అనుకుని ఎన్నో ఆశలుపెట్టుకున్న ఆంధ్రుల ఆశలు అడియాసలయ్యాయి.

ఈ లోగా మద్రాసు ప్రభుత్వం కృష్ణా-పెన్నారు. ప్రాజెక్టును నిర్మింప తలపెట్టింది ఇందువలన కృష్ణా జలాలు మద్రాసుకు తరలించ బడ్తాయనీ, కృష్ణా డెల్టా ప్రాంతము "ఊసర క్షేత్రం"గా మారిపోతుందన్న భయసందేహాలు ఆంధ్రులలో గట్టిగా ఏర్పడడంతో ఆంధ్రులలో స్వరాష్ట్రవాంఛ ద్విగుణీకృతమయింది.


శాంతియుత సత్యాగ్రహాలు, నిరశన దీక్షలవలన తప్ప ఆంధ్ర రాష్ట్రం ఏర్పడదనే భావము ప్రజలలో ఏర్పడింది. 1950 ఆగస్టు నెలలో స్వామీ సీతారామ్ ఆంధ్రరాష్ట్ర సాధనకు ఆమరణ నిరశన దీక్ష వహించారు. నానాటికీ వారి ఆరోగ్యం క్షీణించడముతో పాటు ప్రజలలో ఉద్రిక్త వాతావరణము ప్రబలము కాసాగింది. తుదకు ఆచార్య వినోబా భావే, నెహ్రూ ఆంధ్ర రాష్ట్ర నిర్మాణానికి సుముఖులుగా వున్నారని హామీ యివ్వడంతో వినోబా సలహాతో స్వామీ సీతారామ్ నిరసన దీక్ష విరమించారు. కాని రాష్ట్ర నిర్మాణానికి ఎట్టి ప్రయత్నాలు జరగలేదు.

ఇక 1952 అక్టోబరు 19న గాంధేయవాది పొట్టి శ్రీరాములు గారు మద్రాసులో బులుసు సాంబమూర్తిగారి యింట ఆమరణ నిరశన దీక్షపూని 58 రోజులు కఠోర వ్రతము పూర్తి చేసి డిసెంబరు 16వ తేదీన పూర్ణాహుతి పొందారు. ఇంతటి అపూర్వ త్యాగము ప్రపంచ చరిత్రలోనే బహు అరుదు.

ఆయన ఆత్మాహుతితో ప్రజోద్యమం పెల్లుబికి, ప్రజా విప్లవ చర్యలు ఆంధ్రరాష్ట్రమంతటా చెలరేగాయి.

1952 డిసెంబరు 19 వ తేదీన పార్లమెంటులో శ్రీ నెహ్రూ ఆంధ్ర రాష్ట్ర నిర్మాణం ఎట్టిపరిస్థితులలో నయినా వాయిదా వేయడం జరగదని. రాజధాని నిర్ణయము యితర విషయములు పరిశీలించడానికి ఒక న్యాయమూర్తి నియమింపబడతారని ప్రకటించారు.

తదనుగుణంగా న్యాయమూర్తి వాంఛూను కేంద్ర ప్రభుత్వం నియమించింది. ఆయన అన్ని విషయములు పరిశీలించి విజయవాడ గుంటూరుల మధ్య ఆంధ్ర రాష్ట్ర రాజధాని నగరం ఏర్పాటుకు అన్ని విధాలా బాగుంటుందనీ తుంగభద్ర ప్రాజెక్టు రాయలసీమ అవసరాలకే ఎక్కువ వుద్దేశింపబడినందున ఆ ప్రాజెక్టు స్థలము ఆంధ్రరాష్ట్రంలోనే వుంచడము మంచిదనీ, అదేవిధముగ బళ్లారి కూడా ఆంధ్రదేశంలో చేరవలెనని సూచించారు. చివరి రెండు సూచనలను కన్నడిగులు తీవ్రముగా వ్యతిరేకించడముతో కేంద్ర ప్రభుత్వం వాటిని అమలు జరపలేదు. క్రొత్త రాష్ట్రానికి రాజధాని నగరాన్ని ఎన్నుకునే స్వేచ్ఛనుకేంద్ర ప్రభుత్వము అప్పటి మద్రాసు శాసన సభలో ఆంధ్ర ప్రాంతానికి చెందిన శాసన సభ్యులకి వదలి వేయడం జరిగింది. శ్రీబాగ్ ఒడంబడిక ప్రకారము రాయలసీమ వారు రాజధాని తమ ప్రాంతములోనే ఉండాలని కోరడంచేత



బూర్గుల రామకృష్ణారావు

కర్నూలు ఆంధ్ర రాష్ట్రానికి రాజధానిగా ఆంధ్ర శాసన సభ్యులు నిర్ణయించారు.

1953 అక్టోబరు 1 వ తేదీన ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులుగారు ముఖ్య మంత్రిగా, శ్రీ సి. యం. త్రివేది గవర్నరుగా ఏర్పడిన ఆంధ్ర రాష్ట్రానికి శ్రీ నెహ్రూ ప్రారంభోత్సవము జరిపారు. కర్నూలులో రాష్ట్రరాజధానీ నగరాన్ని ఏర్పాటు చేయడం రాయలసీమ నాయకుడు శ్రీ నీలం సంజీవరెడ్డి ఉపముఖ్య మంత్రి కావడం, ఏడాదిలోగానే తిరుపతిలో శ్రీ వెంకటేశ్వర విశ్వ విద్యాలయము ఏర్పాటు కావడంతో సర్కారు రాయలసీమ ప్రజల మధ్య వెనుకటి అనుమానాలు తొలగి సంపూర్ణమైన భావసమైక్యత ఏర్పడింది.

ఆంధ్రరాష్ట్ర నిర్మాణంతో పాటు ఆంధ్రులు తృప్తి చెందలేదు అంతకు పూర్వము ఎన్నో సంవత్సరాలనుండి విశాలాంధ్ర— మద్రాసు రాష్ట్రంలోని తెలుగ జిల్లాలు— నిజాం రాష్ట్రంలోని తెలుగు జిల్లాలతో కలసిన బృహత్-రాష్ట్రం—ఆంధ్రుల చరమ లక్ష్యంగా వుంటూవచ్చింది. ఆంధ్రరాష్ట్ర నిర్మాణం దీనికి మొదటి మెట్టుగా వారు భావించారు. తెలంగాణలో కూడా ఆంధ్రమహాసభ నాయకత్వాన తెలంగాణా ప్రజలు హైదరాబాదురాష్ట్ర విచ్ఛిత్తి జరిగి క్రమంగా విశాలాంధ్ర ఏర్పడవలెనని కోరుతూ వచ్చారు. సేటు కాంగ్రెసు కూడా హైదరాబాదు రాష్ట్రాన్ని విచ్ఛిన్నంచేసి, మూడు భాషా ప్రాంతాలను ఆయా రాష్ట్రాలలో కలపి వేయవలెనని అభిప్రాయపడుతూ వచ్చింది. కొన్ని శతాబ్దాలుగా చీలిపోయిన తెలుగు వారు ఒక రాష్ట్రంగా ఏర్పడి సర్వతోముఖంగా అభివృద్ధి చెందాలని రెండు ప్రాంతాలలోని సామాన్యప్రజలు ప్రగాఢముగా వాంఛిస్తూ వచ్చారు.

1948లో హైదరాబాదు రాష్ట్రానికి నిజాం నిరంకుశ పరిపాలన నుండి విముక్తి లభించింది. రాజకీయంగా ఆర్థికంగానూ విద్యావిషయికంగా అభివృద్ధి సాధించిన కోస్తా ఆంధ్రులు హైదరాబాదు రాష్ట్రానికి వెళ్లి అక్కడ ఉద్యోగాలు సంపాదించుకున్నారు. భూములను కొని వ్యవసాయం ప్రారంభించారు వీరి ప్రాబల్యం క్రమక్రమముగా అన్ని రంగాలలో విస్తరించుతూ వుండడంతో విశాలాంధ్ర ఏర్పడే పక్షంలో రాజకీయంగా ఆర్థికంగా తెలంగాణ ప్రజలకు అన్యాయం జరుగగలదన్న భయ సందేహాలు తెలంగాణ కాంగ్రెసు నాయకులలో కలుగ నారంభించాయి.

ఆంధ్రరాష్ట్రం ఏర్పడడంవలన దేశాన్నంతటినీ భాషా ప్రయుక్తంగా విభజించాలన్న వాదానికి బలం చేకూరడంతో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రపునర్ వ్యవస్థీకరణ విషయాన్ని పరిశీలించడానికి ఫజలలీ సంఘాన్ని ఏర్పాటుచేసింది.



టంగుటూరి ప్రకాశం

ఈ సంఘము ఎదుట కొందరు ప్రముఖనాయకులు ప్రత్యేక తెలంగాణా రాష్ట్రం ఏర్పర్చవలసినదిగా విజ్ఞప్తి చేశారు. ఆంధ్ర ప్రాంతీయులకు వ్యతిరేకంగా ప్రదర్శనలు, ప్రత్యేక తెలంగాణా ఉద్యమం ప్రారంభమయింది కూడ. ఫజులాలీ కమిషన్ ప్రత్యేకతెలంగాణా స్వయంపోషకము కాగలదని భావించింది. ఐనా బూర్గుల రామకృష్ణారావు, స్వామీ రామానందతీర్థ, మాడపాటి హనుమంతరావు గార్లు విశాలాంధ్రలోనే తెలంగాణా సమగ్రాభివృద్ధికి అవకాశంవుందని దృఢంగా విశ్వసించబట్టి ఆంధ్ర ప్రాంతీయులందరూ విశాలాంధ్రను గాఢంగా వాంఛిస్తూ కొన్ని సర్దుబాట్లు తెలంగాణా ప్రాంతీయులతో చేసుకోబట్టి, అన్నిటికన్నా ముఖ్యంగా ప్రధానమంత్రి నెహ్రూ ఆంధ్ర తెలంగాణా ప్రాంతాలు కలిసి ఒకే రాష్ట్రంగా ఏర్పడడమే అభిలషణీయమని వాంఛించబట్టి 1956 నవంబరు 1వ తేదీన ఆంధ్రప్రదేశ్ అవతరించడము సాధ్యమయింది.

ఐతే తెలంగాణా నాయకులు వెలిబుచ్చిన భయసందేహాలు సహేతుకమైనవని గుర్తించి వారి ప్రయోజనాలను పరిరక్షించేందుకు కొన్ని భద్రతలు కలిగిస్తూ పెద్ద మనుష్యుల ఒప్పందము ఒకటి ఆంధ్ర తెలంగాణా నాయకులమధ్య కుదుర్చుకోబడింది. ఇదికూడా శ్రీబాగ్ ఒడంబడిక వంటిదే। తెలంగాణాకు అన్యాయం జరుగకుండా తెలంగాణా ప్రాంతీయ సంఘముకూడాఏర్పాటు చేయబడింది.

కాని కారణాలు ఏమయినా, ఎవరు బాధ్యులైనా, ఆంధ్ర ప్రదేశ్‌లో తెలంగాణా ప్రాంతీయులకు కొన్ని అన్యాయాలు జరిగాయనీ, వారి ప్రయోజనాలు ఉపేక్షింపబడ్డాయన్న భావము తెలంగాణా ప్రజలలో బలపడడంతో ప్రత్యేక తెలంగాణా ఉద్యమము 1969లో ఉద్ధృతరూపము దాల్చింది. తెలంగాణా ప్రాంతానికి జరిగిన అన్యాయాలు పరిహరించడానికి ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరా గాంధీ అష్టసూత్ర పథకాన్ని ప్రతిపాదించి, అమలు పరచడంతో తెలంగాణా ప్రజలలో ఏర్పడ్డ అసంతృప్తి క్రమంగా తొలగి ప్రత్యేకరాష్ట్ర ఉద్యమం అదృశ్యమయింది.

ఇప్పుడు తెలంగాణా ప్రాంతీయులైన శ్రీ పి. వి ముఖ్యమంత్రి కావడంతో తెలంగాణా అభివృద్ధిపట్ల, తక్కిన ప్రాంతాల మాదిరిగానే శ్రద్ధ చూపించడముతో 1953–56 మధ్య కోస్తా రాయలసీమ ప్రజలమధ్య ఏవిధంగా బలమైన భావసమైక్యత ఏర్పడిందో, ఇప్పుడు తెలంగాణా ఆంధ్ర ప్రాంతీయులమధ్య అదే విధమైన భావసమైక్యత ఏర్పడి ఆంధ్రప్రదేశ్ సర్వతోముఖాభివృద్ధికి యితోధిక కృషి జరుగగలదని ఆశిద్దాము.

ఆరోజు తప్పకుండావస్తుంది

స్వామి

ఏడుస్తున్నావా తల్లీ !
ఒద్దొద్దు ఏడవకు !
ఏదయినా భరిస్తాగానీ,
నీ దఃఖం చూడలేను.

ఎందరో మహానుభావుల
సంకుచిత భావాల
అణచ గలిగే శక్తి నీకుంది కదా,
ఎందుకలా నీశక్తి పీణ ఆగింది ?

సొగసైన నీ కాటుక కళ్ళలోంచి
జారిపోయే కన్నీటి బొట్టులు
నీ అందమైన మోముపై
కట్టిస్తున్నాయి యీనాటి కవితల చారలు.

సరసమైన కవిత్వపు పూదోటలలోంచి
విరసమైన భావుక వనాలలోకి
విసిరిద్చుకొచ్చారు ఈనాటి వైతాళికులు
ఏంచేస్తావు నీవు దుఃఖించక !

మృదు మధురమైన కవితాగానాల బదులు
వినిపిస్తున్నాయి గుండెలదిరించే గావుకేకలు.
హృదయాన్ని పరవశింపజేసి,
ఏ స్వర్గ సీమలకో క్షణమైనా తీసుకుపోయే బదులు

ఈనాటి కవితలు చూపించేవి
దోపిడీలూ, హత్యలూ, రోగాలతో
ప్రవహించే రక్తపు నదులు.
ఏ నాటి కానాడు కొత్తపుంతలు తొక్కుతూ,

సరికొత్త అందాలను దిందిస్తూ,
యింతవరకూ వచ్చిన కవితలకు బదులు,
ఇప్పుడొచ్చేవి పరస్పర దూషణలూ,సంకుచిత ఆరోపణలూ.

ఇలా,
ఇన్ని విధాలుగా
నీ అందమైన రూపాన్నే
అందరూ మార్చేస్తూంటే,
నాకే యింత బాధగా ఉంటే,

నీ కింకెంత కష్టంగా ఉందో !
కానీ,
తల్లీ ! నాకు నమ్మకం ఉంది.
సరసమైన కవిత్వపు పూదోటలు నాశనం కాలేదు.

మృదు మధురమైన కవితా గానాలు మూగబోలేదు
హృదయాల్ని పులకింపజేసే
నవకవితా సృష్టి జరుగుతుంది
నీ అందం తిరిగి చిగురిస్తుంది
ఆ రోజు తప్పకుండా వస్తుంది.

విద్యావంతులైన నిరుద్యోగులకు స్వయం ఉపాధికల్పనపథకాలు

ఖాదర్ అలీఖాన్

విద్యావంతులైనవారు, సాంకేతికంగా అర్హతలుగల వారిలో నిరుద్యోగం ప్రబలుతూవున్నందువల్ల, వారికి ఉద్యోగావకాశాలు కల్పించే ఉద్దేశంతో అనేక పథకాలు రూపొందించబడినాయి. వీరందరికి జీతాలు ఇచ్చే ఉద్యోగాలు ఇవ్వడం సాధ్యం కానిపని. కనుక పరిశ్రమలు, వ్యవసాయం మున్నగువాటిల్లో కానీ, ఇతర ఉత్పత్తి రంగాలలో కానీ వారు స్వంతంగా ఉద్యోగాలు చేసుకొనడానికి వీలుగా పథకాలు తయారుచేసే విషయమై ఇటీవలి కాలం నుంచి ప్రత్యేక శ్రద్ధ చూపడం జరుగుతున్నది. సాంకేతిక యోగ్యతలుగల వ్యక్తులు స్వయంగా పరిశ్రమలు ఏర్పాటు చేయడానికి వీలుగా వారికి శిక్షణ గరిపి ఆర్థిక సహాయం చేయడానికి పథకాలు తయారుచేయబడుతాయని నాల్గవ పంచవర్ష ప్రణాళికలో పేర్కొనబడినది. ఈ పథకాలేకాకుండా భారత ప్రభుత్వ పారిశ్రామికాభివృద్ధి మంత్రిత్వ శాఖ విద్యావంతులైన నిరుద్యోగులు చిన్న పరిశ్రమలు స్థాపించడానికి రూ. 6 5 కోట్లు ఆర్థిక సహాయానికి అవకాశం కల్పిస్తూ ఇటీవల ఒక పథకాన్ని మంజూరు చేసింది. విద్యావంతులైన నిరుద్యోగులకు సహాయపడేందుకు భారత ప్రభుత్వ బడ్జెటులో రూ. 25 కోట్లు ప్రత్యేకించబడినాయి. ఈ మొత్తంలోనుంచి కేవలం స్వయం ఉపాధి కల్పన పథకాల కొరకు రూ. 6.5 కోట్లు కేటాయించబడినాయి. ఈ పారిశ్రామిక మంత్రిత్వ శాఖ రాష్ట్రాలన్నిటికీ ఒకే విధంగా వర్తించేటట్టు కొన్ని పథకాలు తయారుచేసి వివిధ రాష్ట్రాలకు నిధులు కేటాయించింది. ఆంధ్రప్రదేశ్‌కు రూ. 76 లక్షలు కేటాయించబడినాయి. ఇవి ఈ క్రింది విధంగా ఖర్చుపెట్టబడుతాయి.

	రూ. లక్షలలో
1. యంత్రాల అద్దె-కొనుగోలు	20.00
2. స్వయం ఉపాధి వాటికలు	23.50
3. సాంకేతికజ్ఞుల సహకార సంఘాలు	8.00
4. వాణిజ్య వాటికలు	4.50
5. సర్దుబాట్లకు డబ్బు	20.00
మొత్తం	76.00

గత ఆర్థిక సంవత్సరం చివరిలో ఈ డబ్బు మంజూరైనప్పటికీ ఈ డబ్బు మురిగిపోకుండా, వాటిని సాధ్యమైనంతవరకు ప్రయోజనకారిగా ఉపయోగించేందుకు పరిశ్రమల శాఖ ప్రత్యేక కృషి చేసింది. సత్వర సత్ఫలితాలు ఇవ్వగల శీఘ్రతర కార్యక్రమాన్ని ఈ శాఖ తయారుచేసింది. విద్యావంతులైన నిరుద్యోగులకు స్వయం ఉపాధి సౌకర్యాలు కల్పించడానికి ఈ పథకాలు తయారుచేయబడినాయి. స్వయం ఉపాధివాటికలు, సాంకేతికజ్ఞుల సహకార సంఘాలు, వాణిజ్య వాటికలు, పరిశ్రమదారులకు పాక్షికంగా మూలధనం పెట్టుబడిక్రింద ఋణసహాయం అద్దె-కొనుగోలు పద్ధతిపైన యంత్రాల సరఫరా, ఈ పథకాలన్నీ శీఘ్రతర కార్యక్రమంలో చేరివున్నాయి. లాభసాటియైన పరిశ్రమలు చేపట్టి స్వంతంగా వాటిని నడిపించడానికి ఇష్టపడేవారందరూ ఈ కార్యక్రమంలో చేరవచ్చు. పరిశ్రమలు స్థాపించడానికి వాటికి సంబంధించిన పథకాలను పరిశ్రమల శాఖనుంచి పొందవచ్చు. సాంకేతిక సలహా, పరిశ్రమ స్థాపనకు కావలసిన సదుపాయాలు, ఆర్థిక సహాయం మున్నగు విషయాలలో పరిశ్రమ శాఖ తగిన సలహాలు, సూచనలు చేస్తుంది.

కనీసం సెకండరీ స్కూలు, లేక దానితో సమానమైన పరీక్ష ప్యాసు అయిన నిరుద్యోగులు విద్యావంతులైన నిరుద్యోగులని భావించబడుతుంది. ఐ. టి. ఐ. లలో ఏదో ఒక వృత్తిలో శిక్షణ పొందినవారుకూడా ఈ పథకం క్రింద సహాయం పొందటానికి అర్హులు. ఈ పథకం క్రింద వున్న సౌకర్యాలను ఇంజనీరింగు పట్టభద్రులు, డిప్లొమాలుగలవారు పరిపూర్ణంగా ఉపయోగించుకోవచ్చు.

కార్యక్రమాల ప్రాధాన్యతను పరిశీలించిన పిమ్మట డబ్బును దిగువ పేర్కొన్నవిధంగా పునర్వినియోగించడం జరిగింది.

	రూ. లక్షలలో
1. యంత్రముల అద్దె-కొనుగోలు	20.00
2. స్వయం ఉపాధి వాటికలు	5.00
3. సాంకేతిక సహకార సంఘాలు	6.00
4. సర్దుబాట్లకు డబ్బు	43.00
మొత్తం	74.00

సర్దుబాటు డబ్బు, లేక సీడ్ క్యాపిటల్ కొరకు ఎక్కువ డబ్బు కేటాయించబడింది. ఆర్థిక సహాయం కావాలని అనేక మంది పరిశ్రమదారులు అభ్యర్థించినందువల్ల ఈ చర్య తీసుకోబడింది. యంత్రముల అద్దెకొరకై ప్రత్యేకించబడిన డబ్బును ఆంధ్రప్రదేశ్ లఘు పరిశ్రమల అభివృద్ధి సంస్థకు వప్పగించబడింది. ఈ కార్యక్రమం క్రింద మంజూరైన పథకాల ప్రకారం పరిశ్రమదారులకు యంత్రములు సహాయం చేయడానికి ఈ డబ్బు వినియోగించబడుతుంది. పరిశ్రమదారులకు షెడ్లు ఏర్పాటు చేయడానికి స్వయం ఉపాధి వాటికలు ఉద్దేశించ బడినాయి. ఈ వాటికలు ఒకటి హైదరాబాదు, రెండవది కర్నూలు, మూడవది ఒంగోలులో ఏర్పాటు చేయబడుతాయి. ఈ మూడు చోట్లలో 300 షెడ్లు నిర్మించబడుతాయని ఆశింపబడుతున్నది. ఇదే విధంగా జంట నగరాలలో రెండు ఒంగోలు, కర్నూలులలో చెరి ఒకటి సాంకేతిక సహకార సంఘాలు ఏర్పాటు చేయబడినాయి. హైదరాబాదులోని సాంకేతిక సహకార సంఘాలలో ఒక్కొక్క దానిలో 12 మంది సభ్యులున్నారు. ఈ సంఘాలు పనిచేయడం ఆరంభించినాయి.

కార్యక్రమం

ప్లానింగు కమీషను సూచించిన పథకం ప్రకారం రాష్ట్రంలోని 21 జిల్లాల్లో 14 జిల్లాలు వెనుకబడినవిగా పేర్కొనబడినాయి. అంతేకాకుండా హైదరాబాదు, సికిందరాబాదు జంట నగరాలలో ఆర్థికంగా వెనుకబడిన ప్రాంతాలు కొన్ని వున్నాయి కనుక కార్యక్రమాన్ని జంటనగరాలలోను, వెనుకబడిన 14 జిల్లాల్లోను ఆరంభించడానికి సంకల్పించబడింది. ఈ శీఘ్రతర కార్యక్రమాన్ని నడిపించడానికి పరిశ్రమ శాఖ సిబ్బంది యావత్తూ కార్యరంగంలోకి సమీకరించబడింది. లాభసాటియైన పథకాలు రూపొందించి, పెట్టుబడికి తగినంత డబ్బులేని విద్యావంతులైన నిరుద్యోగులకు మాత్రమే ఆర్థిక సహాయం చేసే విషయంలో చాల శ్రద్ధవహించబడింది.

సహాయం చేసే విధానం

పరిశ్రమల శాఖ, లఘు పరిశ్రమల అభివృద్ధి సంస్థ, లఘు పరిశ్రమల సేవా సంస్థ, రీజినల్ రీసర్చి లేబొరేటరీలకు చెందిన సాంకేతిక అధికారులు జట్టుతో కూడిన సంఘాలు ప్రతి పథకాన్ని ఆమూలంగా పరిశీలన చేశాయి. ఈ కార్యక్రమం పట్ల విద్యావంతులైన నిరుద్యోగులు అపారమైన శ్రద్ధ చూపినారు. చాలా మంది దరఖాస్తులు పెట్టుకున్నారు. వీటిని పరిశీలన చేయడానికి ఎగ్జిబిషన్ మైదానాన్ని ఉపయోగించడానికి అనుమతించవలసిందని ఆ సొసైటీవారిని కోరవలసివచ్చింది. అడిషనల్ డైరెక్టరు అధ్వర్యంలో అక్కడ ఒక క్యాంప్ ఆఫీసు ఏర్పాటు చేయబడింది.

పథకాల వర్గీకరణ

ఈ పథకాలలో అనేకవర్గాలు వున్నాయి. లఘుపరిశ్రమల క్రిందికి వచ్చే తేలిక ఇంజనీరింగు, కెమికల్స్, పింగాణి, తోళ్ళు, రబ్బరు వంటి పరిశ్రమలు; దర్జీ, ఇస్త్రీ పనులు, సైకిల్ టాక్సి, టైపురైటింగు సంస్థలు, ఫోటోగ్రఫీ స్టూడియో మున్నగునవి ఇందులో చేరివున్నాయి. కొంతమంది పరిశ్రమదారులు సాంకేతికంగా సున్నితమైన చాల చక్కని పథకాలు సుమారు 500 తయారు చేసినారు. టేపు రికార్డులు, రికార్డు ఛేంజర్లు, మైక్రో స్కోపులు ఎలిమినేటర్లు సిలిండర్ లైనర్లు, ఇండస్ట్రియల్ ఫెషనర్స్, హౌప్రివెట్స్, ఆటోమొబైల్ విడిభాగాలు, డి. సి. మోటార్లు ఎ.సి. కండక్టర్లు, నైట్రిక్ యాసిడ్, అనిల్ ఆల్కహాల్ మున్నగు వాటికి సంబంధించిన పథకాలు కూడా వాటిల్లో వున్నాయి. వచ్చిన దరఖాస్తులలో 700 పథకాలు సాంకేతికంగా అంత ఆధునికమైనవి కావు. మిగిలిన మామూలు పథకాలు, సాంకేతికంగా సున్నితమైన పథకాలను క్షుణ్ణంగా పరిశీలించి వాటిని లాభసాటిగా చేసేందుకు సాంకేతిక సంఘాలు చాల కృషి చేయవలసి వచ్చింది.

పరిశ్రమదారులు

స్వయం ఉపాధి పథకాలు అనేక వర్గాల వారిని ఆకర్షించాయి. ఇందులో మెట్రిక్యులేట్ల నుంచి సైన్సు ఇంజనీరింగులలో డాక్టరేటు డిగ్రీలు కలవారు కూడా వున్నారు. ఇప్పుడు దరఖాస్తులు ఇచ్చిన వారిలో నలుగురు పి. హెచ్. డీలు, 107 మంది ఇంజనీరింగు పట్టభద్రులు, 254 మంది డిప్లొమాలుగలవారు, 350 మంది సర్టిఫికెట్లు గలవారు వున్నారు. మిగిలినవారు ఆర్ట్సు, సైన్సు కామర్సులలో పట్టభద్రులు. వీరుకాక మెట్రిక్యులేట్లు కూడా వున్నారు.

ఆర్థికసహాయక సంస్థల పాత్ర

1969 జూలైలో బ్యాంకులు జాతీయం చేయబడినతరువాత అవి ప్రభుత్వ విధానానికి లోబడి ఆర్థికాభివృద్ధికి ఉపాధి కల్పనకు దోహదకారిగా అవి పనిచేయవలసివచ్చింది. ప్రస్తుతంవున్న బ్యాంకుల కార్యకలాపాలను పరిశీలన జరపడానికి 1970 అక్టోబరులో రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా వారు థక్కార్ కమిటీని నియమించారు. బ్యాంకులు, సమాజంలో సేవింగ్సు డబ్బును సమీకరించి వాటిని ఉత్పత్తి రంగంలో వినియోగించే ఇతర ఆర్థిక సంస్థలు ఉపాధికల్పనను ప్రోత్సహించాలని ధక్కార్ కమిటీవారు నొక్కిచెప్పారు. ఉద్యోగావకాశాలను ప్రోత్సహించే విధానాన్ని అవి పాటించవలసివచ్చింది. మన రాష్ట్రములో పరిశ్రమదారులకు పెద్దయెత్తున ఆర్థిక సహాయం చేయడానికి జాతీయం చేయబడిన బ్యాంకులు, రాష్ట్ర ఆర్థిక సంస్థలు కలిసి కృషిచేయడం ముదావహమైన విషయం. బ్యాంకులు అవి ఇవ్వదలచుకొన్న ఆర్థిక సహాయం వివరాలు దిగువ పేర్కొనబడినవి.

1.	స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా	రూ. 300	లక్షలు
2.	స్టేట్ బ్యాక్ ఆఫ్ హైదరాబాదు	రూ. 125	,,
3.	యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా	రూ. 50	,,
4.	సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా	రూ. 100	,,
5.	రాష్ట్ర ఆర్థిక సంస్థ	పరిమితిలేదు.	
6.	సిండికేట్ బ్యాంక్	రూ. 100	లక్షలు

బ్యాంకులు ఆమోదించిన పథకాల సంఖ్య, అవి మంజూరు చేసిన మొత్తాల వివరాలు దిగువ పేర్కొనబడినాయి.

జంటనగరాలు

		పథకాల సంఖ్య	మంజూరు మొత్తాలు రూ. కోట్లలో
1	స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా	560	2.75
2.	స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాదు	480	1.80
3.	సిండికేట్ బ్యాంక్	240	0.75
4.	ఆంధ్ర బ్యాంకు	110	0.25
5.	సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా	120	0.55
6.	యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా	85	0.18
7.	ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్	35	0.15
8.	ఇండియన్ బ్యాంకు	70	0.20
9	ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక సంస్థ	160	1.32
	వెనుకబడిన జిల్లాలు	500	1.55
	మొత్తం	2360	8.50

పథకాల మంజూరి

ఆర్థిక సహాయక సంస్థలు ఇంతవరకు రూ. 8.5 కోట్లు ఖర్చుకాగల 2300 పథకాలను మంజూరుచేశాయి. ఇంకా వచ్చే రెండు మూడు వారాల్లో మిగిలిన పథకాలను కూడా ఈ సంస్థలు మంజూరుచేయగలవని ఆశింపబడుతున్నది. ఇంతవరకు మంజూరైన పథకాలవల్ల 25,000 మంది నిరుద్యోగులకు ఉపాధి కలుగుతుంది.

కార్యక్రమం అమలు

ఒక్కసారిగా ఇన్ని పారిశ్రామిక యూనిట్లను ఏర్పాటు చేయడమంటే అది సామాన్యమైన విషయంకాదు కేవలం ఆర్థిక సహాయం చేసినంత మాత్రాన పారిశ్రామిక యూనిట్ అవతరించదు. ఇందులో వున్న ఎన్నో సాధకబాధకాలను అధిగమించాల్సి వుంటుంది. పథకాలను ప్రోత్సహిస్తున్న ఏజెన్సీలు ప్రతిదశలో పరిశ్రమదారునికి సహాయంచేస్తే తప్ప అతను పరిశ్రమను నెలకొల్పలేడు.

ఈ ఆశయాన్ని సాధించడానికి ఒకేవిధంగా వున్న పరిశ్రమలకొరకు ఆచరణ సంఘాలు ఏర్పాటు చేయబడినాయి. పరిశ్రమల ఆరంభ దశలో ఏర్పడే చిక్కు సమస్యలను పరిష్కరించే బాధ్యత ఇద్దరు ముగ్గురు అధికారులకు అప్పగించబడినది ఈ సంఘాలు పరిశ్రమదారుల ఇండ్లలో వారిని కలుసుకొని పని చేయడం ఆరంభించినాయి.

యంత్ర పరికరాల సరఫరా

ఈ కార్యక్రమం ప్రకారం యంత్రపరికరాల కొనుగోలుకై రూ. 4 కోట్లకు మించిన ఖర్చు అవుతుంది. భారీయెత్తున కొనుగోలు చేయడానికి వివిధరంగాలలో నిపుణులైనవారు బ్యాంకుల ప్రతినిధులతో కూడిన సలహా సంఘం ఏర్పాటు చేయబడింది. సరసమైన పోటీధరలకు నాణ్యమైన యంత్రాలను కొనడానికి ఈ సలహా సంఘం తోడ్పడుతుంది. సంఘం ఇంతవరకు జనరల్ ఇంజనీరింగు కుట్టుమిషను, టైపురైటర్లు, సైకిళ్లు మున్నగువాటికి సంబంధించిన విక్రయాలను పూర్తిచేసింది.

టెక్నో-మేనేజీరియల్ శిక్షణ

చాలామంది పరిశ్రమదారులకు సాంకేతికంగా యోగ్యతలు వున్నాయి, కాని వారికి యంత్రాలు నడిపించడంలో ప్రత్యక్షానుభవం లేదు. గనుక వారికి ఒక నెలవరకు యంత్రాల నిర్వహణలో స్వల్పకాలిక శిక్షణ ఇవ్వడం వాంఛనీయమని భావించబడింది. ప్రాగాటూల్సు, హైద్రాబాదు ఆల్విన్ మెటల్ వర్క్సు ఇదితర ప్రభుత్వ ప్రయివేటు రంగాలలోని పారిశ్రామిక సంస్థలు అభ్యర్థులకు తగిన శిక్షణ ఇవ్వడానికి సౌకర్యాలు కల్పిస్తాయి.

మేనేజీరియల్, వ్యాపార నిర్వహణలో శిక్షణ ఇవ్వడానికి కూడా వారికి సౌకర్యాలు కల్పించబడినాయి లఘుపరిశ్రమల సేవాసంస్థ, ఆంధ్రప్రదేశ్ ఉత్పత్తి మండలి, లఘుపరిశ్రమల విస్తరణ శిక్షణ సంస్థ, బ్యాంకులకు చెందిన నిపుణులు మేనేజిమెంటు, వ్యాపారనిర్వహణ విషయాలలో అభ్యర్థులకు శిక్షణ ఇస్తారు. ఈ శిక్షణ కార్యక్రమాలు 1972 జూలై ఆఖరుకు పూర్తి అవుతాయని ఆశింపబడుతున్నది. ఇంతవరకు 100 మంది పరిశ్రమదారులకు శిక్షణ ఇవ్వడం జరిగింది. జూన్ 19 నుంచి 564 మంది శిక్షణ పొందుతున్నారు. యంత్ర నిర్వహణ విషయంలో 110 మందికి వివిధ పరిశ్రమల్లో శిక్షణ ఇవ్వడం జరుగుతున్నది.

ఎక్కడైనా ఏర్పాటు చేయడానికి ముందుగా వర్క్షాపు సౌకర్యాలు వుండడం అవసరం. అనేక సందర్భాలలో పరిశ్రమలకు అనువైన స్థలం చూపడం చాల గడ్డుసమస్యగా తయారైంది.

స్వయం ఉపాధివాటిల పథకం క్రింద 300 యూనిట్లు ఏర్పాటు చేయడానికి ప్రతిపాదించబడింది ముందు ముందు కొత్త పరిశ్రమదారులకు ఫ్యాక్టరీలో తగిన స్థల సౌకర్యాలు కల్పించవలసిందని ప్రయివేటు ఏజెన్సీలను కోరడం జరిగింది.

ముగింపు

భారత ప్రభుత్వం రూ. 76 లక్షలు కేటాయించింది. ఈ నిధులు, బ్యాంకులు, ఇతర ఆర్థిక సహాయక సంస్థలు కలిపి చేసిన సహాయం ఫలితంగా ఇప్పుడు 25,000 మందికి ఉపాధి కలగడానికి అవకాశాలు ఏర్పడినాయి. రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధికి ఈ స్వయం ఉపాధిపథకాలు ఎంతగానో దోహదకారి అవుతాయి. ఈ పరిశ్రమదారులు సాలీనా రూ. 12 కోట్లు విలువచేయు వస్తువులను ఉత్పత్తి చేస్తారు. వస్తువులరూపకంగా రాష్ట్ర ప్రభుత్వానికి సాలీనా రూ. 0.5 కోట్లు ఆదాయం వస్తుంది.

ఆంధ్ర విప్లవ యోధుడు

అల్లూరి సీతారామరాజు

—పి. రాజేశ్వరరావు

"ఆయన సాయుధ తిరుగుబాటును నేను అంగీకరించక పోయినప్పటికీ, ఆయన సాహసానికి, త్యాగానికి శ్రద్ధాంజలి ఘటిస్తున్నాను."

— గాంధీజీ

ఆంధ్ర విప్లవయోధుడైన శ్రీ అల్లూరి సీతారామరాజు పశ్చిమ గోదావరి జిల్లా మోగల్లు గ్రామంలో 1897 జూలై 4వ తేదీన జన్మించాడు.

ఆయన తండ్రి శ్రీ వెంకట రామ రాజు ఫోటో గ్రాఫరు వృత్తిని చేపట్టి రాజమండ్రిలో స్థిరపడిపోయారు. ఒకరి క్రింద పనిచేయటం ఆయనకు ఇష్టంలేదు. శ్రీ సీతారామరాజుకు కూడా తన తండ్రి గారి స్వతంత్ర భావాలు అలవడినాయి. ఆయన తల్లి శ్రీమతి నారాయణమ్మ గారు దైవ భక్తి పరాయణురాలు. శ్రీ సీతారామరాజు తన ఎనిమిదవ ఏట తండ్రిని కోల్పోయినాడు. ప్రాథమిక విద్యముగిసిన తరువాత ఆయన కాకినాడలోని పిఠాపురం రాజా వారి కళాశాలలో చేరినాడు. అక్కడ ఆయనకు శ్రీ యం. అన్నపూర్ణయ్యతో సన్నిహిత పరిచయం ఏర్పడింది. శ్రీ అన్నపూర్ణయ్య గొప్ప స్వాతంత్ర్య యోధుడు ఇద్దరు కలసి మాతృ దేశ స్వాతంత్ర్యాన్ని గురించి కలలు కనేవారు. రాజు మాత్రం ఏకాంతంగా వుండి ఏదో ధ్యానములో వుండేవాడు. ఆయనలో ఆకర్షణ శక్తి వుంది చాల అందమైన వ్యక్తి అయినప్పటికి కూడా సన్యాసి కావాలనే కోరిక ఆయనకు ఉంది. 1912 లో ఆయన విశాఖపట్నం వెళ్ళి అక్కడ మిసెస్ ఎ.వి. యన్. కాలేజిలో 4వ ఫారంలో చేరినాడు.

అక్కడ ధనవంతుడైన ఒక అబ్బాయితో స్నేహం చేశాడు. అయనకు తన మిత్రుని చెల్లెలు సీతపైన ప్రేమానురాగాలు వృద్ధి చెందుతూ వచ్చాయి. ఆమె ఆకస్మికంగా మరణించినపుడు. రాజుకు జీవితంపైన నిరాశ కలిగింది. అయితే ఆమె పవిత్ర స్మృతికి చిహ్నంగా తన పేరుకు ముందు ఆమె పేరు పెట్టుకొన్నాడని చెబుతారు అప్పటినుంచి రామ రాజు 'సీతా రామ రాజుగా'' వ్యవహరింపబడుతూ వచ్చాడు. ఆయన పరీక్షలో తప్పిపోవడం ఆయన పెద్దనాయన శ్రీరామకృష్ణరాజుకు మనుస్సుకు కష్టం కలిగింది. అప్పుడు శ్రీరామకృష్ణరాజు నర్సాపురంలో తహశీల్దారుగా పని చేసేవారు. సీతారామరాజు విశాఖపట్నం నుంచి నర్సాపూరుకు వచ్చి అక్కడ ప్రసిద్ధంగావున్న టేలర్ హైస్కూల్‌లో చేరినాడు. అక్కడ తన పెద్ద నాన్న గుర్రం మీద స్వారి చేయటంనేర్చుకొని దూరదూర ప్రాంతాలకు స్వారి చేసేవాడు తరచుగా కొండ ప్రాంతాలకు వెళ్ళేవాడు. చివరకు ఆయన తన చదువుకు స్వస్తి చెప్పాడు.

శ్రీ సీతారామరాజు దేశాటనకు బయలు దేరాడు ఆయన హిమాలయ పర్వతాలకు వెళ్ళాడని విప్లవ యోధుడైన శ్రీ పృథ్వీ సింగ్‌ను కలుసుకున్నాడని ప్రజలు చెబుతారు. శ్రీపృథ్వీసింగ్, నడుస్తున్న రైలు నుంచి దూకి పోలీసులనుంచి తప్పించుకొన్న వ్యక్తి.

వీరిద్దరు కలిసి, ఆ కాలంలో ఆయుధాలు దోపిడికి, విప్లవ కేంద్రమైన చిటగాంగ్‌కు వెళ్ళారని ప్రజలు అనుకుంటూ వుంటారు. గంగా గోదావరి పవిత్ర నదులు పుట్టిన స్థలాలైన గంగోత్రి నాసిక్‌లను కూడా ఆయన దర్శించాడని చెబుతారు

దేశమంతా తిరిగి చిట్ట చివరకు శ్రీ సీతా రామ రాజు



ఏజెన్సీ ప్రాంతాలలోని పాపి కొండలలో స్థిరపడి పోయినాడు ఆధ్యాత్మిక శక్తులు సంపాదించడానికి తపస్సు కూడా చేశాడు.

సీతారామరాజు జ్యోతిషశాస్త్ర విజ్ఞానానికి కొండజాతుల ప్రజలు ఆశ్చర్యపడినారు. ఆయనది కఠోర నియమముగల జీవితము. కొండప్రజలు తెచ్చి ఇచ్చే తేనె, పండ్లు ఫలాలను తనకు ఎంత అవసరమో అంతమాత్రమే తీసుకుని మిగిలిన వాటిని తన ఆశీర్వాదముతో వారికి తిరిగి ఇచ్చేవాడు. అప్పటికి ఆయన తుపాకులు కాల్చడం నేర్చుకున్నాడు. ఆయన కొండప్రజల సాధక బాధకాలను కష్టనిష్ఠూరాలను క్షుణ్ణంగా అవగతం చేసుకున్నాడు.

మురాదారులు ఈ పామరజనులను నానా బాధలపాలు చేస్తున్నప్పటికీ ప్రభుత్వం ఏమీ పట్టించుకొనేది కాదు. కొండ

ప్రజలు త్రాగుడు వ్యసనాన్ని విరమించాలని తమ వివాదాలను పంచాయతీల ద్వారా పరిష్కరించుకోవాలని ఆయన వారికి హితవు చేశాడు. వారిని పోలీసులు, మునసబుల బారి నుంచి ఉపాయముగా విడిపించేవాడు. ఈ విధంగా చేయడంవల్ల ఈ ప్రాంత ప్రజలకు ఆయన దేవునితో సమానమై పోయినాడు.

ప్రసిద్ధ కోయ నాయకులైన మల్లుదొర గంటందొర సీతారామరాజు శిష్యులైపోయినారు. అన్యాయంగా ప్రజలను పీల్చి పిప్పిచేస్తున్న విధానాలను ప్రతిఘటించినందుకు వారు సారవంతమైన తమ భూములను గ్రామ మున్సిఫ్ ఉద్యోగాన్ని కోల్పోయినారు. కొండ ప్రజలపైన దౌర్జన్యకాండ సహించరానిదై పోయింది. కొండ ప్రజలు ఏమాత్రము సహించలేక పోయినారు. ఇక తిరుగుబాటు తప్ప వేరే గత్యంతరం వారికి కనిపించలేదు. 1877 లో ద్వారబంధాల చంద్రారెడ్డి చేసిన తిరుగుబాటును ఈ ప్రజలు ఇంకా మరచిపోలేదు. 1922 లో పరిస్థితి తీవ్రరూపం దాల్చినపుడు సీతారామరాజు ఈ కొండ ప్రజలకు నాయకత్వం వహించాడు. ప్రభుత్వం ఆయనకు ఆశ్రమనిర్వహణ కొరకు 60 ఎకరాల సారవంతమైన భూమిని ఇచ్చి వశం చేసుకోవాలని ప్రయత్నించింది. దీనిని ఆయన తిరస్కరించి, ప్రజలకు అండగా నిలిచాడు. ఒక్కని శక్తితో ప్రతిఘటించడంతో చింతపల్లి, అన్నవరం, రాజవొమ్మంగి, కృష్ణదేవి పేటలోని పోలీసు స్టేషనులపై విజయవంతముగా దాడులు జరిపాడు. అనేక ఆయుధాలను స్వాధీనపరుచుకొన్నాడు. దాడి చేస్తున్నట్లుగా ముందుగానే పోలీసులకు తెలియచేసేవాడు. ఆయనకు అగ్గిరాజు కుడిభుజంగా పనిచేశాడు.

అప్పటినుండి కొండప్రజలకు బ్రిటిష్‌సామ్రాజ్యవాద శక్తులకు మధ్య ఘోర సంఘర్షణ జరిగింది. తిరుగుబాటును అణచివేయడానికి స్థానిక పోలీసులకు తోడుగ మలబారు ప్రత్యేక పోలీసు దళాలు పంపబడినాయి. అయితే అవి పరిస్థితిని అదుపులో పెట్టలేకపోయినాయి. తరువాత ప్రభుత్వం సైనికసహాయన్ని పొందింది. సైన్యానికీ, కొండజాతులకూ మధ్య జరిగిన పోరాటం భారతదేశంలోనేకాక విదేశాలలోకూడా ప్రజలదృష్టిని ఆకర్షించింది. ఈసాయుధ పోరాటం రెండేండ్లు కొనసాగింది. ఆ ప్రాంత భౌగోళిక పరిస్థితులు సైన్యానికి అనుకూలంగా లేవు. ఇది మలేరియా ప్రాంతం. సైన్యాన్ని సంఘటితపర్చలేక, ఈ బాధలన్నీ పడలేక సైనికులు హింసాకాండకు పూనుకున్నారు. గ్రామాలను తగులబెట్టడం, పంటలను నాశనం చేయడం, పశువులను చంపివేయడం, స్త్రీలపైన అత్యాచారాలు చేయడం మొదలగు ఘోరకృత్యాలకు తలపడినారు. విశాఖపట్నం కలెక్టరు శ్రీ బేస్టెన్ ప్రజల తిరుగుబాటును అణచిపెట్టడానికి ఏయే చర్యలు అవసరమో అవన్నీ తీసుకున్నాడు. 1924 మే 7వ తేదీన సీతారామరాజును పట్టుకొని కాల్చివేయడం జరిగింది. ఆయన వీరమరణంపొందినాడు.

సందేహాస్పదమైన విషయమేమిటంటే సీతారామరాజు శరీరం గుర్తించబడలేదు. దానిని వెంటనే దహనం చేయడం జరిగింది. హడావిడిగా గుట్టుచప్పుడుగా ఇది జరగడంవల్ల సీతారామరాజు తప్పించుకొని వెళ్ళినాడని అయితే ఆయనను పోలిన వ్యక్తిని కాల్చి చంపడం జరిగిందని కొందరు విశ్వసించారు. ఏలూరు, రాజమండ్రి భీమవరం ప్రాంతాలలో అనేక మంది వ్యక్తులు సీతారామరాజుగా అగుపించి వెంటనే కనుపించకుండా వెళ్ళిపోవడంవల్ల ఈ విశ్వాసానికి కొంత ఆధారం కలిగింది.

చిట్టచివరకు 1924 జూన్ 6వ తేదీన గంటందొర భీషణ పోరాటంలో అసువులు విడిచినాడు. మల్లుదొర పట్టుబడినాడు. ఆయనకు జన్మాంతర శిక్ష విధించబడింది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత మల్లుదొర పార్లమెంటు సభ్యులైనారు. గాంధీజీ సీతారామరాజుకు శ్రద్ధాంజలి అర్పిస్తూ 'ఆయన సాయుధ తిరుగుబాటును నేను అంగీకరించను కాని, ఆయన సాహసానికీ త్యాగానికీ శ్రద్ధాంజలి ఘటిస్తున్నాను' అని చెప్పడం గమనించదగిన విషయం. 'వ్రేళ్ళపైన లెక్కపెట్టగల మహావీరులలో శ్రీ రాజు ఒకరు' అని శ్రీ జవహర్లాల్‌నెహ్రూ అన్నారు. శ్రీ సీతారామరాజు యొక్క దృఢనిశ్చయము, అసమాన ధైర్యసాహసాలు, ఆత్మార్పణ ఆయన పేరు ప్రఖ్యాతులను దేశం నలుమూలలకు వ్యాపింపచేసినవని ఒక సందర్భంలో నేతాజీ సుభాస్‌చంద్రబోస్ అన్నారు. శ్రీ అల్లూరి సీతారామరాజు ఇరువది యేడేండ్ల చిన్న వయస్సులోనే అమరుడై దేశస్వాతంత్ర్య సమర చరిత్రకు ఎక్కినారు.

శ్రీ సీతారామరాజు జన్మస్థానంలోను ఏజెన్సీ ప్రాంతంలోనూ ఆయన విప్లవోద్యమానికి నిలయమైన చోటులలోను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అనువైన స్మృతి చిహ్నాలను ఏర్పాటు చేయడం ముదావహమైన విషయం. ప్రభుత్వం ఒకలక్ష రూపాయల ఖర్చుతో స్మారకభవనం నిర్మించడమే కాకుండా ఈ విప్లవయోధుని సోదరునికి నెలకి 100/ల చొప్పున రాజకీయ పింఛను ఇవ్వడం శ్లాఘనీయమైన విషయం.

అఖండ ఆంధ్రప్రదేశ్ అభ్యుదయానికి కృషి చేద్దాం

'బాలబంధు'

జవహర్‌లాల్ నెహ్రూ

"నెహ్రూ" అను పేరు తలచుకొనునపుడెల్ల త్యాగశీలము, సేవానిరతి, నిర్మల హృదయము, అకుంఠిత దేశభక్తి, విశాల దృక్పథము మొదలగు సుగుణములు రూపము దాల్చి ఎదురుగా నిలబడినట్లే తోచుచుండును. ఆదర్శ పౌరునకు ఉండవలసిన యీ లక్షణములు అత్యున్నత ప్రమాణములో ఉండుటయే కాక పరిపాలనా దక్షత, రచనా పాటవము హృదయము నుఱ్ఱూత లూగించు వాగ్ధాటి నెహ్రూలో మూర్తీభవించినవి. ఇవన్నియు ఒక ఎత్తు బాలబాలికల యెడల ఆయనకుగల అపారమైన ప్రేమ ఇంకొక ఎత్తు. ఆయన జన్మదినమైన నవంబరు 14వ తేదీ బాలల పండుగ దినముగా ప్రత్యేక ప్రాముఖ్యము వహించినది.

బాలలు భావి భారత పౌరులు. దేశ భవిష్యత్తు వారిపై ఆధారపడియున్నది. వారి క్రమశిక్షణ, విద్యాభ్యాసము, శీలసంపద సరియైన పద్ధతిలో అభివృద్ధి చెందుటయు వారి ఆరోగ్యము నెడల తగిన శ్రద్ధవహించుటయు దేశాభ్యుదయమున కత్యంతావశ్యకములు. ఎంత కార్యభారమున మునిగియున్నను, జాతీయ అంతర్జాతీయ రంగములలో ఎన్నెన్నో గడ్డు సమస్యలతో తలయంతయు గందరగోళముగా నున్నను పిల్లలను చూచునరికి వారిలో కలిసిపోయి వారితో ఆనందింపగల నెహ్రూ వాత్సల్యము బాలలకెంతయో ఉత్తేజకరము, ఉల్లాసకరము కూడ.

బాలల దినోత్సవ సందర్భమున పాఠశాలలలో ఆటపాటల పోటీలు జరుపుట బహుమతులు పంచుట లాంఛన ప్రాయముగ నిలచినదేకాని ఆ దినముయొక్క ప్రాముఖ్యమును పెద్దలు గుర్తించుటయు ఆ పిల్లలకు ప్రయోజనము చేకూర్చుటయు మాత్రము జరుగలేదనియు చెప్పవచ్చును. కనీ మా రోజుననైనను నెహ్రూజీ ఆదర్శములు, ఆశయములు, గుణసంపద బాలలకు మనసున హత్తుకొనునట్లు చేయగల కార్యక్రమములను చేపట్టుట ఎంతో అవసరము. మహామహుల జీవితమునుండి పిల్లలు నేర్చుకొను విషయములు పెక్కులుండును. ఆ జీవిత విశేషములను ఉపన్యాస రూపముగను బుఱ్ఱకథ రూపముగను, రూపకముల మూలముగను, బాలల మనస్సున నాటునట్లు చేసినచో వారి సర్వతోముఖాభివృద్ధికి దోహదము చేకూరును.

నెహ్రూ జీవితమున ప్రధానమైన విషయము త్యాగగుణము ఆగర్భ శ్రీమంతుడైనప్పటికిని ధనార్జనమున కవకాశములు విశేషముగానున్నను దేశభక్తిపూరితుడై సంపదనేకాక శరీరసౌకర్యమునుకూడ త్యజించి కారాగార క్లేశముల ననుభవించుటయందు ఆయన త్యాగశీలము పరాకాష్ఠ నందుకొన్నది. ప్రాణాపాయస్థితిలో నున్న సతీమణి చికిత్సకొరకు విదేశములకు వెళ్ళునపుడు కూడ చలించని దేశభక్తి నిజముగా భావిపౌరుల కుత్తేజకరము. ఆయన నిత్యదైనిక కార్యక్రమమే ఒక సందేశము. తెల్లవారినది మొదలు అర్ధరాత్రి వరకు విరామ మెఱుగని పనిలో నిమగ్నుడై తన జీవితమును దేశ ప్రజలకు అంకిత మొనర్చిన ధన్యజీవి. కర్తవ్య పరాయణత, కాలసద్వినియోగము భారత పౌరులకు ఒరవడిగా చూపిన మహనీయుడు. చిట్టచివరి రోజులవరకు ఆయన దేహారోగ్యము దెబ్బతినుటగాని, విరామముకొరకు సెలవు తీసికొనుటగాని యెఱుగని కష్టజీవి.

భాక్రానంగల్ ప్రాజెక్టు గురించి మాట్లాడుచు అట్టి నిర్మాణములను నవీనయుగ దేవాలయములుగ వర్ణింపగలిగిన ద్రష్ట ఆయన. దేశభవిష్యత్తు గురించి దేశస్థులు కన్నకలలు ఫలించి యీ నిర్మాణములు సిద్ధించుచున్నవనియు సాధ్యమైనంత త్వరితగతిని దేశమునకొక క్రొత్తరూపు సమకూర్చుకొని ముందుకు నడిపి, పుష్టినొసగి, దారిద్ర్యమును నిర్మూలించు ఏ కృషియైనను మహత్తరమైనదనియు గర్వకారణమనియు, వేలకొలది కర్మాగారములు గృహపరిశ్రమలు నెలకొల్పి దేశ ప్రజలకు ఉపాధి కల్పించుటకంటె కోరుకోగలిగినది లేదనియు పక్కాణించిన ఆయన దేశాభ్యుదయ కృషిలోని త్రికరణశుద్ధి నాయకులకే కాక సామాన్య పౌరులకు భావిపౌరులకు కూడ ఒక దివ్య సందేశము. మానవసేవయే మాధవసేవ యను సూక్తి యొక్క ప్రాముఖ్యమును గుర్తించి యిటువంటి నిర్మాణ కార్యక్రమములెంత కష్టభూయిష్ఠములైనను సాగించవలెనను అకుంఠిత విశ్వాస స్థైర్యములు భర్తృహరి చెప్పిన "ధీరుల్ విఘ్ననిహన్యమానులగుచున్ ధృత్యున్నతోత్సాహులై ప్రారబ్ధార్థము లుజ్జగింపరు సుమీ ప్రజ్ఞానిధుల్ గావునన్" అను సూక్తికి నిదర్శనములై భావితరముల వారికి మార్గదర్శకములని గ్రహించ వచ్చును. "పని చేయుట, పని చేయుచు నేర్చుకొనుట, తత్ఫలితముగా ఇంకను గొప్ప గొప్ప

పనులు చేయగలుట" కవకాశము కల్పించు ఈ నిర్మాణమొక విశ్వవిద్యాలయమని కూడ ఆయన వర్ణించెను.

"It struck me that BhakraNangal was like a big University where we can work and while working learn, so that we may do bigger things".

నెహ్రూ వ్యక్తిత్వము ఆయన 'వీలునామా' లో విశిష్టమగుచున్నది. తనపై అపారమైన ప్రేమను వర్షించిన భారత ప్రజానీకమునకు కృతజ్ఞత తెలిపి అందులో ఒక సహస్రాంశమైనను తానుపొందు నర్హతకై ఎంతో కృషిచేయగలనని ఉద్ఘాటించిన ఆయన వినయశీలము ఎవరికైనను ఒజ్జబంతియేయగును. తనతోపాటు స్వాతంత్ర్య మహోద్యమమున కష్టములలో పాలొనిన సహచరుల గురించి చేసిన కృతజ్ఞతాపూర్వక ప్రశంసలోగల నిరహంకార శీలము గుర్తింపదగినది. తుదకు తన చితా భస్మమునెట్లు వినియోగపరచవలెనో కోరుచు కొంచెము ప్రయాగలో త్రివేణీ సంగమమున జల్లి మిగిలినది విమానములో ఎత్తునకు తీసికొనిపోయి భారత భూభాగములైన పంటపొలములపై వెదజల్లవలెనని వాంఛించుటలో ఆయన దేశాభిమానము—ప్రతి అణువు దేశము యొక్క మట్టితో అవినాభావ సంబంధము గలిగి నిలిచిపోవలెననే ఆశయము—ప్రపంచమున కంతటికిని ఒక సందేశము.

దేశము నెంతగానో ప్రేమించిన నెహ్రూ జన్మ దినమున ఆయన కత్యంత ప్రేమ పాత్రులైన బాలలకు సర్వతోముఖాభివృద్ధికై పాటుపడవలెనను దీక్షను పూనుటయు ఆయన జీవితమే బాలలకొక సందేశమని గుర్తించు కార్యక్రమములు రూపొందించుటయు, మన కర్తవ్యముగా నెఱుంగవలెను. ★

జోహారు జవహార్



ఓ మహనీయ ! జాతికి హితోక్తులు నేర్పిన నాయకాగ్రణీ !
నీ మధురామృతోక్తులను నెన్నడు నేమఱపోము మేము, నీ
నామమహత్వ మేమొ ప్రజ నాడును నేడు సమైక్యభావనా
రామమునం జరించు పరరాజులు భీతిల పూజ్య నెహ్రూజీ !

శాంత్యహింసా చక్ర జాతీయరథమును
సాగించు మానవ 'జాతినేత'
చిన్నిపాపలతోడి చెలిమిని వాంఛించి
ముద్దులనొలికించు 'ముగ్ధమూర్తి'
పంచశీలను జాటి బహు దేశములయందు
సఖ్యమున్ పెంచిన 'శాంతిదూత'
సంస్కృతీ మహితుండు, సాహితీకన్యక
మురిపింపజేసిన మోహనుండు

మహిత తేజో విభాసిత మధురభాషి !
సరస సంభాషణాన్విత శాంతమూర్తి !
అభ్యుదయ భావపూర్ణ మహోయశస్వి !
గణ్యచరితాన్వయోదాత్త పుణ్యమూర్తి !

బాలురముద్దుబాబు మన పండిత జవ్హారులాలు బాలగోపాలకుడైన కృష్ణువలె- పాపలు చుట్టును జేర, దీవనల్ బాలురకిచ్చువాడు—కనుపండువుగా చరియింపుచున్ గులాబీలకు ముద్దు గొల్పు మన పెన్నిధి జన్మదినంబు పర్వమా !

రేవూరు అనంత పద్మనాభరావు

తామ్రపత్రం

జె. బాపురెడ్డి

ఢిల్లీలోని
లాల్ ఖిల్లా లోని
"దివానె ఆం" లో
క్రొత్త దీపం ఒకటి వెలిగింది
దివ్య రూపం ఒకటి కదలింది —
పొంగిపడే స్మృతి తరంగాల
గంభీర సాగర నయనాలతో
తరతరాల
పారతంత్ర్య నిగళాలను
పౌరుషంతో త్రెంచుకున్న హస్తాలతో
అందుకున్నాడు స్వాతంత్ర్య యోధుడు
అమృతమూర్తి భారతేందిర
అందించిన అభిమాన తామ్రపత్రం
అమ్లాన స్వేచ్ఛాజీవన చిత్రం —

ఆనందంతో
కరిగిపోతున్న అతని కళ్లను
ఆవేశంతో
ఊగిపోతున్న అతని కరాలను
విజయభారంతో
వంగిన అతని నడుమును
వినమ్రితా భావంతో
తడబడే అతని పాదాలను
అద్దుకొన్నది భరతావని తన గుండెకు
అందించింది కృతజ్ఞతా పత్రం
స్వాతంత్ర్య విజయ ఛత్రం
తామ్రి పత్రం—

ఏమిటి ? ఏమిటిదంతా !
ఏమిటి ? ఏమిటి ఈ వింత !
పాతికేళ్ల స్వాతంత్ర్య లక్ష్మి
పండుగ చేసుకుంటున్నది
సర్వస్వం తనకోసం
త్యాగం చేసిన
స్వాతంత్ర్య యోధులను
సన్మానిస్తున్నది

భరత మాతృ
పవిత్ర నేత్రాలలో
భవిష్యద్దీపాలు వెలిగిస్తున్నది,
మరచి పోమ్మంటున్నది
అవమానాలను, అపజయాలను,
తలచుకొమ్మంటున్నది
సన్మానాలను, దిగ్విజయాలను,
చీకటి తాకలేని లోకం వైపు
శీఘ్రగతిని సాగమంటున్నది —

స్వాతంత్ర్య యోధుడు
స్వర్ణాక్షర తామ్రపత్రం కోసం
సాచిన హస్తం
చరిత్రలో స్వర్ణయుగాన్ని చిత్రించిన
చైతన్య స్రవంతిలా భాసించింది
భవిష్యత్తుకు భద్రభిక్ష పెట్టే
దీక్షా శిబిరంలా దీపించింది —

అపూర్వ త్యాగశక్తి
నిండిన, అతని ముఖమండలం నుంచి
లీలగా తొణకిపడ్డ దరహాసంతో
రాగారుణమైంది ఎర్రకోట
రసార్ణవం అయింది దివానె ఆం —

విశాల కాళనిశాఫాలంమీద
విప్లవోషస్సులు పండించిన
అతని విముక్త కరాగ్రాలు
భరత జాతి జీవన ప్రాంగణంలో
ప్రగతి దీప స్తంభాలు —
ఆసేతు హిమాచలం
ఆవరించిన అతని కరతలంలో
మానవతా జ్యోతిలా వెలిగే
తామ్రపత్రం
మనల నెల్లప్పుడూ
మహా విజయ మార్గంలో నడిపించే
మహోజ్జ్వల నేత్రం—తామ్రపత్రం!

‘ప్రకాశం గారు’ కాదు :

- ప్రకాశం

దేవులపల్లి వేంకటకృష్ణశాస్త్రి

[ఈ వ్యాసం 1946లో వ్రాసినది. అప్పుడు మద్రాసు రాష్ట్రానికి ముఖ్యమంత్రి ప్రకాశం. రాష్ట్ర ముఖ్యమంత్రిని కూడా ఆ రోజులలో ప్రధాన మంత్రి అనేవారు. మద్రాసులో అప్పుడు గవర్నర్లు ఉండే భవనాలు రెండు ఉండేవి. ఒకటి మౌంటు రోడ్డులో (Mount Road) రెండోది గిండీలో. (Guindy) వానిలోనికి ఎవ్వరూ అడుగు పెట్టగూడదు. ప్రకాశం ప్రధానమంత్రి కాగానే, మౌంటు రోడ్డులో ఉన్న గవర్నరు భవనం తీసుకుని, దానిలోనికి జనం ధారాళంగా వచ్చి పోవడానికి తెరిచేశారు.]

ప్రస్తుతం ప్రకాశం మకాం మద్రాసు గవర్నరు భవనంలో. భక్తులైన పూజారులకు గాని స్వామి గర్భాలయం తలుపులు ఇదివరకు సడలేవి కావు.

ఇప్పుడు ముఖద్వారం తలుపులు మూత పడడమే మానివేశాయి. ఎప్పుడూ వచ్చే ప్రజా, వెళ్లే ప్రజానూ ! తీర్థం.

వారిలో కాసూరి రంగడు ఆలీబేగ్. అద్దేపల్లి అప్పడు, మస్తాన్, ‘కింగ్ ఆఫ్ ఒంగోల్’ నవులూరి రమణయ్య: రాజమహేంద్ర వరం బెస్తలూ కూడా ఉన్నారా ! అనిపిస్తుంది.

ఎందుకు ఉండగూడదు ? వీళ్ళందరూ ప్రకాశం బాల్యంలో స్నేహితులు.

డెబ్భై యేళ్ల క్రితం, నాయుడు పేటలో సువర్ణముఖి ఒడ్డున వేంచేసి ఉన్న శ్రీ ఆంజనేయస్వాముల కారగింపుగా కోడిగుడ్లు నైవేద్యం పెట్టిన బాల భాగవతుడు కాసూరి రంగడు.

అక్కడ తోటల్లో విడిది చేసిన వెంకటగిరి మహారాజుల ఏనుగుమీద ఎక్కడానికి మావటివానికి కానీయో అర్ధణాయో కానుక ఇచ్చి, గజారోహణ భాగ్యం పదేండ్ల ప్రాయంలోనే పొందిన బహద్దరు ఛోటానవాబ్ ఆలీబేగ్. బొంగరాలూ, గోలీలూ కొనడానికి దొంగతనాలు అవసరమై, చిన్నముతాలు చేరదీసి ఒంగోలు నడిబజారు వీధుల్లో చిల్లర దుకాణదారుల గల్లా పెట్టెల బరువు వదిలించే మేటిసర్దారు అద్దేపల్లి అప్పడు.

అందరికన్నా అసాధ్యుడు నవులూరి రమణయ్య. ఇతని ‘ఊటీ’ కంపెనీలో మస్తాన్‌సాహెబ్ వంటి మహా సాహసికులు ఉండేవారు. రంగారాయుడు చెరువుక్రింద వరిగెపంటను రాత్రి రాత్రే కోయించి, నెత్తిని పెట్టించి, పొలందాటించిన పోటర్లు.

ఇలాంటి వారితో అప్పుడు ప్రకాశానికి జట్టు ! కనుక, అప్పుడు వాళ్లంటే–ఎప్పుడూ వాళ్లు ఉంటూనే ఉంటారు–వాళ్లది కూడా డెబ్భైఅయిదో పుట్టినరోజు ఈ ఏడాదికి ఇటోఅటో పడి ఉండేదేమో !

అయినా మొన్న ప్రధానమంత్రి జన్మదినోత్సవం జరిగినప్పుడు వాళ్లందరి పుట్టినరోజుల పండుగలూ జరిగినట్లే !

ప్రకాశం వట్టి ప్రజ్ఞ.

ప్రభువుల్లో కంటే ప్రజల్లోనే ఉదాత్తత ఎక్కువ ఉందంటారు

సామాన్యులకున్న దర్జా సామంతులకే లేదు.

గద్దెమీద గరికెనేలమీద ఒకేఠీవితో కూర్చోగలిగిన వానిదే హుందా అంటే.

వానికి ఒక కనకపు సింహాసనం గౌరవం ఇవ్వనక్కర్లేదు.

పంచటరుగును పట్టపు తఖ్తు చెయ్యగలవాడు వాడు.

సామాన్యప్రజ సహజంగా రాజు, కొందరు దోపిడివల్లా దుస్తంత్రాలవల్లా దొంగతనంవల్లా దొరలవుతారు.

ప్రకృతి సిద్ధంగా దర్జా అయినవాడు ప్రకాశం.

ఇతన్ని ‘ప్రకాశంగారు’ అనలేము. అలాగఅంటే అపత పోతుంది. నన్నునేను ‘గారు’ అనుకున్నంత నవ్వులాటగా దుస్సహంగా ఉంటుంది

‘ప్రకాశంపంతులు’ అని కూడా అనలేము.

మతంలేదు, కులంలేదు, మస్తానుకీ బెస్తకీ నేస్తం ‘పంతు’లెలాగవుతాడు !

పంతుళ్లు వేరు. వారూ ప్రముఖులూ గొప్పవారే. సందేహంలేదు. న్యాపతి సుబ్బారావు పంతులు, మోచర్ల రామచంద్రరావు పంతులు, ఇలాగ వారికి ‘పంతులు’ అనేది నప్పుతుంది, సామాన్యులా:

‘పంతులు’ గాని, బిరుదుగాని తగిలించకుండానే ‘ప్రకాశం’ అన్న పేరులో కావసినంత బరువూ ప్రతిష్ఠా ఉన్నాయి. అందులోనే ఉన్నాయి కూడా మన ప్రధానమంత్రి పలుకుబడీ ప్రభావమూను.

ప్రకాశం అంటే 1921 తరువాత వచ్చిన ప్రజా జాతీయోద్యమానికి ప్రబలచిహ్నం అన్నమాట. మన రాష్ట్రంలో ఆ ఉద్యమ చైతన్యం అంతా అతనిలో ఇమిడిఉంది. అతని మూర్తిలో మనకు ఆశకి అంతా స్ఫురిస్తుంది.

ఆ ఉద్యమాన్ని గూర్చి ఇక్కడ ఒక్కమాట.

1921 కి పూర్వం, జాతీయోద్యమంలో విద్వాంసులూ, అధికారులూ, మేధావులూ ప్రసంగాలిచ్చి, పత్రికలకు వ్రాసీ కృషిచేస్తూ ఉండేవారు.

ఇక నలభైకోట్ల ప్రజమాత్రం స్తిమితంగా నిదానంగా నిద్రలాంటి మగతలో పురాణస్మృతులు నెమరు వేసుకుంటూ ఉండేది. ఆ నీరస స్థితికీ నిర్వీర్యానికీ సిగ్గుపడడం కూడా ఆ ప్రజకు తెలియదు. మానంలేదు. అభిమానంలేదు. తృష్ణలేదు. ఆత్మవిశ్వాసం లేదు. తన నీడ తన్నే తరుముతుంటే తల్లడిల్లి పోయేది.

అప్పుడు భారతరంగంలోకి గాంధీ అవతరించాడు. ఈయన చిత్రమైన వాడు,

ఈయన్ని మించిన మహా మేధావులు వర్తమాన భారతంలో ఉన్నారు. ఈయన కన్న విద్యాసంపత్తీ అర్థబలమూ శరీరసౌష్ఠవమూ, రాజకీయ విజ్ఞానమూ, కళావైభవమూ ఉన్నవారు, హిమాలయ శిఖరాలవంటివారు, ఎందరో, నేటి భారతవర్షంలో సాక్షాత్కరిస్తారు.

అయితే, దప్పుదప్పులనే నిలబడివారిని గౌరవిస్తుంటాము. వారిలో ఒకొక్కరిలో ఉన్న ఒక ప్రత్యేక శక్తిముందు మన కించదనం తక్కువతనం నిలబడితే, వాళ్లు మనకి అందరాని అసాధ్యులు అయిపోతున్నారు. వాళ్ల గొప్పతనం సామాన్యులమైన మన కొద్దితనం చూపిస్తుందే కాని, ఆశా బలంగాని, ఆత్మవిశ్వాసంగాని, అహంకారంగాని, గర్వంకాని ఇవ్వలేదు.

గాంధీ మాహాత్మ్యం ప్రత్యేక ప్రతిభలో లేదు.
ఈయన మన కళ్లు మిరుమిట్లు గొలపడు.
ఈయన కైలాస శిఖరం కాడు.
దేశం అంత జలాశయం గాంధీ
గాంధీ గంగానది.

దానిలోని అమృతం మీకూ నాకూ అందరికీ అహరహమూ అన్ని పనులకూ అందుబాటులో ఉంటుంది.

ఈయన శక్తులు మనకూ వుండవచ్చు ననిపిస్తుంది, ఈయన కట్టూబట్టా మనలో అందరికన్నా సామాన్యుని కట్టూబట్టా స్ఫురింపజేస్తాయి

ఈయన కుటీరవాసమూ అలాగే.

ఈయన ఉపవాసాదులూ అలాగే. కనుక తనవంటి వాడే ఒకడు నలభై కోట్లమందికి నాయకుడైనప్పుడు, 'రాజమాన్య రాజపూజితు' డైనప్పుడు, ఆ నలభై కోట్లలో ప్రతి దరిద్రుడూ తాను కూడా నాయకుడైనట్లే గర్వపడడం ప్రారంభించాడు.

గాంధీ వైస్రాయిని చూసినప్పుడు, ప్రతి కుగ్రామంలోనూ ప్రతి కాంగ్రెసు వాలంటీరూ, ప్రతి మనిషీ వైస్రాయి తనతోనే సంప్రదింపులకు వేంచేసినట్లు అనుకోవడం మొదలుపెట్టాడు.

"నావంటి వాడు అంతవాడైనప్పుడు నేనెందుకు కాగూడదు?" అన్న ఆశావాదమూ ఆత్మ విశ్వాసమూ బడాయీ ప్రాభవమూ మొదటిసారి వానిలో విజృంభించాయి

1921లో నలభైకోట్ల బొరియల్లో ఉన్న పురుగులు నలభైకోట్ల మానవులయ్యాయి.

మరి నలభై కోట్ల మానవులు సముద్రంలాగ పొంగివస్తుంటే, ఎందరు 'కాన్యూట్లు' (Canutes) దానికి అవధులూ, అడ్డుకట్టలూ కట్టగలరు!

ఈ దృష్టితో చూస్తే ఆచార్యులూ, పండితులూ, భాష్యకారులూ, ప్రభువులూ వీళ్ళు మాత్రమే గాంధీ శిష్యులు కారు.

సూక్ష్మంగా చూస్తే గాంధీ అనుచరులు ఒక్క కాంగ్రెస్‌వాదులు మాత్రమే కూడా కాదు. కాంగ్రెసు వారూ, కమ్యూనిస్టులూ, అన్ని రాజకీయ పక్షాల వారూ, ఖద్దరు కట్టే వారూ, కట్టనివారూ, అహింస అనే వారూ, అననివారూ, హరిజనోద్ధరణకి భుజాలొగ్గేవారూ, ఒగ్గనివారూ, అందరూ ఆయన అనుచరులే. అంటే అవిభక్తమైన అశేష భారత ప్రజానూ, నేటి భారత దేశానికి బాపూ గాంధీ.

1921 లో మన రాష్ట్రంలో కూడా ఒక్కసారి ఒళ్లు విరుచుకుని హుమ్మని లేచిన జన సామాన్యానికి ఉన్నగుణాలన్నీ ప్రకాశంలో ఉన్నాయి; ఆవేశం, ఉత్సాహం, ఆగ్రహం అనుగ్రహం, ఔదార్యం, అసూయ, సాహసం, పట్టుదల, మొండితనం, తిక్క అన్నీను.

అన్నింటికీ అడుగున అంతర్వాహినిగా సహజమైన ఒక బుద్ధిసూక్ష్మత కూడా ఉంది. ఈ గుణాల కలయిక అతన్ని అప్రతిహతమైన ఒక శక్తిగా చేసింది.

మేధావిగా కనపడే వాని సమక్షంలో మనంకూడా మేలుకుని ఒడుపుగా తిరుగుతాము. అలాగే సజ్జనులుగా కనబడే వారి సన్నిధిలో మనంకూడా మంచిమొగం పెడతాం కూడా అలాగ కనపడకుండానే తెలివైనవాడే నిజంగా మనల్ని లోబరచు కుంటాడు. ప్రకాశం అలాంటి వాడు.

ఈ భావాలన్నీ మొన్న 'నా జీవితయాత్ర' చదివాక నా మనసులో ముసిరాయి.

అతని చిన్నతనపు చేతలు, గాథలుగా అయిపోయిన కొన్ని సంఘటనలూ, ఆ తరవాత 1921 మొదలుకొని మొన్నటి శాసనసభానాయకత్వపు సందడులదాకా జరిగిన సంఘటనలూ, అన్నీ, మనసులోకి పరిగెత్తుకుని వచ్చాయి.

ఒకటి తేలింది. చిన్ననాటి ప్రకాశమే ఇప్పటి ప్రకాశమూను.

కొందరి జీవితాల్లో లాగ ఇతని జీవితంలో అభూతమైన మార్పులూ, వింత విప్లవాలూ వచ్చిపడి ఇతన్ని ఒక కొత్త

మనిషినో విలన్ మనిషినో చేసిపారెయ్యలేదు. ఇతని బ్రతుకులోని స్వచ్ఛతా, వేదీ పొగొట్టలేదు పాత గుణాలే జాతి అంత విశాలంగా పెరిగాయి, అంతే.

ఎంత బాగుంది 'నాజీవిత యాత్ర!' యాభై ఏళ్ల గాథ పందెపు గుర్రంలా పరిగెత్తింది.

ప్రకాశం గొప్ప రచయిత కాడు. 'శిల్పి' కాడు. జవహర్‌లాల్ నెహ్రూలాగ.

నెహ్రూ స్వీయచరిత్ర గడసరి, కళావేత్తా, ఉత్తమ సంస్కారి రంగులుదిద్ది, రాగాలు పోసి సుందర నిర్మాణంగా తయారుచేసినది దానిలో ఒక అపూర్వ సంఘటన వచ్చినప్పుడు, ఒక అద్భుత వ్యక్తి అవతరించినపుడు, ఒక తీవ్ర సమస్య ఎదురుకొన్నప్పుడు, గ్రంథకర్త మనస్సు ఎన్ని విధాలుగా ఆలోచించిందో, ఎలాగ పనిచేసిందో అన్నీ విపులంగా వివరింపబడ్డాయి!

'నా జీవిత యాత్ర' అలాగకాదు. సంఘటన తరవాత సంఘటన! సమరం తరవాత సమరం! ఎటొచ్చీ చిన్నతనంలో చిన్నదీ పెరిగాక పెద్దదీ. చరిత్రకారుని అభిప్రాయాలు వినం. మన అభిప్రాయాలు ఇవ్వం. సరదాగా చదువుకుంటూ పోతాము.

'Roug'ı and tough, we are the stuff!
we want to fight and cannot get enough !

అన్నట్టు మన కనిపిస్తుంది.

ఒక్కొక్క యాత్రకు గమ్యస్థానం ఉంటుంది. కనుక ఆ యాత్రామార్గం గమ్యస్థానం కోసం తీర్చిదిద్దినట్టుంటుంది.

మరి ప్రకాశం యాత్రకు గమ్యస్థానంలేదు.

కనుక యాత్ర ఆగిపోవడము లేదు. బ్రతికున్న మానవుని యాత్ర ఆగి పోతుందా. అలాగా సాగిపోవడమే. అంటే స్వరాజ్య స్థాపనతో ఆగిపోదన్నమాట.

ఆ మార్గం తీర్చిదిద్దినట్లు కాక మలుపులతోను వంపులతోను నిండి ఉంటుంది. ప్రతి మలుపు వెనకాలా ఏదో వింతో, వేడి వేడి పోట్లాటో ఉండి తీరుతుంది మలుపులేని మార్గం మనకి బాగుండదు దానిలో సరదా ఉండదు.

వన్నెలూ, చిన్నెలూ వేయకుండా 'జీవితయాత్ర' వ్రాయడం వల్ల ఒక విధమైన సొగసూ, ఆకర్షణా లేకపోయినా, కథకు బలమూ, తీవ్ర గమనమూ వచ్చాయి.

తనకు అనుకూలమైనవీ, విరుద్ధమైనవీ కూడా విశేషాలన్నీ సమానోత్సాహంతో ఒకటే రుచితో చెబుతాడు.

సందె చీకట్లో కిటికీలో కూర్చున్న ప్రకాశాన్ని యెనమండ్ర కొండయ్య ఊదిపుచ్చుకుని కొడతాడు. పట్టపగలు రాజమహేంద్రవరంలో తాసిల్దారు కచేరీ దగ్గర ఆ కొండయ్యను బండిలో నుంచి పడదోసి చలపతిరావూ, తానూ చావబాది వదుల్తారు.

తననూ తనముఠానీ పచ్చడి చెయ్యడానికి కాకినాడ నడివీధిలో సింహంలాగ కదలి వచ్చిన సింగితపు అబ్బాయి వీరగాథ భారతంలో నుంచి కత్తిరించిన కథా ఖండంలాగుంటుంది. మల్లు మనే బాణాకర్ర, తాడి లాంటి తాడి వెంకటరత్నం ఒక్కదెబ్బతో చితకవడం, ఒకేదెబ్బ ఇద్దరు యోధులకు ఒక్కసారే తగిలి వాళ్ళు భూశయనం కావడం ఈ చిత్రాలన్నీ తన శత్రువే చేసినా యెంత ఆత్రుతతోను, ఆనందావేశంతోనూ వర్ణిస్తాడు!

తరువాత మునిసిపల్ వ్యవహారాలలో తన ప్రతిస్పర్థి నిడమర్తి దుర్గయ్య గారిని అలాగే మెచ్చుకుంటాడు

ఆ తరువాత మైలాపూరు మేధావులతో, మహా మహా న్యాయమూర్తులతో వచ్చిన మాట పట్టింపులదాకా ఈ గుణం కనబడుతుంది.

మెచ్చుకుని వెన్ను చరచగలడు: నొచ్చుకుని వెన్ను చీల్చ గలడు.

మరొక విశేషం. ఎక్కడా తన లోపాలకు కూడా తకుకు మలామా పూయడు.

అల్లాడి ఆదెయ్య కొడుకు ఆచిన్న ప్రకాశాన్ని తన్నాడు. వాడి గూబ ఇతని కందదు. కనుక ఎలాగ పగతీర్చుకోవడం? వాడి పుస్తకం దొంగతనంచేసి సువర్ణముఖి ఒడ్డున ముక్కలు ముక్కలుగా చింపి పారేస్తాడు. ఇదో రకంచచ్చు పగతీర్చుకోవడం. అయితేమాత్రం!

నాటకాల్లో వేషాలు వేసేటప్పుడు నారీమణులతో సహవాసం తప్పదు. ఏంజెయ్య మంటారు?

అమాంతంగా ఒక అభూత నైతిక విప్లవం వచ్చి అహింసలో పడిపోవడం, ఆర్జవ కైలాసం అధిరోహించడం—ఇలాంటివేవీ జరుగవు.

అసలు ఇతని జీవితంలో ఉన్న బలం అంతా ఇదే. ఇతగాడు సామాన్య ప్రజ!—వెలుగుచీకట్లతో.

కొందరి స్వీయచరిత్రలు చదువుతుంటే, వాళ్ళ పుట్టుకతో నే సజ్జనులై పుట్టేసి ఊరుకున్నారనిపిస్తుంది. ప్రహ్లాదుడు వగైరాల లాగ. కొందరివి చదువుతుంటే, ఒక్కసారి హఠాత్తుగా ఒక మహా ముహూర్తాన వాళ్లు ఎలాగ మంచివాళ్లుగా పూర్తిగా మారిపోయారా అనిపిస్తుంది.

జవహర్‌లాల్ జీవితంలో వచ్చే సంఘటనలు ఒక్క జవహర్‌లాల్ జీవితంలోనే వస్తాయి.

పండితుడు మోతీలాల్ ప్రభువు ఏకమాత్ర పుత్రుడు. బాల్యంలోనే భారతీయ ప్రముఖులతో సహవాసము మాలవ్యాజీ, సర్ సప్రూ అనుదినమూ ఆనందభవనానికి విచ్చేసే అతిథులు. ఇంగ్లాండులో చదువు.

ముందే తెలిపోతుంది మన కందని వాడని. ఆయన అనుభూతులు మనకు రావు. పుట్టుకతోడనే కాంగ్రెసు ప్రెసిడెంటుగా పుట్టినట్లనిపిస్తుంది.

జవహర్‌లాల్ ప్రత్యేక వ్యక్తి. అసాధారణుడు.

ప్రకాశం చేసే పనులు మనమూ చేస్తాము. అతడు అనే మాటలు మనమూ అంటాము.

కన్నతల్లి కడుపుతీపి వల్ల పూటకూటి ఇల్లు పెడితే కాలక్షేపం చేసినది మొదలుకొని, ప్రధానమంత్రి పదవి అధిష్ఠించినదాకా ఏ వాక్కూ, ఏకార్యమూ మనకి దూరమైనదిగా కనబడదు.

ప్రజే ప్రధానమంత్రి అయింది. కాని ఆ సాధారణతలో ప్రత్యేకత కూడ ఉంది. కనక, ప్రకాశాన్ని ఏరి పట్టం కట్టుతుంది.

ఇక్కడ ఒక్కమాట?

ఇతని జీవిత యాత్రామార్గమంతా బాణాకఱ్ఱల ఘలఘలలతోను. తుపాకి గుండ్ల తొందరలతోనూ మాత్రమే నిండి ఉంటుందని అనుకోకూడదు.

నిజమే, ఇతగాడు తుపాకీ మందువాసన కొడితే చాలు, ఎదురుగా రంగంలో దూకే రకమే!

కాని ఇతని బతుకులో గుండెలు కరిగించే కరుణ ఘట్టాలెన్నో ఉన్నాయి! తండ్రిగారు వెళ్ళిపోయాక, తల్లిగారు వంటపూటి ఇల్లు పెట్టడమూ, నాలుగురాళ్ళ కోసము మేనమామ బావమరదుల ఇళ్లమధ్య అల్లల్లాడడమూ నిరుపేద కుఱ్ఱవాడు లాయర్లని చూసి సరదాకు లాంగ్‌కోటు కుట్టించుకొని బడాయిగా వేసుకోవడమూ, రైలులేని రోజుల్లో పన్నెండేళ్ళ పిల్లవాడు ఒంగోలునుంచి రాజమహేంద్రవరం దాకా వెళ్లడమూ, ఇమ్మానేని హనుమంతరావు నాయుడుగారూ ఇల్లాలు లక్ష్మమ్మగారూ ఈ పెంపుడు బిడ్డతో ఎడబాటు సహించలేక ఏడవడమూ. తరువాత తాను బారిష్టరయ్యాక, వట్టి కృతజ్ఞతా ప్రదర్శనానికి కాక కేవలమూ ప్రేమవల్ల వారి ఋణము తీర్చుకోవడమూ, తాను నెలకు ఏడెనిమిది వేల రూపాయలు తెస్తూంటే, తల్లిగారు మరణశయ్య మీద ఏడెనిమిది వందల రూపాయాల్ని కూడ బెట్టి ఇవ్వడమూ, ఈ గాథలు చదువుతుంటే ఒక్కొక్కసారి గుండెల్లో పోటు పొడిచినట్లవుతుంది. కళ్లు కరుగుతుంటాయి.

ఇది ప్రజాయుగం అంటున్నారు. ఇక్కడ ప్రజాప్రభుత్వం వచ్చిందంటున్నారు. ఈ రోజుల్లో ఎంత సామాన్యాతి సామాన్యుడైనా తనకంటె ఎత్తుగా నిలబడి నట్లుగా ఉన్నవాణ్ణి సహించలేడు.

అధికారం అసహ్యంగా ఉంటుంది. అది రకరకాలు. మెదడుకు సంబంధించినదీ. నైతిక వర్తనకి సంబంధించినదీ, అర్థమత్తతకి సంబంధించినదీ.

జాతీయ నాయకుల్లో ఒక్కొక్క గొప్ప మేధావి ఉంటాడు. ఒక్కడు పదివేల మందిలో ప్రసంగం ఇస్తున్నప్పుడు తన తెలివి తేటలు చూపిస్తూ పరమ తత్వాలు విశదపరుస్తూ లెఖ్ఖలలో, అంకెలతో, సుభాషితాలతో జనానికి ఊపిరాడనీయక తన ఔన్నత్యము తెలిసో తెలియకో చాటుతూ ఉంటాడు. మరొక్కడు అహింసా. ప్రేమలు, ఆర్తవావేశమూ తానే మూర్తి కట్టినట్లనిపిస్తూ నీతి కథలు మెత్త మెత్తని మాటల్లో పొదిగి అపరధర్మరాజులా అయిపోయి, మనకు అందరానంత మంచివాడుగా సాక్షాత్కరిస్తాడు.

వీళ్లు గొప్పవాళ్లు కారనను. మనలోని వారని మాత్రం అనిపించరు. ఈ ప్రజాయుగంలో అసలే అనిపించరు.

వీళ్లు —

Too bright and good, for human nature's daily food!

మనలాగ ఉంటాడు. మనలాగ చేస్తాడు. మనలాగ బాధపడ్తాడు, సుఖపడ్తాడు మనకు మించిన తెలివి తేటలున్నా మన బుఱ్ఱలకి రుద్దడు. మనకి తెలియకుండానే వాటిని మనకోసం ఉపయోగిస్తాడు.

అలాంటి వాడు కాకపోతే, ఇంకెవ్వరు ఈ రోజుల్లో మన రాష్ట్రానికి ప్రధానమంత్రిగా ఉండడానికి అర్హుడు చెప్పండి!

ప్రత్యేక వ్యక్తిలాగా కాక ప్రజలకు లాగే తనకు కులంలేదు. మతంలేదు, వయస్సులేదు, డెబ్బైయేండ్ల వాడయి తాత అయిపోవలేదు. జాతితో సమానంగా పరుగెత్తుకుంటూ వచ్చేవాడు కాకపోతే ఇంకెవ్వడు మన రాష్ట్రానికి ప్రధానమంత్రిగా వుండటానికి అర్హుడు చెప్పండి!

పాకీవాళ్లు, పారిశ్రామికులు. కష్టజీవులు అటువంటి వాడితో కాక మరెవ్వరితో తమ కష్టసుఖాలు వెళ్ళబోసుకుంటారు. చెప్పండి!

రాళ్లు విసిరే వారిలోనూ తుపాకి దెబ్బలు తినే వారిలోనూ మాత్రమే ఉండే స్వభావం గలవాణ్ణే, నాయకుణ్ణిగా వీళ్లు స్వీకరించగలరుగాని, మరెవ్వరి సాన్నిధ్యానికి ఆర్తతతో వస్తారయ్యా!

మళ్లీ అంటున్నాను, ఇది ప్రజా ప్రభుత్వం. అయితే ప్రకాశం లాంటి ప్రధాని మరొక్కడు ఇప్పుడు దొరకడు. ఈ దృష్టితో చూస్తే ప్రస్తుత భారత దేశంలో ఏ రాష్ట్రానికీ ఇంత అర్హుడయిన ప్రధాని లేదు.

ఆదర్శ పంచాయతీ: అముజూరు

మధురశ్రీ

తూర్పు గోదావరి జిల్లాలో ఉత్తమ ఫలితాలనుసాధించి ప్రశంస లనందుకొన్న పంచాయతీలలో అముజూరు పంచాయతీ పేర్కొనదగినది. అముజూరు తూర్పు గోదావరి జిల్లాలోని కపిలేశ్వరపురం పంచాయతీ సమితిలో ఒక చిన్న గ్రామం. ఈ గ్రామం రామచంద్రపురానికి 10 మైళ్ళు ఈ గ్రామానికి పామర్రు ఒక మైలు. గ్రామ జనాభా 2,242. ఈ గ్రామంలో 1926 సంవత్సరంలో పంచాయతీ యేర్పడింది.

ప్రకృతి శోభ

బస్సు దిగి ఊరిలోకి వెడుతుంటే చెరువు కనిపించింది. ఆ చెరువు గట్లమీద, గ్రామ సరిహద్దులను పెనవేసుకొన్నట్లుగా ఉన్న కొబ్బరి మొక్కలు ఆ గ్రామ ప్రకృతి శోభను వేనోళ్ళ చాటుతున్నవి. పంచాయతీ సర్పంచ్‌ను నేను కలుసుకొన్నాను. పంచాయతీ సర్పంచ్ శ్రీ ఎనుముల వీర వెంకట్రాయ చౌదరి మంచి ఉత్సాహవంతుడైన యువకుడు. ప్రజా సేవ చేయాలని తహతహలాడే ఆదర్శ వ్యక్తి అనే భావన కలిగింది చూసీచూడటంతోనే. నేను వచ్చిన పని గురించి చెప్పాను.

"మా గ్రామ పంచాయతీ సాధించిన ప్రగతి గురించి నేను వివరించటం దేనికండీ. మా గ్రామ పంచాయతీ చేపట్టిన కార్యక్రమాలను చూచి మీరే నిర్ణయించండి. మా గ్రామం సాధించిందేమిటో" అని యెంతో వినయంగా అన్నారు. సర్పంచ్‌కు చేదోడు వాదోడుగా పనిచేస్తున్న గ్రామస్తులు శ్రీ నేమాని చిన్ని క్రిష్ణయ్యగారు, పంచాయతీ ఉపసర్పంచ్ శ్రీ నేమాని రామారావు గారు వున్నారు.

రోడ్ల నిర్మాణం

చక్కని కంకర రోడ్లతోపాటు, ఆ రోడ్ల పక్కన సిమెంట్‌తో నిర్మించిన మురికి కాలువలు ఎంతో చూడ ముచ్చటగా ఉన్నాయి. రోడ్ల నిర్మాణానికిగాను అముజూరు పంచాయతీ 32 వేల రూపాయలు ఖర్చు చేసింది. నేమాని బుచ్చి పాపయ్యగారి షంత రోడ్డు నిర్మాణానికి ప్రజలు శ్రమదానం చేశారు. 5000 అడుగుల పొడవుగల మురికి కాలువలను త్రవ్వించి, సిమెంటు చేయించటానికి గ్రామ పంచాయతీ పదిహేను వేల రూపాయలు ఖర్చు చేసింది. ఏ పట్టణంలోగాని యే నగరంలోగాని రోడ్లను ఇంత పరిశుభ్రంగా నిర్వహించడం నేను చూడ లేదు. అముజూరు లాంటి ఆదర్శ గ్రామంకోసం గాంధీజీ కలలు కనేవారు. ఈ గ్రామంలో మురికి కాలువల నిర్వహణ నిజంగా ప్రశంసనీయంగా ఉంది. గ్రామంలో ప్రతి పౌరుడు తన వాకిలిముందు ఉన్న మురికి కాలువను పరిశుభ్రం చేసుకొంటాడు.

నేను ఆ వూరిలో నడిచి వెడుతూంటే మనోహరమైన ఒక ఉద్యానవనంలో వెడుతున్నట్లుగా అనుభూతి పొందాను. నిజంగా అంత తీర్చి దిద్దినట్లున్నది గ్రామం.

మంచినీటి సౌకర్యం

పరిరక్షిత మంచినీటి సరఫరా పథకం 1964 సంవత్సరంలో ప్రారంభమైంది. కపిలేశ్వరపురం పంచాయతీ సమితి అధ్యక్షురాలు శ్రీమతి బలుసు రాజేశ్వరమ్మగారు ఆ సంవత్సరంలోనే మంచి నీళ్ళ టాంకు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. యాభై వేల రూపాయలు ఖర్చు చేసి ఈ పథకాన్ని అముజూరు పంచాయతీ పూర్తి చేసింది. ప్రతి వీధిలో కుళాయిలు పెట్టింది. ఆర్థిక స్థోమతు ఉన్న గ్రామస్థులు తమ యిళ్ళలో కుళాయిలు పెట్టించుకున్నారు. నీటిని చెరువులోనికి తీసుకొని వచ్చేటప్పుడుకూడ రోగ క్రిములు నీటిలో చేరకుండా ఉండేటట్లు కట్టుదిట్టమైన చర్యలు అముజూరు గ్రామ పంచాయతీ తీసుకొంది. నీటిపారుదల ఛానల్ నుంచి నీరు ప్రవహిస్తున్నప్పుడు ఛానల్‌లో ఆకులు, చెత్త పడి నీరు అపరిశుభ్రం అయ్యేది. పంచాయతీ ఆర్. సి సిమెంట్ పైపులను వేసి నీరు కలుషితం కాకుండా పైపులద్వారా చెరువులోనికి తీసుకొని వస్తున్నది.

వ్యవసాయాభివృద్ధి

రోడ్ల నిర్మాణం, మంచినీటి సరఫరా విషయాలలోనే కాదు, ప్రతీ అభివృద్ధి కార్యక్రమానికి అముజూరు గ్రామ ప్రజలకు పంచాయతీ అండగా నిలిచింది. అముజూరు గ్రామ పంచాయతీ ఒక స్ప్రేయరును కొని రైతులకు అద్దెకు యిస్తున్నది. క్రిమి సంహారక ఔషధాలనుకూడా పంచాయతీ కొని లాభం నష్టం లేని పద్ధతిపై రైతులకు అమ్ముతున్నది. పంట యెరువు ఉత్పత్తిని

ప్రోత్సహించింది. ఈ గ్రామంలో రైతులు 15 స్ప్రేయర్లను స్వంతంగా కొనుక్కొని ఉపయోగించు కొంటున్నారు. అముజూరు గ్రామ పంచాయతీ రైతులు 15 ఆయిలు ఇంజనులు, ఒక ఎలక్ట్రిక్ మోటారు స్వంతంగా కొనుక్కొని వ్యవసాయాభివృద్ధికి ఉపయోగించు కొంటున్నారు ఈ గ్రామంలో ఈ ప్రతి యేడూ 900 ఎకరాలలో రెండవ పంట పండిస్తున్నారు రైతులకు అప్పులు సమకూర్చటానికి గ్రామంలో ఒక సహకార సంస్థ ఉంది.

"ఈ సహకార సంస్థలో 205 రైతు కుటుంబాలు సభ్యత్వం స్వీకరించాయి. ఈ సంస్థ వాటాధనం 700 రూపాయలు. ఈ సహకార సంస్థ ప్రతి సంవత్సరం 75వేల రూపాయల వరకు రైతులకు అప్పులు సమకూర్చు తున్నది." అని ఉప సర్పంచ్ గారు వివరించారు.

"విద్యారంగంలో మీ గ్రామ పంచాయతీ కృషిని వివరించండి" అని కోరగా ఉపసర్పంచ్ గారు ఇలా అన్నారు. "బడి ఈడు వచ్చిన పిల్లల నందరిని బడిలో చేర్పించడం జరిగింది. ప్రతివారు తమ పిల్లలకు మంచి చదువులు చెప్పించాలని తహతహలాడుతున్నారు. ఈ గ్రామంలో రెండు ప్రాథమిక పాఠశాలలు, ఒక ఉన్నత పాఠశాల ఉన్నాయి.

"ఈ రెండు పాఠశాలల్లో ఒకటి హరిజన పేటలో ఉంది. అన్ని పాఠశాలలకు అముజూరు పంచాయతీ శాశ్వత భవనాలు నిర్మించింది. హరిజన వాడలోని పాఠశాల భవన నిర్మాణానికి హరిజనులు ముందుకు వచ్చి శ్రమదానం చేశారు. మా గ్రామంలోని ప్రాథమిక పాఠశాల తోట నిర్వహణ విషయంలో కపిలేశ్వరపురం పంచాయతీ సమితిలో మొదటి బహుమతి నందుకొంది." అన్నారు.

బీద విద్యార్థులకు మధ్యాహ్న భోజనసౌకర్యం కూడ కల్పించబడింది. ఈ కార్యక్రమానికి పంచాయతీ 200 రూపాయలు విరాళంగా యిచ్చింది. పంచాయతీ గ్రంథాలయాన్ని కూడ ప్రారంభించింది. ఈ గ్రంథాలయంలో 200 పుస్తకాలు ఉన్నాయి.

ఆదాయాభి వృద్ధి

అముజూరు గ్రామంలో ఏవైపు చూసినా కొబ్బరి చెట్లే. కొన్ని గ్రామస్థులవి, కొన్ని గ్రామ పంచాయతీవి 1961 సం॥ వరకు అముజూరు గ్రామపంచాయతీ ఆదాయం చాల తక్కువగా ఉండేది. సగటున సాలీనా యింటి పన్ను 450 రూపాయలు వచ్చేది. నిధులకై ప్రభుత్వాన్ని అర్థించి ప్రయోజనం లేదు. అందుచేత పంచాయతీ ఆదాయాన్ని పెంచే దృష్టితో పన్నులను పెంచింది. పన్నులు పెంచితే ప్రజలలో పలుకుబడి పోతున్నదని జంకలేదు. ఇంటి పన్ను రూపంలో 1966-67 సంవత్సరంలో 2140 రూపాయలు, 1967-68 సంవత్సరంలో 2050 రూపాయలు పంచాయతీకి ఆదాయం లభించింది. పన్నులద్వారా వచ్చే ఆదాయం ఐదు రెట్లు పెరిగింది.

రోడ్డు ప్రక్కన, పుంతలలో పచ్చగడ్డిని పెంచి వేలం వేయించారు. 1965-66 సంవత్సరంలో 1356 రూపాయలు మాత్రమే పచ్చగడ్డి పాటలద్వారా అముజూరు పంచాయతీకి ఆదాయంవస్తే, 1967-68 సంవత్సరంలో 2773 రూపాయలు ఆదాయం వచ్చింది. చెరువులను మరమ్మత్తుచేసి చేపల పెంపకాన్ని అముజూరు పంచాయతీ చేపట్టేలా కృషి చేశారు. చేపల పెంపకం ద్వారా ఈ గ్రామ పంచాయతీకి మొదట్లో 1366 రూపాయిలు ఆదాయం లభిస్తుందేది. పంచాయతీ సరిహద్దులను, పంచాయతీ పరంగా ఉన్న ఖాళీ స్థలాల్ని అంతటినీ గ్రామ పంచాయతీ సద్వినియోగం చేసుకుంటున్నది. రోడ్ల ప్రక్కన, పుంతలలో, పశువులకు ఉద్దేశించిన చెరువు గట్లపై ఆదాయాన్నిచ్చే కొబ్బరి మొక్కలను నాటి పెంచుతోంది. 1965-66 సంవత్సరంలో కొబ్బరిచెట్ల సంరక్షణకు 964 రూపాయలు, 1966-67 సంవత్సరంలో 1100 రూపాయలు, 1971-68 సంవత్సరములో రు 827 ఖర్చు చేసింది.

అముజూరు గ్రామంలో ఒక ఏడు ఫర్లాంగుల రోడ్డు యిరువైపులా కొబ్బరి మొక్కలను నాటింది గ్రామ పంచాయతీ. వచ్చే సంవత్సరం కొబ్బరిచెట్లు కాయలు కాస్తాయి. గత సంవత్సరం గ్రామ పంచాయతీ ప్రాంతములో 111 కొబ్బరి మొక్కలను నాటింది. మొత్తం అముజూరు గ్రామంలో పంచాయతీ 1300 మొక్కలను పెంచుతున్నది. కొబ్బరి మొక్క ఒక్కంటికి 30 రూపాయల చొప్పున సాలీనా 39000 రూపాయల వరకు ఆదాయం వస్తుందని అంచనా.

తోటల పెంపకము

పంచాయతీ సర్పంచ్ గారిని ఇంటర్వ్యూ చేసినప్పుడు వారు యింకా ఇలా అన్నారు "యింకా చేపల పెంపకాన్ని, కొబ్బరి మొక్కల పెంపకాన్ని చేపట్టాలని ఉంది. పంచాయతీ ఇటీవల సమావేశమై యింకా గ్రామంలో 400 కొబ్బరి మొక్కలను నాటాలని నిర్ణయించింది. మా గ్రామ పంచాయతీని స్వయం కృషితో ముందుకు నడిపించాలని మా ఆకాంక్ష."

"ఇటీవలనే సినిమాహాలు మీ గ్రామంలో స్థాపించారు కదా. ఈ సినిమా హాలువల్ల మీ గ్రామ పంచాయతీలో యేదైన ఆదాయం లభిస్తోందా" అని ప్రశ్నించాను.

అముజూరు గ్రామం యింకా సాధించ వలసిఉంది. అయినా గ్రామ పంచాయతీ సాధించిన ప్రగతి చూసిన తర్వాత మంచి నాయకత్వం లభించిన గ్రామాలలో ప్రగతి కుంటు పడదని విశ్వాసం నాకు కుదిరింది. నాయకత్వం సరిగా ఉంటే ఏ ఉద్యమమైనా చిగురిస్తుంది, పుష్పిస్తుంది. పంచాయతీ రాజ్యం విఫలం కాలేదనటానికి అముజూరు గ్రామం సాధించిన ప్రగతి ఒక చక్కని తార్కాణం.

స్వతంత్ర భారతావనిలో తెలుగు వారు

చావలి రామమూర్తి

భారత స్వాతంత్ర్య భానూదయముతో ఒక నవశకము ప్రారంభమైనది. క్రొత్త జ్యోతులు వెలుగ నారంభించి నూతన కాంతులను వెదజల్ల నుద్యమించెను. స్వాతంత్ర్య భారతిలో నూతన అవకాశము కొరకు అన్ని భాషావర్గములవారు ఉవ్విళ్లూర నారంభించిరి. గత ఇరువది ఐదు సంవత్సరముల (1947-72) లోను భారతాభ్యుదయ మను నీ మహాయజ్ఞమున యెందరో తెలుగు వారు ఋత్వికులుగా వ్యవహరించిరి. సాంఘిక, రాజకీయశాస్త్ర విజ్ఞాన రంగములందు నైపుణ్యమును, సామర్థ్యమును, సమరస భావమును ప్రదర్శించిరి.

వసిష్ఠాది మహామునులచే మహాశక్తి సంపన్నుడుగా కొనియాడ బడిన విశ్వామిత్ర మహర్షి మన తెలుగుజాతికి మూల పురుషుడు.

పురాణ పురుషుడైన శ్రీకృష్ణపరమాత్మునితో మల్ల యుద్ధముచేసిన చాణూరుడు, శ్రీరామచంద్రునికి అత్యంత ప్రీతి పాత్రుడైన హనుమంతుడు, బౌద్ధమత ప్రచారకులలో అగ్రేసరు డైన నాగార్జునుడు, వల్లభమత వ్యవస్థాకుడైన వల్లభా చార్యులు, గణితశాస్త్ర కోవిదురాలైన లీలావతి, భారతీయ సంగీతానికి మూల గ్రంథమైన సంగీత పారిజాత గ్రంథకర్తయగు అహోబల పండి తుడు, తాజమహల్ శిల్పులైన కొందరు శిల్పులు, మంత్రమున ప్రసిద్ధికెక్కిన అక్కన్న, మాదన్న, పూర్ణయ్యలు, తమభక్తి పారవశ్యముచేత శ్రీరామచంద్రుని దర్శించ గలిగిన గోపన్న, త్యాగయ్యలు మన పూర్వులు.

అద్వైత మతమునకు ప్రవక్త అయిన ఆదిశంకరులు మళ యాళ దేశమున స్థిరపడిన ప్రవాస ఆంధ్రుడు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘవ్యవస్థాపకుడైన డాక్టరు హెడ్గవర్. ప్రసిద్ధ రాజకీయ వేత్త అయిన డాక్టరు యం యస్ ఆనీ (వైస్రాయి ఎక్జిక్యూ టివ్ కౌన్సిల్ సభ్యుడు తరువాత ఉత్తరప్రదేశ్ గవర్నరు) మధ్య ప్రదేశ్‌లో స్థిరపడిన తెలుగువారు. బొంబాయి మాజీముఖ్యమంత్రి కన్నం వారు, తమిళనాడు మాజీ ముఖ్యమంత్రులు, ఓమండూరు పెద్దరామస్వామి రెడ్డియారు, పూసపాటి సంజీవకుమారస్వామిరాజా, అన్నాదొరైలు, ప్రవాసాంధ్రులు

ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన కోహినూరు వజ్రము మన తెలుగు సీమలోనే లభించినది.

స్వాతంత్ర్య సమరములో......

తెలుగువారు స్వాతంత్ర్య సముపార్జనకొరకు జరిపిన కృషి చేసిన త్యాగములు యెనలేనివి. ఆంధ్రు లసమాన శూరులని ఆంగ్లేయులే అంగీకరించిరి. పట్టాభి, ప్రకాశము, వెంకటప్పయ్య, నాగేశ్వరరావు, సాంబమూర్తి యిత్యాదులందరు నాయకత్వము వహించి జాతినుత్తేజిత లూగించి తెల్లవారి గుండెలలో భయభీతా హములు రేకెత్తించి, తమ సర్వస్వము దేశము కొరకే త్యాగము చేసి ప్రజానురంజకతను వడసిన మహనీయ మూర్తులు. స్వాతంత్ర్యము లభించిన పిదప వివిధ రంగములలోను తెలుగువారు చేసిన విశేషమైన సేవలను, దేశాభ్యుదయము కొరకు సలిపిన కృషిని వరించిన పదవులను గూర్చి స్మరించుకొన వలసి యున్నది.

స్వాతంత్ర్య భానుడు

భారత స్వాతంత్ర్య భానుడుదయించిన శుభసమయమున జాతి నుద్దేశించి ప్రసంగించిన మొదటి వరుస ప్రముఖులలో మన తెలుగువారైన శ్రీమతి సరోజినీనాయుడు, డాక్టరు సర్వేపల్లి రాధా కృష్ణ పండితుడు కలరు.

నవభారత రాజ్యాంగ నిర్మాణము

న్యాయశాస్త్ర పారంగతుడు, సునిశిత మేధా సంపన్నుడు, రాజ్యాంగ నిర్మాణశాస్త్ర చతురుడునైన కీ. శే సర్ అల్లాడికృష్ణ స్వామి నవభారత రాజ్యాంగ సభయందు సభ్యుడుగను, రాజ్యాంగ రచనా సంఘమున నొకడుగను చూపినప్రతిభ అనిర్వచనీయమైనది. రాజ్యాంగమునందలి వ్యక్తి హక్కులు, శాసన సభల నిర్మాణము, న్యాయ శాఖరూపావళి మున్నగు ప్రకరణములను రూపొందించినదీ మహనీయుడే. వీరు సుమారు ముప్పదివత్సరములు మద్రాసు హైకోర్టులో అడ్వకేటు జనరలుగ వ్యవహరించిరి.

న్యాయ శాస్త్రకోవిదురాలు, సంస్కర్త, విద్యావేత్త, సంఘ సేవా పరాయణి, అయిన శ్రీమతి గుమ్మిడిదల దుర్గాబాయమ్మ (ఇప్పటి దుర్గాబాయి దేశ్‌ముఖ్) భారత రాజ్యాంగ నిర్మాణ సభలో ఉపాధ్యక్షురాలు.

విశ్వవిద్యాలయ సంఘము

భారతదేశము స్వాతంత్ర్యము పొందిన పిమ్మట 1948లో విశ్వవిద్యాలయ విద్యయందు విశేషమైన మార్పులు తీసుకొని రావలసివచ్చినది. బోధనా పద్ధతులయందు విశేషమైన మార్పులు తీసుకొనిరావలసియున్నది. దాని పరిశీలనకై కేంద్ర ప్రభుత్వము విశ్వవిద్యాలయ సంఘము (University Commission) ను డాక్టరు సర్వేపల్లి రాధాకృష్ణ పండితుని అధ్యక్షత క్రింద నియ మించినది. ఈ సంఘమువారి నివేదిక ననుసరించియే నేడు విశ్వవిద్యాలయ ప్రణాళికలు రూపొందించ బడుతున్నవి.

రాష్ట్రపతులు

నవభారత రాజ్యాంగ నిర్మాణము ననుసరించి, భారత దేశమున కంతకు రాష్ట్రపతి (భారతదేశ అధ్యక్షుడు) పాలకుడు. ఈతనిపేరు మీదగనే కేంద్ర ప్రభుత్వ పరిపాలన జరుగును. దేశసమైక్యతను, ప్రదేశ సమగ్రతను పరిరక్షించుట ఈతని ముఖ్యవిధి. రాజ్యాంగము ననుసరించి విశేషమైన బాధ్యతలు నిర్వహించవలసి యున్నది. భారత ప్రధానమంత్రిని, కేంద్ర మంత్రి మండలిని, సుప్రీంకోర్టు హైకోర్టు న్యాయమూర్తులను, త్రిబలాధిపతులను రాయబారులను యితర ఉన్నతాధికారులను నియమించవలసిన బాధ్యత కలదు. భారత రాష్ట్రపతి భారతదేశ సర్వసేనాని. అందుచే భారత రాష్ట్రపతిగా నెన్నుకొనబడు వ్యక్తి సర్వసమృద్ధుడై, రాజ్యాంగ చతురుడై, విద్యాధికుడై, అనుభవజ్ఞుడైన పరిపాలనా దక్షుడై, విశేషించి ప్రజానురంజకుడై నొప్పారవలెను. రాష్ట్రపతిగా నెన్నుకొనబడు అవకాశము మన వారిలో ద్వితీయ రాష్ట్రపతిగా డాక్టరు సర్వేపల్లి రాధాకృష్ణ పండితునికి తృతీయ రాష్ట్రపతిగా డాక్టరు జకీరుహుస్సేను సాహేబు వారికి, చతుర్థ రాష్ట్రపతిగా వర్తమానమున శ్రీవరహాగిరి వేంకటగిరి మహోదయునకు వరుసగా లభించుట ముదావహమేగాక, తెలుగు వారిశక్తి సామర్థ్యము లెంతవరకు పెరిగినవో తెల్పుచున్నది.

ఉపరాష్ట్రపతులు

భారత దేశమునకు నేటి వరకు నలుగురు ఉపరాష్ట్రపతులు ఎన్నికయిరి. వారిలో ముగ్గురు మనతెలుగు వారే. అంతేకాదు వారు ముగ్గురున్ను తిరిగి రాష్ట్రపతులుగా ఎన్నుకొనబడుటయు ముదావహమే. భారత రాజ్యాంగము ననుసరించి ఉపరాష్ట్రపతి నిర్వహించవలసిన ముఖ్యవిధి రాజ్యసభ అధ్యక్షపదవి. నవభారత రాజ్యాంగము ననుసరించి 1950 వ సంవత్సరము జనవరి 26 వ తారీఖున భారతతొలి ఉపరాష్ట్రపతి డాక్టరు సర్వేపల్లి రాధాకృష్ణ పండితుడు వీరి తరువాత డాక్టరు జకీరుహుస్సేను సాహేబు వారు అటు పిమ్మట శ్రీవరహాగిరి వేంకటగిరి గారున్ను ఈపదవి నలంకరించిరి. వీరు ముగ్గురున్ను రాజ్యసభ అధ్యక్షులుగా ఆపదవి దక్షతతోడను నిష్పక్షపాతము తోడను విజ్ఞతతోకూడిన హుందాతోడను నిర్వహించి రాజ్యసభ సభ్యుల యొక్కయు ప్రభుత్వము యొక్కయు ప్రజల యొక్కయు మన్ననలకు పాత్రులైరి. వీరిలో రాధాకృష్ణపండితుండు జగద్విఖ్యాతిగాంచిన మహాపండితుడు వక్తగా విద్యావేత్తగా ఆచార్యుడుగా పరిపాలకుడుగా నీతండు గాంచిన కీర్తి అద్భుతమైనది. ప్రాక్ పశ్చిమ దేశముల నడుమ వారధి నిర్మించిన వివేకి. ప్రాచీన భారతీయ వేదాంత తత్వ బోధనలతో నవీనశాస్త్రవిజ్ఞానమును మేళవించి శాంతివచనములను ప్రబోధించిన కారుణ్యమూర్తి. జకీరుహుస్సేను జన్మతః హైదరాబాదునకు చెందిన తెలుగు ముస్లిము. పది పదునాల్గండ్ల వత్సరముల ప్రాయమున పితృవియోగము చెందుటచే ఉత్తరప్రదేశమునగల మాతామహుల యిల్లుచేరెను. జర్మను దేశమునుండి డాక్టరేటు బిరుదము పొందెను. విద్యావేత్త, గాంధేయ వాది, మహాత్ముని ప్రాథమిక విద్య (Basic education కు భాష్య కారుండు. మత సామరస్యమునకు హిందూ ముస్లిము సోదరత్వమునకు చిహ్నమైన నీ మహనీయుండు భారతద్వితీయ ఉపరాష్ట్రపతి. శ్రీవరహాగిరి వేంకటగిరి ఐర్లండు దేశమున విద్యాభ్యాసము చేసి బారిస్టరు పట్టము నొంది స్వదేశమునకేగి స్వాతంత్ర్య సమరమున దుమికి గొప్పకార్మిక నాయకుడై, భారతజాతీయ కార్మిక కాంగ్రెస్ (Indian National Trade Union Congress) అధ్యక్షుడై గొప్పకీర్తినార్జించెను. ఉమ్మడిమదరాసురాష్ట్రమున రాజాజీ, ప్రకాశము మంత్రివర్గములందు మంత్రిగానుండెను. ఇట్టి విశేషగుణగణ సాంగతుడైన గిరి సుప్రసిద్ధ దేశభక్తులు, శాసన సభ్యులు ఆంధ్రకేసరి ఆప్తమిత్రులు అయిన శ్రీ వి. వి. వరహాగిరి జోగయ్య పంతులుగారి పుత్రుడు. జోగయ్యగారు ఒరిస్సా రాష్ట్రమున గల బరంపురమునందు వకీలుగానుండి గొప్ప ఖ్యాతిగడించెను.

కేంద్రమంత్రిమండలి సభ్యత్వము

భారతదేశ పరిపాలనా బాధ్యతలను కేంద్ర ప్రభుత్వ స్థాయిలో నిర్వహించువారు ప్రధాన మంత్రియు వారి మంత్రివర్గ సహచరులును. దీనినే ఇంగ్లాండు రాజ్యాంగపద్ధతి ననుసరించి క్యాబినెట్ (Cabinet) అంటారు. రాష్ట్రపతి తన బాధ్యతలను నిర్వహించుటకు క్యాబినెట్ సహాయపడును. అందుచే కేంద్ర ప్రభుత్వమున క్యాబినెట్ హోదాగల మంత్రి అనగా అత్యంత ఉన్నత స్థానమును బాధ్యతలను చేపట్టిన వ్యక్తి అన్నమాట. ఈ పదవి నిర్వహించుటకు రాజకీయ చతురత, పరిపాలనా దక్షత, ప్రజానురంజకత కావలయును. మన తెలుగువారిలో శ్రీ వరహాగిరి వెంకటగిరిగారు ప్రథమముగా 952వ సంవత్సరమున నెహ్రూ మంత్రివర్గమున కార్మికశాఖామాత్యులైరి. వీరి తరువాత శ్రీ బెజవాడ గోపాలరెడ్డిగారు రేడియో సమాచారశాఖామాత్యులుగా నెహ్రూ మంత్రివర్గమున చేరిరి. లాల్ బహద్దూరు, ఇందిరాగాంధీ మంత్రివర్గములలో శ్రీ నీలం సంజీవరెడ్డి శ్రీ దామోదరం సంజీవయ్యలు, క్యాబినెట్ మంత్రులై వివిధ శాఖలను నిర్వహించిరి. ఇందిరాగాంధీ మంత్రివర్గమున డాక్టరు మర్రి చెన్నారెడ్డి, శ్రీ కొత్త రఘురామయ్యలు క్యాబినెట్ మంత్రులైరి. ప్రవాసాంధ్రులైన శ్రీ కే సి రెడ్డి (మైసూరు వాస్తవ్యులు) నెహ్రూ, లాల్ బహద్దూరు, ఇందిరాగాంధీ మంత్రివర్గములలో క్యాబినెట్ హోదాగల మంత్రిగా వ్యవహరించిరి. వర్తమానమున శ్రీ కే రఘునాథరెడ్డిగారు స్టేట్ మంత్రిగా నున్నారు.

స్పీకరు - డిప్యూటీ స్పీకర్లు

భారతదేశము స్వాతంత్ర్యము పొందిన పిమ్మట నవభారత రాజ్యాంగము అమలులోనికి వచ్చిన నాటినుండియు ఐదుగురు (1) శ్రీ మవలంకర్ (2) శ్రీ మాడభూషి అనంతశయనం అయ్యంగారు (3) శ్రీ హుకుంసింగు (4) శ్రీ నీలం సంజీవరెడ్డి (5) వర్తమానమున శ్రీ జి.యస్. ధిల్లాన్‌లు స్పీకర్‌గా నెన్నుకొనబడిరి. రాజ్యాంగము ననుసరించి లోకసభ కార్యక్రమములను

స్పీకరు నిర్వహించవలెను. ఇట్టి ఉన్నత పదవిని నిర్వహించు వ్యక్తి ప్రజాస్వామ్యమునకు సంరక్షకుడు 'కస్టోడియన్' (Custodian) కావున నీ ఉన్నత పదవి నలంకరించు వ్యక్తి పార్టీ రాజకీయములకు అతీతుడుగా నుండవలెను. చిరకాలము పార్టీ రాజకీయములలో పాల్గొనిన వ్యక్తులకు, ఇది యెంతో చాల కష్టతరమైనది. దీనికి కారణము స్పీకరు నిష్పక్షపాత వైఖరి నవలంబించవలసి అవసరమని తోచిన యెడల ప్రభుత్వమును మందలించుచు, ప్రతిపక్షపు హక్కులను రక్షించవలసి యున్నది. ఈ పదవిని అత్యంత సమర్థతతో మన తెలుగువారైన శ్రీ మాడభూషి అనంతశయనం అయ్యంగారు, శ్రీ నీలం సంజీవరెడ్డిగారు నిర్వహించిరి. ప్రభుత్వము యొక్కయు, ప్రతిపక్షము యొక్కయు ప్రజల యొక్కయు పత్రికల యొక్కయు, ప్రముఖుల యొక్కయు ప్రశంసలకు పాత్రులు కాగలుగుట వ్యక్తిగతముగా వారిరువురికే కాక యావత్ తెలుగువారికి గర్వకారణము. ఇంకొక విశేషము వీరిరువురు ఒకే ప్రాంతము అనగా రాయలసీమ వారగుటయు, ఆ ప్రాంతీయులకు ప్రత్యేక గర్వకారణము అనుటలో సందేహము లేదు.

శ్రీ మాడభూషి అనంతశయనం గారు స్వతంత్ర భారత తొలి డిప్యూటీ స్పీకరుగా నెన్నుకొనబడి, తరువాత స్పీకరైరి.

పార్లమెంటులో

పార్లమెంటు ఉభయ సభలలోను అత్యంత సమర్థులైన వారుగా మనవారు ప్రవర్తించుచున్నారు. 1962-67 సంవత్సరముల మధ్యకాలమున స్వతంత్ర అభ్యర్థిగా లోక్‌సభకు ఎన్నికైన డాక్టరు లంక సుందరము తన ప్రతిభా పాటవములచేతను, విజ్ఞానసంపద వలనను, ప్రభుత్వము యొక్కయు, ప్రతిపక్షము యొక్కయు, ప్రజల యొక్కయు ప్రశంసలకు పాత్రుడు కాగలిగెను.

ఆచార్య యన్.జి. రంగా స్వతంత్ర పార్టీకి లోకసభలో నాయకులుగా, సభకు నూతనశోభలను చేకూర్చుచు, పార్లమెంటరీ వ్యవస్థయొక్క ఘనతను యినుమడింప చేసిరి.

శ్రీ తెన్నేటి విశ్వనాథము గారు నాలుగవ లోకసభలో సభ్యులుగా ఉండి తమ విశేష అనుభవమును, పరిజ్ఞానమును, ప్రతిభను ప్రదర్శించి, స్వతంత్ర అభ్యర్థిగా నున్నను ప్రభుత్వము యొక్క కృతజ్ఞతకు పాత్రులు కాగలిగిరి.

రాజ్య సభకు ఎన్నికైన అనేక మంది తెలుగువారిలో, విశాఖ వాస్తవ్యులైన శ్రీ ముళ్ళపూడి [illegible], కార్మిక నాయకుడుగా, సభాకార్యక్రమములో పాల్గొనుచు సభకు హుందాను గౌరవము చేకూర్చ కలిగిరి.

శ్రీ బెజవాడ గోపాలరెడ్డిగారు, ఈ సభలో కాంగ్రెసు పార్టీకి ఉపనాయకులుగా నుండిరి. ప్రస్తుతమున శ్రీ బి. యస్. మూర్తిగారు ఈ పదవికి ఎన్నికైనారు.

సుప్రీంకోర్టు న్యాయమూర్తులు

భారతదేశమున అంతకు ఉన్నత న్యాయస్థానము భారత సుప్రీంకోర్టు. సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమింపబడువారు న్యాయశాస్త్ర కోవిదులై, సమస్త లౌకిక విషయములను క్షుణ్ణముగా నెరిగినవారై, అనుభవజ్ఞులైన న్యాయవాదులునై యుండవలెను. ఈ ఉన్నత పదవిని నలుగురు తెలుగువారు పొందగలిగిరి. అందు ఒకరు ప్రధాన న్యాయమూర్తులు కూడ కాగలిగిరి.

శ్రీ జస్టిస్ జగన్నాథదాసు యం. ఏ., బి. యల్. పట్టభద్రులు స్వాతంత్ర్య సమరమున పాల్గొనిన దేశభక్తులు. మద్రాసు హైకోర్టులో న్యాయవాదులు. భారతదేశ స్వాతంత్ర్యానంతరము స్వరాష్ట్రమైన ఒరిస్సాలో హైకోర్టు న్యాయమూర్తిగను ప్రధాన న్యాయమూర్తిగను వ్యవహరించి, తదుపరి సుప్రీంకోర్టు న్యాయమూర్తిగ నైనారు.

న్యాయమూర్తి శ్రీ కోకా సుబ్బారావుగారు బి.ఏ., బి.యల్. పట్టభద్రులు. మద్రాసు హైకోర్టులో న్యాయవాదిగను న్యాయమూర్తిగను పేరుగాంచి తదుపరి, ఆంధ్రప్రదేశ్ హైకోర్టులలో ప్రధాన న్యాయమూర్తిగా ఖ్యాతిగాంచి సుప్రీంకోర్టులో న్యాయమూర్తిగను, ప్రధాన న్యాయమూర్తిగను వ్యవహరించి ప్రస్తుతము బెంగుళూరులో విశ్రాంతి గైకొనుచున్నారు.

కీ. శే. పెనుమత్స సత్యనారాయణ రాజు బి.ఏ., బి.యల్. పట్టభద్రులై, కీ. శే. టంగుటూరి ప్రకాశము పంతులుగారి వద్ద శిష్యరికము నెరిపి మద్రాసు హైకోర్టులో న్యాయవాదిగను, ఆంధ్ర, ఆంధ్రప్రదేశ్ హైకోర్టులలో న్యాయమూర్తిగను తదుపరి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అయి, సుప్రీంకోర్టులో స్వల్పకాలము మాత్రమే న్యాయమూర్తిగా ఉండి అకాల మరణము నొందిరి.

న్యాయమూర్తి శ్రీ పింగళి జగన్మోహనరెడ్డిగారు. బికాం (లీడ్సు) యల్. యల్. బి. బారిష్టరు పట్టములు విదేశములో పొందిరి. వీరు హైదరాబాదు సంస్థానమున మంత్రిగా నుండిన కీ. శే. పింగళి వెంకటరామారెడ్డిగారి తనయులు. పింగళి వారిది సుప్రసిద్ధ కుటుంబము. జగన్మోహన రెడ్డిగారు హైదరాబాదు సంస్థానము యొక్కయు, ఆంధ్రప్రదేశ్ యొక్క హైకోర్టులలో న్యాయమూర్తిగను తదుపరి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగను వ్యవహరించి, ప్రస్తుతము సుప్రీంకోర్టులో న్యాయమూర్తిగా నున్నారు.

గవర్నర్లు

గవర్నర్లకు 'రాజ్యపాల్' అని పేరు. మన రాజ్యాంగము ననుసరించి ప్రతిరాష్ట్రమునకు గవర్నరు ముఖ్యపాలనాధికారి. ఈయన పేరుమీదనే రాష్ట్రప్రభుత్వ పరిపాలన జరుగును. గవర్నరు రాష్ట్రపతిచే నియమింపబడి, ఆతనికి ఏజెంటుగా వ్యవహరించును. మనది ఫెడరల్ రాజ్యాంగ విధానము అనగా రాష్ట్ర కేంద్ర ప్రభుత్వములమధ్య అధికారములు విభజింపబడినవి. దేశ సమగ్రతను రక్షించుటకు కేంద్రప్రభుత్వము, రాష్ట్రప్రభుత్వములపై అజమాయిషీ చేయవలసి యున్నది. దీని ననుసరించి గవర్నర్లకు చాల ముఖ్యమైన బాధ్యతలు కలవు. రాష్ట్ర ప్రభుత్వము సుస్థిరముగా ప్రజాస్వామ్య పద్ధతులపై నడుచునట్లు

చూచుట, రాజకీయ సంక్షోభములను నివారించుట. వెనుకబడిన వర్గముల వారికి అవకాశములు లభించునట్లు ఉత్తరువులిచ్చుట, రాష్ట్ర ముఖ్యమంత్రిని యితర మంత్రులను, అడ్వకేటు జనరల్, సర్వీస్ కమీషన్ సభ్యులు, యితర ఉన్నత ఉద్యోగులను నియమించుట ఈతని ముఖ్యవిధులు. ఇట్టి విధులను నిర్వహించు వ్యక్తి ప్రతిభావంతుడై, పరిపాలనదక్షుడై, రాజకీయ చతురతతో కూడినవాడై యుండవలెను మన తెలుగువారిలో (1) శ్రీమతి సరోజినీనాయుడు (ఉత్తరప్రదేశ్) (2) డాక్టరు భోగరాజు పట్టాభి సీతారామయ్య (మధ్యప్రదేశ్) (3) శ్రీ బూర్గుల రామకృష్ణరావు (కేరళ, ఉత్తరప్రదేశ్) (4) శ్రీ వరాహగిరి వేంకటగిరి (ఉత్తరప్రదేశ్, కేరళ, మైసూరు) (5) శ్రీ మొసలికంటి తిరుమలరావు (వింధ్యప్రదేశ్) (6) శ్రీ మాడభూషి అనంతశయనం అయ్యంగారు (బీహారు) (7) కుమారి పద్మజానాయుడు (పశ్చిమ బెంగాలు) (8) మెహిది నవాబ్‌జంగ్ (గుజరాతు) (9) శ్రీ బెజవాడగోపాల రెడ్డి (ఉత్తరప్రదేశ్) గవర్నరులుగా వ్యవహరించిరి. ప్రవాసాంధ్రులైన (1) డాక్టరు యం యస్. అనీ (మధ్యప్రదేశమున స్థిరపడిరి) ఉత్తరప్రదేశ్‌కు (2) శ్రీ పూసపాటి సంజీవకుమార స్వామిరాజా (తమిళనాడులో స్థిరపడిరి) ఒరిస్సాకు (3) శ్రీ కే సి. రెడ్డి (మైసూరులో, స్థిరపడిరి) మధ్యప్రదేశ్‌కు గవర్నర్లుగా వ్యవహరించగా వర్తమాన కాలమున శ్రీ అలీయవార్‌జంగ్ బొంబాయికి గవర్నరుగా వ్యవహరించుచున్నారు.

తొలి భాషారాష్ట్రము

భారత దేశమును భాషా ప్రాతిపదిక పై విభజించుటకు కారకులు తెలుగువారు. భాష ఆధారముగా దేశవిభజన కావించ వలెనను కోరిక 1913వ సంవత్సరమునుండి యున్నను దానిని పరాయివారైన ఆంగ్లేయులుకాని, స్వతంత్ర భారత ప్రభుత్వముకాని అమలు జరపనందున అమరజీవి పొట్టి శ్రీరాములుగారను సర్వోదయ నాయకుడు 58 దినములు నిరహారదీక్ష బూని 1952 డిసెంబరు 15వ తారీఖున ఈశ్వరసాన్నిధ్యము చేరెను. వారి మరణమువలనే తొలుత 1953 అక్టోబరు 1వ తారీఖున వెనుకటి మద్రాసు రాష్ట్రమునగల తెలుగు జిల్లాలతో ఆంధ్రరాష్ట్రము, కర్నూలు రాజధానిగా ఏర్పడినది. కేంద్ర ప్రభుత్వమువారు న్యాయమూర్తి ఫజల్ఆలీ, సర్దార్ హీకర్, పండిత్ హృదయనాథ్ కుంజ్రులతో నొక సంఘము నేర్పాటు కావించిరి ఆ సంఘము వారి సిఫార్సుల ననుసరించి దేశమంతయు భాషా రాష్ట్రములుగా విభజింపబడినది. 1956 వ సంవత్సరము నవంబరు ఒకటవ తేదీ నుండి రాష్ట్రాల పునర్ వ్యవస్థీకరణ చట్టము అమలులోనికి రాగా ఆంధ్రప్రదేశ్ అను పేరుతో విశాలాంధ్ర ఏర్పడినది. కీ. శే. ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు భారత తొలిభాషారాష్ట్ర తొలి ముఖ్యమంత్రి.

కాంగ్రెస్ అధ్యక్షపదవి

భారత దేశమునకు స్వరాజ్యము వచ్చునంతవరకు భారత జాతీయ కాంగ్రెస్ (Indian National Congress), దేశ స్వాతంత్రము కొరకు విశేషమైనకృషి జరిపినది. కాంగ్రెస్ అధ్యక్షుడనగా విశేషమైన గౌరవ పీఠము. నేటికి కాంగ్రెస్ భారత దేశమున గల ప్రధాన రాజకీయ సంస్థ అని అంగీకరింపక తప్పదుకదా!

స్వాతంత్ర్యమునకు పూర్వము 1885-1947 సంవత్సరముల మధ్య అనగా సుమారు 62 సంవత్సరముల కాలములో శ్రీపనంపాకం ఆనందాచార్యులు, శ్రీమతి సరోజనిదేవిగార్లు మాత్రమే కాంగ్రెస్ అధ్యక్షులు కాగలిగిన తెలుగువారు.

స్వాతంత్ర్యానంతరము డాక్టరు భోగరాజు పట్టాభిసీతారామయ్య (1949) జయపుర కాంగ్రెస్‌కు 1960 వ సంవత్సరములో బెంగుళూరు కాంగ్రెస్‌కు శ్రీ నీలం సంజీవరెడ్డి (1962) ఢిల్లీకాంగ్రెస్‌కు శ్రీ దామోదరం సంజీవయ్య అధ్యక్షులు కాగలిగిరి. రాయలసీమకు చెందిన సంజీవ రెడ్డి సంజీవయ్యలు వరుసగా కాంగ్రెస్ అధ్యక్షుల గుట ముదావహమైన విషయము. కాంగ్రెస్ అధ్యక్షుడగు నరికి సంజీవయ్యకు నలువదివత్సరములు. యింతటి చిన్నవయస్సునను నెవ్వరును ఈ అగ్రస్థానమలంకరించలేదు.

కీ. శే. దామోదరం సంజీవయ్య కాంగ్రెస్ అధ్యక్షులుగా ఉంటూ 1972వ సంవత్సరములో పరమపదించిరి.

కాంగ్రెస్ కార్యదర్శి

భారత స్వాతంత్ర్యానంతరము కీ. శే. కళా వేంకటరావు కీ శే అలూరు సత్యన్నారాయణ రాజుగారు అఖిలభారత కాంగ్రెస్ కార్యదర్శులైరి. స్వాతంత్ర్యమునకు పూర్వము చాలకాలము క్రిందట నీపదవిని ఆంధ్ర భీష్మన్యాయ పతి సుబ్బారావు దేశభక్త కొండా వేంకటప్పయ్య, ఆంధ్రరత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్యగార్లు నిర్వహించిరి

స్వతంత్రపార్టీ

ఆచార్య యన్ జి. రంగా స్వతంత్రపార్టీ 1960లో స్థాపించబడినపుడు దానికి తొలి అధ్యక్షులై ఆ పదవిలో చాల కాలముండిరి.

జన సంఘ్

రాజమహేంద్రవర న్యాయవాదులైన శ్రీ అపసరాల రామారావు గారు 1962 అఖిలభారత జనసంఘ అధ్యక్షులుగా నుండిరి.

కమ్యూనిస్టు-మార్క్సిస్టు పార్టీ

శ్రీ నీలం రాజశేఖర రెడ్డి శ్రీ చండ్రరాజేశ్వరరావు, శ్రీ మోటూరు హనుమంతరావు, శ్రీ పుచ్చలపల్లి సుందరయ్యలు అఖిల భారత కమ్యూనిస్టు పార్టీకి కార్యదర్శులుగా నుండిరి.

ప్రస్తుతము శ్రీ చండ్ర రాజేశ్వరరావు అఖిలభారత కమ్యూనిస్టుపార్టీకిన్నీ శ్రీ పుచ్చలపల్లి సుందరయ్య అఖిలభారత మార్క్సిస్టు పార్టీకిన్ని కార్యదర్శులుగానున్నారు.

కృషిక్ లోక్ పార్టీ

1951 వ సంవత్సరమున ఆచార్య యన్. జి. రంగా కాంగ్రెస్ విడిచి అఖిల భారత స్థాయిని కృషిక్‌లోక్ పార్టీని స్థాపించి దానికి అధ్యక్షులైరి. ఈ పార్టీ ప్రతినిధులు మద్రాసు రాజస్థాన్ శాసన సభలకు ఎన్నిక కాగలిగిరి. కాల గర్భమున నీ పార్టీ స్వతంత్ర పార్టీలో లీనమైపోయినది.

ప్రజాపార్టీ

ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశము పంతులుగారికి కాంగ్రెసు లోని కొన్ని వర్గములతో విభేదములు రాగా వారు కాంగ్రెసును విడిచి 'ప్రజాపార్టీ' అను పేరుతో నొక పార్టీని స్థాపించి, ఉమ్మడి మద్రాసు రాష్ట్రమునగల ప్రముఖులైన కాంగ్రెస్‌వారిని 1951వ సంవత్సరము ప్రథమ సార్వజనిక ఎన్నికలలో ఓడించి, కాంగ్రెస్ వారు ప్రభుత్వము నేర్పర్చుటకు కొన్ని సంకట పరిస్థితులు లేర్పర్చిరి తరువాత ప్రజా పార్టీ, సోషలిస్టు పార్టీతో లీనమై పోయినది. రాజకీయ మార్పుల వలన పంతులుగారు ప్రజా సోషలిస్టు పార్టీని వదలి కాంగ్రెసులో చేరిపోయి 1953 అక్టోబరు 1వ తేదీన ఏర్పాటు అయిన ఆంధ్ర రాష్ట్రమునకు తొలి ముఖ్యమంత్రులైరి. దానితో ఆ పార్టీ దాదాపుగా అంతమైనది. కాని నేటికిన్ని శ్రీ తెన్నేటి విశ్వనాథంగారు ప్రజాపార్టీ పేరును నిలబెట్ట కృషి సల్పుచున్నారు.

అందరూ తెలుగువారే

1961వ సంవత్సరపు తృతీయ సార్వత్రిక ఎన్నికలప్పుడు, కాంగ్రెస్, కమ్యూనిస్టు స్వతంత్ర, జనసంఘ అధినేతలందరు తెలుగువారే.

ప్రణాళికా సంఘము

శ్రీమతి దుర్గాబాయి దేశముఖ్ ప్రణాళిక సంఘమున సభ్యురాలుగా వ్యవహరించెను. శ్రీ బుర్రా వెంకటప్పయ్యగారు యిటీవల ఈ పదవి నలంకరించిరి. సర్. కొంరి రామమూర్తి, సర్. భాగవతుల విశ్వనాథంగార్లు ప్రణాళికాసంఘ ప్రాంతీయ సలహాదారులుగా నుండిరి.

యూనివర్సిటీ గ్రాంట్సు కమీషను

ఆంధ్ర విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షులుగా వ్యవహరించిన కీ. శే. డాక్టరు వి. యస్. కృష్ణ యూనివర్సిటీ గ్రాంట్సు కమీషను అధ్యక్షులుగా 1961వ సంవత్సరమున నియమింపబడి ఆ పదవిలో ఒక నెలదినములు మాత్రమేయుండి ఆకస్మిక మరణము పొందిరి. డాక్టరు కృష్ణ గొప్ప విద్యావేత్త.

కంపెనీ వ్యవహారముల సంఘము

శ్రీ తెన్నేటి విశ్వనాథముగారు 1957 వ సంవత్సరమున అఖిల భారత స్థాయిని కంపెనీ వ్యవహారములు నిర్వహించు సంస్థకు అధ్యక్షులైరి.

కాఫీబోర్డు అధ్యక్ష పదవి

శ్రీ తెన్నేటి విశ్వనాథముగారున్ను ప్రవాసాంధ్రులైన శ్రీ హెచ్. జి. కె. రెడ్డిగారున్ను కాఫీబోర్డు అధ్యక్షులుగా అఖిల భారత స్థాయినుండిరి.

భారత నౌకాయాన సంస్థ

వర్తమాన కాలమున పార్లమెంటు సభ్యులగు శ్రీ బులుసు ప్రభాకర పట్టాభి రామారావుగారు భారత నౌకాయాన సంస్థ ఛైర్మన్‌గా నున్నారు.

నావికా దళాధిపతి

మన తెలుగువారైన శ్రీ ఆర్. డి. కటారి, కొంతకాలము భారత నావికా దళాధిపతిగా నుండిరి.

రిజర్వు బ్యాంకు – స్టేటు బ్యాంకు

శ్రీ బుర్రా వేంకటప్పయ్యగారు ఐ.సి యస్ రిజర్వు బ్యాంకు డిప్యూటీ గవర్నరుగాను, స్టేటు బ్యాంకు ఆఫ్ ఇండియా ఛైర్మన్ గాను వ్యవహరించి ప్రస్తుతము గ్రామీణ పరపతి సంఘముల నిర్వహణ పరిశీలనా సంఘ అధ్యక్షులుగా నున్నారు.

రక్షణ శాఖలో

డాక్టరు సూరి భగవంతముగారు రక్షణశాఖలో శాస్త్రవిజ్ఞాన సలహాదారు (Scientific Adviser) గా నుండి, యిటీవలనే పదవీ విరమణ కావించినారు. అంతకు పూర్వము వారు లండన్ లోని భారత హైకమీషన్ కార్యాలయమున శాస్త్రవిజ్ఞాన సలహాదారుగా నుండిరి.

శ్రీ ఓ. పుల్లారెడ్డి, ఐ. సి. యస్. రక్షణశాఖ కార్యదర్శిగా, పదవీ విరమణ కావించిరి. శ్రీ పి. యస్. రావుగారును, యిట్లే పదవీ విరమణ కావించిరి.

కేంద్ర జలవిద్యుత్ కమీషన్

ప్రస్తుతము కేంద్రప్రభుత్వమున జలవిద్యుత్ శాఖా మాత్యులుగానున్న డాక్టరు కె. యల్. రావు గారు కొంతకాలం కేంద్ర జల విద్యుత్ కమీషను అధ్యక్షులుగా నుండిరి.

సుప్రీంకోర్టు రిజిస్ట్రారు

కీ. శే. పి. యస్. మూర్తిగారు సుప్రీంకోర్టు రిజిస్ట్రారుగా నుండిరి. 1953లో ఆంధ్ర రాష్ట్రపు ఏర్పాటు బిల్లును రూపొందించినది వీరే.

ఆర్థిక సంఘము

మద్రాసు హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తులైన డాక్టరు పాకాల వెంకట రాజమన్నారు నాలుగవ ఆర్థిక సంఘ

అధ్యక్షులుగా నుండిరి. వర్తమానమున ఆరవ ఆర్థిక సంఘ అధ్యక్షులుగా ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి శ్రీ కాసు బ్రహ్మానంద రెడ్డిగారు నియమింపబడినారు.

కేంద్ర లలితకళా అకాడమీ

మద్రాసు హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తులైన డాక్టరు పాకాల వెంకట రాజమన్నారు, లలితకళా అకాడమీ మాజీ అధ్యక్షులు. మెహిదీ నవాజ్ జంగ్ కూడా మాజీ అధ్యక్షులే.

నేషనల్ బుక్ ట్రస్టు

సుప్రసిద్ధ పత్రికా రచయితలగు కీ. శే. కుందూర్తి ఈశ్వర దత్తుగారు, నేషనల్ బుక్ ట్రస్టుకు కార్యదర్శిగా వ్యవహరించిరి.

కేంద్ర సాహిత్య అకాడమీ

కేంద్ర సాహిత్య అకాడమీవారు ప్రతి సంవత్సరము సాహిత్య వేత్తలకిచ్చు బహుమతులందుకొనిన వారిలో, మన వారైన, కీ. శే. సురవరపు ప్రతాపరెడ్డి, కీ. శే జాషువా, కీ. శే. గోపీచంద్, కీ. శే. దేవరకొండ బాలగంగాధర తిలక్, శ్రీ బలుసు వెంకటేశ్వర్లు, చిరంతనానందస్వామి, డాక్టరు. పోణంగి శ్రీరామ అప్పారావు, శ్రీ బాలాంత్రపు రజనీకాంత రావు, శ్రీ రాయప్రోలు సుబ్బారావు, శ్రీ దాపి ధర్మారావు, శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారు, శ్రీ తుమ్మల సీతారామమూర్తి చౌదరీ గారలు కలరు.

జ్ఞాన పీఠ బహుమతి

ఈ సంవత్సర జ్ఞాన పీఠ బహుమతిని కళా ప్రపూర్ణ డాక్టరు విశ్వనాథ సత్యనారాయణ గారికి లభించినది. జ్ఞానపీఠ బహుమతి అనగా భారతీయ నోబుల్ బహుమతి అనవచ్చును. ఈ బహుమతిని సాహిత్యములో సుప్రసిద్ధులైన వారికి రెండు సంవత్సరముల కొకమారు ఒక లక్షరూపాయలు యిచ్చెదరు.

ఛిత్రో గ్రాఫరు

1961 వ సంవత్సరమున ప్రపంచములోనికెల్ల ఉత్తముడైన ఛిత్రో గ్రాఫరుగా మన తెలుగువాడైన శ్రీ యస్. వి రామారావును లండన్‌లోని స్లేడు స్కూలు వారు ఎన్నుకున్నారు. ఈతని చిత్రములు ప్రపంచములో అనేక ప్రదర్శనశాలలలో ఉత్తమములుగా ఎన్నిక కాబడినవి.

రాయబారులు

మన తెలుగువారు దేశీయ రాజకీయ రంగమునందు చూపినంత ప్రతిభ విదేశ వ్యవహార రంగమున చూపలేక పోవుచున్నారు. కాని అందులో కొందరు ప్రముఖ పాత్ర నిర్వహించిరి. భారత స్వాతంత్ర్యానంతరము శ్రీ వరహాగిరి వెంకటగిరి గారు లంకలో భారత హైకమీషనరు గాను, డాక్టరు రాధాకృష్ణ పండితుడు రష్యాలో రాయబారిగను, ఆర్. డి. రావు బర్మాలో రాయబారి గను, పదవులు నిర్వహించిరి. ప్రస్తుత బొంబాయి గవర్నరగు అలీయావర్ జంగ్ అమెరికాలో భారత రాయబారిగా వ్యవహరించిరి.

శాస్త్రవిజ్ఞానములలో

మన తెలుగువారిలో చాలమంది భారత స్వాతంత్ర్యానంతరము నవీన శాస్త్ర విజ్ఞానములలో విశేషమైన కృషి సల్పిరి; అందులో ముఖ్యులైన వారిలో డాక్టరు అయ్యగారి సాంబశివరావు. శ్రీ నూతక్కి భానుప్రసాదు; డాక్టరు ఎలవర్తి నాయుడమ్మ; శ్రీ యస్. జి. కె. మూర్తి. డాక్టరు పురుషోత్తమ రామలింగస్వామి; డాక్టరు సి రాధాకృష్ణరావు యిత్యాదులు ముఖ్యులు. వీరే కాక డాక్టరు సూరి భగవంతముగారు తమ కృషిని అహోరాత్రములు, విజ్ఞాన విషయ పరిశోధనకొరకు జరుపుచున్నారు.

శ్రీ అయ్యగారి సాంబశివరావుగారు ప్రఖ్యాతివడసిన భౌతిక శాస్త్ర (Physics) వేత్త. వీరు కీ. శే. డా. హోమీబాబా అధ్వర్యమున నిర్మింపబడిన ట్రోంబె అణుశక్తి కేంద్రమున పని చేయుచు, ఈ అణుశక్తి యంత్ర నిర్మాణమునందు, వీరు చూపిన ప్రతిభకు 1960 సంవత్సరంలో పద్మశ్రీ బిరుదును పొంది 1972 సంవత్సరములో ప్రభుత్వము పద్మభూషణ బిరుదును పొందిరి.

శ్రీ నూతక్కి భానుప్రసాదు, కీ. శే. నూతక్కి రామశేషయ్యగారి పుత్రులు. రామశేషయ్యగారు, ఒరిస్సా రాష్ట్రమున గల రాయఘుడ చక్కెర ఫ్యాక్టరీలో ఉన్నత ఉద్యోగిగా నుండుచు, ఒరిస్సా రాష్ట్రమున మంత్రిగా నుండిరి. శ్రీ భానుప్రసాద్ ట్రాంబే అణుశక్తి కేంద్ర నిర్మాణములో గొప్ప నైపుణ్యము చూపిన ఇంజనీరు. పద్మశ్రీ బిరుదాంకితులు.

డాక్టరు ఎలవర్తి నాయుడమ్మ తోళ్ల పరిశ్రమకు చెందిన రసాయనిక శాస్త్రమున బహుప్రౌఢ. వీరు ఈ శాస్త్రమున విశేషమైన కృషి జరిపిరి. వీరు కేంద్ర పరిశోధనా సంస్థకు డైరక్టరుగా వున్నారు.

శ్రీ యస్. జి. కె. మూర్తిగారు డ్యాముల నిర్మాణములోను, నీటిపారుదల ఇంజనీరింగు శాఖలో విశేషమైన జ్ఞానము కలవారు. కొయినాడామ్ (మహారాష్ట్రలో) వారియొక్క బుద్ధి కుశలతకు శాశ్వత చిహ్నము. వీరు 1963 లో పద్మశ్రీ బిరుదము పొంది 1972లో పద్మభూషణ బిరుదును గ్రహించిరి.

డాక్టరు పురిమిటి రామలింగస్వామి ఢిల్లీలోగల కేంద్రవైద్య పరిశోధనా సంస్థలో విజ్ఞాన శాస్త్రవేత్తగా యుంటూ 'జెనిటిక్సు' (Genetics) పై విశేషమైన పరిశోధనలు చేసి ప్రకటించి అంతర్జాతీయ కీర్తి నార్జించినాడు.

డాక్టరు సి. రాధాకృష్ణరావు, అర్థగణాంక విషయములపై విశేషమైన కృషి జరిపి ప్రఖ్యాతిని గాంచిరి. వీరు కలకత్తాలో గల భారతీయ అర్థగణాంక సంస్థకు అధ్యక్షులుగా నున్నారు.

డాక్టరు నోరి వెంకటేశ్వర్లుగారు అఖిల భారత వెలివిజను సంస్థకు అధిపతిగ నున్నారు.

డాక్టరు పల్లూరి సీతారామారావుగారు బెంగుళూరులో గల అఖిల భారత విమాన పరికరముల పరిశోధనా సంస్థకు అధిపతిగా నున్నారు.

డాక్టరు చిత్రావూరు దక్షిణామూర్తి గారు భూమికి సంబంధించిన భౌతిక శాస్త్రమునందును, డాక్టరు వేము లక్ష్మీ భీమ శంకరముగారు భూ జల సంబంధమైన భూగర్భ శాస్త్రమునందును విశేషమైన పరిశ్రమను జరిపిరి.

విశ్వసాహితిలో

శ్రీశ్రీ, శ్రీ కుందుర్తి ఆంజనేయులు, శ్రీ క్రొవ్విడి లింగ రాజుగారలు, తమ అభ్యుదయ సాహిత్య సేవలకు నెహ్రూ-సోవియట్ బహుమతిని పొందిన ప్రముఖులు. శ్రీ పాలగుమ్మి పద్మ రాజుగారి 'గాలివాన' కథ ఒకదు విశ్వఖ్యాతి లభించి అమెరికాలో గల 'న్యూయార్క్-హెరాల్డు ట్రిబ్యూన్' పత్రికవారి బహుమతి లభించినది.

అక్షరసేవలో

గుజరాతు హైకోర్టు మాజీ న్యాయమూర్తులైన శ్రీ వా. దేవు భద్రిరాజుగారు బి.సి.యస్, హైదరాబాదు అనబడుటకు అఖిల భారత భాషలకున్న ఏక లిపిని కనుగొనెను.

ప్రస్తుతము విస్కాన్సిను విశ్వవిద్యాలయ ఆర్ట్సు శాఖల ప్రిన్సిపాల్ గానున్న డాక్టరు భద్రిరాజు కృష్ణమూర్తిగారు దక్షిణాది భారతీయభాషలపై విశేషమైన కృషి చేసి, అమెరికాలోని కాలిఫోర్నియా, కార్నెల్, యిల్లినాయి విశ్వవిద్యాలయములలో భాషాశాస్త్రమును గూర్చి ఉపన్యాసములిచ్చెను, అనేక జాతీయ అంతర్జాతీయ భాషాశాస్త్ర సభలలో భారతీయ ప్రతినిధిగా పాల్గొనియు మాతృభాషకు, సోదర భాషలకు విశేషమైన సేవ సల్పుచున్న మహోదయులు.

డాక్టరు డి. యస్. రెడ్డి ఇథియోపియాలో విద్యాధికారిగానుండిరి.

కళాసేవలో

పద్మశ్రీ బిరుదాంకితులైన కీ. శే. ద్వారం వేంకటస్వామి నాయుడుగారికి భారత రాష్ట్రపతి బహుమతి లభించగా, కీ. శే. చింతాకృష్ణమూర్తిగారికి కూచిపూడి నృత్యమునకు లలితకళా అకాడమీవారి బహుమతి లభించినది. శ్రీ ధర్మాల రామమూర్తిగారికి వారి మృదంగతత్త్వ గ్రంథమునకున్ను లలితకళా అకాడమీ బహుమతి లభించినది.

స్టేట్ ట్రేడింగ్ కార్పొరేషను

కీ. శే. దిట్టకవి శాండిల్య, స్టేటు ట్రేడింగ్ కార్పొరేషనుకు అధ్యక్షులుగా వ్యవహరించిరి.

ఇండియన్ ఎలక్ట్రానిక్ కార్పొరేషను

డాక్టరు అయ్యగారి సాంబశివరావుగారు ఎలక్ట్రానిక్ కార్పొరేషను అధ్యక్షులుగా నున్నారు.

పత్రికా రంగమున

పత్రికారంగమున మన తెలుగువారిది పూర్వమునుండియు అగ్రస్థానమే. కీ. శే. చిర్రావూరి యజ్ఞేశ్వర చింతామణి కీ. శే. కోటంరాజు పున్నయ్య, కీ. శే. కోటంరాజు రామారావు యిత్యాదులెందరో ఆంగ్లపత్రికా రచయితలుగా ఖ్యాతి గాంచిరి.

స్వతంత్ర భారతావనిలో మనవారు కొందరీ రంగమున ఖ్యాతినొందిరి. కీ. శే. జి. వి. కృపానిధి ఢిల్లీలోగల ఇండియన్ న్యూసు క్రానికల్కు, బెంగుళూరులోగల 'డెక్కను హెరాల్డు'కు సంపాదకులుగా నుండిరి. కీ. శే. ఖాసా సుబ్బారావు ... హైదరాబాదులోగల లీడరు పత్రికకు సంపాదకులుగా నుండిరి. ప్రస్తుతమున శ్రీ యం. చలపతిరావుగారు నేషనల్ హెరాల్డు సంపాదకులుగా నున్నారు. ఈ ప్రస్తుతమున హిందూపత్రిక ప్రత్యేక ప్రతినిధిగా శ్రీ జి. కే. రెడ్డిగారున్ను, ఏ. యస్. రామన్‌గారు (ఇలస్ట్రేటెడ్ వీక్లీ మాజీ సంపాదకులు) ఖ్యాతి గాంచియున్నారు.

కేంద్ర సాంఘిక సంక్షేమశాఖ

శ్రీమతి దుర్గాబాయి దేశముఖ్ 1953_6 సంవత్సరముల మధ్యకాలమున కేంద్ర సాంఘిక సంక్షేమశాఖ అధ్యక్షురాలుగా నుండిరి.

చైనా ఘర్షణలో

1962వ సంవత్సరములో చైనావారితో మనకు సంభవించిన యుద్ధానంతరము జరిగిన సమాలోచనలలో డాక్టరు సర్వేపల్లి గోపాలున్ను, కీ. శే. డాక్టరు ఆర్. కృష్ణారావుగారున్ను ప్రముఖ పాత్ర వహించిరి. వీరిలో ఆర్. కృష్ణారావు అంతర్జాతీయ కీర్తి నార్జించిన అంతర్జాతీయ న్యాయశాస్త్రనిపుణుడు.

ఆటలలో

క్రికెటు ఆట ప్రత్యక్ష వ్యాఖ్యాతగా విజయనగరం రాజకుమారులగు కీ. శే. 'విజయ', క్రికెటు ఆటలో నిపుణుడుగా సి. కే. నాయుడు యిత్యాదులు విఖ్యాతమైన ఖ్యాతి నార్జించిరి.

మానవత

జె. వీరాస్వామి

మనిషిలోనుంచి మానవతను తీసివేస్తే, మిగిలిపోయ్యేది, ఒక ఆదిమ నివాసి—ఒక ద్విపాద పశువు.

కొన్ని వేల సంవత్సరాల క్రిందట, మనిషికి పంట పండించుకోవటం, వంట వండుకోవటం లాంటి వేమీ తెలియదు. అనాగరికంగా ఉంటూ, అడవుల్లో తిరుగుతుండేవాడు. జంతువుల్ని వేటాడి, తన ఆకలి తీర్చుకునేవాడు. ఆకలి కొన్ని క్రూర జంతువుల వాతబడి, అతడు ఆహుతి అయిపోవటంగూడా జరుగుతుండేది. అప్పుడు మనిషి, మొదటిసారిగా తన బలహీనతను తెల్సుకున్నాడు. తోటివాళ్లను కల్సుకుని తన మనుగడకు సహకార దృక్పథాన్ని అలవరుచుకొన్నాడు. అంతా సమైక్యంగా మసులుకుంటూ, సంఘీభావాన్ని పెంచుకోవటం నేర్చుకున్నారు ఆదిమ నివాసులు. అలా ఏర్పడ్డదే మొదట్లో సంఘం.

"కష్టంలో, సుఖంలో నీకు నేను, నాకు నీవు తోడుగా విడిపోని జోడుగా ఉండిపోవా" లనే మానవతా దృక్పథపు పునాదుల మీద నిర్మింపబడ్డదీ సంఘం. అప్పటో వారికి వ్యక్తిగతమైన ఆస్తులంటూ ఏమీ ఉండేవి కావు.

కాలం మారే స్వభావం కలదీ, కదలించే ప్రభావం కలదీ కావటంవల్ల, అజ్ఞానాంధకారంలో నిలబడ్డ మనిషిచుట్టూ కోటి విజ్ఞాన దీపాల్ని వెలిగించుకుంటూ వెళ్లసాగింది. గుంపులు గుంపులుగా నివసించే మనుష్యుల్లో తెగలూ, జాతులూ కనిపించసాగాయి. పల్లెలు రూపొందాయి. పంటచేలు పెంపొందాయి. పలు రకాల పనిపాటలూ, వృత్తులూ వృద్ధిచెందాయి. భారత దేశంలో వృత్తుల ఆధారంగా కులాలు ఉద్భవించాయి వృత్తితో ఆరంభమైన కులాలు షట్టుకతో ముడిపెట్టబడి, ఇప్పుడు పెకలించటానికి వీల్లేనంత బలంగా సంఘంలో వేళ్ళు దించుకుని స్థిరపడి పోయాయి. ఈ కులాలు మనిషినుంచి మనిషిని వేరుచేశాయి. వారి మధ్య స్పర్థలు, స్వలాభాపేక్షలూ ఎక్కువయ్యాయి దేశం విదేశీయుల బారికి గురి అయింది. ఇతర మతాలు రావటంతో, మతాల పేర గూడా సంఘర్షణలు ప్రారంభమయ్యాయి.

సంఘీభావంతో మెసలాలి అనే మానవత్వపు పునాదుల మీద నిర్మించబడ్డ సంఘం, క్రమంగా తన ఆకృతిని మార్చుకున్నది. అంచెలు అంచెలుగా సంఘం తన అంతస్తులు పెంచుకుంది. మానవత్వపు పునాదులు మాత్రం తమ పటిష్టాన్ని పోగొట్టుకుంటున్నాయి.

ఒక పక్క మనిషిని బాధనుంచి ఎలా రక్షించాలా అని అహర్నిశలూ లక్షలమంది డాక్టర్లు తమ జీవితాలను వెచ్చించి, విజ్ఞానాన్ని పెంచి పరిశోధనలు సాగిస్తుంటే, మరో పక్క క్షణికోద్రేకంలో పక్కవాణ్ణి పొడిచి చంపేస్తున్నాడింకో మనిషి. ఆకలిమీద, అజ్ఞానంమీద, మధ్య మధ్య విలయ తాండవం చేస్తున్న ప్రకృతిమీద యుద్ధం చేస్తున్న చిన్న చిన్న దేశాలపై పక్కదేశాలు కయ్యానికి కాలు దువ్వుతున్నాయి. పెద్ద పెద్ద దేశాలు, కీచులాడుకుంటున్న దేశాల్లో, ఒకదానికి మందుగుండు సామగ్రిని మరోదానికి మందుల సామగ్రిని ఓడల నిండా ఎగుమతి చేసి ధనార్జన చేస్తూ, తమ రాజనీతిజ్ఞతకు తామే మురిసిపోతున్నాయి. ఇక మానవత్వం మాట ఎవరికి గుర్తుంటుంది? అది గుర్తుంటే ఘర్షణే ఉండదు గౌతమ బుద్ధుడు మానవత్వాన్ని ప్రబోధించాడు. బౌద్ధ మతం జపానువరకు విస్తరించి, అక్కడి ప్రజలను ఉత్తేజితుల్ని చేసింది కర్తవ్యాన్ని, మానవత్వాన్ని గుర్తెరిగిన ఆ దేశ ప్రజలు, సర్వతోముఖాభివృద్ధి పొందారు బౌద్ధ మతానికి జన్మస్థానం అని చెప్పుకునే మన దేశంలో మాత్రం, ఆ మతం క్షీణదశకు వచ్చింది.

మన దేశం పరదేశీయుల పరిపాలనలో అనేక సంవత్సరాలు ఉన్నందువల్ల, అభివృద్ధి కుంటుపడింది స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత, ఈ పాతికేళ్ళలో వర్గ ప్రయోజనాలకు, వ్యక్తిగత స్వలాభాలకు మాత్రమే తగిన ప్రోత్సాహం లభించింది గాని, సమాజంలోని అనేకమైన సాంఘిక దురాచారాలను అరికట్టి మనిషిలోని మానవత్వపు విలువల్ని పెంచే ప్రయత్నాలుగాని, సంఘ సంస్కరణలకు పూనుకునే ప్రయత్నాలుగాని జరగలేదు.

రాను రాను సామాజిక దృక్పథాలలో మార్పులు వస్తున్నాయి. ఎదుటివాణ్ని ఎంత తెలివిగా మోసం చెయ్యటమా అనే ప్రతివాడూ ఆలోచిస్తున్నాడు. కాలానుగుణంగా తలవంచక, నమ్ముకున్న నీతికోసం ఎవడైనా నిజాయితీగా నిలబడదల్చుకుంటే, వాడికి హరిశ్చంద్రుడికొచ్చినన్ని కష్టాలు వచ్చిపడుతున్నాయి. ఇది నేడు మనకు అన్ని రంగాల్లోనూ కన్పిస్తూనే ఉంది.

అందువల్ల మనిషి తనలో అంతర్గతంగా ఉన్న కొద్దిపాటి మంచితనాన్ని, మానవత్వాన్ని, హృదిలోపలి అరల పొరల్లో ఎక్కడో భద్రంగా దాచేసుకుని, అంతరాత్మ పీక నొక్కేసి, అవలీలగా అవతలివాణ్ణి మోసంచేసి, అందరి కళ్లూ కప్పి, అవసరమైన వాళ్ళ నోళ్ళు కప్పి, తను మాత్రం పెద్దమనిషిలా నోరు నిండుగా నవ్వేస్తున్నాడే, ఎందుకిలా చేస్తున్నాడు?

మనిషిని మనిషి ఇంత అమానుషంగా కాటేస్తున్నాడే, ఎందుకోసం?

స్వార్థంకోసం.

సూక్ష్మంగాచూస్తే కొద్దో గొప్పో స్వార్థంలేని మనిషి ఎవడూ ఉండడు. ఉండలేడుగూడా అందరూ సన్యాసులైతే పుట్టుకే

ఉండదుగా. స్వార్థచింతన కొంచెంగూడా లేకపోతే. పురోభివృద్ధి కుంటుపడటంగూడా తథ్యమే. ఏమాత్రమూ స్వార్థంలేనివాడు, భగవంతుడయినా అయి ఉండాలి. లేదా వొట్టి పిచ్చివాడైనా అయి ఉండాలి. ఎందువల్లనంటే, ఏకోరికలూ లేవని చెప్పుకునే సన్యాసికికూడా, స్వర్గానికి చేరుకోవాలనే కోరిక ఉంటుందిగా. అదీ స్వార్థమే !

స్వార్థంలేకపోతే, మనిషికి పురోభివృద్ధి లేదు. మానవత్వం లేకపోతే అతను మనిషే కాడు. సరిగ్గా ఇక్కడే వస్తున్నది అసలు పేచీ.

స్వార్థం, మానవత్వం — ఈ రెండూ పరస్పరం విరుద్ధమైన స్వభావాలు కలవి. కానీ, ఈ రెండూ మనిషికి, రెండు ఊపిరితిత్తుల్లాంటివి. అతని జీవిత రథానికి, రెండు చక్రాల్లాంటివి. ఈ రెండూ సరిసమానంగా పనిచేస్తేనేగాని అతను పరిపూర్ణమైన మనిషిగా ఎదగలేడు. ఉదాత్త లక్ష్యాలవైపు పయనించలేడు. అయితే దైనందిన జీవితంలోకి వచ్చేటప్పటికి, ఈ సూత్రాల విలువ సన్నగిల్లుతున్నది.

కాలచక్రం, వేగాన్ని పుంజుకుంటున్నది ఆ చక్రంలో ఒక చిన్న పనిముట్టులాంటి మనిషి, ఆ వేగానికి, ఒరవడికి తట్టుకోలేక, ఉక్కిరిబిక్కిరి అయిపోతున్నాడు. పెరిగిపోతున్న జీవితావసరాలకు, సంపాదన అనే పగ్గాలువేసి, అదుపులోకి లాక్కోలేకపోతున్నాడు. జీవిత రథానికి స్వార్థం, మానవత్వం అనే రెండు చక్రాలున్నాయని అనుకున్నాంగదా. ఈ స్వార్థం అనే చక్రం, మనసులోని కాఠిన్యంతోటి, కావేశంతోటి తయారు చేయబడింది. మానవత్వం అనే చక్రం, మనసులోని ఆర్ద్రతతోటీ, మార్దవంతోటీ తయారుచేయబడింది. అందువల్ల ఈ రెండో చక్రం ఎక్కువ వేగాన్ని అందుకోలేకపోతున్నది. తొందరగా అరిగిపోతున్నది విరిగిపోతున్నది. వెనకబడితే లాభం లేదనుకుని తన రథానికి రెండో చక్రాన్నిగూడా స్వార్థంతో చేసినదాన్నే వేసుకుని, ముందుకు పరుగెడుతున్నాడు మనిషి. కటువుగా తోచినా, ఇది మాత్రం కాదనలేని సత్యం.

నేడు సమాజంలో మన చుట్టూ ఉన్న విషయాల్ని ఒకసారి పర్యావలోకనంచేస్తే, మానవత అనే మణిని, మనం ఎక్కడ పోగొట్టుకున్నామో, విలువైనదానిని పోగొట్టుకుని జీవితంలో ఆనందాన్ని రాబట్టుకోవాలని వెర్రిగా ఎండమావులవైపు ఎలా పరుగెడుతున్నామో అర్థమవుతుంది

ఒక వ్యక్తికి డబ్బు అవసరమవుతుంది. ఇంకొక వ్యక్తి దగ్గరకెళ్లి అప్పు అడుగుతాడు అప్పు ఇచ్చినందుకు కొంత వడ్డీని తీసుకోవచ్చు. ఈ వడ్డీ వ్యాపారాన్ని అడ్డంగా పెట్టుకొని దగ్గరకొచ్చినవాణ్ణి జలగలా పట్టుకుని, వాడి నెత్తురు పిండేసి, అసలుకు మించిన వడ్డీలు గుంజి, వీలైతే వాడి తాలూకు ఆస్తినంతా మింగి, పెద్దవాడైపోవటం ఎంత హేయం !

కొన్ని వస్తువులు టోకుగా కొని చిల్లరగా అమ్మకోవటం వ్యాపారం తాము కొంత లాభాల్ని కలుపుకుని, ఆ వస్తువుల్ని విక్రయించటం వ్యాపారసరళి. జనంలో అలజడిని సృష్టించి, ధరలు పెంచి, తమ లాభాలు పెంచుకునే వ్యాపారస్తులున్నారు. తిండిగింజలులేక తల్లడిల్లిపోతున్న పేదవాడి గోడు, సుష్టుగా భోంచేసి బయటకొచ్చి బొజ్జనిమురుకునే వాడికేం తెలుస్తుంది ?

మందులలో కల్తీలు, ఆహార వస్తువులలో కల్తీలు, రక్తదాహంతో సమానంగాదా ?

స్వార్థ చింతనతో రాజకీయాలు కల్పించే వాళ్లు కొందరు. ఆ సుడిగుండంలోపడి విలవిల్లాడే వాళ్లు ఇంకొందరు.

మతం పేర అక్రమాలు, హత్యలు. కుల విశిష్టత ఆధారంగా అన్యాయాలు, అక్రమాలు, భాషపేర ఉన్మాదం. హింసాకాండ — వీటన్నిటికీ ముఖ్య కారణం మనిషి మానవత్వాన్ని మరచిపోవటమే.

ఈ ఉద్యోగంచేస్తే, ఇంత జీతం ఇస్తామని ముందే చెబుతాడు. ఒప్పుకొని ఉద్యోగంలో జేరతాడు. జేరిన మర్నాటినుంచి పైన ఏమాత్రం దొరుకుతుంటుంది? అని అడుగుతుంటారు అతన్ని, అంటే జీతం లాగా, లంచాలు గూడ తప్పనిసరిగా వస్తుంటాయనే భావం ఉంది చాలా మందికి. లంచగొండితనం, కాలక్రమేణా వృద్ధి పొందుతుండటమే దీనికి కారణం. లంచం పుచ్చుకుంటున్న ఉద్యోగిని పట్టివ్వవలసిన ప్రజలే, తమ పనులు ఏమైనా అతని ద్వారా కావల్సి వచ్చినప్పుడు, అదే అడ్డదోవన నడుస్తుంటారు. కొండొకచో, దురదృష్టవశాత్తూ పై అధికారి అలాంటి అలవాటున్న వాడైతే, క్రిందవాడు ఎంత నిజాయితీగా ఉందామన్నా, అతనికి అన్నీ అగ్ని పరీక్షలే ఎదురవుతుంటాయి. తన మానవత్వాన్ని, తాత్కాలికంగా అవతలివారి స్వార్థానికి తాకట్టు పెట్టవల్సివస్తుంది.

కొన్ని కొన్ని ఆచారాలు శృతిమించి దురాచారాలుగా మారుతుంటాయి. దురాచారాలు సంఘానికి పట్టిన జాడ్యాల్లాంటివి. అవి మనుష్యుల్ని ఆరోగ్యంగా ఎదగనివ్వవు. అలాంటి వాటిలో, నేటి కట్నాల సమస్య కూడా ఒకటి. తన పిల్లను పెళ్లిచేసుకున్నందుకుగాను, తన సంతోషానికి చిహ్నంగా, లాంఛన ప్రాయంగా పిల్ల తండ్రి అల్లుడికి ఒకరూపాయి కట్నకానుకల క్రింద చదివించే ఆచారం ఉండేది మొదట్లో. రానురాను ఆ ఆచారం అతని జీవన విధానం మీదనే దెబ్బకొట్టేదిగా తయారయింది. ఈ నాడు ఒక ఆడపిల్ల పెళ్లి చేయాలంటే, ప్రతివాడూ తన స్తోమతకు మించిన డబ్బు ఖర్చు చెయ్యాల్సివస్తుంది. ఉన్న ఆస్తి అమ్ముకోవలసి వస్తుంది. లేదా అప్పులపాలు కావల్సివస్తుంది. మిమ్మల్ని అందర్నీ ఏడిపించి, నేను పెళ్లి చేసుకొని ఏం సుఖపడతాను నాన్నా? నాకు పెళ్లి వద్దు. అన్న అమ్మాయిల్ని మనం చూస్తూ ఉన్నాం జాలితో, ఆడపిల్లలు గల తల్లిదండ్రుల్ని కట్నాల కొరడాలతో శిక్షించటం అమానుషం.

ప్రతిచోటా, ప్రతివారూ మనుష్యులంతా ఒకటేనని వేదిక లెక్కి ఉపన్యాసాలిస్తునే ఉంటారు. అయితే ఈ మనుష్యులందర్నీ కలిపి, వారి మధ్యనున్న కులమతాల అడ్డుగోడల్ని కూలదోసి స్వేచ్ఛగా చేతులు కలిపి తిరిగేందుకు దోహదం చేసే కార్యక్రమాలు జరగవల్సినంతగా ఇంతవరకూ జరగక పోవడం విచార

కరం. అభ్యుదయ భావాలుగల యువతరం ఇందుకు ముందంజ వేస్తున్నది. కానీ, కొన్ని చోట్ల సనాతన సాంప్రదాయాల తాలుకు రాక్షసత్వం విశృంఖలంగా విహారం చేస్తున్నదనటానికి తార్కాణమే అప్పుడప్పుడు మనకు పేపర్లో కనబడే వార్తలు. ఫలానా చోట, ఫలానా వర్గానికి చెందిన మనుష్యుల సజీవ దహనంలాంటి ఘోరాలు జరుగుతున్నాయని విన్నప్పుడు ఆ దారుణ హత్యాకాండలకు కారణభూతులైన మనుష్యులు ద్విపాదపశువుల స్థాయినుంచి ఎంతమాత్రం ఎదగలేదని అనిపిస్తుంది.

మనిషిని మనిషి మోసం చెయ్యటంతో ఆగలేదు. దేవుణ్ని గూడా మోసం చేయ్యటానికి వెనకాడటం లేదు. దేవుడి పేరుమీద గుళ్లూ, గోపురాలు కడతామని చందాలు వసూలుచేసి స్వాహా చెయ్యటం, దేవుడి ఆస్తిని సొంత ఆస్తికన్నా ఎక్కువగా అనుభవించటం లాంటివి అలా ఉంచండి. దేవుణ్ణి దర్శించి, పూజిద్దామని వస్తే, దేవుడి దగ్గరున్న పూజారి రూపాయి పుచ్చుకుని, సగం మంత్రాలు మింగేసి, దేవుడిముందు నిలబడ్డవాణ్ణి మెడబెట్టి ముందుకు నెడుతున్నాడు. ఎందుకీ ఆత్మవంచన? ఏమయ్యా ఎందుకిలా వాళ్లని నమ్మకంగా మోస చేసున్నావు? అని దేవుడు ఆ పూజారిని అడిగితే ఏమంటాడో? బహూశా రెండు చెంపలూ వాయించుకుని స్వామీ, నీకు తెలియనిదేముంది? ఎలాగో ఒకలా, నేనూ బ్రతకాలిగదా? అని అంటాడేమో. భగవంతుని సృష్టిలో ఉత్కృష్టమైన ప్రాణి మానవుడు. అన్ని మతాలు మానవసేవే మాధవసేవ అని చెబుతున్నాయి. ఆ పరమ రహస్యాన్ని గంగపాలు చేసి, తోటి మానవుడికీ, మానవాళికి ద్రోహంచేసి, సంపాదించిన కొంత విత్తాన్ని. భగవంతునికి కానుకగా, ముడుపుగా సమర్పిస్తూ, ఉన్నతాను మోసం చేసుకుంటున్నాడు, మానవుడు.

ఇలా మనచుట్టూ ఉన్న అనేకరకాల అన్యాయాల్ని, అక్రమాల్ని మనం నిత్యం చూస్తుంటాం. వీటిని అరికట్టాల్సిన బాధ్యత ఈ తరంవారి భుజస్కంధాల మీద ఉన్నది. చిన్న చేపను పెద్దచేప మింగుతుంది. పెద్దచేపను తిమింగలం మింగుతుంది. లేని వాణ్ణి, ఉన్నవాడు తన స్వార్థానికి ఎరగా వాడుకుంటున్నాడు. ఆ 'ఉన్నవాణ్ణి' అంతకన్నా గొప్పవాడు తన స్వప్రయోజనాలకు తగినట్లుగా వినియోగించుకుంటున్నాడు. ఇలా బలవంతుడు బలహీనుణ్ణి మింగేస్తుంటే, మనిషికి జలచరానికి తేడా ఏమిటి? మానవుడికి మేధస్సు ఉంది. న్యాయాన్యాయాలను విచారించే విచక్షణాజ్ఞానం ఉంది. అందువల్ల బలవంతుడి బారి నుంచి బలహీనుడికి అన్నివిధాలా తగిన రక్షణ కల్పించే సమాజం విలసిల్లాలి.

యుగం మారినప్పుడు యుగధర్మం మారుతుంటుంది. ఎన్ని ధర్మాలు మారినా, అవన్నీ మానవత్వం అనే ముడిపదార్థంతో తయారు చేయబడినవే. కనుక నిత్యజీవన విధానంలో మానవతాన్ని ప్రవర్తించటంకన్న గొప్పధర్మం మరొకటి లేదు

మనిషిని మనిషిగా ఎప్పుడు గుర్తిస్తామో, మానవత్వం పెంపొందించుకుని తోటి మానవునికిగాని మానవులకుగాని హాని లేక, ద్రోహాన్ని తలపెట్టకుండా, మన జీవితాన్ని గడుపుతుంటామో అప్పుడే — స్వర్గం అనేది ఉందోలేదో గాని మనము స్వర్గసుఖములు ఈ భూలోకములోనే అనుభవిస్తాం. అలా జీవితం గడపలేనప్పుడు, మనశ్శాంతి కరువై, భోగభాగ్యములున్నా గాని — నరకం అనేది ఉందోలేదో గాని — నరకయాతన ఈ లోకంలోనే అను నిత్యం అనుభవించక తప్పదు

అందువల్లనే పునరావృత్తి అయినా మళ్ళీ చెబుతున్నాను. మనిషిలోనుంచి మనవత్వాన్ని తీసివేస్తే, మిగిలిపొయ్యేది — ఒక ఆదిమ నివాసి ఒక ద్విపాద పశువు

తెర తొలగించి

సవ్యమైన ప్రజాస్వామ్య సామ్యవాద
శిశూదయం జరగనీక
సంఘ విచ్ఛిన్నకర సాయుధ విప్లవ
గర్భస్రావానికి ఒడిగట్టే శిశు హంతకులు
రాద్ధాంత సిద్ధాంతాల దుర్మదాంధులు
యుక్తాయుక్త విచక్షణ విస్మరించి
యువ శక్తిని మళ్లించే యుగ పురుషులు
అన్నాదమ్ముల రక్త సిక్తులవతార పురుషులు
తూటాలతో గెలుపు బావుటాలెత్తాలని
హింసతోనే సమత కలహంస పుట్టాలని
దారుణ మానవ మారణ హోమం
హింసాద్వేష వివాదాల హాలాహలం
యావన్మానవ జాతికి ముసలం
పుట్టించే పరాన్న భుక్కులు
అందుకోలేరు
ఇక ముందు
నీరాజనాలు

—తాతిరాజు

ఆనంద దీపావళి

—యర్రమిల్లి చలపతిరావు ప్రత్యేకం

అరవై కోట్లమంది భారత ప్రజల హృదయాల్లో
అందాల రంగుల ఆనంద మతాబులు వెలిగిస్తూ
పాతికేళ్ళ యుగతన్నిద్రలోని భారత జనసహస్రాల్ని
బాణసంచాల ప్రేలుళ్లతో మేల్కొల్పుతూ,
సమాజంయొక్క నవజీవన ప్రాంగణంలో
అందాల రంగుల జ్వాలాతోరణాలు వెలిగిస్తూ,

అంధకారంలో అలమటిస్తూన్న కోట్లకొలది బలహీన
మానవుల
హృదయమందిరాల్లో. కోట్లకొలది శాంతిజ్యోతులను
వెలిగిస్తూ,
అభివృద్ధి నిరోధక, అనారోగ్యకారక, ప్రగతివ్యతిరేక
క్షుద్రక్రిమికీటకాలను
ఘాటెక్కిన గంధక ధూమంతో గహనాంతరాళాలకు
తరుముతూ,
వచ్చింది. ఈ యేడు దీపావళి !
భారత స్వాతంత్ర్య రజతోత్సవశోభావళి !

జువ్విచెట్టు కొమ్మమీద తొర్రలోకూర్చున్న
వెలుగుచూడలేని దివాంధాలు
టపాకాయల మోతలకు త్రుళ్ళిపడుతున్నాయి !
తమభయాన్నీ, అసహ్యాన్నీ, అయిష్టతనూ సూచిస్తూ
ఏవో వెర్రికూతలు కూస్తున్నాయి.
అనంత జనమహాసముద్ర ఘోషలో
ఆనంద జనకోలాహలవీచిలో
గుడ్లగూబల స్వగతం వినేదెవరు ?

మర్రిచెట్టు కొమ్మలమీద నిద్రిస్తూ ఆలోచించే
ఒంటిపుల్లిరాకాసిమూకలు, కాకాసురమూకలు, ఏకాక్షులు !
మరింత కంగారుతో మేల్కొని అల్లరిచేస్తూ
వెలుగువైపుచూడలేక, చీకటివైపు పరుగెడుతున్నాయి !
ఏదో ప్రమాదం ముంచుకొస్తున్నట్టుగా
పెద్ద అల్లరిచేస్తున్నాయి.

పుట్టలోని పాములూ, కలుగుల్లో దాగుకొన్న కాలసర్పాలూ
కొండచివర బండరాతిమీద రాబందులూ, గ్రద్దలూ,
అన్నీ అదిరిపడి, త్రుళ్ళిపడి ఆశ్చర్యంగా చూస్తున్నాయి
అసలుసంగతేమిటి చెప్మా ? అర్ధరాత్రి పట్టపగలైందని.

శతాబ్దాలు ముసిరిన చీకట్లు చెల్లాచెదరై
వేకువలేని నితాంత నిశ్శబ్దనీరవ నిశీధిలో,
జాతి జీవననిశీధిలో,
కోటి సూర్యప్రభలు విరజిమ్ముతూ
వెలుగుతున్నాయి జాతిహృదయంలో నేడు
వినూత్న దీపావళీ జ్యోతులు
వెల్లివిరుస్తున్నాయి జాతికళ్ళలో నేడు
వినూత్న శోభామయకాంతులు

అంధకాసురుణ్ణి దిశాంతరాలకు తరిమి
పాకిస్థాన్ నరకాసురుణ్ణి భయంకర యుద్ధంలో గీటడించి
అసమానతా పద్మవ్యూహాన్ని. అభినవ అభిమన్యునివలె
ఛేదించి
అవినీతి, స్వార్థాల విషవలయాన్ని. అన్నిరంగాల్లోనూ
ఛేదించడానికి

అస్త్రశస్త్రాలు సమకూర్చుకొని
దారిద్ర్య రాక్షసిని తరిమికొట్టడానికి
వేయిచేతులతో వివిధాయుధాలు చేపట్టి, విశ్వరూపం ధరించి
శూలపాణియై. ప్రజావాణియై, మహాకాళియై,
అన్నార్తులూ, వ్యథార్తులూ, క్షుధార్తులూ అయిన
అశేష బలహీన మానవవర్గాలకు అభయముద్రతో,
సింహాసనారూఢయై. శ్రీదేవియై, సర్వమూ తానే అయి
జాతి హృదయంలో వెలుగుతున్న విజయేందిర, రాజ్యేందిర !

ఈ దీపావళి, పర్వదినాన, ఇంటింటా తానే అయి.
పసిబిడ్డల ఆనందోత్సాహాలు తిలకిస్తున్నది !
ఆనందబాష్పాలు రాలుస్తూ, పులకిస్తున్నది !

ఈ దీపావళీ పర్వదినం ! జాతి ఉజ్వల భవిష్యత్తుకు
ప్రారంభ స్వర్ణదినం

ఈ వెల్లివిరిసే ఆనందోత్సాహాలు, జాతినవజీవన శుభోదయానికి
వసంతోత్సవాలు !

ఈ వినూత్న శోభామయకాంతులు, మనభావిపౌరుల జీవితాలలో
వెల్లివిరియనున్న. ఉజ్వల సుఖశాంతులు !

ఈ బాణసంచాల ప్రేలుళ్ళు నవయుగోదయావిర్భావానికి
చిహ్నమైన పెనుమ్రోతల ఫిరంగిగుళ్ళు !


ఈ అందాలరంగుల కాంతికిరణాలు, జాతిబంగారు భవిష్యత్‌కి
జ్వాలాతోరణాలు !

వెల్లివిరుస్తున్న ఈ మహాజనచైతన్యం
అద్రిగర్భోజ్వలద్బడబానలాంతర్గత అమృతకలశం !
కొల్లలై మిన్నుముట్టుతున్న ఈ ఆనందోత్సాహాలు !
అమృతభాండంకోసం క్షీరసాగరం మథించే
దేవాసురుల, హా, హా, కారాలు !

ఈ క్షీరసాగర మథనం
జాతి భవితవ్యాన్ని నిర్ణయిస్తున్న, ఒకవిచిత్ర కథనం
హాలాహలం పుట్టినా గుటుక్కున దిగమ్రింగగల
అపరగరళకంఠుడు నేటిమానవుడు
అమృత భాండం లభించినా, అందరకూ పంచియివ్వగల
అపర దానకర్ణుడు, నేటి, ఆధునిక మానవుడు




అజంతా శిల్ప ప్రతిబింబాలైన నిర్మల్ కళావస్తువులు



లేపాక్షి ఎంపో

తెలుగు సంస్కృతిని ప్రతిఫలిం

చేతివస్తువుల విభాగంలోని కొండపల్లి బొమ్మలు, తిరుపతి చందనం బొమ్మలు



న్యూ ఢి ల్లీ

ఆంధ్రప్రదేశ్

లే పా



యం



రంగు రంగుల గాజులు, గోడలకు వ్రేలాడదీసే చిత్రాలు


ంచే శిల్పకళా ప్రదర్శనశాల

లో ని

ఎంపోరియం


కి

రక రకాల డిజైన్లలో చీరెలు



తెలుగు సాహిత్యంలో గాంధీజీ

గుంటి పుండరీకాక్షయ్య



మహాత్ముని పేరు మనం స్ఫురణకు తెచ్చుకుంటే మనకు బుద్ధుడు, ఏసుక్రీస్తు తలంపుకు వస్తారు. భారతావని దాస్య శృంఖలాలలో క్రమగ్గే సమయంలో మహాత్ముని ఆగమనం నలుబది కోట్ల ప్రజా హృదయాలలో నూతన చైతన్యాన్ని, శక్తిని ఆవిర్భవింపజేసింది. అతడే భారతదేశము. భారతదేశమే అతడు. బాపూజీ ప్రత్యేక వ్యక్తిగాదు. నలుబది కోట్ల భారతీయుల రూపమే మహాత్మాగాంధీ. "అతిదొడ్డ మధుర ప్రకృతిగాని మానవవ్యక్తి గాదని" జార్జి బెర్నార్డ్‌షా సముచితమైన రీతిగా ప్రశంసించాడు. పరమఋషుల తేజస్సుతో, పసిపాపల బోసినవ్వుతో వెన్నపూస మనసుతో కన్నతల్లుల ప్రేమతో సత్యాహింసల శాంతిరూపంగా అవతరించిన బాపూజీ నలుబదికోట్ల ప్రజాహృదయాలలో ఎన్నెన్నో ఆశలను పూరించాడు; కర్తవ్యాన్ని బోధించాడు; కర్తవ్య పరాయణుల్ని చేశాడు

మహాత్ముని ఆగమనం తెలుగు సాహితీ జగత్తులో నూతన సంచలనం కలిగించింది. కవులలో దేశాభిమానం రేకెత్తింది. కవులు ప్రజలలో జాతీయాభిమానం రేకెత్తించే రచనలు ప్రారంభించారు. జాతీయ నాటక కవి శ్రీ దామరాజు పుండరీకాక్షుడు తను వ్రాసిన నాటకాలలో జాతీయాభిమానం మొలకెత్తటానికి మహాత్మా గాంధీని సముచితంగా శ్లాఘించాడు. మచ్చునకు వీరి నాటకాలలో కొన్ని

"కత్తులులేవు. ఖడ్గగద గాండివముల్ మొదలే హుళక్కి నో
రెత్తి ప్రచండ వాక్పటిమ నేనియు చాటడు, వైరిమీద దం
డెత్తగ సేనలేదు. బలహీనము కాయము. కోపతాపముల్
'బొత్తిగ సున్న అట్టి ఘనమూర్తి మనోబలశాలి గాంధి జే'
యెత్తి నమస్కరించి, స్మరియింతు స్వదేశ స్వరాజ్య సిద్ధికిన్''.

''శ్రీ గాంధి నామం మరువాం మరువాం
సిద్ధము జైలుకు వెరువాం వెరువాం
రామా రామా రామా కలియుగ రామా గాంధీ''

మహాత్మాగాంధీ చైతన్యమూర్తి. ఆయన నడిస్తే జాతి యావత్తూ ఆయన అడుగుజాడలలో నడిచింది. ఆయన పిలిస్తే దేశం దేశమే కదిలింది. ఆ భావావేశంలో బసవరాజు అప్పారావు గారు "గాంధీ మహాత్ముని చరణధ్వని విని గజగజ వణికిందీ జగత్తు కంపించిపోయిందీ" అని ఉప్పు సత్యాగ్రహానికి దండి తరలివెళ్ళిన గాంధీ మూర్తిని శాశ్వతంగా తమ గీతంలో నిలిపారు. అడివి బాపిరాజుగారు "హిమాలయోత్తుంగ శృంగం నీ బ్రతుకు ఉమాపతీ నృత్యరంగం" అని కీర్తించారు. ఆ మహాత్ముని అడుగుజాడలలో నడచిన గరిమెళ్ల సత్యనారాయణగారు "మా కొద్దీ తెల్ల దొరతనము" అని సాహసంతో బ్రిటీషువారిని ధిక్కరిస్తూ వ్రాశారంటే అది బాపూజీ ప్రభావమేనని చెప్పక తప్పదు.

తెనుగు లెంక తుమ్మల సీతారామమూర్తి చౌదరిగారు బాపూజీ 'ఆత్మకథ' వ్రాసి తెలుగు సాహితీ మాత కంఠసీమలో వాడని కుసుమమాలగా అలంకరించారు. తెలుగులో గాంధీజీ జీవితానికి కావ్య గౌరవం కల్గించిన యీయనను 'మహాత్ముని ఆస్థానకవి'గా ప్రశంసించటం సముచితమే. 'అమరజ్యోతి' అనే లఘుకృతిలో యితడు మహాత్ముని భువనైక శాంతిదూతగా, అభేద్య సత్యకవచునిగ అభివర్ణించిన తీరు మన హృదయాలను ఆకట్టుకుంటుంది.

"ఇతడహింసారణవ్రతదీక్షితుడభేద్య
సత్యకవచుండు భువనైక శాంతిదూత
యుగయుగమ్ములు కల్పముల్ ముగియుగాక
తరణియై మింట మెఱయు నీతని పతాక"

"యుగయుగమ్ముల భారతోర్వీ తపః పుంజ
మెసరేగి జగముల కిడిన పంట
తరతమ్ముల నుండి తరలని దాస్యమ్ము
కట్లు త్రెంచిన శాంతి కదన యోద్ధ
నరనరమ్మున జీవన జ్యోత్స్నగా నహిం
సను వహించిన యోగిసత్తముండు
పదపదమ్మున సత్యభాషా సనాతన
సౌరభమ్ములు చిమ్ము సాధుశీలు
డహరమ్మును విశ్వకల్యాణ లబ్ధి
కొఱకు నాత్మార్పణ మొనర్చుకొను తపస్వి"

గా సీతారామమూర్తి చౌదరిగారికి మహాత్ముడు గోచరించాడు.

కరుణశ్రీ జంధ్యాల పాపయ్య శాస్త్రిగారికి బాపూజీ పురుషోత్తమునిగ, 'యుగపురుషునిగ' గోచరించాడు. మహాత్ముని మహమ్మదు క్రీస్తు, బుద్ధదేవుని కోవలో పరిగణించి తమ అపార భక్తిని ప్రదర్శిస్తున్నారు.

"యుగపురుషుండవంచు పురుషోత్తమమూర్తి వటంచు మూర్తిమ
జ్జగ దనురాగ శాంతిమయ సాత్త్వికశక్తి వటంచు వేనవేల్
మొగముల ప్రస్తుతించెను ప్రమోదముతో జగమెల్ల నిన్ను ఏ
మగుదురు నీకు తొల్లిటి మహమ్మదు, క్రీస్తును, బుద్ధదేవుడున్?"

ఈనాడు కవులెందరో ధనిక, పేద తారతమ్యాలు లేని సమ సమాజం కోసం అర్రులు చాస్తున్నారు. దేశంలో ఎల్లరు సుఖపడాలని కాంక్షిస్తున్నారు. బాపూజీ నాడే భవిష్యత్తును దర్శించి చెప్పిన మాటలు ఆతని ప్రగతి దృక్పథానికి నిదర్శనాలు. "నేను కలలు కంటున్న స్వరాజ్యం నిజానికి బీదవాళ్ళ రాజ్యం. మహారాజులూ, ధనవంతులతోపాటు నిత్యజీవితావసర వస్తువుల వలన కలిగే సుఖాలు మీరుకూడా అనుభవించవలసిందే......ధనవంతుడు అనుభవించే సాధారణ జీవితసౌఖ్యాలు, సౌకర్యాలు అన్నీ మీకు తప్పనిసరిగా వుండాలి. ఈ సాధారణ జీవితసౌకర్యాలను సమకూర్చలేని స్వరాజ్యం స్వరాజ్యమేకాదు." జనావళికి శుభం పూయాలని 'మరో ప్రపంచం' కోసం తహతహ లాడిన శ్రీశ్రీ మహాత్ముని మహనీయతకు ముగ్ధుడై

"అతడు సామాన్యవ్యక్తి
అతడసామాన్య వ్యక్తి
తృణం కంటే తేలిక
మేరువు కంటే ధీరుడు
ఆగర్వ శ్రీమంతుడు
నిత్య దరిద్ర నారాయణుడు... ..
అతడిప్పుడు లేడు
అరదెప్పుడూ వున్నాడు."

అని నిండుమనసుతో గానం చేశాడు

తెలుగు మాగాణంలో 'జాతి రత్నాలు' పండిస్తూ తనదైన ప్రత్యేక పంట విలువల్ని నిలుపుకుంటున్న శ్రీ సి. నారాయణరెడ్డి 'బాపూచిత్తం ప్రపంచానికి దొరికిన విత్తం'గా భావించారు.

"హిమాద్రి ఎంత ఎత్తు? హేమాద్రి ఎవరిసొత్తు?
మహాత్మా నీ స్వరూపం
తుహినాద్రికి సంక్షిప్త రూపం
బాపూ నీ చిత్తం ప్రపంచానికి దొరికిన విత్తం"

ఆధునిక కవితా పయోధి దాశరథి మహాత్మునికి 'అక్షరాభిషేకం'లో అక్షరాభిషేకం చేశారు.

"ఆతని ప్రతి అడుగు గురుతు
ఆలయమై తలయెత్తును
అతని చేయి గొడుగు క్రింద
అఖిల జగము శయనించును
....
ప్రతి మానవ హృదయమ్మున
నొదిగిపోవ జాలు నతడు.
....

మహితాత్ముడు మరెవ్వరు? దాశరథికి గాంధీజీ క్షమామూర్తిగ, లోక బాంధవునిగ గోచరించాడు.

"అతడు బంగారమ్మనం దెట్టి పిలుపను
పరికించి యెఱుగని వైశ్యవరుడు
కత్తితో శత్రువు కడతేర్చ గలమన్న
చాదస్తములు లేని క్షత్రియుండు.
బ్రహ్మ విజ్ఞానంబు పదిమందికీ యను
వర్గీకరణ లేని బ్రాహ్మణుండు,
అణగారి పడియుండు టది నీతి యనుటను
కాలదన్నిన మేటి కార్మికుండు,
అంటరాని వారలమని అలమటించు
పంచముల హరిజనులని పాంచజన్య
మూది పలికిన హరిజనాభ్యుదయ వాది
గాంధి దేవుండు మన లోక బాంధవుండు."

మహాంధ్రోదయం . దాశరథి

బాపూజీ అకాలమరణము జాతి ఎదలో మానని గాయమైంది. ఒక మహోన్నత మానవతా మూర్తి యీ భారతావనికి దూరమవటంతో కవికుమారుల హృదయాలు అశ్రువులతో బాపూజీకి అంజలి ఘటించాయి. కవికోకిల శ్రీ జాషువా రచించిన 'బాపూజీ' ఖండకావ్యం యీ సందర్భంలో పేర్కొనదగింది. బాపూజీ జననంతో భారత దేశానికి సభ్యతాస్ఫూర్తి లభించినదట!

"పూర్వ పశ్చిమ గోళాలు మోకరించి
యే మహావ్యక్తి కొగి నమస్కృతులు సలిపె
నట్టి బాపూజి మనమధ్య బుట్టుకతన
సభ్యతాస్ఫూర్తి భరత వర్షమున నమరె"

అని బాపూజీ మరణంతో ఆవేదన చెందిన జాషువా ఆయన వ్యక్తిత్వాన్ని కొనియాడాడు.

బాపూజీ భారతజాతి రక్తంలో రక్తంగా అంతర్లీనమై పోయాడు. ఆయన స్మృతి మరపురానిది. ఇటీవలనే గాంధీ శతజయంత్యుత్సవ సందర్భంలో జాతి యావత్తూ ఆయనకు నివాళులర్పించింది. తెలుగు కవి కుమారులు మహాత్ముని సంస్మరిస్తూ పద్యాలు, గేయాలు, కవితలు ఎన్నెన్నో రచించి వాగ్దేవి మందిరానికి వింతశోభను చేకూర్చారు. 'మహాత్మా! మళ్లీ అవతరించు' అని కొందరు కవులు మహాత్మునికి స్వాగతం పలికితే' నానాటికి సంకుచితమై స్వార్థం గూడుకట్టుకుంటున్న ఈ లోకంలో మహాత్ముని ఆగమనం సత్ఫలితాల నివ్వదేమోనని మరికొందరు 'అవతరించకు మహాత్మా!' అని గాంధీని హెచ్చరిస్తూ రచనలు సాగించారు. ఏది ఏమైనా గాంధీజీ ప్రభావం తెలుగు సాహిత్యంపై చెరపరాని ముద్రవేసింది. తెలుగు సాహిత్యోద్యానవనంలో యీ నూతన కుసుమం సరికొత్త పరిమళాల్ని వెదజల్లింది. *

స్వాతంత్ర్యోద్యమము

బాలల చిత్ర కళా ప్రదర్శన

తెలుగు దేశంలో చిత్రకళా ప్రదర్శనకు వేలమంది జనంరావడం అబ్బురమే బహుశా ఈ ప్రదర్శనలోని బాలచిత్రకారులు తీసుకున్న వస్తువు అందరికీ సులభంగా తెలియడమే ప్రముఖకారణం కావచ్చు లేక, ముద్దుగా పిల్లలు వేసిన చిత్రాలను ముచ్చటగా చూడాలనేదే మరొక కారణం కావచ్చు ఏమైనా, మొత్తంమీద హైదరాబాద్‌లో చాలా ప్రసిద్ధిని ఈ "బాలల చిత్రకళా ప్రదర్శన" బాగా ఆకర్షించింది.

స్వాతంత్ర్యోద్యమానికి అద్దం పట్టిన ఈ చిత్రకళా ప్రదర్శనలో పసిమనస్సుల్లోని పండి భావాలకు రెక్కలు మొలిచాయి ప్రతి చిత్రం దాని ప్రత్యేకతను చిత్రకారుడి ప్రావీణ్యతను చాటి చెప్పేదే. అందరూ గొప్పగా చిత్రించాలని తహతహ లాడే వారే

అఖిలభారత స్థాయిలో కేంద్రీయ పాఠశాలల బాలలు వేసిన స్వాతంత్ర్యోద్యమ చిత్రాలు భారత స్వాతంత్ర్య రజతోత్సవాలను పురస్కరించుకొని ఆగస్టు 16వ తేదీ నుండి కళాభవన్‌లో గోల్కొండ కేంద్రీయ విద్యాలయం వారి ఆర్ట్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రదర్శించారు.

ఇందులో మొత్తం అఖిలభారత స్థాయిలో ఇరవైఆరు పాఠశాలల బాల చిత్రకారులు పాల్గొన్నారు దూర ప్రాంతాలైన కొచ్చిన్ మొదలుకొని ఫరీదాబాద్ లాంటి ప్రాంతాల నుండి కూడా బాల చిత్రకారులు పాల్గొనడం విశేషమేమరి. మొత్తం 172 చిత్రాలు పరిశీలనకు రాగా, అందులో 83 మాత్రం ప్రదర్శనయోగ్యంగా నిర్ణయించారు. ఇందులో పదహారు చిత్రాలకు బహుమతులు ప్రకటించారు. బాలలను మూడు తరగతులుగా విభజించి-ఒకటి. 6-9 సంవత్సరాలు. రెండు, 9-12 సంవత్సరాలు; మూడు, 12-16 సంవత్సరాలు-ప్రతి తరగతిలోనూ ప్రథమ, ద్వితీయ బహుమతులే కాక, మరో ఎనమండుగురికి ప్రత్యేక బహుమతులు కూడా ఇచ్చారు.

ఇవేకాక మొత్తం ప్రదర్శనలో అత్యుత్తమ బహుమతిని కూడా ప్రకటించారు. అది గోల్కొండ కేంద్రీయ విద్యాలయం విద్యార్థి మాస్టర్ ఈశ్వరీప్రసాద్ చిత్రించిన ''జలియన్ వాలా బాగ్ దురంతాలు'' అనే వర్ణచిత్రానికి లభించింది. ఈయనకు అరరూపంలో ఇచ్చే బహుమతేకాక, ఒక పతకాన్ని కూడా అందచేశారు. ఈ చిత్రంలో వెయ్యిమందికి పైగా భారతీయుల నిండు ప్రాణాల్ని పొట్టన పెట్టుకున్న బ్రిటిష్ ప్రభుత్వపు పిశాచనృత్యం వస్తువు. ఈ చిత్రంలో తెగిన వెయ్యి తలలు కన్పించకున్నా, అమాయకులైన, నిరాయుధులైన భారతీయుల్ని-స్త్రీలను, పురుషులను, బాలలను, వృద్ధులను- ఆ నాడు (1919 ఏప్రిల్ 13వ తేదీన) ఎత్తైన గోడలున్న, ఆ తోటలో-బయటికి పోవడానికీ, లోనికి రావడానికీ ఒకేఒక చాలా ఇరుకైన ద్వారంవున్న ఆ తోటలో-కాల్చి చంపిన భీభత్సాన్ని చిత్రకారుడు గొప్పగా ప్రతిబింబించాడు ఇందులో, ఈయన వాడిన వర్ణాలు-ఎరుపు, నలుపు, తెలుపు, పసుపు నీలం, నారింజ, ఆకుపచ్చ

కుమారి "ఊర్మిళా కుమారి (12-16సం॥) వేసిన "స్వాతంత్ర్య దిన సందేశం" అనే చిత్రానికి ప్రథమ బహుమతి వచ్చింది. ఇందులో, పతాకవందనానంతరం సందేశం వింటూ కూర్చున్న వందలాది ప్రజలను చూపిన తీరు బాగుంది. పూల కుండీలు ఉన్నా, కుర్చీల్లో ప్రముఖులు కూర్చున్నా, మధ్యమధ్య చెట్లను, వెనకగా పూరిండ్లను చిత్రించి చక్కని పల్లెటూరి వాతావరణాన్ని ధ్వనింప చేసిందీమె ఈమె బెంగుళూరు ఎ.సి.సి. కేంద్రీయ విద్యాలయం విద్యార్థిని

"వందన స్వీకారం" అనే చిత్రానికి కుమారి రాధిక (9-12 సం॥)కు ప్రథమ బహుమతి వచ్చింది. ఈమె కూడా బెంగుళూరు ఎ. సి. సి. కేంద్రీయ విద్యాలయం విద్యార్థిని. వెల్లివిరిన ఆనందానికి చిహ్నంగా, ఈ వేడుకల్లో వందనం చేసే భావిపౌరుల

టి. ఉదయవర్లు

హృదయాంబరాలను వ్యక్తం చేస్తూ, అంబరముఖంగా వేసిన గుడారాల చిత్రణలో ఇంద్రధనుస్సును స్ఫురింపచేశారు. పూల తోరణాలు కూడా వున్నాయి.

మరో ప్రథమ బహుమతి చిరంజీవి బి. పద్మారెడ్డి వేసిన "బాపు-బాలలు" అనే చిత్రానికి లభించింది. ఈ పాప బాపును గీసిన పద్ధతిబాగుంది. జెండాలను ఎగరవేస్తూ బాలల్ని బాపు చూస్తూరా చూపిన పద్ధతి బాగుంది. ఈమె రంగులను రమ్యంగా ఉపయోగించింది. తొమ్మిది సంవత్సరాల వయస్సుగల చి. పద్మారెడ్డి గోల్కొండ కేంద్రీయ విద్యాలయం విద్యార్థిని.

ద్వితీయ బహుమతి పొందిన వారిలో బొంబాయిలోని పవాయ్ కేంద్రీయ విద్యాలయం విద్యార్థి మాస్టర్ పి సుజిత్ (12-16 సం॥) కు తోడుగా గోల్కొండ కేంద్రీయ విద్యాలయం విద్యార్థులు మాస్టర్ కె. సురేశ్ (9-12 సం॥) మరో మాస్టర్ కె. సురేశ్ (6-9 సం॥) కూడా వున్నారు

మాస్టర్ పి. సుజిత్ వేసిన "తిరిగి పో, సైమన్" (Go Back Simon) అనేది ఒక అపురూప చిత్రం. ఆ నాడు (1927లో తొలిసారి సైమన్ కమిషన్ వచ్చినప్పటి ఊరేగింపులో) శ్రీ ప్రకాశం నాయకత్వాన, ఆయన వెంట నల్ల జెండాలతో నల్ల సముద్రంలాగా పొంగిపోతూ కదలివచ్చిన జనవాహిని ఈచిత్రంలో కన్పించకున్నా, "పో, తిరిగి పో సైమన్" అంటూ సముద్రముఖంగా చేతులూపుతూన్న వారి వెనక ఆ అపూర్వ దీక్ష ఉన్నంత ఉన్నతంగా వుందీచిత్రం. ఇందులో నీలం, నారింజ రంగుల మిశ్రమం చాలా బాగుంది.

ప్రత్యేక బహుమతులను పొందిన వారిలో జలంధర్ నుండి మాస్టర్ బలవీందర్ సింగ్, నాసిక్‌రోడ్ నుండి మాస్టర్ పి. జె. రాయ్, గోల్కొండ విద్యాలయం నుండి మాస్టర్ జ్యోతిప్రసాద్, మాస్టర్ ఆశిష్ ఘోష్ వున్నారు. వీరంతా 12-16 సంవత్సరాల వారు.

మాస్టర్ పి. జె. రాయ్ చిత్రంలో వలయక్రమంగా, మైదానంలో, పతాకాలతో గ్రామీణులు తరలిపోవడం చూస్తాం. ఇందులో కాంట్రాస్ట్ టెక్నిక్ బాగా కనిపిస్తుంది. ఎరుపు, నలుపు కలయికతో దూరాన్ని ద్యోతకం చేయడం గొప్పగుంది

మాస్టర్ ఆశిష్ ఘోష్ చిత్రించిన పోస్టర్ చిత్రం "ఊరేగింపు" ముచ్చటగావుంది.

మాస్టర్ జ్యోతిప్రసాద్ "ఎర్రకోటపై జెండా ఆవిష్కరణ"ను చిత్రించాడు. ఆవిష్కరిస్తున్న వ్యక్తి ఇందిరలా గోచరిస్తుంది. బాగా ఎరుపు వర్ణాన్ని వాడిన ఈ చిత్రం ప్రదర్శనలో ప్రేక్షకుల్ని బాగా పరిశీలింప చేస్తుంది.

9-12 సంవత్సరాల బాలల్లో ప్రత్యేక బహుమతులు పొందిన వారు గోల్కొండ విద్యాలయం విద్యార్థి మాస్టర్ సన్‌దీప్ హల్‌దార్, కొచ్చిన్ విద్యార్థి మాస్టర్ ఇందూ నారాయణన్. మాస్టర్ ఇందూ నారాయణన్ పతాకాలలో ముందు ఇద్దరినే చూపుతూ, వారి వెనకగా చెప్పలేనంతమంది ఉన్నట్లు భ్రాంతి గొల్పేటట్లుగా చిత్రించిన విధం బాగుంది

గోల్కొండ విద్యాలయం విద్యార్థులు కుమారి ఆశారావు, కుమారి నాగమణితోపాటు దేవరోడ్ విద్యార్థి మాస్టర్ విజయ కుమార్‌లు, 6-9 సంవత్సరాల వారిలో ప్రత్యేక బహుమతులు పొందారు

కుమారి ఆశారావు చిత్రించిన పల్లెటూరిలో "పతాకవందనం", మాస్టర్ విజయకుమార్ కూడా "పతాకవందనాన్నే" చిత్రించాడు పచ్చని వర్ణాలతో. కుమారి నాగమణి జండాలు పుచ్చుకొని ఆనందంతో అడుగులువేసే బాలల్ని చిత్రించింది.

ఈ ప్రదర్శనలో బహుమతి పొందకపోయినా, మొత్తం ప్రదర్శనలోనే గొప్పగావున్న చిత్రం "నవ భారతము" అనే మాస్టర్ అసద్ గీసిన చిత్రం. ఇది ప్రతీకవాద చిత్రం. వైజ్ఞానికంగానేకాక, వ్యావసాయికంగా మనం సాధిస్తున్న పురోభివృద్ధిని, సాంఘిక సమానత్వాన్ని, శాంతి ప్రియత్వాన్ని ద్యోతకం చేసే కిసాను, జవాను, తెల్లపావురము అదిగాగల మరికొన్ని సంకేతాల కూర్పుతో అమోఘమైన శైలీ విన్యాసాన్ని ప్రదర్శించాడీ విద్యార్థి. ఈయన మంగుళూరు కేంద్రీయ విద్యాలయంవాడు

"హరిజనోద్ధరణ" అనే మాస్టర్ శ్రీనివాసరావు వేసిన చిత్రం కూడా విశిష్టమైనదే. ఇది రాజస్థాన్ మినియేచర్ పద్ధతిలో వుంది. ఇందులో హరిజనులతో ముచ్చటిస్తున్న గాంధీ, ఆయన అడుగుల్లో అడుగులు వేస్తున్నట్లుగా నెహ్రూ చిత్రించబడ్డారు. బ్యాగ్రౌండ్ బాగుంది.

మాస్టర్ రాజేష్ కుమార్ వేసిన "పతాకం" చిత్రంలో మూడు రంగుల్లో మన రక్షణ దళాలను సైనిక, వైమానిక, నౌకా దళాలను—చిత్రించిన తీరు చక్కగుంది, మధ్యలో ధర్మ చక్రం వుంది.

ఇంకా ఈ ప్రదర్శనలోని చిత్రాల్లో కుమారి సుధారెడ్డి వేసిన చిత్రం భావనలో గొప్పగుంది. గుజరాత్‌కి చెందిన మాస్టర్ చేతన్ వేసిన బార్డర్ చిత్రం "సైనికుల విన్యాసం" చక్కనిది, బెంగుళూరుకు చెందిన మాస్టర్ శ్యామాచలం, మద్రాసుకు చెందిన ప్రేమ్‌రాజ్ కూడా గొప్పగానే చిత్రించారు.

బాలల భావికి బంగారు బాటలు ఈ చిత్రాలు. ఇందులో పాల్గొన్న బాలలెవ్వరూ బహుశః బాపూజీని చూచివుండరు కాని, వారు బాపూజీని చిత్రించినతీరు ఎంతో రమ్యంగా, రమణీయంగా, సహజంగా వుంది. రంగుల కూర్పులో గొప్ప నైపుణ్యాన్ని ప్రదర్శించారు వీరు.

చిత్రించబడిన భావాలు చాలా సుకుమారమైనవి. ఇవి సౌందర్యంగా రూపొందించుటకు బాలలు చేసిన కృషి మెచ్చుకోదగింది, ప్రోత్సహించదగింది కూడా.

ఇందులోవన్నీ నీటిరంగుల చిత్రాలు. కళాభవన్‌లో ఈ ప్రదర్శనకు ముఖ్య అతిథిగా వచ్చిన బ్రిగేడియర్ శ్రీ ఎం. కె. బాలచంద్రన్ ప్రారంభోత్సవం చేశారు.

ఈ బాలల సృజనాత్మక చిత్రకళా ప్రదర్శనకు న్యాయ నిర్ణేతలుగా ప్రఖ్యాత చిత్రకారులు, శ్రీ పి. టి. రెడ్డి, శ్రీ మధుసూదనరావు, శ్రీ గౌరీశంకర్‌లు వున్నారు. శ్రీ బి. ఎ. రెడ్డి కన్వీనర్.

స్వాతంత్ర్య సముపార్జనకు ముందు ఘట్టాల్ని ద్యోతకం చేసే చిత్రాలు కాని, స్వాతంత్ర్యానంతరం ఆనందోత్సవంలోగాని, అభివృద్ధి కార్యక్రమాల్లో నిమగ్నమైన భారత జాతిని ప్రతిబింబించే చిత్రాలను రచించవలసిందిగా మొదటే గోల్కొండ కేంద్రీయ విద్యాలయం స్ఫూర్తినిచ్చింది. ఫలితంగా అపురూపమైన అనేక చిత్రాలు వచ్చాయి. ఇందులో ఆనందోత్సవ చిత్రాల సంఖ్య ఎక్కువ.

గోల్కొండ కేంద్రీయ విద్యాలయం తమ విద్యార్థుల్లో చిత్రకళాభివృద్ధిని తీసుకురావాలనే మహోన్నత లక్ష్యంతో మొదటినుండీ కృషి చేస్తూనే వుంది. అయితే, ఈ విద్యాలయం లాంఛనంగా 1967 లో ఆర్ట్ క్లబ్‌ని ప్రారంభించి తన కార్యక్రమాలను ఉధృతం చేసింది.

ఫలితం నేడు దేశంలో ఎక్కడ నిర్వహిస్తున్న బాలల చిత్రకళా పోటీల్లోనైనా, విధిగా కనీసం గోల్కొండ విద్యాలయం విద్యార్థి ఒక్కొరికైనా బహుమతి రావడమే. ఈ ఐదు సంవత్సరాల కాలంలోనే నాలుగు అంతర్జాతీయ బహుమతులను జపాను నుండి పొందడమే కాక, మెచ్చుకోదగ్గ మొత్తంలో బహుమతులను

(తరువాయి 43వ పుటలో)

నాకిప్పుడు 25 ఏండ్లు

క్రోవి రామారావు

నేను 1947 ఆగస్టు 14-15 అర్ధరాత్రి ప్రపంచమంతా నిద్రిస్తున్న సమయంలో జన్మించాను. అంతవరకు 250 ఏండ్లు భారత రాజకీయ రంగంపై ఆధిపత్యం వహించిన పరాయివారి పాలనలో వున్నాను. బ్రిటిష్‌వారు భారత తీరాలను ఒదిలివెళ్లారు. భారత దేశం స్వతంత్రమైంది. నేను స్వతంత్రంగా జన్మించాను. అనేకమంది మహనీయుల ఫలితంగా నేను విముక్తి చెందాను. నాకు గొప్ప పూర్వ సంస్కృతి ఉన్నది. జీవితంలోని అనేక రంగాలకు నేను ఎంతో సేవచేశాను. గతంలో గొప్ప చరిత్ర వున్నా, ఆగస్టు 14-15 అర్ధరాత్రి నేను జన్మించినప్పుడు, నాకు ఆత్మలేని జీవితం మాత్రమే మిగిలింది. పరాయివారు నా ఆత్మను పిండి పిప్పి చేశారు. అందువల్ల నేను జన్మించిన రోజున నా చుట్టూ పర్ర భూములు, కటిక దరిద్రం, నీటికోసం తపిస్తున్న భూములు. బానిసత్వంలో మునిగివున్న ప్రజలూ వున్నారు. ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ దేశ ప్రజలను మేల్కొలిపి, నేను భారతమాతగా జన్మించానని చాటారు. అంతవరకు ప్రజలు బొంగురుపోయిన గొంతుకలతో భారత్ మాతాకీ జై అని నినాదాలిస్తే చాలు ప్రజలకు జైలు ప్రాప్తించేది.

ప్రజాస్వామ్యానికి, సెక్యులరిజంకు, సోషలిజంకు అంకితమైన గడ్డమీద భారత్ మాత, భారత్‌గా నేను జన్మించాను. భారత్ సాధు పుంగవులకు, తత్వవేత్తలకు, మహాపండితులకు, పటిష్ఠమైన రైతులకు ఆశ్రయం. బానిసత్వం నుంచి నన్ను తొలగించి ప్రజలు దేశభక్తులని నిరూపించుకొన్నారు.

దేశ విభజన జరిగి, భారత్‌కు సంపూర్ణ స్వాతంత్ర్యం ప్రకటింపబడిన తరుణంలో పండిత నెహ్రూ ప్రజల మొదటి సేవకుడనిపించుకొన్నారు. అర్ధరాత్రి 12 గంటలప్పుడు స్వేచ్ఛ పొందడం గొప్ప విశేషం. ప్రజలంతా ప్రజాస్వామ్యం, సెక్యులరిజం సోషలిజంకు దీక్ష పూనాలి.

నేను అనేక రకాలుగా, అనేక భాషలు, అనేక సంస్కృతులలో పెరిగాను. బ్రిటిష్‌రోజుల్లో సంస్థానాలుగా పెరిగాను. 560 సంస్థానాలను భారత్‌లో విలీనం చేయడం ఒక పెద్ద సమస్య అయింది. ఉక్కుమనిషిగా ప్రసిద్ధిచెందిన సర్దార్ వల్లభాయ్ మాత్రమే దీనికి తక్షణ పరిష్కారం కనుగొనగలిగారు. ఒక్క ఏడాదిలో ఇవన్నీ 16 రాష్ట్రాలలో చేరిపోయాయి.

నెహ్రూ ఈ దేశ నిర్మాత. అనేక సంస్థానాలుగా చెదిరిపోయిన దేశాన్ని యూనియన్‌లో చేర్చడానికి పటేల్ ముఖ్యుడు. ప్రథమ ప్రధాని ఈ దేశానికి 17 ఏండ్లు నాయకత్వం వహించి నడిపించాడు. భారత్ ఒక దేశంగా, ఒక జాతిగా రూపొందింది. నెహ్రూ, పటేల్‌లు చరిత్ర సృష్టించారు. ఈ దేశంలో జన్మించిన ఈ మహానాయకులిద్దరు, దేశంలో సంచరించి, ప్రజలను కదిలించారు, ప్రజలను సమీకరించారు.

బాపూజీ నాకు స్వాతంత్ర్యం తెచ్చి మీకు ఇచ్చారు. బాపు నాకు సత్యం అహింస అనే పవిత్ర సూత్రాలను బోధించారు.

ఖద్దరు ధరించి, సన్నగావున్న గాంధీజీ నన్ను విముక్తి చెందించడానికి ఎలా పనిచేశారనే విషయం తెల్సుకొంటేనే ఒళ్లు గగుర్పొడుస్తుంది. దేవుని వంటి గాంధీజీ ఒక వ్యక్తి పిస్తోలుకు గురైనాడు. 1943 జనవరి 30వ తేదీన ప్రార్థనకు వెడుతుండగా పిస్తోలు గుండుకు బలై ఆయన స్వర్గస్థుడైనాడు.

నేను ఒంటరినై పోయాను. నెహ్రూ కూడా అలాగే ఒంటరి అయిపోయారు. లక్షలు కోట్లాది ప్రజలు అలాగే భావించారు. కాని నేను హిమాలయం మాదిరిగా పెరగవలసి వున్నది. వ్యవసాయ రంగంలో యంత్రాలు ప్రవేశపెట్టబడ్డాయి. పరిశ్రమలు పెరిగాయి. నేను పెరిగాను. ఇంకా పెరుగుతున్నాను భారత దేశం ఒకనాడు ప్రపంచంలోని పురోగామి దేశాలలో అగ్రస్థానం వహించగలదన్న విశ్వాసం నాకున్నది. రాజకీయంగా గొప్ప దేశభక్తులైనవారి త్యాగాలవల్ల నేను జన్మించాను.

రాజ్యాంగాన్ని రూపొందించేందుకు రాజ్యాంగ పరిషత్తు ఏర్పడింది. డాక్టర్ అంబేద్కర్, డాక్టర్ రాజేంద్రప్రసాద్ ఈ రాజ్యాంగ పరిషత్తు అధ్యక్షుడుగా వున్న సమయంలో చేసిన సేవ అపారమైనది.

1950 జనవరి 26 న మనకొక రాజ్యాంగం ఏర్పడింది

దేశంలో ఒకరకపు నైరాశ్యభావం ఏర్పడింది. తమకున్న దానితో తృప్తిపడే భావం ఏర్పడింది. ప్రజలలో మరింత ఉన్నతి కోసం కృషిచేయాలన్న సంకల్పం కల్పించడం బ్రహ్మ ప్రళయమైనది. నెహ్రూ నాయకత్వాన నా ప్రజలు పరాయి దేశస్థులపై కాక, దారిద్ర్యం, అమాయకత్వం, వ్యాధులపై యుద్ధానికి సిద్ధపడ్డారు.

కమ్యూనిటీ ప్రాజెక్టువల్ల ప్రజలలో క్రొత్త ఆశలు రేకెత్తాయి. 1952 అక్టోబరులో 25 న ఈ ప్రాజెక్టులు ప్రారంభమై క్రమేణ గ్రామ జీవితంలో పెనవేసికొని పోయాయి.

ఇంతవరకు ప్రజలు 5 సార్లు సార్వత్రిక ఎన్నికలలో పాల్గొన్నారు. ప్రతివాద ప్రజాస్వామ్యానికి అగ్నిపరీక్ష ఎదురైంది.

ఇంక్విలాబ్ దశ నేను స్వతంత్రమైన రోజున పూర్తయింది. వెంటనే రెండవదశ ప్రారంభమైంది. మన పంచవర్ష ప్రణాళికల అమలులో ప్రజలు సైనికులవలె పనిచేశారు.

నా సరిహద్దులు నా ఆనకట్టలు అన్నీ వివాదగ్రస్తమైనవి. ఏదో ఒక దేశంతో వివాదం వస్తుండేది. అయినా నాకు విజయం కలిగింది.

నెహ్రూ 17 ఏండ్ల నాయకత్వం జయప్రదమైనది. ప్రపంచంలో శాంతికి అయన బీజాలు నాటారు. పంచశీల-సహజీవనం పంచే సూత్రాలు మంత్రంవలె పనిచేశాయి.

నెహ్రూ సేవలు అవసరమైన తరుణంలో ఆయన మరణం సంభవించడం అనేకపాట్లు తెచ్చిపెట్టింది. లాల్‌బహదూర్ శాస్త్రి రంగంమీదికి వచ్చారు 7 నెలలు మాత్రమే ఆయన రంగంమీద నిలిచారు. తాష్కెంటులో ఆయనను మృత్యువు కబళించింది.

నాకిప్పుడు 25 ఏండ్లు. అనేక విజయాలు సాధించాను. అనేక ప్రాజెక్టులు సాధించాను. అనేక నదీలోయ ప్రాజెక్టులు సాధించాను.

భారతదేశం గొప్పది. ఔన్నత్యం నా సంప్రదాయం తెలిసో తెలియకో తరతరాలుగా నాకు ఆ ఔన్నత్యం వున్నది. నేను గొప్పతనంలో పుట్టాను, గొప్పగానే పెరుగుతాను. ప్రజాస్వామ్య జ్యోతిని శాశ్వతంగా వెలుగుతూ వుండేట్లు చేస్తాను.

మానవ విలువలైన ప్రజాస్వామ్యం, సెక్యులరిజం, సోషలిజం లక్ష్యాలను నిలబెట్టడం నా సూత్రాలని మీకు తెలుసు. ఈ కారణంతోనే, ఇటీవల పాకిస్తాన్‌తో జరిగిన యుద్ధంలో నేను బంగ్లాదేశ్ ఏర్పాటును బలపరిచాను.

1972 ఆగస్టు 15 వ తేదీన నా రజతోత్సవం జరిగింది. అది కేవలం ఒక నినాదానికి పునరంకితమయ్యే సందర్భంకాదు. గరీబి హటావ్‌ను సాధించాలనే దీక్ష పూనవలసిన రోజు. ఇది ఒక చారిత్రక ఘట్టం. నేను 25 వ మైలు దాటాను. ఇంకా చాలా దూరం పోవాలి. కాలం, దూరం వయసుతో నాకు నిమిత్తంలేదు ఎన్ని అడ్డంకులు ఎదురైనా, సకాలంలో చర్య తీసికొని వాటిని అధిగమిస్తాను.

దారిద్ర్యం, నిరక్షరాస్యత, వ్యాధులబాధ నుండి ప్రజలను విముక్తి చేయడం కోసం కృషిచేయాలని నేను విజ్ఞప్తి చేస్తున్నాను.

బాలల చిత్రకళా ప్రదర్శన

(41వ పేజీ తరువాయి)

శంకర్స్ ఇంటర్ నేషనల్ చైల్డ్ ఆర్ట్ కాంపిటీషన్‌లోనూ పొందారు మనరాష్ట్రంలో జరిగే ప్రతి చిత్రకళా పోటీలో ఈ విద్యాలయం బాల చిత్రకారులకు ఒక ప్రత్యేక స్థానం ఉంది. ఒక ప్రగతి మార్గంవుంది. ఈ కృషికి విద్యాలయం ప్రిన్సిపాల్ శ్రీ జె.కె. గంగాల్ పాత్రనేకాక, చిత్రకళోపాధ్యాయుడు శ్రీ బి.ఏ. రెడ్డి సేవకూడా గర్వకారణమే.

బాల చిత్రకారుల్లో వెల్లి విరుస్తున్న చిత్రకళాభిరుచిని గమనించి, ఈ విద్యాలయం కేవలం బాలలకు చిత్రకళలో నైపుణ్యం కోసం ప్రతి వేసవిలోనూ ప్రత్యేక తరగతులను ఏర్పాటు చేస్తూంది. ఇందులో జంటనగరాల్లోని ప్రముఖ చిత్రకారులను పిలిపించి, విద్యార్థులకు చక్కని సలహాలను మిక్కిలి ఓపికతో — వారి హృదయ పటంలో హత్తుకునేలాగా బోధింపటకు దోహదం చేస్తుంది.

అఖిలభారత స్థాయిలో కేంద్రీయ పాఠశాలల బాల చిత్రకారులను ఒకే వేదిక పైకి తీసుకువచ్చి వారి నవ్యభావాలకు ఒక చక్కని రూపునివ్వడానికీ, వారి వర్ణ ప్రయత్నానికి ఒక గొప్ప బాణీ కూర్చడానికీ ఎంత అవకాశం ఇచ్చారో, అంత ఆదరం చూపారు. నిజంగా విజయవంతమైన ఈ సృజనాత్మక ప్రయత్నాన్ని ప్రతిసంవత్సరం కూడా కొనసాగించుటకు నిశ్చయించుకున్న ఈ విద్యాలయ నిర్ణయం ముదావహమైనది అభినందనీయమైనది.

వందేమాతరం

ముదిగొండ వీరభద్రమూర్తి

హైదరాబాదు ఖండము

పినాకపాణి బలవంతరావు ఫాడ్కేతో చెప్పిన కథ

ఉన్న దంతయు నిటనుండి యున్నది హైద
రాబాద శూరుల యమరగాథ
పట్నమందున గాక ప్రాంతమంతయు విర
బూచినట్టి కడిమిపూల గాథ
యితరస్థలమ్ములం దెసగిన దెల్ల నొ
కెత్తు నిది యొక యెత్తు హీరగాథ
ఘనములై జనములు గర్జించినట్టి గా
థ, యిల దిగిన యింద్రధనువుగాథ

మింట మెఱుపులు బలె మారు నొంట మెఱుపు
లొంటరమున నేతల పిడికింటి యొఱపు
లింట నింట వీరల వాసి నెరుగు నలపు
లాడలు గరుపొడిపించిన గడుసుగాథ.

దీనిని జక్కగ జెప్పన్
బూనుట యొక దొడ్డకావ్యమును వ్రాయుటయే
యేను కధించెద టూకీ
గా నా నేర్చిన కొలంది కతిపయ చరితల్.

సాలార్జంగు ప్రధాని తొట్టతొలి రాజ్యంబేలువా 'డప్పులు
ద్దౌలా' వారిది హూణపాలనరథోద్యచ్చక్రసంరక్షణం
బాలిమ్మాంగ్లుల నెందునేని యనలమ్మైక్రమ్మెనో యెప్పుడున్
దోలున్ దిత్తుల నీరు నింపికొని సిద్ధుల్ వీరు చల్లార్పగా.

ఆకులషు లు వాహినులు ని
హాకాగ్రాహామకరనికరావృతి నిం
దేకాదశ కేంద్రములు న
నేక సహస్రాంగ్ల వాహినీ సంకులముల్

షోరాపురి పతి పరహ్యా
న్నారచము 'వేంకటప్పనాయకు' డొకడే
పోరాడె స్వతంత్రతకై
సారబలముతోడ ప్రజల సాయముదోడన్.

అది పురి కేంద్ర మై తనర నందు విరాజిలు నైదువేల తె
ల్ల దళము పంచవింశతిశరత్తుల నాయకు డందు గొందఱన్
జదిపియు మించి రాగ విధి సాలరుజంగకు భాగ్యపత్తనీ
సదనమునందు జిక్కి యనుశాసితు డయ్యెను బందెకానకున్.

వినుచు శిక్షను దన్ను దా ద్రెల్చికొనియె
నాయకుడు సుంతతోడ నంతట నట నట
వలు లయి పటచె రోహిలా లరబు లొప్ప
నులు కొల కొల మనెడి వాని బలగ మెల్ల

త్వరపడినాడు నాయకుడు ఓద్వీధి వ్రాఇట వోస మెట్టులో
గల కలి ఖైదనన్ మసలి కాలమువెంట బరాక్రమించి మా
ర్తుర బరిమార్పగావలె యథోచితరీతి న టన్న శ్రోతతో
నెఱుగవాకో! మనోబలవిహీనుల దేహబలాఢ్యులందునున్.

అనుచు వెండియు నిటుల వాకొనియె పక్క
షోరపూర్ణడిపింట నుంచుకొని కన్న
డు లటునుండి మరాటివార లిటునుండి
చెలగి యెదిరి నొత్తెడి పూన్కి కలసి రార.

కలసిరార యొక్కుమ్మడి గలహమునకు
నావురావు రిస్సించియు నరిచయమ్ము
నొక్కడే దుర్గమును బట్టి యొక్కడంగె
'భీమరావు దేశాయి' నా బిరుసు జెట్టి.

ఏ: మతిత్వముస్ గలుగ నేమి ! జనమ్ము ఫలప్రదానసు
శ్రీ:ము గాగ వాడుకొను చేవలు లేనప్పు డయ్యె దుండియున్
రేకునికే గదోయి ! కవిలెన్ గల వెన్నియొ వేలు మాడుకోన్
రూకయు రాద యక్కలకు రోయి యదీ యిది యొక్క టేసుమీ !

చెఱుపు త్రవ్వక మని చెప్పి 'పర్గుండి' జే
డు నితండు కూర్చిన జనము కలదు
తత్పుష్టికై ప్రభుత్వపుగోశముల నూళ్ల
బడి దోచికొనిన పెన్నొడమి కలదు.
నూర్లమందిగ జమీందార్లు జాగీర్దార్లు
కలసి పోరుద మన్న కట్టు గలదు
చిటికెలోపల గ్రోసు చెంగలించు హుమాయి
గుంపు నాయుధ ల సొంపు కలదు

నిట్టి వెల్ల నేమయ్యెనో! యిపుడును మరొ
కొండు నిట్టిడు 'కొప్పలం' కోట బట్టి
కొనియు నంచె ప్రుగ్గి రయో ! యఘోర షూర
శాస్త్ర మయి పుట్టుకొన నసంఖ్యాంగ్ల సేన.

ఆ నిర్గుండపురపతియు
దా నెత్తురు ప్రొద్దువలకు దయము మొదలవ
ర్జ్యానీకమ్మున నొక్కం
డే నిలచి పెనంగె నయ్యె ! యేమయినాడో!

ఇసుక బస్తాలు పెసిడెంటు నింటి గోడ
కాన్చినవి యాన్చినట్లె భాగ్యపురి నుండె
నే ఫిరంగి యే నిమసాన నెవరు తెచ్చు
నో ! యటంచు, వాకిలి దాటి కొకరు పలదు

ఒక్కటి కాదు వాకిళులొక్కొక్కని కొక్కటి గా బడాళ్ళనల్
దిక్కులనుండి లోని కరుదెంచి మహాసభ సేయ గావలెన్
జెక్కులు దేశభక్తులకు మిక్కిలి ముఖ్యము సౌధ మిట్టి స
మ్యక్కిలితమ్ము పట్టణముమధ్య న టంచు నొకండు గర్జిలెన్.

ఏడు రెసిడెన్సినిన్ గొట్టలేడొ వాడు
నన్ను కొట్టజాలు యోధినల్లె నాకు
దూలువలయు నా కాలి క్రిందుగ నతం డ
టంచు నొకఁడు సంభాషించు నచ్చటచట.

సోనాజీప డితు డత
డే నడచెన్ భాగ్యనగర మెడసి నిజాంప
ర్మానాన్ దన జాగీరున,
కైన నతని మతికి లక్ష్య మా రెసిడెన్సీ.

ఎ దఱకో నేతల కెద
విందుగ 'బంతుప్రధానపీష్వాబహదూర్
ధోండోబాజీరా' విట
కందించెను లేకలన్ సహాయులద్వారా.

ఆ నానాసాహే బన
ప్రాణమ్ము 'గులాముఖాన్‌సఫదరుద్దౌలా
సోనాజీరావ్‌రంభా'
ద్యానేకుల కతని యాజ్ఞ నలరులు నగ్నుల్.

ఒక కులకర్ణి శ్రౌతి కల దోయి! పట్టునవ్ వా
ని కుడుము పోటి వచ్చియును నెగ్గ దూపిరిన్ గొం
తిక భరతోర్వికై ముడుపుగట్టె నాతడా ధై
ర్యకవచధారినామ మురు రంగరావుపాగే.

ఎంత కైన నధికారిని నే న టంచు
దెలుపు గాని భావమును బండె విడ లేదు
వాని వదనము తెల్లని వన్ని పాలు
నల్లనివి నీళు లనుకొను నతని మనము.

మనసున దాగి వెల్వడవి మానవ దానవ తత్వ మొండు త
క్క నిఖిలసృష్టిలోని యపకారవిభాగము చేయనల్లె చే
సిన యవమానమున్ దెలియ జిత్తవికారము నిల్వయుండ దా
తనికి దపస్థితిన్ విరియు దన్మతి మల్లియ వోలె మిత్రమా!

బ్రతుకన్‌జాలడ హాస్యదైన్యమున నెవ్వ స్నవ్వుతో మోయు సం
తతమున్ మన్నన నెక్కి సాగు నది మేనా గాగ దేశస్వతం
త్రత కై రూక శతమ్ముగా గయికొనున్ బట్టింపు వచ్చెన్ శత
క్రతువున్ బట్టుక తిట్టు నా కరణ మ్మగ్రశ్రేణి కాత్మీయుడున్.

సోనాజీ యుత రమును
నానాజీకంద జేయ నడచెను పాగే
కానసమున ద్విగుణ శ్రీ
కాననమున దనదు పొలమునం దెటు లిటులన్

తిన్నాడో తినలేదో
యెన్నొన్న రేలుం బవల్లు నెప్పుడుతోడన్
దన్నున్ జెప్పికొనక నడ
చె న్నడచె నతండ న్యాసీమాధ్వములన్.

ఏ మెఱుంగని యల్లె యెనగి గోతుల దీయు
మనసుల బో లూబులను వృథించి
పొడిచి పొడిచి చూచు బుద్ధుల కాకృతి
దిదు ముండ పౌదల హద్దు తెలిసి
దరిజేరువాని నంత్రము సేయు గండశి
లల వ టి కొండచిల్వలకు దొలగి
తన లోహితోష్ణిషము ను మానమని యెంచి
తలదన్నవచ్చు గ్రద్దల నదల్చి

తనదు నుయ్యమవాసన లగిలె నేమొ!
తలగి చను వన్యమృగముల దలచి తలచి
దాటి యున్మ తినదుల నతండు వెదకి
కొనుచు నానసాహేబున్న కొలువు సేరె.

చేరి చేరెడు కనుల కెంగేలవాని
సారవాణి వ్యూహమ్ముల సర్వసైన్య
నాథుతోడ జర్చించెడు నానసాహె
బును నమించి యా పాగె లేఖ విడి వేచె.

యావద్దేశము చూడ పుంచతలమం దాసీనగాన్ స్వేచ్ఛకున్
దైవ మ్మిచ్చిన నిచ్చెనై పొలుచు నానాసాహెబున్ జేతి ని
ద్దా వా లద్దముగా నొసంట తిలకాధానమ్ము సేయంగ బా
గే వీక్షించుచు విస్మరించె గమనక్లప్తాధికాయసమున్.


కూరిమి నానసాహెబు సఖుల్ సుఖులే; యని తచ్ఛుభజ్ఞు డై
భారత మాతృశృంఖలలపై బడు వ్రేటుల జెప్పి మాటలన్
బేరను బేర నెందలనొ పేర్కొని లేఖలు వ్రాయ జేసి ద
స్తూరికి గ్రింద దస్కతును తోపుసిరానొనరించి యందిడెన్.

హే! పాగేకులకర్ణపూర! కులకర్ణీ! రంగరాయాగ్రణీ!
నీ ప్రాంతమ్మున దండు గూర్చికొని దండింపన్‌గదే! మా ర్తు నీ
నా పేర్కొన్న మదాప్తరాజికిని సోనాజీకినిన్ జెప్పు మి
ట్లే పోగా నని వీనిచే నతడు కీలింపించె గెందామరన్.

ఆ మ్మహాపురుషుండు త న్నాదరించి
నొడివిన తడవు పుట్టుకతొడవు గాగ
సెలవు గొని వాని యిడిన జాబులను దాచు
కొని వెడలె బాగె స్వస్థలమ్మునకు జేర

పెద్ద విసరి క్రోతులను కవ్వించి తద్ర
ద ప్రదర్శనమున జోడు తాను నగుచు
నిరువదేడులవా డయ్యె నిల్లుచేరు
నపుడు నలుపదియేండ్ల ప్రాయంపువాడు.

(తరువాత 56వ పుట చూడుడు)



10

జైత్ర యాత్ర

వేమారెడ్డి ఆనెగొంది తన సేనలతో వస్తూనే సోమదేవ రాజు తన జైత్ర యాత్రను ప్రారంభించాడు. ఆ యాత్రను ప్రారంభించకముందే అతడు తన సోదరునితో దండయాత్ర వివరాల నన్నిటినీ చర్చించి ఒక నిర్ణయానికి వచ్చాడు.

వేమారెడ్డి వస్తూనే తానతనితో కలిసి ముసలిమడుగు, సాతానికోట, కందనవోలు మొదలగు దుర్గాలను ఆక్రమించుకోవాలని సోమదేవ రాజు నిర్ణయించుకొన్నాడు. అన్నమదేవుడు ఆనెగొందిలోనే వుండి, కంపలి సేనలు వచ్చేటట్లయితే వాటి నెదిరించాలని గూడ నిర్ణయించాడు.

అదేవిధంగా వేమారెడ్డి వస్తూనే సోమదేవరాజు అతనితో కలిసి దండయాత్ర ప్రారంభించాడు. అన్నమదేవుడానెగొందిలోనే వుండి కంపలి సేనలు వారిపై బడకుండా చూస్తానన్నాడు. అవసరమైతే ద్వార సముద్రంనుండి సాయాన్ని తెచ్చుకొంటానన్నాడు.

వేమారెడ్డి తన సైన్యంతో వచ్చినప్పుడు సోమదేవ రాజు అన్నమదేవుడు అతనికి ఘనస్వాగత మిచ్చారు. ఆ సైన్యానికి అన్ని సౌకర్యాలను ఏర్పాటు గావించారు. వేమారెడ్డికి, ఆ సైన్యానికి ఆనెగొందిగాని, ఆ ప్రాంతంగాని కొత్తగాదన్నట్లుగా చేశారు.

వేమారెడ్డిని చూస్తూనే అన్నమదేవునికి కాపయ్య గమనం వచ్చాడు. అతని మాటలు జ్ఞప్తికివచ్చాయి. కాపయ్యనాయకుడు తనతో ప్రయాణం గావించినప్పు డతడు ఏన్నోసార్లు వేమారెడ్డిని గూర్చి చెప్పివున్నాడు. అతణ్ణిగూర్చి ఎంతో ప్రశంసించివున్నాడు. ఆ నాయకుడు చెప్పిన మాటలన్నీ అక్షరాలా నిజంగావున్నాయి.

వేమారెడ్డి చాల స్నేహపాత్రుడు. సులభంగా అందరిలో కలసిపోతాడు. త్వరగా అందరి హృదయాలను ఆకర్షిస్తాడు.

వేమారెడ్డి సోమదేవరాజుతో వెళ్ళినప్పుడు అన్నమదేవుణ్ణి చూచి, "తమ్ముడూ. వెళ్ళివస్తాము." అన్నాడు. ఆ మాటలు విన్నప్పు డన్నమదేవుని కతడు తన సోదరుడే అనిపించింది.

సోమదేవ రాజు వేమారెడ్డి తమ సైన్యాలను తీసుకొని వెడుతూనే అన్నమదేవుడు తమ సైన్యాధిపతియైన దుర్జయ నాయకుణ్ణి పిలిచి సంప్రతించాడు. ఒకవేళ మహమ్మదీయ సైన్యాలు తమ మీదికి వస్తే వాటి నెలా ఎదుర్కోవాలి అన్న విషయాలను గూర్చి చర్చించాడు. సోమదేవరాజు జైత్ర యాత్ర ఎలా జరుగుతున్నదో అప్పటి కప్పుడు తెలుసుకొనడానికి కావలసిన ఏర్పాట్లను చేయమన్నాడు. దేవగిరిమీద, కంపలిమీద ఒక కన్ను వుంచమన్నాడు. ఆ తరువాత తన గదికి వెళ్ళాడు.

అచ్చట తనకు కాపయ్య గమనం వచ్చాడు. ఆ ఎత్తైన లలాటం, పెద్దకళ్ళు, ఆ నూనూగు మీసాలు లీలగా తోచాయి. అతని మాటలు గూడ జ్ఞప్తికివచ్చాయి. అప్పు డతని హృదయం ఒక విధమైన పరవశత నొందింది.

అన్నమదేవుడు తన సితికి తానే నవ్వుకొన్నాడు. తానొక వనిత. అయినా పురుషవేషంలో వున్నది. అన్నమాంబకు బదులు అన్నమదేవుడని అనిపించుకొన్నది. అలాగే వ్యవహరించబడుతున్నది.

బహుశా కాపయ్య నాయకుడు గూడ తన్ను పురుషుడనే అనుకుంటున్నాడు. అవిధంగానే తనతో వ్యవహరించాడు. అతనికి తానొక తరుణి అని తెలిసినప్పుడే......

——ఆమె హృదయంలో ఏదో భావం ప్రకోపించింది. ఆమె అలాగే ఆ భావోద్రేకంలో చాలాకాలం వుండిపోయింది. ఎందుకో ఆమె హృదయం ఒక విధమైన తీయనిబాధ ననుభవింప సాగింది. కాపయ్య నాయకుడు ఆంధ్ర భూమండలాధ్యక్షుడయ్యాడు. అతడే యీనాడు విప్లవోద్యమాన్నంతటిని నడుపుతున్నాడు. మరొకసారి ఓరుగల్లు సేనలు ఆంధ్ర రాజ్యంమీదికి దండెత్తాయట. కాపయ్య నాయకుడు వారి నెదిరించడానికి వెళ్ళాడట.

ప్రోల నాయకుడు మరణించడం విమోచనోద్యమానికి చాలా నష్టాన్ని కలిగించింది. అతడు మహానాయకుడు. కాని కాపయ్య నాయకుడతనికి తీసిపోయినవాడు గాడు. ప్రోలనీడు ధైర్యవంతుడు, సాహసవంతుడు. సమరాంగణ సార్వభౌముడు. కాని కాపయ్య నాయకుడు రణరంగంలో మంచి అనుభవమున్నవాడేగాక రాజకీయ చతురుడు. మంచి యెత్తుగడలు వేసి శత్రువును సర్వనాశనం గావించ గలిగినవాడు. ఆ నాయకుడే రాకుంటే ద్వార సముద్రం తమ వైపు తిరిగేది గాదు. తాము గూడ ఇంతగా తెగించి ముందుకు వెళ్ళేవారు గాదు. అతడొక వీరుడు. ఆదర్శ పురుషుడు.

ఆమె అతణ్ణి తలచుకొంటూ వుంటే, తలచుకొన్న కొద్దీ ఆమె హృదయదర్పణంలో అతడు స్పష్టంగా ప్రతిఫలింప సాగాడు. ఆమె అతణ్ణి భావించుకొంటూ అనిర్వచనీయమైన ఆనందాన్ని పొందసాగింది.

మరలా కాపయ్య తనకెప్పుడు కనబడరాడో. ఈ యుద్ధాల పర్యవసానమేమవుతుందో? ఆమె మనస్సు కలవరపడింది. ఎన్నడూ ఎరగని దిగులు ఆమె హృదయాన్ని కలచివేసింది. ఆమె అలాగే ఆలోచిస్తూ నిద్రపోయింది ...

ఒక పక్షం దినాలకు సమరాంగణం నుండి వేగులవారు వచ్చారు. తమ సేనలు విందన వోలు వరకు వెళ్లాయని, ఒకటి రెండు దినాలలో అదిగూడ వశమైపోవచ్చునని వారు చెప్పారు. ఆ వార్త విని అన్నమదేవుడెంతో ఆనందించాడు.

సోమదేవుడు, వేమారెడ్డి గారు జాగ్రత్తగా తమ వ్యూహ రచన గావించుకొన్నారు. సోమదేవుడు ముందువెళ్ళి ఒక కోట మీద బడుతాడు. దాన్ని వశం గావించుకొంటాడు. వెంటనే దానిని వేమారెడ్డి కప్పగించి మరొక కోటమీదికి వెడుతుంటాడు. వేమా రెడ్డి ఆ కోటను స్వాధీనపరచుకొని దాని పరిపాలనా వ్యవస్థను మార్చి విశ్వాసపాత్రులైన వారినచ్చటధికారంలో వుంచి అచ్చట కొంత సైన్యాన్నివదిలి ముందుకు వెడుతుంటాడు.

ఎప్పుడైనా ఒక కోటను పట్టుకోవడం ఆలస్యమైతే ఇద్దరూ లేచి ఒకవంక ముట్టడించి దానిని స్వాధీనము చేసుకుంటారు. తాము జరిపిన దాడిలో చాలా తక్కువ నష్టం కలిగేటట్లు, శత్రువు త్వరగా లొంగిపోయేటట్లు చూచుకొంటారు. అంతేగాక వాతావరణం గూడ వారికనుకూలించింది. తోవపొడుగునా వారికి ప్రజలు స్వాగతం పలకసాగారు. తురుష్క క్రూర దమన విధానాన్నుండి తమకు విముక్తి కలిగించడానికి వస్తున్న విమోచన సైన్యాలవి అని వారు భావించి వారికి కావలసిన సాయంచేశారు. ధనధాన్యాలు సమర్పించారు. శత్రువు లాక్రమించుకొన్న కోటలలోని రహస్యాలను తెలిపారు. ముందుగా వెళ్లి ఆ కోటలలో తిరుగుబాట్లను లేవనెత్తారు. అందువల్ల సోమదేవరాజుకు, వేమారెడ్డికి ఎదురు లేకుండా పోయింది. ప్రతికోట వారికి లొంగిపోజొచ్చింది. ముసలిమడుగు, సాతానికోట, కందనవోలు, ఏత్వకోలను, రాచూరు, ఏతగిరి, గంగినేని కొండ వారి వశమయ్యాయి. అవి స్వాధీనం కావడంవల్ల ఎనలేని ఆయుధాలు, అశ్వాలు, ధనధాన్యాలు వారికి దక్కాయి. త్వరత్వరగా కలుగుతున్న విజయ పరంపరలవల్ల, ప్రజలిస్తున్న సహకారంవల్ల ఆ నాయకులిద్దరు ముందుకు చొచ్చుకొని వెళ్లారు.

సోమదేవరాజు, వేమారెడ్డి హఠాత్తుగా వెళ్లి కోటల మీద బడి పట్టుకోవడంవల్ల వారి సైన్యాలకు గలిగిన నష్టం చాల తక్కువ. ఆ కోటలో వున్న, అధికార్లు ముస్లింలేగాని ప్రజలందరూ హిందువులు. అందువల్ల ఆ యధికార్లు హిందూసైన్యాల దెబ్బకు తట్టుకోలేక లొంగిపోయారు. కొన్నిచోట్ల పరుగిడిపోయారు. ఆ నాయకులిద్దరు ఎంతవేగంగా కోటల్ని పట్టుకొంటున్నారో, అంతత్వరగా తమస్థానాన్ని పదిలపరుచుకొంటున్నారు. ఒకవేళ దేవగిరి సేనలు పైబడితే గూడ వాటిని నెదిరించడానికి వీలుగా వారు ఆ కోటల్ని బలపరచసాగారు.

సోమదేవరాజు ఈ విధంగా కృష్ణా తుంగభద్ర, అంతర్వేది పైబడి తమ కోటలన్నింటినీ పట్టుకొంటున్నాడని దేవగిరిలోవున్న వజీర్ మలిక్‌కు తెలిసింది. వెంటనే అతడు వారిపై బడవలసిందని కొంత సేనను పంపాడు. ఈ లోగా ఓరుగల్లు సేనలు కాపయ్య నాయకుని ధాటికాగలేక వెనుకంజ వేస్తున్నాయని వార్త వచ్చింది. అందువల్ల ఓరుగల్లు సేనలకు సాయంగా మరికొంత సేనను అటు వైపు పంపాడు. కాని అతని మనస్సు కుదుటబడలేదు.

సోమదేవరాజును జయించడమంత సులభంగాదు. అతనితోడుగా అద్దంకినుండి అనవోతు సేనలు వచ్చివున్నాయని అతనికి తెలిసింది. కాబట్టి వేరే పన్నుగడలేమైనా పన్నపోతే ఆ రెండు సైన్యాలను ఎదిరించడం కష్టమని అతనికి తోచింది.

వెంటనే వజీర్ మలిక్ ఒక ఆలోచన గావించాడు. సోమదేవరాజు తనసైన్యంతో కృష్ణా తుంగభద్ర, అంతర్వేది మీద పడాడు గనుక అరక్షితంగావున్న ఆనెగొందిని పట్టుకొంటే అతడే వెనుదిరిగి వస్తాడు. అప్పుడు తన సేనలకు అతని వశమైన కోటలను పట్టుకోవడం సులభం. గనుక కంపలి నుండి మలిక్‌నబి వెళ్లి ఆనెగొందిని ముట్టడించమని చెప్పాలి అని అతడు నిర్ణయించుకున్నాడు. అందుకోసమని వెంటనే అతడు ఇద్దరు బాధ్యత గల సైనికాధికారుని కంపలికి పంపాడు.

వజీర్ మలిక్ నుండి వార్త వస్తూనే మలిక్‌నబీ తనసైన్యాలను తీసుకొని ఆనెగొందిమీద బడ్డాడు. అప్పటికే అన్నమదేవుడు సిద్ధంగా వున్నందువల్ల అతడు ఆ సేనల్ని వెంటనే ఎదిరించ గలిగాడు.

ఆనెగొంది నేలాగైనా పట్టుకొని, ఆ తరువాత సోమదేవరాజు పడుదామని మలిక్‌నబీ ఆలోచించి తీవ్రంగా పోరాడసాగాడు. కాని దృఢ నిశ్చయంతో ప్రతిఘటిస్తున్న ఆనెగొంది సేనల్ని ఏమీ చేయలేక పోయాడు.

అంతేగాదు, కోటతలుపులు తెరచి మీదబడిన అన్నమదేవుణ్ణి కంపలి సేనలెదుర్కొనలేక పోయినవి. అన్నమదేవుడు వీరావేశంతో పోరాడసాగాడు. అతని కెదురుగా ఎవ్వరూ నిలబడలేక పోయారు.

సోమదేవుడే అన్నమదేవునికి ఖడ్గ విద్య నేర్పాడు. అన్ని శిక్షణలు యిచ్చాడు. కాని అన్నమదేవుడు అన్ని విద్యలలోను సోదరుణ్ణి మించి పోయాడు. అతడు సుకుమారంగా వున్నప్పటికీ, తన అన్నయ్యకంటె బలిష్టంగా లేనప్పటికీ అతనికంటె నైపుణ్యం గలిగిన వాడు గనుక, కుశాగ్రబుద్ధి గలిగినవాడు గనుక అన్నిటిలోను తన అన్నయ్యకంటె అతను మించిపోయాడు. రణరంగములోనే గాక పరిపాలనలో గూడ పేరెన్నికగన్నాడు. అందుకనే అన్నమదేవుని హస్తాలలో బాధ్యతను పెట్టటానికైనా సోమదేవుడు వెను కావడం లేదు. అందుకనే ఆనాడు గూడ ఆనెగొంది నతని చేతుల్లో పెట్టి వెళ్ళాడతడు. తన సోదరుడు తన మీద పెట్టిన విశ్వాసానికి తగ్గట్లుగానే అన్నమదేవుడు పోరాడసాగాడు.

ఎదురు పడి వస్తున్న ముస్లిం సేనావాహినుల్ని రెండుగా చీల్చివేయాలని అన్నమదేవుడు నిశ్చయించుకొన్నాడు. సేనానియైన పేరన నాయకుణ్ణి గూడ తనతోటే ముందుకురమ్మని ఆదేశించాడు. ఇద్దరూ మహమ్మదీయ సేనను చెండాడుతూ ఆ సేనమధ్య గండి కొట్టుకొని ముందుకు వెళ్ళారు. వారి వెనుకనే ఆనెగొంది సైన్యం గూడ ముందుకు నడిచింది.

ఆ సైన్యం రెండు చీలికలు చేయబడిన వెంటనే అన్నమదేవుడొక సైనిక విభాగాన్ని పేరన నాయకుడు మరొక విభాగాన్ని ఎదిరించారు. తమ సైన్యాన్ని రెండు భాగాలుగా చీలి ముస్లిం సైన్య విభాగాలను చక్రబంధం చేయమని ఆజ్ఞాపించాడు. వారి ఆదేశానుసారం సైన్యం రెండయి ముస్లిం సేనలను తాకినవి. మహమ్మదీయ సేనకు నాయకత్వము వహిస్తున్న మలిక్ నబీ తన సేనలకు సంభవించిన ప్రమాదాన్ని వెంటనే గుర్తించాడు. కాని అతనికేమి చేయాలో తెలియలేదు.

ఒక వైపున అన్నమదేవుడు మరొక వైపున పేరన నాయకుడు ముందుండి వీరావేశంతో పోరాడుతుంటే అచ్చెరువు పొందని వారులేరు. ముఖ్యంగా అన్నమదేవుడు ఖడ్గచాలనం చేస్తూ స్వైర విహారం సలుపుతుంటే ఆ పరమేశ్వరుడు ప్రళయ నృత్యం చేస్తున్నట్లనిపించింది.

మలిక్‌నబీ ఇక ఆలస్యం చేసే లాభంలేదనుకొన్నాడు. తన అశ్వాన్ని పేరన నాయకుని వైపు పోనిచ్చాడు. అతని రాకను ఆ నాయకుడు గమనించాడు. కాని అతని వైపు చూడనట్లుగానే నటిస్తూ యుద్ధం చేయసాగాడు. మలిక్‌నబీ వేగంగా అతనివైపుకు వచ్చి తలపడాడు. అతణ్ణి ఆక్రమించడానికి ప్రయత్నించాడు. వెంటనే పేరన నాయకుడు తిరిగి అతణ్ణి మోదబోయాడు. నబీ తప్పించుకొనడానికి ప్రయత్నించడంలో పట్టు తప్పి పడిపోయాడు. వెంటనే పేరన ప్రక్కనున్న సైనికులు నబీని బంధించి వేశారు.

మలిక్ నబీ బధించబడడం చూచి ఆనెగొంది సైన్యాలు ఉప్పొంగి పోయినవి. కంపిలి సైన్యాలు అదిరి పోయినవి. కాని వెను దీయకుండా పోరాడసాగాయి. కాని విజయోత్సాహంతో పెకురుకుతున్న ఆనెగొంది సైన్యాల నెదిరించలేక పోయినవి. తుదకవి ఓడిపారిపోయినవి.

ఆ నాడు జరిగిన యుద్ధంలో ఇరు సైన్యాలకు చాల నష్టం కలిగింది. కాని ఆనెగొంది సైన్యాలకు ఘనవిజయం చేకూరింది. ముస్లిం సైనికులు విడిచి వెళ్లిన ఆయుధ సామగ్రి అంతా ఆనెగొంది వారికి చిక్కింది. అంతకంటె హెచ్చుగా కంపిలి సేనా నాయకుడైన మలిక్‌నబీ వారిచే బంధింపబడ్డాడు. అంతకంటె అన్నమదేవునికి కావలసిందేమున్నది ?

తమకు గలిగిన విజయాన్ని గూర్చి తన సోదరునికి తెలిస్తే అతడెంతో సంతసిస్తాడు. అతడెంతో ఉప్పొంగిపోతాడు. ప్రక్కలో బల్లెంలాగా వున్న మలిక్‌నబీ తమకు బంధీ అయ్యాడు. ఇక కావలసిందల్లా కంపిలి ఆక్రమణ మాత్రమే. కాని కంపిలి మీదికి వెళ్లాలంటే సాధ్యమైన పనిగాదు. కంపిలి సైన్యాలు ఓడి పోయాయని దేవగిరిలో నున్న వజీరు మలిక్ వింఝూనే తప్పని సరిగా అతడు తమ పైకి సేనల్ని పంపుతాడు. ఆ సమయంలో ఆనెగొందిలో లేకపోతే ఆ కోట నా సేనలాక్రమించుకొని తన్ను తన సోదరుని వేరుచేస్తాయి. అలా జరిగితే ప్రస్తుతం తమకు కలిగిన విజయమంతా అపజయంగా మారిపోతుంది. అందువల్ల ఆ ప్రయత్నం మానుకోవాలనుకొన్నాడు అన్నమదేవుడు.

ఒక వారం దినాలు జరిగాయోలేదో అన్నమదేవరాజనుకొన్నట్లే దేవగిరి సైన్యాలు ఆనెగొందికి వస్తున్నాయని వార్తవచ్చింది. అప్పుడు అన్నమదేవుడు కొద్దిగా భయపడాడు. శత్రుసైన్యాలు వస్తాయని ముందుగానే అతడూహించి వున్నప్పటికీ ఆ సైన్యాలు నిజంగా వస్తున్నాయనేసరికి అతనికి కొంత భయంవేసింది. వచ్చిన విజయంకాస్తా వమ్మయిపోతుందేమోనని అతనికి ఆందోళన గల్గింది. ఏమయినా పోరాడి తీరక తప్పదని నిర్ణయించుకొని సైనికుల్ని ఉత్సాహపరచి వారిని సన్నద్ధంగావించడానికి నిర్ణయించుకొన్నాడు.

దేవగిరి సేనలు దగ్గరపడుతున్నాయన్న వార్తలొక వైపునుండి వస్తుంటే సోమదేవరాజు వేమారెడ్డి జయం తరువాత జయం పొందుతున్నారని వార్తలు వస్తున్నవి. అన్నమ దేవునికీవార్తలు సంతసంతోపాటు ఆదుర్దాను గూడ కలిగించాయి.

దేవగిరి సైన్యాలు రానేవచ్చాయి. ఈ మారు ఆ సేనలు కృతనిశ్చయతో వచ్చాయి. విజయమో వీరస్వర్గమో తేల్చుకోవాలని వచ్చాయి. ఆ వచ్చిన సైన్యం అంత పెద్దది గాదు. కాని త్రోసివేయదగింది మాత్రంగాదు. అది బాగా సాయుధమైవున్నది. మూల బలంలాగా కనబడుతున్నది.

దేవగిరి సేనలలో కొంత భాగం సోమదేవరాజు మీదికి వెళ్లింది. కొంత భాగం అచ్చటే వుంచబడి, మరికొంత భాగం మాత్రమే ఆనెగొంది మీదికి పంపబడింది. అలా పంపబడిన సైన్యం చాల హెచ్చుగాకపోయినా ఆనెగొంది సైన్యం కంటె అధికంగానే వుంది.

దేవగిరి సేనలు వచ్చి ఆనెగొందిని ముట్టడించేలోగా ద్వారసముద్రం సేనలు తనకు సాయంగా వస్తున్నవని అన్నమదేవునికి తెలిసింది. అప్పుడతనికెంతో ధైర్యం కలిగింది. వెంటనే

అతడు తన సేనానాయకుణ్ణి పిలిచి తాము ఎదిరించవలసిన వ్యూహాన్ని గూర్చి చర్చించాడు. ఆ చర్చలో అన్నమదేవుడు కోటలో వుండి దానిని రక్షిస్తూవుండాలని. పేరన కొద్ది సైన్యాన్ని తీసుకొనివెళ్లి దేవగిరి సేనలు కోటను ముట్టడించినప్పుడు వెనుక నుండి వారిపై బడి చికాకు పరచాలని, ఆలోగా ద్వారసముద్రం సేనలు వస్తే వాటిని చేర్చుకొని దేవగిరి సేనల్ని నుగ్గునూచం చేయాలని నిర్ణయించబడింది. ఆ విధంగానే పేరన నాయకుడు కొంత సైన్యాన్ని తీసుకొని దూరంగా వెళ్లి ఒక కొండచాటున పొంచిచూడసాగాడు. అన్నమదేవుడు కోట ద్వారాలను బంధించి దానిని రక్షింపసాగాడు.

దేవగిరి సేనలు వచ్చి కోటను ముట్టడిస్తూనే ఆనెగొంది సైనికులు కోట మొగ్గలమీద నుండి వారిమీదికి అగ్ని బాణాలను విసరసాగారు. కాచిన నూనెను పోయసాగారు. పైగా వారిమీద శరపరంపరలను వదలసాగారు ఆనెగొంది సేనలలా చేస్తున్నప్పటికీ దేవగిరి సైనికులు వెనుదీయకుండా కోటగోడల నెక్కడానికి ప్రారంభించారు. అలా ఎక్కుతున్న వారిని మొగ్గలమీద నున్న యోధులు పొడిచి క్రిందపడవేయసాగారు

ఇంతలో పేరన ఆధిపత్యాన వున్న సేనలు వచ్చి దేవగిరి సైన్యాలను వెనుక నుండి దెబ్బ తీశాయి. అలా జరుగుతుందని ఆ సైన్యాలు కలలోనైనా అనుకోలేదు.

పేరన వచ్చి వెనుక తాకుతూనే దేవగిరి సైన్యాలను నడుపుతున్న ముబారక్ తన సైన్యాల వెనుక భాగాన్ని వెనుదిరిగి శత్రువుల్ని ఎదుర్కొమన్నాడు. అప్పుడా సైన్యం రెండు భాగాలయి ఒకటి పేరన సేనతోను, రెండవ భాగం కోటమీద నున్న వారితోను పోరాడ దొడగింది. ఇంతలో ద్వారసముద్రం సైన్యాలు వచ్చి పేరన సైన్యాలతో కలిశాయి. అందువల్ల పేరన సైనికులు మరింత ఉత్సాహంతో పోరాడసాగారు. ద్వారసముద్రం సైన్యాలు వచ్చి ఆనెగొంది సైన్యాలతో చేరుతూనే ముస్లిం సైన్యాలు గడగడ వణకిపోయినవి. అంతలో కోట తలుపులు తెరుచుకొని అన్నమదేవుడు ముందుకువచ్చాడు తన సైన్యాన్ని ఆ ముస్లిముల్ని చెండాడమన్నాడు. ఆ పోరాటంలో మహమ్మదీయ సేనలు అడకత్తెరలో చిక్కుకొన్న పోకలాగా అయ్యాయి. ఆనాటి యుద్ధంలో దేవగిరి సేనలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. మిగిలిన కొందరు సైనికులు ఏలాగో తప్పించుకొని పారిపోయారు.

ఆనాడు తమకు కలిగిన ఘనవిజయానికి ఆనెగొంది సేనలే గాక, ద్వారసముద్రం సేనలు కూడ ఎంతో ఆనందించినవి. ఉత్సవాలు చేసుకొన్నవి. ఊరేగింపులు జరుపుకొన్నవి. ఆనాడు అన్నమదేవుడు పొందినంత ఆనందం మునుపెన్నడూ పొందివుండలేదు

ఆ జయం చేకూరిన కొన్ని దినాలకే సోమదేవరాజు తన సేనతో తిరిగి వచ్చాడు. జైత్రయాత్ర జరిపి దిగ్విజయం పొంది మరలి వచ్చిన సోదరునికి స్వాగతమివ్వడానికి అన్నమదేవుడు ఘనమైన ఏర్పాట్లను గావించాడు. సోమదేవరాజు వస్తూనే అతణ్ణి తానే స్వయంగా మాలాలంకృతుణ్ణి గావించాడు. [illegible] గావించే జయ జయ ధ్వానాలమధ్య సోమదేవరాజు అతని సేనలు ఆనెగొందిని ప్రవేశించాయి.

భోజనాలయిన తరువాత అన్నమదేవుడు ఆనెగొందిలో జరిగిన పోరాటాన్ని గూర్చి ద్వారసముద్రం వారు చేసిన సహాయాన్ని గూర్చి వివరించాడు. వేమారెడ్డి రాలేదేమని ప్రశ్నించాడు. తమ దిగ్విజయం పూర్తి అవుతూనే వేమారెడ్డి తన సేనల్ని తీసుకొని కాపయ్య నాయకునికి సాయంగా వెళ్ళాడని సోమదేవరాజు సోదరునికి తెలియజేశాడు. తమ మీదకి వచ్చిన దేవగిరి సేనలు చాలా వరకు ధ్వంసం చేయబడ్డాయని చెప్పాడు.

వేమారెడ్డి కాపయ్య నాయకునికి సాయంగా వెళ్ళాడని సోమదేవరాజు చెప్తూనే అన్నమదేవుని మనస్సు అతని మీదికి వెళ్ళింది. అతని యోగక్షేమాలేమైనా తెలిశాయా అని అడుగుతూ తన సోదరుణ్ణి ప్రశ్నించాడు.

"తెలిశాయి. వేగులవారు తెలియజేశారు. కాపయ్య నాయకుడు ఓరుగల్లు సేనల్ని తప్పికొట్టి వెడుతుంటే అవి వెను దిరిగి నట్లుతిరిగి వెనక్కి వెడుతున్న ఆంధ్రసేనల మీద బడ్డాయట. అప్పుడు ఆంధ్ర సైనికులు చెలాచెదరైనారట. వెంటనే కాపయ్య నాయకుడు వారిని పురికొలిపి ముస్లిం సేనలమీద బడాడట. పోరు ఘోరంగా జరిగిందట. ఫలితమేమయిందో తెలియదట..... కాని జయం మాత్రం కాపయ్య నాయకునిపైనే ఉండవచ్చునట. ఇది వారు తెలియజేసిన విషయం. అందుకనే వేమారెడ్డి తన సేనను తీసుకొని అతనికి సాయంగా వెళ్ళాడు."

సోమదేవుని మాటలు అన్నమదేవుని మనస్సును చాల కలవరపరచాయి. కాపయ్య నాయకునికి విజయాన్ని ప్రసాదించమని అతడు లోలోనే దేవునికి మొక్కుకొన్నాడు.

(సశేషం)

సమైక్య రాష్ట్రంలోనే తెలుగుజాతికి వికాసం

గంగా–కావేరి లింకు ప్రాజెక్టు:

దాని సాధక బాధకాలు

— పోకూరి శ్రీరాములు

గంగేచ యమునేచైవ గోదావరి సరస్వతి ।
నర్మదే సింధు కావేరి జలేస్మిన్ సన్నిధిం కురు॥

గంగ, యమున, గోదావరి, సరస్వతి, నర్మద, సింధు, కావేరి–ఈ సప్త నదుల జలాలు ఏకం కావాలంటూ భారతీయులు స్నానం చేసేటప్పుడు ప్రార్థిస్తూ వుండడం అందరికి తెలిసిన విషయమే. ప్రముఖ దేశభక్తుడూ ఆధునిక తమిళ కావ్యానికి మణిపూస సుబ్రమణ్య భారతి మాతృభూమి ప్రశస్తిచేస్తూ వంగ భూమి జలాన్ని మళ్ళించి దక్షిణాపథాన్ని సస్యశ్యామలం చేయమని ఉద్బోధించాడు.

అప్రతిహత వేగంతో పరవళ్ళు త్రొక్కుతూ చివరకు సాగర గర్భంలో వృథా అయ్యే ఉత్తర దేశంలోని నదుల వర్షాకాలపు నీటిని మళ్ళించి భారతదేశంలోని దక్షిణ ప్రాంతాన్నీ ఎండిపోయిన పశ్చిమ ప్రాంతలకు అధరాలలో తడపగలిగితే అంతకన్న మహాకార్యమేముంది! ఆసేతు హిమచలం యావద్భారత దేశాన్ని ఒకే యూనిటుగా భావించి అన్ని ప్రాంతాల నీటి అవసరాలను తీర్చిదిద్దగలిగే వ్యవస్థ యేర్పడగలిగితే అది అందరికీ ఆమోదయోగ్యమే కాక అన్నిరాష్ట్రాల్నీ ఐక్యత అనే పట్టుతాడులో గ్రుచ్చినట్లవుతుంది. రెండేళ్ళక్రితం కేంద్ర నీటిపారుదల విద్యుచ్ఛక్తి మంత్రిగారైన డక్టరు కె.యల్. రావుగారు దేశానికి మొత్తం ఒకే జాతీయ విద్యుచ్ఛక్తి గ్రిడ్ యేర్పరచినట్టుగానే దేశంలో లభ్యమయ్యే జలసంపదను ఒకే జాతీయ గ్రిడ్ కిందకు తెచ్చి ప్రత్యేక ప్రాంత అవసరాలను తీర్చుటకుగాను ప్రస్తావించిన గంగా కావేరి లింకు ప్రాజెక్టు ఇటువంటి బృహత్తర కార్యక్రమానికి ప్రతీకగా చెప్పవచ్చు. గంగానది నీటిని కావేరినదితో కలపడం వంటిదే ఇన్ని దశాబ్దాలనుండి మానవుని మేధకు అందకుండా ప్రతి సంవత్సరమూ జలప్రళయం సృష్టిస్తూ, అస్సాం రాష్ట్రానికి అపారమైన నష్టాన్ని కలిగిస్తోన్న బ్రహ్మపుత్ర జలాల్ని తిస్తానదిద్వారా గంగతో కలిపే మరోబృహత్తర ప్రాజెక్టు.

ఉత్తరదేశంలో ప్రవహించే నదులకూ దక్షిణదేశంలో ప్రవహించే నదులకూ ఈ రెంటికీ మౌలికంగా భేదం వుంది. ఉత్తరదేశంలోని నదులు చాలావరకు దేశానికే మకుటాయమానంగా వుండే హిమాలయం నుండి పుట్టి ప్రవహిస్తాయి. శీతాకాలంలో ఘనీభవించిన మంచు ఎండాకాలం వచ్చేసరికి కరగడం ప్రారంభిస్తుంది. నీటిగా కరిగిన ఈ మంచు మేరునగ శిఖరాల్నుండి జలజల పారుతూ ఉత్తరాపథాన వున్న నదులన్నింటికి అపారమైన జలరాశిని అందజేస్తుంది. అందుచేత అక్కడినదుల్లో సంవత్సరం పొడుగునా నీరు సమృద్ధిగా వుంటుంది. ఇక దక్షిణ పథంలో ప్రవహించే నదులకు ఆ సౌకర్యం లేదు. శ్రావణం, భాద్రపదం మొదలు పుష్యం వరకు వర్షఋతువు కొద్దోగొప్పో వుంటుంది. తీరా ఎండాకాలం వచ్చేసరికి నీరు ఇంకి నదులన్నీ విరహవిదగ్ధ కృశాంగనల్లా తయారౌతాయి. అందుచేత వర్షఋతువులో కురిసిన వర్షాన్ని జాగ్రత్తగా రిజర్వాయర్లలోకి మళ్ళించి సంవత్సరం పొడవునా దానిని జాగ్రత్తగా సద్వినియోగం చేసుకోవడం ఎంతైనా అవసరం. దీనికి ప్రత్యామ్నాయంగా సంవత్సరమూ నిత్యకళ్యాణం పచ్చతోరణంగా నీటి సమృద్ధితో కళకళ లాడే ఉత్తరదేశంలోని నదుల నీరు సాంకేతిక రంగంలో గడించిన అనుభవంతో దక్షిణానికి మళ్ళించితే నీటి ఎద్దడితో సతమతమయ్యే దక్షిణ ప్రాంతాలను సుభిక్షం చేయవచ్చన్న యోచన సర్ సి.పి. రామస్వామి అయ్యర్ మెదడులో మొదటిసారిగా మెదలింది. గంగను కావేరితో కలపాలన్న యోచన ఇటీవలి కాలంలో పుట్టిందిగాదు. అయితే భారతదేశం నాలుగు చెరగులూ నీటి వనరులతో సస్యశ్యామలం చేయడానికి నాగార్జునసాగర్, భాక్రానంగల్, పోచంపాడు మొదలైన బృహత్తర ప్రాజెక్టుల్ని నిర్మించాలన్న కృతసంకల్పంలో ఈ యోచన క్రమక్రమంగా పొలుపోసుకుంటూ రావడం నిజం.

జలసంపత్తి అనేది ప్రకృతి ప్రసాదించిన వరప్రసాదం. జలాధిక్యానికి పేరుగన్న భారతదేశంలో, ఒక ప్రాంతంలో జలాధిక్యత చేత వరదలువచ్చి జననష్టం ఆస్తినష్టం జరుగుతోంటే వేరొక ప్రాంతం ఒక్క నీటిబొట్టు కోసం తహతహ లాడడం విడ్డూరం కాదా! రోజురోజుకు అదుపులేకుండా దేశంలో పెరుగుతున్న జనాభాను పోషించడానికి ఈ అసమానత్వాన్ని తొలగిస్తే ఎంతో బావుంటుంది.

సర్ సి.పి రామస్వామి అయ్యర్ మెదడులో మెరిసిన ఈ యోచన పైన చెప్పినట్లు మన కేంద్రనీటిపారుదల విద్యుచ్ఛక్తి మంత్రివర్యులు శ్రీయుతులు డాక్టర్ కె.యల్. రావు గారి పునరాలోచనతో తిరిగి బలాన్ని పుంజుకుంది. మిత్ర రాజ్యసమితి వారిచే ఈ బృహత్తర ప్రాజక్టులోని సాధకబాధకాలను పరిశీలింప చేయించడానికి వారు పూనుకున్నారు. తర్వాత ప్రారంభిక సర్వే జరగడం యు.యన్. లో వారు ముప్పది సంవత్సరాల్లో ప్రాజెక్టును పూర్తి చేయాలని, దాని నిర్మాణానికి 2250 కోట్ల రూపాయలు ఖర్చవుతాయని, ఈ ప్రాజెక్టును నిర్మించే ఉత్తరప్రదేశ్, బీహారురాష్ట్రాల్లో రెండు పంటలు పండే ఇరవై లక్షల ఎకరాల భూమికి సేద్యపు నీటి సౌకర్యం లభించడమేగాక గుజరాతు, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, మైసూర్, తమిళనాడు రాష్ట్రాలలోని 80 లక్షల ఎకరాల విస్తీర్ణానికి శాశ్వతంగా కరువునుండి విముక్తి లభిస్తుందనీ, ఈ బృహత్తర పథకంలో బ్రహ్మపుత్రలో ప్రవహించే ఎక్కువ (Surplus) నీటిని మళ్ళించే ప్లానుగూడా చేర్చాలని, ప్రాజెక్టు ఖర్చును పదివేల కోట్ల రూపాయల మేరకు పెంచే పక్షంలో నౌకాయాన సౌకర్యాలు యేర్పరుచ వచ్చని ఆర్థికంగా చూచిన యెడల ఈ ప్రాజెక్టుపై వెచ్చించే మొత్తానికి గిట్టుబాటు అవుతుందని మిత్ర రాజ్యసమితి సలహాదారులు రిపోర్టులో పేర్కొన్నట్లు వార్తలు వచ్చాయి.

మిత్రరాజ్య సమితి సాంకేతిక బృందంవారు ఈ ప్రాజెక్టు గురించి ఇంకా విస్తృత ప్రాతిపదికపై క్షుణ్ణంగా సర్వే చేయాల్సి వుంది. నిర్మాణంలో వచ్చే సాధకబాధకాల్ని చర్చించే ముందు అసలు ఈ ప్రాజెక్టు మూలస్వరూపం గురించి స్థూలంగానైనా తెలుసుకోవడం సముచితం.

గంగా—కావేరి లింకు ప్రాజెక్టు పరిశీలన ఇంకా టోపోషీట్ల వరకే పరిమితమైవుంది. ప్రాజెక్టు రూపురేఖలకు సంబంధించిన వివరాలు సాంకేతిక అనుభవజ్ఞులు చెప్పిన ప్రకారం ఈ విధంగా వున్నాయి.

(1) వర్షాకాలంలో గంగానది, దాని ఉపనదుల్లో అంతులేకుండా పొర్లి ప్రవహించే నీటిని సద్వినియోగం చేయాలి. భవిష్యత్తులో రాబోయే ఈ నదుల పరీవాహక ప్రాంతాల అవసరాలను తీర్చినతర్వాతకూడ ఒకటి రెండు కోట్ల ఎకరా అడుగు నీరు మిగిలిపోతుందని అంచనా. ఈ పథకం వల్ల ఈ నదుల్లో వృథాఅయ్యే నీరు దక్షిణదేశమూ, పశ్చిమప్రాంతాల అవసరాలను తీర్చడానికి వుపయోగించవచ్చు. దీనివల్ల కలిగే మరొక లాభం ఉత్తరదేశంలో ప్రతి సంవత్సరమూ వరదల తాకిడికి గురి అవుతోన్న ప్రాంతాలను సంరక్షించవచ్చు.

(2) గంగానదిలోని మిగులు నీటిని పాట్నా వద్ద బ్యారేజి నిర్మించడం ద్వారా ఓ విశాలమైన కాలువలోకి మళ్ళించాల్సి వుంటుంది. అయితే ప్రారంభంలోనే గంగానది దిగువ లోయనుండి దక్షిణ పీఠభూమి ప్రాంతాలకు తేవడానికిగాను కేవలం రెండువందల మైళ్ళు దూరం లోపలే 2000 అడుగులు ఎత్తుకు నీటిని తీసుకపోవాలి. అంటే ఒకదానిపై ఒకటి చొప్పున తొమ్మిది కుతుబ్ మినార్లను నిలబెట్టిన ంత ఎత్తు అన్నమాట. సామాన్యానికి భౌతికంగా అసాధ్యంగా కనబడే ఈ పని ఎంతో శక్తివంతమైన పంపులద్వారా తోడాల్సివస్తుంది.

(3) అంత ఎత్తుకు నీటిని పంప్ చేసిన తర్వాత ఇక దానంతట అదే ఈ ప్రవాహం 'నీరు పల్లమెరుగు' అన్న లోకోక్తి ప్రకారం దక్షిణాపథంలోని నదులను కలుపుకుంటూ సుమారు 2200 మైళ్ళు ప్రయాణం చేసి కృష్ణానదిలో కలుస్తుంది.

(4) ఆ తర్వాత మళ్ళీ ఈ నీటిని 300 అడుగులు ఎత్తుకు పంపింగ్ పద్ధతి ద్వారా తీసుకెళ్ళగలిగితే మెట్టూరు ఆనకట్ట వరకు ఇంక ఏ అవరోధం లేకుండా తీసుకెళ్ళవచ్చు. కావేరి వరకే పరిమితంగాకాక ఈ అపార జలరాశిని తామ్రపర్ణిలో కలపాలన్న మరో యోచనగూడా వుంది.

ఇంతటి సుదీర్ఘ ప్రయాణంలో గంగా ప్రవాహం యే యే నదుల్ని తాకుతూ వెళ్తుందో అక్కడ పెద్ద పెద్ద ఆనకట్టలు బ్యారేజీలు నిర్మించాల్సిన అవసరం వుంది. నర్మదా నదిపై నుండి ఈ జలరాశిని తీసుకు వెళ్ళేప్పుడు దానిలోని కొంత భాగాన్ని రాజస్తాన్లోని నీటి ఎద్దడి ప్రాంతాలకై వుపయోగించడం కోసం నర్మదా నదీ పరీవాహక ప్రాంతంలోకి వదలివేయాలన్న అంశం కూడా ఈ బృహత్తర పథక పరిధిలోనే వుంది. విస్తృత ప్రాతిపదికపై క్షుణ్ణంగా సాంకేతిక పరిశీలన జరిపిన తర్వాత గాని నర్మదా నదిలోకి వదిలే గంగా జలాన్ని ఏ విధంగా తీసుకెళ్ళి రాజస్తాన్లోని కరువు ప్రాంతాలకు సరఫరా చేయాలన్న విషయం తేలదు. స్థూలంగా వేసిన అంచనాల ప్రకారం గంగానది జలాన్ని కావేరి జలాలతో కలిపితే సుమారు 30 లక్షల ఎకరాలకు నీటి పారుదల సౌకర్యం లభించగలదు.

కాలువ రూపంలో గంగానది నుండి బయలుదేరి ఈ జలవాహిని రిహాండ్ రిజర్వాయరు, బరోయీ రిజర్వాయరు, పోచంపాడు, మెట్టూర్ రిజర్వాయర్లలో కలుస్తూ గోదావరి, కృష్ణ, తుంగభద్ర, పెన్న, కావేరీలను తాకుతూ తామ్రపర్ణిలో సంగమిస్తుంది. ఈ విధంగా దక్షిణదేశం, మధ్య భారత్ లోని వివిధమైన నదులను రాచుకుంటూ పశ్చిమ ప్రాంతంలోని ఎడారి భాగాన్ని, దక్షిణానవున్న పీఠభూముల్ని తడిపి వాటి దాహం తీర్చగలిగే ఇంతటి మహత్తర జాతీయ ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తి చేయగలిగాం అంటే మనం దేశ సౌభాగ్యాన్ని గూర్చి కన్న కలలన్నీ పండించుకున్నట్లే. దీనివల్ల దక్షిణదేశం, పశ్చిమ ప్రాంతంలోని దుర్భిక్ష ప్రాంతాలకు నీటి పారుదల సౌకర్యంతోపాటు త్రాగడానికి కూడా నీరు లభ్యం కాని ఎన్నో ప్రాంతాల అవసరాలు తీరడంతోపాటు అంతర్దేశీయ నౌకాయాన రంగంలో ఘన విజయాన్ని సాధించిన వారమవుతాం.

చూడడానికి ఇంతటి బృహత్తర ప్రాజెక్టు నిర్మాణం ఒక మధుర స్వప్నంలా తోస్తుంది. అమలు పరచడానికి ముందు ప్రతి బృహత్ పథకమూ మనకు అందరాని స్వప్నంగానే కనబడుతుంది.

ఉదాహరణకు దక్షిణ దేశంలో పెరియార్ ప్రాజెక్టును 1893లో నిర్మించడం జరిగింది. పడమటి కనుమల్లో విశాలమైన ఓ సొరంగాన్ని నిర్మించి పశ్చిమంగా ప్రవహించే నదీ గమనాన్ని తూర్పు దిక్కుగా మళ్ళించారు. ఫలితంగా చాలని నీటి పారుదల సౌకర్యాలతో అవస్థ పడుతూన్న మధురై జిల్లాను ఉద్ధరించ గలిగారు.

ఈ విధంగానే జీలం నదీ జలాలను చీనాబ్, రావీ నదుల పైగా దాటించి రావీ రెండో ఒడ్డునవుండే బంజరు భూముల్ని తడిపే కార్యక్రమం ఈ శతాబ్ద పూర్వార్ధంలో అమలు పరచడం జరిగింది. అక్కడిదాకా ఎందుకు మొన్న మొన్ననే స్వాతంత్ర్యం లభించిన తర్వాత నిర్మించిన భాక్రానంగల్ ప్రాజెక్టుకూడా ప్రథమ ప్రపంచ సంగ్రామం ఆఖరులో వూహించబడిందే. అసలు గంగా నదిని కావేరీ జలాలతో కలిపి ముఖ్యంగా అంతర్దేశీయ నౌకాయాన సౌకర్యాన్ని అభివృద్ధి చేయాలన్న సంకల్పం సుప్రసిద్ధ ఇంజనీరు సర్ ఆర్థర్ కాటన్ దొర గారికి కలిగింది. ఒక శతాబ్దం ముందు చూచిన ఈ మహా స్వప్నాన్ని కాటన్ గారు అప్పటి బ్రిటిషు ప్రభుత్వం నాగి ముందు వుంచారు. మరి ఎందుకో గాని ఆయన స్వప్నం స్వప్నంగానే వుండి పోయింది. గంగా కావేరి లింకు ప్రాజెక్టు పరిశీలనలో మరెక్కడా ఎవరూ వూహించని పద్ధతులలో నిర్మించ బూనుకొన్నారనుకోవడం పొరపాటేమో. నిజానికి ఇటువంటి విశాలమైన లింకు ప్రాజెక్టుల గూర్చి కొన్ని దేశాల్లో వూహించడం జరిగింది. అమలు పర్చారు కూడాను. సోవియట్ రష్యాలో వోల్గా నదిపై కట్టిన ప్రాజెక్టు ఇటువంటిదే. వారు నది మార్గాన్నే మార్చి తమ దేశంలోని ఆర్థిక వ్యవస్థ స్వరూపాన్నే మార్చివేశారంటే ఆశ్చర్యపడనక్కర్లేదు.

ఇన్ని వ్యయ ప్రయాసలతో కూడుకొన్న ఇంత బ్రహ్మాండమైన ప్రాజెక్టును నిర్మించాలంటే ఎన్నో ఎన్నలేనన్ని సాధక బాధకాలు ఎదుర్కోవడం సహజం. దీని నిర్మాణం మొదలెట్టిన తర్వాత వూహించని, ఒక్కొక్కప్పుడు పరిష్కారానికి కూడా అందని ఎన్నో చిక్కులు తలెత్తుతాయి. వీటిని చిక్కులనండి, సాధక బాధకాలనండి, స్థూలంగా ఆర్థిక సంబంధమైనవి, సాంకేతిక పరిజ్ఞానానికి సంబంధించినట్టివి; ప్రాంతీయమైనవి, లేక ప్రాజెక్టు సైజు దాని భవిష్యత్తుకు చెందినట్టివి.

అన్నిటికన్న పెద్ద బాధ ప్రాజెక్టు సైజుకు సంబంధించినట్టిది. దీని దైత్యాకారాన్ని వూహించుకొంటేనే ఒళ్ళు జలదరిస్తుంది. ప్రాథమిక సర్వే చేయడానికి మాత్రమే 1000 మంది ఇంజనీర్లు కావాలట. మునూరు ఒకటిన్నర సంవత్సరాలు ఈ సిబ్బంది అహరహం కేవలం సర్వే పనినే చేయవలసి వుంటుందట.

ఇన్ని విఘ్నాలను తొలగించుకొన్నా ప్రాజెక్టు నిర్మాణ ప్రారంభం ఈ శతాబ్దం చివరలో గాని సాధ్యం కాదట. అంటే ఈ తరం వారికి గగనకుసుమ మన్నమాట. ఇంత బ్రహ్మాండమైన ప్రాజెక్టు నిర్మాణానికి పూనుకోవడం దుస్సాహసమే కాకుండా దానికి కావలసిన ధనాన్ని సంపాదించేది ఎట్లు, ఎవరిని పిండాల్సి వుంటుంది? ధనాభావంవల్ల నానాటికి దిగజారుతోన్న మన ఆర్థిక స్థితివల్ల చిన్నతరహా ప్రాజెక్టుల్నే నిర్మించుకోలేక వాయిదా వేసుకొంటుంటే యింత పెద్ద బృహత్తర పథకాన్ని సజావుగా నిర్మించలేం సరికదా వూహించడం కూడా అడియాసేమో అన్న సందేహం కలుగుతుంది. అంత వ్యయంచేసి తెచ్చిన నీరు దక్షిణాపథానికి ఏ విధంగా లాభకారి అవుతుంది?

ఇంత భగీరథ ప్రయత్నంచేసి గంగానదిలోంచి కావేరి వరకు తీసుకరాగలిగే మిగులునీరు 1-2 కోట్ల ఎకరాల అడుగు ఉంటుందని పైన చెప్పుకొన్నాం. ఆ మిగులునీరు కావేరిలో సంగమించడానికి ముందు రెండువందల మైళ్ళు మాత్రమే కాలువ ద్వారా ప్రయాణం చెయ్యాల్సివుంటుంది. అంతచిన్న ప్రయాణంలోని ఆ నీటిని ఎత్తిపోత పద్ధతిద్వారా 2000 అడుగుల ఎత్తుకు తీసుకరావలసి వస్తుందన్న విషయం కూడా ముందే చర్చించబడింది. అంత ఎత్తుకు పంప్ చేయడానికి 60 లక్షల కిలోవాట్ శక్తి కల విద్యుత్తు అవసరమౌతుంది. ఎత్తిపోత పద్ధతిలో మనం తలపెట్టిన చిన్న చిన్న స్కీములే లాభసాటిగా లేక జయప్రదం కావడంలేని ఈ రోజుల్లో అరవై లక్షల కిలోవాట్లకంటే అధికమైన శక్తికల విద్యుత్తు సహాయంతో 2000 అడుగుల ఎత్తుకు నీటిని ఎలా ఎత్తడం?

ఈ ప్రాజెక్టు పూర్తికావడానికి ఏభై-డెబ్బై సంవత్సరాలు పట్టొచ్చు. అప్పటికి టెక్నాలజీ సైన్సు రంగాల్లో వూహించరాని మార్పులు రావొచ్చు. మన సాంకేతిక విజ్ఞానం బాగా అభివృద్ధి చెందిందంటే సముద్ర జలాల్లోని వుప్పుదనాన్ని వేరుచేయగలిగే ప్రక్రియలో మనం సాఫల్యం పొందవచ్చు. అట్టి పరిస్థితి యేర్పడితే కోస్తా తీరాన వున్న సముద్రజలాన్నే అతి సులభంగా లోని పొలాలకు తెచ్చుకొని బంగారు పంటలు పండించవచ్చు. ఈ అభివృద్ధి అంతా పరమాణు విద్యుత్తు ఉత్పత్తి చేయడంలో మనం సాధించబోయే ప్రగతిపై నిస్సందేహంగా ఆధారపడివుంది. అప్పుడు మనం ఇంత భారీమొత్తాన్ని వెచ్చించి కట్టిన ఈ ప్రాజెక్టులు, దాని కోసం పడిన శ్రమంతా వృథా కాదా? గంగానది నుండి తెచ్చే నీటిలో కొంతభాగాన్ని నర్మదానది ద్వారా రాజస్థాన్ ప్రాంతానికి తీసుక వెళ్ళగలిగే విషయం ఇంకా సందేహాస్పదంగానే వుంది.

ఇంత పెద్దతరహా ప్రాజెక్టు నిర్మాణానికి విదేశాలనుండి మంచి అనుభవం కలిగిన ఇంజనీర్లను కూడా పిలిపించాల్సిన అవసరం ఏర్పడొచ్చు. నీటిపారుదల వరదల నిరోధం మొదలైన రంగాల్లో అంతర్జాతీయ స్థాయిలో అనుభవము ప్రఖ్యాతిగాంచిన ఎందరో ఇంజనీర్లు భారతదేశంలో ఉండగా బయటనుండి పిలిపించాల్సినంత అవసరం ఎందుకని కొందరు ప్రశ్నించవచ్చు.

నదీ జలాల వివాదాలు ఇంకా ట్రిబ్యునళ్ళ ఫైళ్ళలో నలుగుతున్నాయి. వాటి పరిష్కారం కుదరక ఎన్నో అంతర్రాష్ట్రీయ ప్రాజెక్టుల నిర్మాణం కుంటుబడిపోయింది. అనేక రాష్ట్రాల సహాయ సహకారం లేనిదే నిర్మాణం పూర్తిచేయడం సాధ్యంకాదు. ఇంతటి విశాలమైన ప్రాజెక్టు నిర్మాణానికి పూనుకుంటే జాతీయ

ఐక్యత సాధించాలన్న మన పవిత్ర లక్ష్యమే దెబ్బతిని రాష్ట్రాల మధ్య కీచులాటలు మరింత ఎక్కువౌతాయేమో !

గంగానదిలోని మిగులు నీటిని దక్షిణ దేశానికి తరలించే ముందు గంగానదీ పరీవాహక ప్రాంతాల అవసరాలు జాగ్రత్తగా పరిశీలించడం ముఖ్యం. హిమాలయ పర్వత దిగువ ప్రాంతం, ఉత్తర ప్రదేశ్‌లో వెనుకబడివున్న తూర్పుభాగం, బీహారు, పశ్చిమ బెంగాలులో ఇంకా ఎన్నో ప్రాంతాల నీటి అవసరాల్ని తీర్చవలసి వుంది. ఫరక్కా బ్యారేజీ, కలకత్తా హార్బరుకు ఇలా వీటన్నిటి అవసరాలకు పోను ఎంతనీరు గంగానదిలో మిగులుతుందో ముందు ఖచ్చితంగా తేల్చుకోవాలి. రాబోయే అవసరాలను లెఖ్ఖకట్టి మనం అంచనా వేయాలి. సంవత్సరానికి మూడు పంటలు పండించాలంటున్నారు. మరి అలాంటి పరిస్థితిలో పైన పేర్కొన్న ప్రాంతాల అవసరాలను పుష్కలంగా దృష్టిలో వుంచుకొనని పక్షంలో ఉత్తరోత్తరా పేచీలు తగాదాలు రావచ్చు. ఇన్ని సమస్యల్నీ కూలంకషంగా అధ్యయనంచేసి వాటికి సమాధానాల్ని వెతికిన తర్వాతగాని దక్షిణ భారతదేశానికి ఎంతనీటిని లభ్యం చేయగలమన్న ప్రశ్నకు సమాధానం దొరకదు. ఉత్తర భారతదేశంలోని ఎక్కువ సారవంతమైన భూముల దాహార్తిచ్చక దక్షిణాపథంలోవున్న తక్కువ సారవంతమైన భూముల తృష్ణతీర్చడానికి పూనుకొంటున్నారని ఔత్తరాహులు కినుక చెందడానికి ఆస్కారం వుంది. అసలు గంగా నదినుండి మిగులు నీటిని దక్షిణానికి తేవడానికి ప్రయత్నించే ముందు అసలు దక్షిణదేశంలో లభించే నీటి వనరులన్నింటిని మనం ఎంతవరకు పూర్తిగాను, సక్రమంగాను వినియోగించుకోగలిగాం అని ప్రశ్నించుకోవాలి.

ఆర్థిక దృష్ట్యా ఇంత పెద్ద బృహత్తర పథకాన్ని అమలు పరచడం ఎన్నో సాధకబాధకాలతో కూడుకొన్నపని అంటూ కొంతమంది అప్పుడే వాదన ప్రారంభించారు. ఇది లాభసాటియా కాదా అన్న విషయాన్ని అటుంచి దాని నిర్మాణం చేపట్టినందువల్ల దేశంలో జనజీవనానికి ప్రబలిపోతోన్న సాంకేతికజ్ఞుల నిరుద్యోగ సమస్య తీరిపోగలదని మరికొందరు వాదిస్తున్నారు. సారాంశం తేలేది ఏమిటంటే ఈ ప్రాజెక్టు నిర్మించడానికి పూనుకొనేముందు దీనిలో నీటి పారుదల లభించే ఎకరా విస్తీర్ణం, దీనికి కావలసిన సాంకేతిక పరిజ్ఞానం, పెట్టుబడి, దానిఫలితంగా పండే పంటల రాబడి, వాటి ప్రతిగా నికర లాభం ఇవన్నీ క్షుణ్ణంగా ఆలోచించాల్సివుంటుంది.

బ్రహ్మపుత్రను గంగానదితో జోడించి గంగానదిని దక్షిణాదినవున్న కావేరీలో కలప గలిగిన నాడు ఓ మహత్తరమైన పరమ పునీతమైన జాతీయ స్వప్నాన్ని సాకారం చేసుకొన్న వాళ్ళమౌతాం. ఒక రాష్ట్రానికీ మరో రాష్ట్రానికీ మధ్య కావలసిన ఇచ్చిపుచ్చుకొనే ధోరణికి ఎంతో దోహదం కలుగుతుంది. దీనివల్ల సౌహార్ద్ర భావన, భావైక్యత ఎంతగానో బలాన్ని పుంజుకుంటాయి. దేశం మొత్తంలో లభించే జలసంపదనంతటిని అన్ని రాష్ట్రాల మధ్య వారివారి అవసరాల మేరకు న్యాయసమ్మతంగా పంపిణీ చేయడం సాధ్యం అవుతుంది. అన్నివైపులకూ అన్ని ప్రాంతాలను తడపగలిగిననాడు "సస్యశ్యామల వసుంధర" అన్న ప్రతిభారతీయుని మనోరథం ఈడేరుతుంది. ఇది మన జాతి ఔన్నత్యానికీ, పురుషార్థానికి సవాలు. ఆనాడు భగీరథుడు ఘోర తపస్సు చేసి దివినుండి భువికి గంగను తెచ్చాడంటారు. ఉత్తరాపథానికే పరిమితమైన గంగను మన ఇంజనీరింగ్ శాస్త్రజ్ఞులు తమ ప్రజ్ఞా ప్రాభవాలను ఉపయోగించి దక్షిణాపథానికి తేగలిగితే అపర భగీరథులన్న మాట. సంకల్ప బలం కలిగిన జాతికి ఏ భగీరథ ప్రయత్నమూ కష్టసాధ్యమైంది కావచ్చు కానిదుస్సాధ్యం మాత్రం కాజాలదు.

ఈ సంచికలోని రచయితలు

శ్రీయుతులు :

పి. వి. నరసింహారావు, ముఖ్యమంత్రి,
కిర్లపాలెము కుటుంబశాస్త్రి, రామచంద్రపురం, హైదరాబాదు-32
కంచి వాసుదేవరావు, జర్నలిస్టు, తెనాలి
ఖాదర్ అలీఖాన్, అడిషనల్ డైరెక్టర్, పరిశ్రమల శాఖ
పి. రాజేశ్వరరావు, జర్నలిస్టు, ఏలూరు
శ్రీపాద లక్ష్మీనారాయణమూర్తి, రాజాం, శ్రీకాకుళం జిల్లా
రేవూరు అనంత పద్మనాభరావు, కందుకూరు, ప్రకాశంజిల్లా
జె. బాపురెడ్డి, అసిస్టెంట్ సెక్రటరీ, సచివాలయం, హైదరాబాదు
దేవులపల్లి కృష్ణశాస్త్రి, మద్రాసు
మధురశ్రీ, పెద్దాపురం, తూర్పుగోదావరి జిల్లా
చావలి రామమూర్తి, స్మాల్ సేవింగ్స్ ఆర్గనైజర్, నిజామాబాదు
స్వాము, బరంపురం, ఒరిస్సా
తాతిరాజు, బరంపురం, ఒరిస్సా
జె. వీరాస్వామి, న్యాయశాఖ కార్యదర్శి, సచివాలయం, హైదరాబాదు
యర్రమిల్లి చలపతిరావు శ్రీవత్సవ, చౌడువాడ, విశాఖజిల్లా
గుంటి పుండరీకాక్షయ్య, శ్రీకాకుళం
టి. ఉదయవర్లు, ఆంధ్రజ్యోతి కార్యాలయం, హైదరాబాదు
క్రోవి రామారావు, సమాచారశాఖ, హైదరాబాదు
ముదిగొండ వీరభద్రమూర్తి, హైదరాబాదు
పి. రాజగోపాలనాయుడు, ఎం. ఎల్. సి. చిత్తూరు
పోకూరి శ్రీరాములు, సమాచారశాఖ, హైదరాబాదు
ఎస్. ఆర్. కోటేశ్వరశర్మ, ఎల్. ఐ.సి. హైదరాబాదు
కప్పగంతుల లక్ష్మణశాస్త్రి, హైదరాబాదు
ముద్దసాని రాంరెడ్డి, జర్నలిస్టు, ఊటూరు, కరీంనగర్ జిల్లా

భాగ్యనగరంలో

ఫ్రెంచి యోధుని స్మృతి చిహ్నాలు

''మహేశ్''

ఆంధ్రప్రదేశ్ రాజధాని భాగ్యనగరం అనేకానేక చారిత్రిక కట్టడాలకు నిలయమై శతాబ్దాలుగా ప్రపంచ ప్రఖ్యాతిని సంతరించుకొంది. శోభలు చిలకరిస్తూ, కాంతికళికలు గులకరిస్తూ దీప్తివంతమైన పెక్కు నిర్మాణాల్లో జౌచిన్ రెమాండ్ పేరుగల ఫ్రెంచి యోధుని సమాధి, దాని పరివృత్తమైన యితర ముఖ్య కట్టడాలు ఘనంగా చెప్పుకోదగ్గవి.

హైదరాబాదు పట్టణానికి ఆగ్నేయంగా మూడు కిలోమీటర్ల దూరంగా మలక్‌పేటకు ఎగువలో విజయవాడకువెళ్ళే జాతీయ రహదారికి పశ్చిమంగా కొలది దూరంలో పరిఢవిల్లేవే ఫ్రెంచి యోధుని స్మృతిచిహ్నాలు. 180 అడుగుల యెత్తు, 33 అడుగుల వెడల్పుగల ఒక చిరు పర్వతంపై 23 అడుగుల యెత్తుగల కోణాకారపు సమాధి కట్టడం చూపరుల నయనాలను ఆకర్షించగలదు. ఇచ్చటనుండి పరిసర ప్రాంత దృశ్యం సుందరాతిసుందరంగా గోచరిస్తుంది. ఇది శిలా నిర్మాణం. ఈ సమాధిపై ఆంగ్లంలో "జె. ఆర్" అనే అక్షరాలు అతని నామానికి సంక్షిప్త సంకేతాలుగా వ్రాయబడివున్నాయి.

ఈ సమాధిముందు చదునైన కప్పుగల మందిరం గలదు. ఈ మందిరానికి ఆసరాగా 28 స్తంభాలు అలంకృతమై వున్నాయి. ఈ నిర్మాణంలో గ్రీకుభవనరీతి దోబూచులాడుకుంటూవుంది. ఇది నిరాడంబర సౌందర్య ప్రతీక. సమాధిలోగాక కొన్ని రెమాండ్ యొక్క ముఖ్య దేహావశేషాలు మందిర గర్భంలో నిక్షిప్తం చేయబడట్లు చెప్పబడుతుంది. మందిర ముఖభాగాన నిజాం పతాకంపై శిలువ చిహ్నంగల చెక్కడం కొట్టవచ్చినట్లు కన్పిస్తుంది.


ఇటీవల వరకు నగర ప్రజలు—క్రైస్తవులు (ముఖ్యంగా కాథలిక్కులు), మహమ్మదీయులు, హిందువులు మత భేదాలను విస్మరించి, భక్తి ప్రపత్తులతో రెమాండు మరణదినాన, అతని గౌరవార్థం వైభవంగా గొప్పఎత్తున సమాధివద్ద "ఉర్సు" త్సవం జరుపుకునేవారు. ఈ ఉత్సవాల్లో పాల్గొనేవారి సంఖ్య వేలకొలది వుండేదట. ఆ రోజుల్లో సమాధిచుట్టూ మందిరం యావత్తూ నిండుగా దీపాలతో అలంకరించి, మందిరపు గర్భభాగంలోని గూడులో దీప ప్రమిదలను వెలిగించి, కాంతిపుంజాలను వెదజల్లచేసేవారట. ఆ దినాన ఫ్రెంచి యోధుని గౌరవార్థం సైనిక వందనాలు, ఫిరంగి కాల్పులు మొదలగు, సైనిక గౌరవ చిహ్నాలు ఉత్సవంలో భాగాలైవుండేవి. రెమాండు క్రింద పనిచేసిన 15 వేల మంది సైనికుల వారసులు కొన్ని గంటల తరబడి సమాధి వద్ద వినమ్రులై, రెమాండు ఆత్మను పూజిస్తూ ఆ దినాన గడిపేవారు. తర్వాత విందు భోజనాలు ఆరగించేవారు

భారత దేశంలో ప్రజాదరణ పొందిన పాశ్చాత్య యోధులలో రెమాండు ముఖ్యుడు. ఈతనిని హిందువులు 'మూసారామ్' అని, మహమ్మదీయులు 'మూసా రహీమ్' అని ప్రేమగా పిల్చేవారు. ఈతని పేర్న వెలసిందే "మైసారామ్ బెక్కడీ" పేట. నేటికి నిల్చియున్న ఈ పేట అతని ఘనతకు, సాహసోపేత కృత్యాలకు, ప్రజా సేవకు, మతాతీత దృక్పథానికి నిదర్శనాలు. అతనిపై గాథలెన్నో వెలసి, తరతరాలుగా కీర్తింపబడుతున్నాయి ఈ ఫ్రెంచియోధుడు ఫ్రాంసు దేశంలో గాస్కనీలో క్రీ. శ. 1755లో జన్మించి, 20వ యేట తండ్రితోపాటు భారత దేశానికి వర్తకం కోసం బయలుదేరి, 1775 చివరిభాగంలో పాండిచేరి చేరాడు.

వర్తకం కోసం వచ్చిన చాలా మంది పాశ్చాత్యుల మాదిరే రెమాండు కూడా తలవని తలంపుగా యుద్ధ యోధుడై సాహస కృత్యాలను పెక్కింటిని చేశాడు. పాండిచేరి నుండి మైసూరు చేరి హైదరాలి సైన్యంలో "సబ్ లెఫ్టినెంట్" గా ఉద్యోగంకు కుదిరాడు. భారత దేశంలో అతని సైనిక జీవితానికి యిది నాంది. దక్షిణ భారత దేశాక్రమణ సమరంలో 1780లో మైసూరుకు ఆంగ్లేయులకు జరిగిన పోరులో రెమాండు పాల్గొని, తన ధైర్య సాహసాలవల్ల హైదరాలి అభిమానాన్ని చూరగొన్నాడు.

హైదరాలి మరణానంతరం బుస్సీ సైన్యంలో చేరి 1785 వరకు పాండిచేరిలో కెప్టెన్‌గా కాలంగడిపాడు. తర్వాత భాగ్య





నగరంచేరి నిజాంపాలకుని తనయుల్లో ఒకడైన సలాబత్‌ఖాన్ ఆశ్రయం పొందాడు. తదుపరి ఆంగ్లేయుల ప్రాభవంచే నిజాంఆలీ రాజ్యాధినేత కావింపబడ్డాడు. ఫ్రెంచి-ఆంగ్లేయుల రాజ్య విస్తరణ వైరంలో ఫ్రెంచి దేశస్థుల పలుకుబడి దేశంలో క్షీణదశకొచ్చినా, వ్యక్తిగత సామర్థ్యంవల్ల 1786 లో నూతన నిజాం ఆలీ మన్ననలను, ఆదరాన్ని సంపాదించుకొన్నాడు. అప్పటి నుండి 13 సంవత్సరాలపాటు, తన మరణం వరకు భాగ్యనగరంలో రెమాండ్ ఘనంగా గడిపాడు.

దేశీయుల పాలన పటుప్రాంతాల్లో అస్తమించి, యిరోపావారి పాలన అంకురార్పణ కావడంతో దేశీయ సైనికులు పలువురు నిరుద్యోగులయ్యారు. అందు జీవనం కోసం కొందరు బందిపోటు దొంగలుగా మారారు వారే పిండారీలు, ధగ్గులనబడే దొంగల గుంపులు. హైదరాబాదు సమాజ జీవనంలో వీరిబెడద కొండంతలై ప్రజారక్షణ దూరమైంది. ఈ ముఠాలను చాకచక్యంగా రెమాండ్ అణచివేసి దేశంలో శాంతిని నెలకొల్పాడు. ప్రస్తుతం ఆబిడ్ రోడ్డుకు ఎగువలోవున్న "గన్ ఫౌండ్రి" స్థాపనకు, అచ్చట మందుగుండు సామాగ్రి తయారుకు కూడా రెమాండ్ ముఖ్య బాధ్యుడు.

సరియగు శిక్షణలేని ప్రాంతీయ సైనికులను చేరదీసి, పాశ్చాత్యరీతుల్లో తగిన సైనిక శిక్షణ ఒసంగి, ఫ్రెంచి సైనికాధికారుల ఆధ్వర్యంలో చక్కని సైనిక శక్తిని నైజాంలో కూర్చి, దేశ రక్షణకు ప్రాణంపోశాడు. వారికి సరిపోను ఫ్రెంచి వర్తకుల నుండి అధునాతన యుద్ధ సామగ్రిని తక్కువ ఖరీదులో కొని నిజాం పొగడ్తలకు కారకుడయ్యాడు. 1790 లో టిప్పుసుల్తాన్ పై నిజాంపాలకుడు, ఆంగ్లేయులు యుద్ధం చేశారు. రెమాండు సుశిక్షితులైన 700 మంది సైన్యంతో ఆ యుద్ధంలో పాల్గొని అద్వితీయ సాహస కృత్యాలను ప్రదర్శించి, నవాబు సంతోషానికి పాత్రుడయ్యాడు. నెలసరి 5000 జీతంతో సైన్యాధిపతిగా గౌరవం పొందాడు ఇదిగాక సాలుకు 52 లక్షలు ఆదాయంగల జాగీరుకు అధినేతగా కావింపబడ్డాడు. అంతటితో రెమాండ్ ప్రాధాన్యం, సైనిక ప్రముఖతలు అంతంతలుగా పెరిగాయి.

ఈతని చివరి సైనిక చర్య ఖర్దా వద్ద మహారాష్ట్రులతో జరిగిన యుద్ధం. అప్పుడు తన క్రింది 16000 సైన్యాన్ని తీసుకెళ్లాడు. అదిగాక సర్వసైన్యాధ్యక్షుడుగా నియమింపబడ్డాడు. మహారాష్ట్రుల సైన్యాధిపతి "పెర్రాన్". అతను కూడా ఫ్రెంచి దేశస్థుడే. నమ్మిన దేశంకోసం నిజాం విజయం కోసం, స్వామి భక్తితో, నిజమైన సైనికుడుగా మరో ఫ్రెంచి యోధునితో హోరాహోరీగా పోరాటం జరిపాడు. విజయం కనుచూపు మేరలో వుందనగా, రక్తపాతానికి జడిసి నిజాం అంతఃపుర కాంతల చపలత వల్ల నిజాం ఆలీ తన సైన్యాన్ని వెనుకకు మరలించమని ఆజ్ఞలొసంగాడు. యోధునిగా ఆ భీరువు చర్యకు యిష్టం లేకపోయినా, ప్రభువు ఆదేశానుసారం తలొగ్గక తప్పలేదు రెమాండుకు. ఫలితం నిజాంకు ఘోర పరాజయం.

ఈ విఫల యుద్ధానంతరం కూడా హైదరాబాదు సంస్థానంలో రెమాండు ప్రాభవం సన్నగిల్లలేదు. నిజాంపై గద్దెకోసం తనయుడు ఆలీజా తిరుగుబాటు చేస్తే, నిజాం ఆజ్ఞానుసారం ఆ తిరుగుబాటును విజయవంతంగా అణచివేశాడు. సైనికశాఖకు సంపూర్ణాధికారిగా నియమితుడై (అమీనజిస్సి), సామర్థ్యంతో ఉద్యోగం కొనసాగించాడు. ఈతని ఘనత, గౌరవాలు ఆంగ్లేయాధికారులకు కూడా అసూయ కల్గించేవి. నిజాం ఆంగ్లేయులతో సైన్యసహకార ఒడంబడిక (1799) చేసుకొనే సమయానికి ముందుగా కొన్ని నెలల క్రితం అనూహ్య కారణాలవల్ల అకస్మాత్తుగా రెమాండ్ మరణిస్తాడు. మృత్యు కారణం ఈ నాటికి గోప్యంగానే వుండిపోయింది పెక్కు స్వదేశీ, విదేశీ అధికారులు రెమాండ్ వ్యక్తిత్వాన్ని, ఔదార్యాన్ని సహాయనైజాన్ని నేర్పును, సమయస్ఫూర్తిని కొనియాడేరు అందుకు తార్కాణంగా అతని కొసంగబడిన చారిత్రక ప్రాధాన్యంగల అనేక యోగ్యతా పత్రాలు నేటికీ భాగ్యనగరంలో భద్రపరచబడ్డాయి.

రెమాండ్ సమాధి గల పర్వతానికి ఉత్తరంగా అనుకొని వున్న మరొక చిన్న కొండపై ఎలిజబెత్ జెంకిన్స్ అనే ఫ్రెంచివనిత సమాధిగలదు. ఈమెను గూర్చి వివరాలు చరిత్రకంతగా ఎక్కలేదు. బహుశా నిజాం ఆస్థానంలో పనిచేసిన ఒక ఫ్రెంచి ముఖ్యోద్యోగి యొక్క భార్య కావచ్చు. సమాధిపై "ఇక్కడే 26-11-1809 న ప్రసవసమయాన మరణించిన అని జేన్ ఎలిజబెత్ దేహావశేషాలు నిక్షిప్తం చేయబడ్డాయి. వయస్సు 21 సంవత్సరాల, ఆరునెలలు. ఇచ్చటనే — పుట్టిన కొద్ది సమయానికి అసువులుబాసిన ఆమె పసి కుమారుని దేహావశేషాలున్నాయి-" అనే మాటలు ఆంగ్లంలో వ్రాయబడి వున్నాయి. ఇచ్చటనే చుట్టూ పెక్కు ప్రముఖ ఫ్రెంచి దేశస్థుల సమాధులు కూడ వున్నాయి.

రెమాండ్ సమాధికి క్రింది అంచునుండి సుమారు ఎంద గజాల దూరంలో "ప్రతిధ్వని కేంద్రం" వుంది. ఇచ్చట మనం ఎటువంటి చప్పుడు చేసినా, ప్రక్కగల లోయలో, ముందున్న కొండపై, పరిసర ప్రదేశాలనుండి ప్రతిధ్వని స్పష్టంగా అంతరించియే వినబడుతుంది. ఇది ఆనాటి నిర్మాతల సాంకేతిక నిపుణతకు చక్కని ఉదాహరణ.

ఇక్కడనే "ఆస్మాన్ ఘర్" అనే సుందర భవనం గలదు. ఇది హైదరాబాదు రాజ్యానికి ప్రధానమంత్రి అయిన "సర్ నవాబ్ అస్మాన్‌జా" చే నిర్మించబడి, రమ్యతను పుణికి పుచ్చుకుంది. ఇది పీఠంపైలో, స్థలౌన్నత్యంలో శోభలో యాత్రికుల్ని చకితులను గావించగలదు. బస్సులో ప్రయాణంచేసేవారికి మలక్‌పేటకు ముందు ప్రత్యేకమైన గుట్టమీద—నిండుగా హుందాలో కన్పడుతుంది.

ఫ్రెంచియోధుని స్మృతిచిహ్నాల నిర్మాణాలకు సుమారు కిలోమీటరు దూరంలో ఆనాటి ఫ్రెంచి ఉద్యానవనాలున్నాయి. ఆ రోజుల్లో యిచ్చటనే రెమాండు, అతని సైనికులు నివశించేవారట. వారి గృహ శిథిలాల్ని నేటికి మనం చూడవచ్చు. ప్రస్తుతం రెమాండుకు సంబంధించిన నిర్మాణాలు పురావస్తు శాఖాధ్వర్యంలో వున్నాయి.

సమాధికి కనుచూపు మేరలో, దిగువగా వెంకటేశ్వర స్వామికి కైంకర్యం చేయబడ్డ ఒక ప్రాచీన దేవాలయంవుంది. భాగ్యనగర సందర్శనార్థం విచ్చేసే విహార యాత్రికులు ఈ ప్రదేశాలను తప్పనిసరిగా చూడతగ్గవి. ఇచ్చటకొచ్చిన యాత్రికులు రెమాండ్ కృత్యాలను స్మృతికి తెచ్చుకొని, వారి మనస్సులను సాహసోపేత మధ్యయుగంనాటి వైభవ కాలానికి మరలించుకోగలరని నా నమ్మకం. వింత అనుభూతులను కల్గించే చక్కని స్థావరమిది.

(వందేమాతరం)

45 వ పుట తరువాయి

ముప్పది సెకండ్లు వాని నిముసముకు స
గమునకు సగమ్ము తగ్గె మార్గమ్ము పొడుగు
ప్రకృతి పచ్చదనమ్ము గాపాడు మొప్పు
నవ్వుతోడ నా కుంకర్ణి సడచునప్పుడు.

వచ్చి యుత్తరమ్ము నిచ్చి సోనాజీ క
తండు చిక్కువాని చిక్కిన చుట్టు
కవుల కందజేయ గానలో బడి పోయె
భాగ్యనగర మేగు పథము దప్పి.

చినిగిన దయ్యి బాగ విలపింప జగానరిగంపుతోడ నెం
డ నెనియె తీరని నౌ తలపునన్ జలదంగుళి యామునేగు పా
గెను నిలవేసి దోచుకొనె గేదుచు వొంగల గుంపొండు పో
యెను దలసౌరు జోడునకు నీడగు పైయుడు పూడె సంచియున్

పూనడు చింత సంచిరయి బొంకకునై తుల్జాపురంపు శ
ర్వాణికి మొక్కు దీరిచిన పట్టున బూనిచె దల్లి తండ్రి షే
ర్వాణిని దండ్రీ తండ్రి యిడె పాగను దా గరిణమ్ముగా గనే
గానుక పేరు నిల్పు మని, గాసిలె నాతడు వీసికై మదిన్

ఉత్తరములు పోయెనో నానసాహెబు
నింక నొక్కమారు నేగి మ్రొక్క
వచ్చు నవ్వి యివ్వ వచ్చునా! యందునుం
బాగ చుట్టుకొనియె ప్రాణమునకు.

అది పోవన్ దల యుండి యూడినటులే యై యద్విధాహార మే
ని దినన్ మానె్కనె నాటి పూట ధన ముండెన్ గోచిలో దాచుకొ
న్నదిగా మూడు వరాల మూట భళి! రంగారావు చాతుర్య ము
న్మదచోరాళుల మిర్య మంచు నగికొన్నా డాతడా మూటతో.

భారతమును చిరవిభుతా
దూరతమము సేయ బోర దొడర దనకు ము
ష్మారు పిలిచి చెప్పెను నా
నా రాణునకై యతండు సలుపెస రోసెన్.


ప్రాసెం బత్రిము గాశి రాము డను నెవ్వాడో నిబద్ధింప బా
గే సైన్య ష్మారువేలు వాడు తనకున్ గిల్కొల్ప దా ద్రోచున
ట్లా సందర్భమునం దొసంగెను ధనం బమ్మ్మవ్వరాలుం బయా
నా సెల్లించె నతండు వ్రాయి యిర దన్నా! క్రుమ్మరెన్ రోయికై

అందఱునుం బ్రిభుత్వమనినంతనె గుండెలు జాటినట్టులై
యందయు నీయరైరి ధనవంతులు నాలుకపైని దేశభ
క్తిం దగువారు పాగె తిరిగెన్ దిరిగెన్ దన కాళు లీచబో
వెందురి డస్సి చేడుపడి వాడి కృశించెను నించె నశ్రుఃన్.


సంచులు క్రుమ్మరించి ప్రతిశాఖిని శాలను గుర్తెఱుంగు వా
గించిత పత్రలం బెనిచి రా రెసిడెంటు నిజాము వేగు నం
దించిన వివ్వి పాదయుగదృష్ట వృత్తమ్ములు రంగరావుకై
పొంచులు వేసి కాచినవి పో నరవాసన వచ్చు నెల్లెడన్.

వాడొకండు వచ్చి స్వామి! నిమంత్రిణం
బెవరు తమ రసంగ బ్రవర నొడివి
రంగరావు చెవులు గింగురు మన నీల
బద్ధు డయ్యె వాడు వారు గాగ

యావజ్జీవము బందీ
యై విడచెను బుడమి మూడు నబ్దమ్ములలో
నా విమలుడు పెక్కురు కా
గావాసులు వానివలని సని వినుపించెన్.



నల్గొండ జిల్లా, నకరేకల్లులో ప్రధాన మంత్రి




కడప జిల్లా ఎర్రగుంట్లలో ప్రధాని ప్రసంగాన్ని అనువదిస్తోన్న ముఖ్య మంత్రి


ఆంధ్రప్రదేశ్ లో ప్రధాని పర్యటన

రాష్ట్రంలోని అనావృష్టి ప్రాంతాలను ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీ దర్శించారు.

ముఖ్యమంత్రి శ్రీ పి. వి. నరసింహారావు ప్రధాని వెంట పర్యటించారు.



విశాఖ జిల్లా అనకాపల్లిలో ప్రధానికి ఘనస్వాగతం



నకరేకల్లులో జరిగిన బహిరంగ సభలో ప్రధానికి వెండి కిరీటం బహూకరణ

మహాభారతము

తెంపుగంటుల లక్ష్మణశాస్త్రి

"వీరుడు 'సరయూ' అను పత్నినుండి 'సిద్ధి'యను పుత్రిని గనెను. ఈ సిద్ధి తన తేజస్సుతో సూర్యుని తేజస్సును గూడ కప్పివేసెను. అప్పుడు సూర్యుడు అగ్నిదేవతాకమగు యజ్ఞమును చేసెను. 'అగ్నిమగ్న ఆవహ' యను నాహ్వాన మంత్రముతో ఈ 'సిద్ధి' యను నగ్నిస్తుతియే చేయబడును. బృహస్పతి రెండవ కొడుకు పేరు 'నిశ్చ్యవనుడు'. ఇతడు ఎప్పుడు గూడ 'యశస్ - తేజస్ - కాంతి' అను నీ మూడింటిచేత 'చ్యుతుడు' (విడువబడువాడు) కాడు కనుక నితనికి 'నిశ్చ్యవన' నామము సార్థకమైయున్నది. ఈ పేరుగల అగ్ని పృథివీదేవత యొక్క స్తుతి మాత్రము చేయును. 'తస్యావాచాస్పృషా, పృథివీ చాగ్నిశ్చ' అను వేదమంత్రము ప్రకారము ఈ నిశ్చ్యవనుడను నగ్ని వాక్కుయొక్క అభిమాన దేవతయగును. అతని పుత్రుడు 'సత్య' అను పేరుగల యగ్ని ఇతడు తండివలెనె పాపరహితుడు—కాలధర్మమును ప్రవర్తింపజేయువాడు అతడు, పీడితులై ఆర్తితో అరచు ప్రాణులను కష్టమునుండి కాపాడును. కనుక నీయగ్నికి 'నిష్కృతి' యని మరియొక పేరుగూడయున్నది. ఇతడే మానవుల యిండ్లకు, ఉద్యానములకు శోభను కలిగించును. ఈ సత్యుని పుత్రుడు 'స్వన' నామకుడు. ఈ స్వనునిచే పీడితులై జనులు హాహాకారము చేయుచుందురు. అందులకే అతనికి 'స్వన' నామము సార్థకమైనది. అతడు రోగకారకుడగు 'అగ్ని'.

"బృహస్పతి యొక్క మూడవకొడుకు 'విశ్వజిత్' అనువాడు ఇతడు సర్వ ప్రపంచము యొక్క 'బుద్ధి'ని తన వశము నందుంచుకొనును. అందుకే అతనికి 'విశ్వజిత్తు' అను పేరు సార్థకము. బృహస్పతి నాల్గవకొడుకు 'విశ్వభుక్' అను నగ్ని. ఇతడు అందరి హృదయములో నివసించుచు వారు తినిన ఆహారమును జీర్ణము చేయుచుండును. ఈ యగ్నిని బ్రాహ్మణులు 'పాకయజ్ఞ' ములలో పూజించెదరు. పవిత్రయగు 'గోమతీ'నది యితని పత్ని. ఈ 'విశ్వభుక్' అగ్నితోనే బ్రాహ్మణులు సమస్త కర్మలను అనుష్ఠించెదరు. బృహస్పతికి 'ఊర్ధ్వభాక్' అనుపేరుతో నైదవ కొడుకు కలిగెను. ఈ యగ్ని అతి భయంకర బడబానల రూపముతో సముద్రజలమును శుష్కింప జేయుచుండును. ఈయగ్ని ప్రాణుల శరీరములలో నూర్ధ్వగమనముకలదై 'ఉదాన' నామముతో ప్రసిద్ధమైయుండును. అందుచేత నితనికి 'ఊర్ధ్వభాక్' అను సార్థకనామము. దీనిని ప్రాణవాయువు ఆశ్రయించి యుండును. ఇది భూత—భవిష్యత్—వర్తమాన కాలములను దర్శించగలదు.

"బృహస్పతి యొక్క ఆరవకొడుకు పేరు 'స్విష్టకృత్' అని. గృహ్యాగ్ని కర్మలలో (వివాహాదులలోను—నిత్యమున్ను హోమము చేయునగ్ని) ఈ యగ్నియందు నేతిధారను ఉత్తరాభిముఖముగా విడుచుచుందురు. దానిచేత ఇష్టసిద్ధి కలుగును. అందుకే దానికి 'స్విష్టకృత్' అని సార్థ నామమేర్పడినది. అగ్ని స్వరూపుడగు బృహస్పతికి ప్రాణులపైన క్రోధము గలిగినప్పుడతని శరీరమునుండి ఉత్పన్నమగు స్వేదము (చెమట) అతని కూతురి రూపములో పుట్టెను. ఆమెకు 'స్వాహా' అని పేరు. ఆమెకు కోపమధికము, క్రూరురాలగు ఆ కన్యక అన్ని జంతువులయందును నివసించియుండును. ఆమెకు 'కామ' అను పేరుగల పుత్రుడు కలిగెను. ఆ కామునితో సమానుడగు రూప సౌందర్యవంతుడు మూడులోకములలో లేకుండెను. ఇతనినే 'కామాగ్ని' యందురు. మనస్సులో సర్వదా కోపము గలిగియుండి, ధనుస్సు - బల్లెము ధరించి రథములో కూర్చొని యుద్ధమునందు హర్షోత్సాహములతో శత్రునాశము చేయుచుండు అగ్నికి 'అమోఘ' అనిపేరు. యుధిష్ఠిరా! ఏ యగ్నిని బ్రాహ్మణులు మూడువిధములగు 'ఉక్థ' మంత్రములచేత స్తుతించుచుందురో, ఎవడు మహాకావ్యమగు 'పరా' అను వాక్కును ఆవిష్కరించెనో, ఎవనిని జ్ఞానులు తమకు శాంతిగూర్చువాడని తలచెదరో ఆ యగ్ని పేరు 'ఉక్థ'ము అని తెలిసికొనుమని మార్కండేయముని చెప్పి తరువాత నిట్లనుచున్నాడు :—

'పాంచజన్య' అగ్ని జన్మ—అతని సంతతి

"కాశ్యప-వాసిష్ఠ-ప్రాణ-చ్యవన-త్రిపర్చస్, అనునైదుగురు అగ్నులు తమకు బ్రహ్మదేవునితో సమానులు కీర్తిమంతులు, ధర్మిష్ఠులునగు పుత్రులు కలుగవలెనని యనేక సంవత్సరములు తీవ్రముగా తపస్సు చేసిరి. అగ్నిస్వరూపులగు నా ఋషులు 'భూః, భువః, స్వః, మహః జనః' అను నైదు మహావ్యాహృతులతో పరమాత్మ ధ్యానము చేసిరి. అప్పుడు వారియెదుట అత్యంత తేజోమయుడు, ఐదురంగులుగల యొక పురుషుడు కనపడెను. అతడు జ్వాలలచేత భాసించుచున్న అగ్నివలె ప్రకాశించుచుండెను. అతడు

సర్వజగత్తును సృజించుటకు సమర్థుడై యుండెను. అతని శిరస్సు అగ్నివలె, బాహువు సూర్యునివలె, కన్నులు-చర్మము సువర్ణము వలెను దేదీప్యమానములై యుండెను. అతని పితృలు మాతృలు సల్లగానుండెను. ఐదుగురు మునులవలన ఐదు వంశములు గల పురుషుడు గలిగినందుచేత నతనికి 'పాంచజన్య' నామము సార్థకముగా నేర్పడెను. ఆ పురుషుడు ఆ యైదుగురు మునులకు వంశకర్తయయ్యెను.

"పాంచజన్యుడను అగ్ని పదివేల సంవత్సరములు ఘోరమగు తపస్సుచేసి తనతండ్రుల వంశమును ప్రవర్తింపజేయుటకు భయంకరమగు నగ్నిని కనెను. ఆ యగ్నికి 'దక్షిణాగ్ని' అనిపేరు. ఆ విధముగా పాంచజన్యుడు శిరస్సు నుండి 'బృహత్' అను సామమును, ముఖమునుండి 'రథంతర' సామమును కనెను. ఈ రెండు సామములు అతివేగముగా ఆయుస్సును హరించును. కనుక వీనికి 'తరసాహర' నామము ఏర్పడెను. తరువాత నతడు నాభినుండి రుద్రుని, బలమునుండి యింద్రుని, ప్రాణము నుండి వాయుదేవుని - అగ్నిదేవుని కనెను. రెండు భుజములనుండి 'ప్రాకృత-వైకృత' భేదములుగల రెండు 'అనుదాత్త'ములను, మనస్సు - చక్షురాదిజ్ఞానేంద్రియములకు అధిష్ఠాన దేవతలను, పృథివ్యాది పంచమహాభూతములను కనెను. ఈ సృష్టియంతయు చేసిన తరువాత ఐదుగురు తండ్రులకొరకు మరల నైదుగురు పుత్రులను పుట్టించెను. వారి పేర్లు ఇవి. వాసిష్ఠునకు 'ప్రణిధి', కాశ్యపునకు 'మహాన్తరుడు', చ్యవనునకు 'భానుడు', త్రివర్చసునకు 'సౌభరుడు' ప్రాణకునకు 'అనుదాత్తుడు' అను పుత్రులు ఐదుగురు ఈ విధముగా వెరసి యిరువదియైదుగురు పుత్రులను పాంచజన్యుడు కనెను

అథర్వాతి 'తప' నామధేయుడగు పాంచజన్యుడు యజ్ఞమునకు విఘ్నములు కలిగించు 'సుభీమాదు' లగు నైదుగురు వినాయకుల ఉత్పత్తిని తొలుతచేసెను. వీరు 'ఉత్తర దేవ'రూపులు. ఆ తరువాత దేవరూపులగు 'సుమిత్రాదు' లగు నైదుగురు వినాయకులను, 'సుర ప్రవీరాదు'లగు నైదుగురిని పుట్టించెను. ఈ విధముగా పదునైదుగురు యజ్ఞవిఘ్నకారకులగు వినాయకులను, ఐదైదుచొప్పున మూడు వర్గములగా నుత్పత్తి చేసెను. వీరు భూలోకములో నివసించుచు కూడ దేవ లోకమునందు చేయబడు యజ్ఞముల సామగ్రిని అపహరించుచుండిరి. అగ్నుల హోమ ద్రవ్యములను హరించుచు అగ్నులను నష్టముచేయుచు అగ్నులయందు వీరికిగల ద్వేషభావము[స్పర్థ] చేతనే యిట్లు చేయుచుండిరి. అప్పటినుండియే యజ్ఞశాలలలో వెలుపటి వేదికయందు ఈ వినాయకులకు వేరుగా హవిర్భాగమును ఉంచు పరిపాటి యేర్పడెను. ఎందుకనగా, హోమాగ్ని ప్రజ్వలితమై ఆహుతులను స్వీకరించునప్పుడా యగ్నిదేవుడు తన యిరు పార్శ్వములందలి జ్వాలలచేత వినాయకులను దగ్గరికి రాకుండ తొలగించుచుండును. మంత్రములచేత శాంతింపబడిన తరువాత వినాయకులు యజ్ఞహవిస్సును అపహరింపజాలరు. యజ్ఞకర్మ ఆరంభింపబడిన సమయములో పాంచజన్య పుత్రుడగు 'బృహదుక్థ' నామకుడు భూలోకమునందుండగనే పూజింపబడును. 'రథంతర' పుత్రునకు ఇవ్వబడిన హవిస్సు 'మిత్రవింద' దేవతా భాగమగునని యజుర్వేద విద్వాంసులు చెప్పెదరు. ఈ పుత్రులందరితోను తపుడు (పాంచజన్యుడు) మహానందము ననుభవించుచుండును.

అగ్నులు తపుడు, భానుడు-వీరి సంతతి

"శంయుని పౌత్రుడు ఊరుని పుత్రుడునగు భరతుడు [అగ్ని] అతి నియమముతో [illegible] 'పుష్టి'ని ఇచ్చును గనుక నతనికి 'పుష్టిమత్' యనికూడ పేరు. సమస్త ప్రజలను పోషించుచు [illegible] గనుక నతనికి 'భరతుడు' అని [illegible] 'శివ' అను పేరుగల అగ్ని శక్తిని ఆరాధించుటకు [illegible] ప్రజలకు శివము [మంగళము]ను చేకూర్చును గనుక అది అతనికి సార్థకనామము.

పాంచజన్యునకు తపోబలముచేత కలిగిన ఐశ్వర్యము పెరిగి పెద్దదయ్యెను. ఈ సంపదను పొందవలెనను నాశతో ఇంద్రుడు 'పురందర' నామముతో పాంచజన్యునకు పుత్రుడయ్యెను. పాంచజన్యునకు కలిగిన నలుగురు మంది పుత్రులేకాక 'పురందర-ఊష్మ-మను-శంభు-ఆవసథ్య' నామకులగు మరి యేనుగురు పుత్రులు కలిగిరి. 'ఊష్ముడు' సర్వప్రాణులలో ఉష్ణత్వము ద్వారా ప్రకటితుడగుచుండును. 'మను' అను కొడుకు 'ప్రాజాపత్య' నామకాగ్నిని కలిగించెను. 'శంభు-ఆవసథ్య' అను నిరువురు అగ్నులు వేదశాస్త్ర పారంగతులగు బ్రాహ్మణుల స్వరూపములో ప్రకటితులగుచుందురు. ఇట్లు ఈ యేనుగురు పాంచజన్యుని పుత్రులు. అగ్ని రూపముగల వీరికోనే యజ్ఞమునందు హోమముని పేర ఆహుతులీయబడును. ఈ యేనుగురును సువర్ణకాంతితో, బల-శౌర్యములు కలిగించు శక్తితో, దేవతలకు హవిస్సును చేర్చు శక్తితోను నుందురు.

అస్తమయ కాలమునందు అలసిపోయిన సూర్యభగవానుడు తన తేజస్సును అగ్నియందుంచునని 'ఆదిత్యో వా అస్తంయన్ అగ్నిమను ప్రవిశతి' యను వేదవాక్యములో స్పష్టముగా చెప్పబడినది. కనుక నప్పుడు సూర్యుడు అగ్నిస్వరూపుడై యుండును. అప్పుడతడు భయంకరులగు రాక్షసులను, అనేక మనుష్యులను పుట్టించును. వీరందరు గూడ పాంచజన్యుని [తపు] సంతతి వారుగానే భావింపబడుదురు. తపుని పుత్రుడగు మను [ప్రజాపతి] అనువానికి 'భాను' అనికూడ పేరు. అతనియందు అంగిరసుడు తన ప్రభావమును సంక్రమింపజేసి నూతన జీవనమును కల్పించెను. వేదవిదులగు బ్రాహ్మణులు ఈతనికి 'బృహద్భాను' నామము నిచ్చిరి.

భానునకు 'సుప్రజ-బృహద్భాస' యను నిరువురు భార్యలుండిరి. బృహద్భాస సూర్యుని కూతురు. ఈ యిరువురు భార్యలందు భానుడు ఆరుగురు పుత్రులను కనెను. దుర్బలులకు బలము నిచ్చు 'బలద' అనే పేరుగల అగ్ని భానుని ప్రథమ పుత్రుడు. శాంతులగు ప్రాణులయందు భయంకర క్రోధరూపములో ప్రకటితుడగు 'మన్యుమాన్' అను నగ్ని భానుని రెండవ కొడుకు. మూడవ పుత్రుడు 'విష్ణు' అనువాడు. ఇతనికి 'ధృతిమాన్' అగ్ని అను మరియు పేరు గలదు. ఇతనికి 'దర్శ-పూర్ణమాస' యాగములలో హవిష్యమీయబడును. భానుని నాలవ కొడుకు 'ఆగ్రయణ' నామకుడు. ఇంద్రునితో గూడిన యితనికి 'ఆగ్రయణ' కర్మము (నూతనమగు నన్నముతో చేయబడు యజ్ఞకర్మ)

లో హవిస్సు సమర్పింపబడును. భానుని యైదవకొడుకు 'ఆగ్రహ' నామము గలవాడు. ఇతడు చాతుర్మాస్య యజ్ఞములలో నిత్యము విధింపబడు 'ఆగ్నేయ' మొదలగు నెనిమిది హవిస్సులకు జన్మస్థానీయుడు. ఇతడే 'వైశ్వదేవ' హోమమునందు ప్రధానుడగు 'విశ్వదేవ' నామకుడను నగ్ని. 'స్తుభ' నామకుడు భానుని యారవ పుత్రుడు.

భాను (మను)నకు 'నిశా' యను మూడవ భార్యయందు ఒక కూతురు, ఇరువురు కొడుకులు పుట్టిరి. కూతురు పేరు 'రోహిణి' కొడుకులు 'అగ్ని-సోమ' నామకులు. ఈ ముగురు కాక నిశాదేవికి భానునివలన 'వైశ్వానర-విశ్వపతి సన్నిహిత కపిల-అగ్రణీ' నామకులగు మరి యైదుగురు అగ్నిస్వరూపులగు పుత్రులు పుట్టిరి. వీరిలో వైశ్వానరునకు పర్జన్యునితో పాటు చాతుర్మాస్య యజ్ఞములలో ప్రధాన హవిస్సును సమర్పించుటద్వారా పూజ జరుగును. సర్వజగత్తునకు వేదములలో అధిపతియగు 'విశ్వపతి' యను రెండవ పుత్రుడు. అతని ప్రభావముచేతనే ఆహుతులు మంచిగా నీయబడును గనుక నతడు 'సుమస్విష్టకృత్' (మంచి యిష్టమును పూర్తి చేయువాడు) అని ప్రసిద్ధుడయ్యెను. భానుని కూతురు రోహిణికి గూడ 'స్విష్టకృత్' అనియే ప్రసిద్ధి యేర్పడెను. అట్లైనను, ఆమె చేసిన కొన్ని దుష్కర్మలవలన హిరణ్యకశిపునకు భార్యయయ్యెను. భాను (మనువు) ని యొక్క మూడవకొడుకు 'సన్నిహితుడు' ప్రాణుల ప్రాణముల నాశ్రయించి యుండి వారి యుపయోగములను కార్యములందు ప్రవర్తింపజేయుచుండును. శబ్దరూపములను, రూపము గ్రహింపబడును. నాల్గవ కొడుకగు 'కపిలుడు' తేజశ్శాలి, అగ్నిని ధరించి పోషించువాడు, కల్మషరహితుడు అయినను కల్మష (వికార) స్వరూపమగు జగత్తునకు కర్త. ఇతనిని యతులు 'మహర్షి' యని కొనియాడుచుందురు. ఈ కపిలుడే సాంఖ్యశాస్త్రమునకు ప్రవర్తకుడు. క్రోధస్వరూపుడగు నగ్నికి కపిలుడు ఆశ్రయుడై యుండును. భానునియైదవ పుత్రుడగు 'అగ్రణి' యను నగ్ని ద్వారా అన్నములో నగ్రభాగమును సమస్త ప్రాణులకు ఇవ్వబడుచుండును. ఈ యగ్నులను భానుడు, యజ్ఞకర్మములలో జరుగు తప్పులకు ప్రాయశ్చిత్తము చేయుటకొరకు పుట్టించెను.

"యజ్ఞాగ్నులలో పరస్పరస్పర్శము గాలి వలన నేర్పడినప్పుడు 'శుచి' యను నగ్నియందు 'అష్టాకపాల పురోడాశము' చేత (ఎనిమిది మూకుళ్లలో తయారుచేయబడిన రొట్టెవంటి పదార్థము) హోమము చేయవలెను. యజ్ఞములో 'దక్షిణాగ్ని-గార్హపత్యము ఆహవనీయము' అను మూడు అగ్నులు వేర్వేరుగా నుండును. అందు, దక్షిణాగ్ని-తదితరములగు రెండగ్నులతో కలిసినప్పుడు 'అష్టాకపాల పురోడాశము' తో 'నీతి' యను నగ్ని యందు హోమముచేసినచో ఆ స్పర్శ దోషము పోవును. ఇంటిలోనున్న 'గృహ్యాగ్ని'కి దావానలము (కార్చిచ్చు)తో స్పర్శము కలిగినప్పుడు ఆ హవిస్సుతోనే 'శుచి' యను నగ్నియందు హోమము చేయవలెను. రజస్వలయగు స్త్రీ యాజ్ఞికాగ్నిని స్పృశించినప్పుగూడ నీ యష్టాకపాల పురోడాశముతోనే 'వసుమాన్' అను నగ్నియందు హోమము చేయవలెను. మృత్యుసూచకమగు దుఃఖమును వినినప్పుడును, కుక్క మొదలగు క్షుద్రజంతువుల స్పర్శము యాజ్ఞికాగ్నికి కలిగినప్పుడును ఈ పురోడాశము చేతనే 'సురభిమాన్' అను నగ్నియందు హోమము చేయవలెను. దాని చేత నతడు ప్రసన్నుడగును. నిత్యాగ్ని హోత్రియగువాడు బాధలచేత గాని రోగములచేతగాని, మూడుదినములు హోమము చేయజాలక అపినప్పుడు తద్దోష నివారణార్థముకూడ అష్టాకపాల పురోడాశముతోనే 'ఉత్తర' యను నగ్నియందు హోమముచేసి ప్రాయశ్చిత్తము చేసికొనవలెను. జరుగుచుండు 'దర్శ-పూర్ణమాస' యాగములలో మధ్యన విఘ్నములు కలిగినప్పుడుగూడ ఈ పురోడాశముతోనే 'పథికృత్' అను నగ్నియందు హోమము చేయవలెను. పురుడు వచ్చిన ఇంటిలోని అగ్ని స్పర్శము యాజ్ఞికాగ్నికి కలిగినప్పుడు గూడ నిట్లే 'అగ్నిమాన్' అను నగ్నియందు హోమముచేసి దోష నివారణ చేయవలెను.

'సహ' అను నగ్ని జలప్రవేశము-దాని యదార్థము

మార్కండేయ ముని తరువాత విషయములిట్లు చెప్పదొడగెను : "రాజా! జలమునందు నివసించు వాడగు 'సహ'యను పేరుగల అగ్నికి 'ముదిత' యను భార్య ఉండెను. ఆమె యందు సహునకు 'అద్భుత' నామకుడగు పుత్రుడు పుట్టెను. అతడొక శ్రేష్ఠుడగు నగ్ని. అతడు భూ భువర్లోకములకు ప్రభువు. సమస్త భూతములకు అధిపతి. అంతరియాత్మ స్వరూపుడు. భువన భర్తగా గూడ నుండెను. సర్వజగత్తును పవిత్రీకరించుచు 'గృహపతి'యని ప్రసిద్ధుడయ్యెను. 'ఆప' నామముతో విరాజిల్లు అద్భుతాగ్ని 'బుద్ధితత్త్వ'మునకు అధిపతి అతనికి 'భరతుడు' అను నొక యగ్ని పుట్టెను. ఇతడు శవదహన కర్మను నిర్వర్తించువాడు అగ్నిష్టోమ యజ్ఞములో నితడు నిత్యనివాసము గలవాడు. కనుక నితనికి 'నియత' నామముగూడ కలదు. ఇతని తలంపు సర్వదా మంచిదిగా నుండును అత్యంత ప్రభావశాలియగు నీ భరతుని తాతయగు సహుని దేవతలు వెదకుచుండిరి. వారిలో తన మనుమనిని చూచి యతనిని స్పృశించుటకు భయపడి సహుడు సముద్రములో దూరెను. అప్పుడు ప్రథమాగ్ని యగు సహుని అన్ని దిక్కులలో వెదకుచు సముద్రము వైపుగూడ వచ్చుటను చూచి సహుడు 'అంగిరసుని'తో 'పిరికివాడ నీవే దేవతల కడకు హవిస్సును కొనిపొమ్ము. నేను దుర్బలుడనుగానున్నాను. నీవే అగ్ని పదవియందు ప్రతిష్ఠితుడవుకమ్ము' అని చెప్పి సహుడు వేరుచోటికి పోయెను. అట్లు పోయిన 'అథర్వుని' (అంగిరసుడు) ఉనికిని గూర్చి మత్స్యములు తెలియజేసెను. అది తెలిసి సహుడు కోపముతో 'మీరు అనేక జీవ కోటికి ఆహారముగా నగుదురుగాక' యని మత్స్యములను శపించెను. ఆ తరువాత ఎంత వేడుకొన్నను సహుడు దేవతాహవిర్భారమును మోయుటకు ఇష్టపడక చివరకు తన శరీరత్యాగము చేసెను.

పూర్వ శరీరమును విడిచి సహుడు భూమిలో నైక్యము చెందెను. అక్కడినుండి వివిధ ధాతువులను (లోహములను) సృజించెను. తనలోని చీము నెత్తురులతో గంధకమును, తైజస ధాతువులను (బంగారము మొదలైనవి) ఉత్పత్తి చేసెను. అతని ఎముకల నుండి దేవదారు వృక్షములు, కఫము నుండి స్ఫటికములు

పిత్తము నుండి మరకతమణులు (పచ్చలు) ఉత్పన్నములయ్యెను యకృత్తు (అనగా శరీరము లోపల నీరు తిత్తి క్రింద నుండు మాంస ఖండము) నుండి ప్రాణుల అత్యంతోపయోగకరములగు 'కట్టెలు. పాషాణములు. ఇనుము' లను మూడు పుట్టెను. అతని గోళ్లు మేఘస్వరూపములు నరములు పగడములు ఇంకను అనేక ధాతువులతని శరీరమునుండి ఉత్పన్నములయ్యెను. ఇట్లు నగుచు తన సర్వశరీరమును మార్చి అతడు గొప్ప తపస్సు చేయుచుండెను

అతనిని 'భృగు_అంగిరస్' మొదలగు ఋషులు తపస్సు నుండి విరమింప జేసిరి. అప్పుడు సహుడు తపస్సు చేత అతి తేజశ్శాలియై విరాజిల్లెను. అప్పుడు ఎదుట 'అంగిరసుని' చూచి భయపడి అగ్ని తిరిగి సముద్రములో దూరెను. అగ్ని లేకపోవుట చేత సర్వ ప్రపంచము భయగ్రస్తమయ్యెను. ప్రజలు అంగిరసుని (అథర్వుని) శరణువేడిరి. దేవతలతనిని పూజించిరి. అప్పుడు అథర్వుడు ప్రాణులయందు దయగలవాడై సముద్రమును మథించెను. అగ్నిదేవుని దర్శనము చేసి యథర్వుడు స్వయముగానే సమస్తలోకములను సృజించెను. ఈ విధముగా నదృశ్యుడయిన అగ్నిని అంగిరసుడు ఆహ్వానించెను. ఆ తరువాత అగ్ని సర్వ ప్రాణుల హవిస్సును భరించుటకు ఆరంభించెను.

“సముద్రము లోపలి భాగమునందు సంచరించుచు 'సహు'డను ప్రథమాగ్ని వేదోక్తములగు ననేకాగ్ని దేవతలను, వారి స్థానములను సృజించెను. అగ్నులకు నుత్పత్తి స్థానములగు “సింధునద-పంచనద_దేవికా_సరస్వతీ_గంగా_శతకుంభా_సరయూ_గండకీ_చర్మణ్వతీ_మహీ_మేధ్యా_మేధాతిథి_తామ్రవతీ_కౌశికీ_తమసా_నర్మదా_గోదావరి_వేణా_ఉపవేణా_భీమ_బడబా_భారతీ_సుప్రయోగా--కావేరీ_ముర్మురా--తుంగవేణా_కపిలా_శోణభద్ర” నామకములగు ముప్పది నదీనదములను సృజించెను.

'అద్భుత' నామకుడగు నగ్నికి అతని భార్యనుండి 'విభూరసి' యను పేరుగల పుత్రుడు కలిగెను. ఇంతదాక నెందరు అగ్నులు చెప్పబడిరో అన్ని సోమయాగములున్నవి. ఆ యగ్నులందరు బ్రహ్మదేవుని సంకల్పముచేత 'అత్రి' వంశమునందు జన్మించిరి. అత్రి మహర్షికి సంతానమును కనవలెనను సంకల్పము గలిగినప్పుడే యగ్నులను తన హృదయములో ధరించెను. తరువాత ఆ బ్రహ్మర్షి శరీరమునుండి వేర్వేరు అగ్నులు ఉత్పన్నములైరి.”


“యుధిష్ఠిర మహారాజా! మహాత్ములగు నగ్నుల నుత్పత్తిని గూర్చి నీకు సవివరముగా నుపన్యసించితిని. 'అద్భుత' నామకుడగు నగ్నియొక్క మహిమను వేదములలో చెప్పబడిన విధముగా నీవు వింటివి గదా! ఆ విధముగానే ఇతరాగ్నుల మహిమను గూడ తెలిసికొనవలెను. ఎందుకనగా అన్ని యగ్నుల యందుండు నగ్నితత్త్వ మొకటే యగును. భగవంతుడగు 'అంగిరసుడు' ఒక్కడే మొదటి అగ్నియని తెలిసికొనుము. ఒక్కడే 'జ్యోతిష్టోమ' యజ్ఞము 'ఉద్భిత్' మొదలగు ననే రూపములలో ప్రకటితమైనట్లే ఒకటే అగ్నితత్త్వము 'ప్రజాపతి' శరీరము నుండి భిన్నభిన్న రూపములలో నుత్పన్నమయ్యెను. రాజా! ఈ విధముగా నేను అగ్నిదేవుని యొక్క గొప్ప వంశమును గూర్చి తెలిపితిని. ఆ యగ్ని భగవానుడు వివిధ వేదమంత్రముల చేత పూజింపబడుచు మానవులిచ్చు హవిస్సులను తీసుకొనిపోయి దేవతలకు అర్పించుచుండును. ధర్మరాజా! ఇకపైన కార్తికేయుడగు 'కుమారస్వామి' జన్మమును గూర్చి చెప్పెదను వినుము” అని మార్కండేయ మహాముని యిట్లు చెప్పదొడగెను:_

దేవసేనోద్ధారము


'అద్భుత' నామకుడగు నగ్నికి అద్భుత శక్తిగల కార్తికేయుడు జన్మించెను. అతడు అనంతములగు బలపరాక్రమములు గలవాడు. జన్మము బ్రహ్మర్షుల పత్నుల గర్భమునుండి అయ్యెను. అతని జన్మవృత్తాంతము వినుము.

“పూర్వము దేవదానవములు యుద్ధము చేయుచు పరస్పరము కొట్టుకొనుచుండిరి. భయంకరులగు రాక్షసులే ఆ యుద్ధములు సర్వదా గెలుచుచుండిరి. మాటిమాటికి వధింపబడుచున్న తన సేనను చూచి చింతించుచు నింద్రుడు 'తనకొక సమర్థుడగు సేనాపతి కావలె' ననియు 'నతడు నశించుచున్న దేవసేనను రక్షించగలడు' అనియు చింతించుచు 'మానస పర్వతము' నకు పోయెను. అక్కడ నొక స్త్రీయొక్క ఆర్తనాదమును వినెను. ఆమె 'ఎవరైన వీరుడు త్వరగా పరిగెత్తివచ్చి నన్ను రక్షించి నా పతిని నాకిచ్చుగాక, అథవా అతడే నాకు పతియగుగాక; అని దుఃఖించుచు పిలుచుచుండెను. అది విని యింద్రుడు, భయపడకుము అనుచు ఆమెను సమీపించు సరికి నెదుట 'కేశి' యను రాక్షసుడు ఇంద్రునకు కనపడెను. అతడామెను పట్టుకొని యుండెను. అది చూచి యింద్రుడు 'ఈమెనేల బాధించుచున్నావు. విడువుము. నేను ఇంద్రుడను.' అని బెదరించుచు ననెను. అది విని కేశి రాక్షసుడు ఇంద్రునితో నీవే యీమెను విడిచిపొమ్ము. నేనీమెను వరించితిని. నీవు ప్రాణములతో నీ అమరావతీపురికి పోవదలచినచో నిట్లు చేయుము. అని చెప్పి యతడు ఇంద్రునిపై తన గదను విసిరివేసెను. దాని నింద్రుడు నడుమనే తన వజ్రాయుధముతో ఛేదించెను. పిదప నా రాక్షసుడు పర్వత శిఖరముతో నింద్రుని కొట్టెను. దానినిగూడ వజ్రముతో భేదించెను. క్రిందపడుచున్న శిఖరముచేత రాక్షసుడు కొట్టబడెను. ఆ దెబ్బతో నతడా స్త్రీని విడిచి పారిపోయెను. అప్పుడింద్రుడు 'నీవెవతె' వని యామె నడిగెను. అప్పుడా యిరువురకు నిట్లు సంభాషణ జరిగెను:


(పశేషము)



హిరమండలంలో వరదనీరు




అచ్యుతాపురంలో వరద బాధితులకు నగదు సహాయం
అందచేస్తున్న ఆర్. డి. ఓ.



[illegible]మరపల్లి, అచ్యుతాపురం గ్రామాలమధ్య వరద
నీటిలో మునిగిన చెరకుతోట

శ్రీకాకుళం జిల్లాకు తుఫాను దెబ్బ

గడచిన సెప్టెంబరు నెలలో వచ్చిన తుఫాను వలన
శ్రీకాకుళం జిల్లాలోని కొన్ని ప్రాంతాలలో
పైరలకు విపరీత నష్టం సంభవించింది.




మూఖ లింగంవద్ద దెబ్బతిన్న పైర్లు




పాలవలస వద్ద చెట్లుకూలిన దృశ్యం





2

4



నగరంలో


1. గవర్నరు శ్రీ ఖండూభాయ్ దేశాయ్ డా ఎస్. రమేశన్ వ్రాసిన అప్పయ్య దీక్షితులవారి జీవితచరిత్ర గ్రంథానికి సెప్టెంబరు 24 న ఆవిష్కరణ చేశారు.

2 ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ వార్షిక సమావేశానికి సెప్టెంబరు 11 న ముఖ్యమంత్రి శ్రీ పి వి నరసింహారావు ప్రారంభోత్సవం చేశారు


3 ముఖ్యమంత్రి శ్రీ పి వి నరసింహారావు అక్టోబరు 2 వ తేదీన గాంధీ ఎగ్జిబిషన్‌కు ప్రారంభోత్సవం చేశారు.

4. వి-న సభ స్పీకరు శ్రీ పి రంగారెడ్డి సెప్టెంబరు 22 వ తేదీన విదేశ పర్యటన ముగించుకుని నగరానికి తిరిగి వచ్చినప్పుడు ప్రముఖులు అనేకులు స్వాగతం యిచ్చారు

5. హోం మంత్రి శ్రీ వి కృష్ణమూర్తి నాయుడు అక్టోబరు 6 వ తేదీన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హోంగార్డులు పౌర రక్షణ సిబ్బంది శిక్షణ ముగింపు కార్యక్రమంలో క్రీడలలో గెలుపొందిన వారికి బహుమతులు పంచారు



3



5

సంప్రదాయంగా వస్తూన్న పొగాకు రకాలను సఫలంగా ఎగుమతి చేస్తున్నాం కదా,



మేము ఏళ్ళ తరబడి ఫ్లూక్యూర్డ్ వర్జీనియా పొగాకును ఒకే స్థాయిలో ఎగుమతి చేస్తున్నాము
అయినా, కొత్త రకాల పొగాకు కొరకు శీఘ్రగతిలో అన్వేషణ సాగిస్తున్నాము. ఎందుకు?

అంతర్జాతీయ పోటీని తట్టుకోవటం కోసం. దీనిని మేము మా ప్రధాన కర్తవ్యంగా భావిస్తున్నాము. కొత్తగా పొగాకు ఉత్పత్తి విదేశాలలో మొదలైంది దీనికితోడు కొనుగోలుదారుల అభిరుచులు కూడా మారాయి.

ఇంతవరకూ ప్రాధాన్యత కాంతిగల రంగుపైనే ఉండేది. ఇది అంతర్జాతీయ మార్కెట్‌లో మన ఫ్లూక్యూర్డ్ వర్జీనియా పొగాకుకు అనుకూలంగా ఉండేది. అభిరుచి యిప్పుడు ఫిల్టర్ టిప్ సిగరెట్ల వైపు మొగ్గడంతో, అంతర్జాతీయ కొనుగోలుదారులు ఘనమైన మరియు నిండు లక్షణములు గలిగిన బాగా పరువెక్కి బిరుసైన పొగాకు రకములవైపు మొగ్గుతున్నారు. కొత్తగా కలిగిన యీ అభిరుచికి అనుగుణంగా ఆంధ్రప్రదేశ్, మైసూర్ రాష్ట్రాలలో ప్రత్యామ్నాయంగా కొత్త ప్రాంతాలలో పొగాకు పండించే కృషి చేస్తున్నాం. కొత్త రకాల కొరకు చేస్తూన్న యీ అన్వేషణ ఫలించాలి.

ఈలోగా దేశపు మొత్తపు పొగాకు ఎగుమతిలో మూడవ భాగమగు మన ఎగుమతులు విదేశీయ పోటీకి తట్టుకోవాలి. ఈ పోటీని ఎదుర్కొనడానికి ఎవరో ఒకరు కావాలి.

మరి కొత్త రకాలకోసం నిరంతరం దేనికి పరిశోధన చేస్తున్నట్లు?

ఐ ఎల్ టి డి

ఇండియన్
లీఫ్ టొబాకో
డెవలప్‌మెంట్
కంపెనీ లిమిటెడ్

ఐ ఎల్ టి డి—పొగాకు శాస్త్రీయ వ్యవసాయిక పద్ధతులకు మూలాధారము.

U-IL-C-8 TL

ఇల్లిందకుంట స్వయంవ్యక్త మూర్తులు

ముద్దసాని రాంరెడ్డి

ఆంధ్రదేశం శ్రీరామాలయాలకు పుట్టినిల్లయితే, కరీంనగరం జిల్లా మెట్టినిల్లన వచ్చునేమో! ఆంధ్రులకు శ్రీరామచంద్రుడు ఇలవేలుపు, ఆరాధ్యదైవం; ఆదర్శప్రభువు. ప్రతి ఆరు గురాంధ్రులలో ఒక్కరి నామధేయంలో కొంత భాగంలోనైనా శ్రీ సీతారామ లక్ష్మణులకు స్థానముంటుందనడంలో విప్రతిపత్తి యుండదు. కరీంనగర మండలంలో త్రిలింగ దేశానికి నాసిక లాంటి దనదగు కాళేశ్వరాలయం మొదలుకొని, వేములవాడ రాజ రాజేశ్వర స్వాములేకాక, ధర్మపురి లక్ష్మీ నరసింహస్వాములతో పాటు, ఇల్లిందకుంటలో వెలసిన శ్రీ సీతారామలక్ష్మణస్వాముల కృపా కటాక్ష వీక్షణములు ప్రజానీకంపై సతతం ప్రసరిస్తూనే ఉన్నాయి. ఇవేగాక, ఇక్కడ వెలసిన ముత్తారం శ్రీసీతారామచంద్రులు, రామగిరి శ్రీరామ పాదములు పురాణ ప్రసిద్ధ దేవాలయాలు. ఇః పోతె వారి బంటుకు గల ఆలయాల్లో కొండగట్టు, చీకురాయి, కొండ పలకలకు గల కీర్తి ప్రతిష్ఠలు అనిర్వచనీయాలు.

అశేష ప్రజానీకాన్ని అన్ని కాలాల్లో ఆకర్షిస్తున్న దేవాలయం ఇల్లిందకుంట శ్రీరామాలయం. దీనికి చారిత్రిక ప్రాశస్త్యం అంతగా లేకున్నా, భక్తకోటి భక్తి ప్రపత్తుల నాకట్టు కోవడంలో ఏ ప్రముఖ దేవాలయానికి తీసిపోదు. ఇల్లిందకుంట శ్రీరామక్షేత్రం బల్లార్‌షా–హైద్రాబాదు బ్రాడ్‌గేజి మార్గంలో గల జమ్మికుంట రైల్వే స్టేషన్‌కు రెండు మైళ్ళ దూరంలో ఉంది. ఇల్లిందకుంటకు కరీంనగరం మరియు వరంగల్లు నుండి రోడ్డు మార్గంగా కూడా చేర వచ్చును. ఉత్సవ సమయాల్లో ఆర్.టి.సి. బస్సుల సౌకర్యం కూడా లభ్యమవుతుంది.

శ్రీరామచంద్రుడు పితృవాక్య పరిపాలనార్థం, సీతాలక్ష్మణ సమేతుడై అరణ్యవాసం చేస్తున్న సమయంలో, తండ్రిగారి శ్రాద్ధ కర్మను నిర్వహించుటకుగాను ఇల్లిందకుంటకు సమీపంలో ఒకానొక ఇల్లింద వృక్షం క్రింద వనలభ్య ఫల పుష్పములు, ఇల్లింద ఫలబీజముల తోడ తిథికార్యము నాచరించి, అచటనే గల ఒక రాతి ఫలకముపై పైతృక కర్మకాండ స్మృతికి చిహ్నముగా వెలసెనని జనశ్రుతి. ఇల్లిందకుంట పూర్వనామము "మణిపురము". శ్రీరామచంద్రుడు ఇల్లింద వృక్షచ్ఛాయలో రాతిపై వెలసిన కారణాన, యీ ప్రదేశమునకు ఇల్లిందకుంట యను నామము సార్థక నామమైనది. స్థలచరిత్ర మాహాత్మ్య మిట్లుండ, ఇచట దేవళములను నిర్మించి, అగ్రహారముల నేర్పరచి, ధర్మశాలల నెలకొల్పి, చక్కని మామిడి తోటలను నాటించి, సంగీత, సాహిత్య పుణ్య కథాకాలక్షేపము కొరకొక దివ్యభవనమును కట్టించి, సర్వమూ శ్రీరామార్పణము చేసిన ఘనత ధర్మదాతలగు కటంగూరు వంశీయుడగు రెడ్డి ప్రభువులకు దక్కింది. వీరిలో అగ్రగణ్యుడు కటంగూరు రాఘవ రెడ్డిగారు. ఇతడు పదునైదవ శతాబ్ది ప్రథమ పాదమున తన పూర్వ నివాస స్థలమగు నల్లగొండ జిల్లానుండి ఇక్కడికి వచ్చి మడి మాన్యములనార్జించి, ప్రభువులై కీర్తినార్జించి, మణిపురంలో ఇల్లింద వృక్షచ్ఛాయలో ఎండవానల కోర్చుతూ రాతి ఫలకముపై వెలసిన మూల విరాట్టులగు సీతారామ లక్ష్మణులను గాంచి భక్త్యావేశపరుడై దేవాలయము నిర్మించి, ధర్మప్రభువై రాణించాడు. ఆదాదిగా వారి వంశీయులు, ఆలయ సముద్ధరణకు గోపుర మంటప ప్రాకారాది ధర్మసత్రముల నిర్మాణము గావించి నిరతాన్నదానాది ధర్మ కార్యముల నిర్వాహణకు కంకణ ధారులై వాసి గాంచినారు. వారిలో మడిపల్లె వాసులగు కటంగూరు బుచ్చిరెడ్డిగారు ముఖ్యంగా సంస్మరణీయులు. వీరు తమ సర్వస్వమును ఇల్లిందకుంట శ్రీరామచంద్రునకే సమర్పించి, ఆలయపు నేటి ఔన్నత్యానికి కారకులైనారు.

భద్రాచల రామచంద్రునకు నిజాము నవాబులు కాసులు, కానుకలు ఏటేటా సమర్పించుకున్నట్లే, ఇల్లిందకుంట రామభద్రునికి కూడా ఆంధ్రప్రదేశ్ అవతరణ వరకూ సాలీనా 900 రూప్యముల ఉత్సవ కార్యనిర్వహణకూ, నిత్యదీపధూపారాధనకు సమర్పించుకున్నారు. భద్రాచల రాములకున్నంత ప్రాశస్త్యం, ఇల్లిందకుంట రామచంద్ర ప్రభువుకున్నదనడానికి ఇదొక ప్రత్యక్ష తార్కాణము.

ఇక్కడి స్వయంవ్యక్త మూర్తులను అనగా ఉత్సవ విగ్రహములను గురించిన చక్కని గాథ యొకటి జనవాడుకలో ఉంది. శ్రీరామ పట్టాభిషేక విగ్రహములను తయారించ సంకల్పించిన, రాఘవరెడ్డిగారు శిల్పకళాధురంధరులైన విశ్వబ్రహ్మలను పిలిపించి తన సంకల్పమును వారికి వివరించారు. విశ్వకర్మలు పంచలోహములను కరిగించి ఎన్ని సార్లు ఎత్తి మూసలో పోసిననూ ఆశాభంగమే తప్ప ఆశయసిద్ధి కలుగలేదు. విశ్వకర్మల విశ్వప్రయత్నములూ విఫలమైన కారణాన విసిగివేసారి రెడ్డిగారికి తమ అశక్తతను వ్యక్తం చేశారు. అప్పుడు రెడ్డిగారు వారి ఆచార్యులు సమాలోచనలు జరిపి దైవవిధియని కృతనిశ్చయులై సఫలీకృత మనోరథులగు వరకూ నిరాహార దీక్ష నవలంబించి ప్రజలచేత నిరవధిక రామనామ భజనలు చేయిస్తూ తాము తారకమంత్ర పఠనమున కుపక్రమించారు. అలా చేస్తున్న సమయంలో ఒకనాటి రాత్రి కలలో రెడ్డిగారికి ముగ్గురు యోగులు ఒక యోగిని, కనిపించి మీకు కావలసిన సీతారామ పట్టాభిషేక మూర్తులను రూపొందిస్తామని అభయమిచ్చి తెల్లవారి వస్తామని అంతర్ధానమయినారు. కలలోని వార్తను యదార్థమని విశ్వసించిన రెడ్డి తెల్లవారి జడదారులకొరకు నిరీక్షించారు. మాన్యుల చరిత్రలు మాన్యులకేగాని సామాన్యుల కగమ్య గోచరములు గదా!

అన్న మాట ప్రకారం కాషాయాంబరధారులగు ఇద్దరు పురుషులు, ఒక స్త్రీ రెడ్డిగారి కడకు వచ్చి శ్రీరామునకు వలసిన వస్తు సంచయమును తెలియజేశారు. చైత్రశుద్ధ విదియనాడు శుభలగ్నమున నొక మండపము నిర్మింపబడింది. మండపం మధ్యలో చతురస్రాకారముగల వేదికను నిర్మించి దానిపై రంగవల్లుల నలంకరించి, సుగంధద్రవ్యములనుంచి వేదమంత్ర పఠన జరుగుచుండ ముప్పురు జటావల్కలధారులు వేదికనలంకరించారు. వేదికచుట్టూ సప్త ప్రాకారాకారంలో ఏడు ధవళ వస్త్రములతో శ్రేణులను కట్టించారు. ప్రాకారానికీ ప్రాకారానికీ మధ్య యేడు మూరల ఎడము వదిలారు. ఏడు దినములా నిరవధిక మంత్ర పఠనము, భజన సంకీర్తనలు జరుగునట్లు ఆదేశించబడింది. నాలుగు రోజులు కార్యక్రమం యథావిధిగా జరిగిపోయింది. నాలవ నాటి వేకువ జామున కంసాలికి అసలు రహస్యం తెలుసుకోవాలనే కుతూహలం ఆపరపెట్టుటచేత మెల్లగా ఎవరూ కానకుండా పరదాలలోనికి ప్రవేశించి మెల్లమెల్లగా వేదికను సమీపించాడు వేదికను కంసాలి చూశాడో లేదో కాని కలిసి చెంప ఫెళ్ళున మ్రోగింది. క్షణమే కేకవేసి మూర్ఛిల్లాడు. ఆర్తనాదం విన్న రెడ్డిగారు తదితరులు పరదాలను తొలగించి పరిస్థితిని తిలకించి విభ్రాంతులైనారు. వేదికపై సీతారామలక్ష్మణుల మూర్తులే ముద్దులొలుకుతూ గోచరించాయి. కంసాలి సొమ్మసిల్లి పడియున్నాడు విధివైపరీత్యానికి పరితపించారు. ముగ్గురు యోగులే సీతారామలక్ష్మణ మూర్తులై రూపొందారు. వారే స్వయంవ్యక్తమూర్తులు. అంత చక్కని ఉత్సవ విగ్రహాలు తెలంగాణాలోగల ఏ దేవాలయాల్లోనూ లభించవు.

ఇల్లిందకుంటలో చైత్రశుద్ధ నవమినుండి పౌర్ణమి దాకా శ్రీరామ జననం మొదలుకొని సీతారాముల కల్యాణం వరకు ఉత్సవాలు ఉత్సాహ భరితంగా జరుపబడుతవి. ముఖ్యంగా రథోత్సవం కన్నుల పండువగా ఉంటుంది. ఒక్క రథోత్సవంనాడే 15, 16 వేల వరకు కానుకలు మొక్కుబడులు శ్రీరామునికి ముడుతుంటాయి. ప్రభుత్వమువారు యాత్రికుల సౌకర్యార్థం మరిన్ని ధర్మసత్రాలు నిర్మించి, మంచినీటి వసతిని కలిగించి, ఆరోగ్య సౌకర్యాలు కల్పిస్తే, దైవాదాయం ద్విగుణీకృతం అవుతుందని ఆశించవచ్చు.

సంస్కృతబోధినీ—1

రచయిత—

అనపర్తి శ్రీ సీతారామాంజనేయులు

ఆనందబాల ప్రచురణలు,

గుంటూరు-4

వెల:-రూ 1-25

పాఠశాలల్లో చదివే ప్రాథమిక కక్ష్య బాలబాలికలకు సంస్కృతాన్ని బోధించటానికి సరళమయిన సంస్కృతివాచకాలు దేశంలో అనేకంగా ప్రచురింపబడ్డాయి. నేడు సంస్కృతాభ్యాసం కొరకు విద్యార్థులు తల్లిదండ్రులు ఉత్సాహం చూపిస్తున్నారు. సంస్కృత జ్ఞానం ఏ కొద్ది అలవడ్డా తెలుగుభాషకు దోహదం చేస్తుందనే విషయంలో ఏ మాత్రం సంశయములేదు. సరళ శైలిలో సుబోధకంగా రచింపబడ్డ సంస్కృత బోధిని తెలుగు విద్యార్థులకు నిస్సందేహంగా ఉపయోగపడగలదు. శ్రీ సీతారామంజనేయులుగారు ఈ కృషిలో కృతార్థులయ్యారనే చెప్పవచ్చును. ఇలాంటి పుస్తకాలను ప్రచురించటానికి బాలానంద కేంద్రం (గుంటూరు) ప్రశంసనీయంగా ప్రయత్నిస్తున్నది. గ్రంథకర్త రెండో ముద్రణలో ఏమైనా సవరణలు ఉంటే చేసుకోవచ్చు. చిన్నచిన్న సంస్కృత పదాలకూ, వాక్యాలకు తెలుగులో అర్థాలు వ్రాసి దీన్ని ప్రకటించడంవల్ల తెలుగుద్వారా సంస్కృతం అభ్యసించే విద్యార్థులకు ఈ పుస్తకం ఎంతో ఉపయోగకరంగా ఉంది.

కప్పగంతుల లక్ష్మణశాస్త్రి

జిల్లాల్లో

చిల్లకల్లు సమితిలో పట్టాల ప్రదానం

చిల్లకల్లు సమితిలోని కన్నెవీడు గ్రామంలో హరిజనులకు, ఆర్థికముగా వెనుకబడినవారికి 107 మందికి నివేశన స్థలాలకు, కృష్ణాజిల్లా కలెక్టర్ శ్రీ జి. కుమారస్వామి రెడ్డి పట్టాప్రదానం చేసారు.

యీ సందర్భముగా ప్రసంగిస్తూ, నివేశన స్థలాలకు, పట్టాలు తీసుకొన్న వారు, యీ పట్టాల ద్వారా సంక్రమించిన భూమిని ముందు తరాలవారు కూడా అనుభవించేటట్లు చేసే బాధ్యత వున్నదని, వెంటనే గృహాలను నిర్మించుకోవాలని కోరారు.

వెనుకబడిన వర్గాలు, కుటుంబ నియంత్రణ అమలు పరచాలని, ప్రభుత్వం యిచ్చిన సహాయానికి తోడు తాము స్వశక్తితో ముందుకు రావాలని కోరారు.

కన్నెవీడు గ్రామంలో, నీటిలో ఫ్లోరిన్ ఎక్కువగా వుండుటవలన, దంతముల వ్యాధులు, 40 సం. ల వయస్సు వారికి నడుములు పట్టుట జరుగుతున్నదని, గ్రామ సర్పంచి వివరించిన విషయం ప్రస్తావించి, రక్షిత నీటిపథకం మంజూరు విషయం సానుభూతితో పరిశీలిస్తామని హామీ యిచ్చారు. కరువు పనులకు కేటాయించిన నిధులను సకాలంలో ఖర్చుపెట్ట వలసినదిగా విజ్ఞప్తి చేసారు.

సభకు చిల్లకల్లు సమితి అధ్యక్షులు శ్రీ కొండపు రాధాకృష్ణమూర్తి అధ్యక్షత వహించారు. శ్రీ మొక్కపాటి వెంకటేశ్వరరావు, నందిగాను సమితి అధ్యక్షులు శ్రీ చింతా వెంకటేశ్వరరావు, కంచికచర్ల సమితి అధ్యక్షులు, శ్రీ యస్. విశ్వనాథం, జగ్గయ్యపేట సర్పంచి ప్రసంగించారు.

శ్రీ యం. యన్. రెడ్డి, జిల్లా సోషల్ వెల్‌ఫేర్ ఆఫీసరు, శ్రీ పి. వి. రమణారావు, బి. డి. ఓ. శ్రీ రత్నేశ్వరరావు, అసిస్టెంటు ఇంజనీరు, శ్రీ యం. రామారావు, బి. ఎ. పి. ఆర్. ఓ. పాల్గొన్నారు.

తొలుత గ్రామ సర్పంచి శ్రీ కర్నాటి రామనాథం, కలెక్టరుకు స్వాగత వినతి పత్రం సమర్పించారు.


2-10-72 సోమవారం ఉదయం 10 గంటలకు సమాజ వికాస వారోత్సవాలకు జిల్లా పరిషత్ ఛైర్మన్ శ్రీ వి. రామస్వామిరెడ్డి ప్రారంభోత్సవం చేశారు. సమితి అధ్యక్షులు శ్రీ ఆర్. ఓబుల్‌రెడ్డి అధ్యక్షత వహించారు.

మధ్యాహ్నం నల్లగుట్టపల్లి తాండాలో "సుగాలి" పిల్లలకై ప్రత్యేక పోషక ఆహార కేంద్రమునకు సమితి అధ్యక్షులు శ్రీ ఆర్. ఓబుల్‌రెడ్డి ప్రారంభోత్సవం చేశారు. సాయంత్రం 6 గంటలకు శింగిరిగుంట గ్రామంలో "శ్రీరామా యువజన సంఘ సభ్యులు" సమావేశమై మహాత్మాగాంధీ జీవిత విశేషములు, సమాజ వికాస అభివృద్ధి కార్యక్రమాలలో ప్రజల పాత్రలను గూర్చి చర్చించారు. నాటి దినం యువజన సంఘ సభ్యులు రెండు ఫర్లాంగులు రోడ్డును శ్రమదానంతో బాగుగా మన్నువేసి మరమ్మతు చేశారు. ఎరువు దిబ్బలను కప్పి వేశారు. కంపోస్టు ఎరువు తయారు చేశారు.

3 వ తేదీన చెదళ్ళ గ్రామ యువజన సభ్యులు శ్రీ ఆర్. వి. వెంకటరెడ్డి (సర్పంచ్) ఆధ్వర్యమున సమావేశమై కుటీర పరిశ్రమలు, వ్యవసాయము మరియు చిన్న తరహా పొదుపు ఉద్యమముల అవసరము గురించి చర్చించారు.

4 తేదీన ఏటవాకిలి గ్రామ మహిళా మండలి అధ్వర్యమున వంట ప్రదర్శనను, 5 తేదీన రామసముద్రం మహిళా మండలిలో సభ్యురాండ్రచే వంట ప్రదర్శము జరిగాయి. 6 వ తేదీన పంచాయతీ సమితి ఆవరణములో లేగ దూడల ప్రదర్శన జరిగింది.

7 వ తేదీన మధ్యాహ్నము 2 గంటలకు పుంగనూరు మహిళా మండలిలో సభ్యురాండ్రచే వంట ప్రదర్శనము జరిగింది.



ముఖ్యమంత్రి శ్రీ పి. వి. నరసింహారావు అక్టోబరు 3వ తేదీన భువనగిరిలో హరిజనకాలనీకి ప్రారంభోత్సవం చేశారు

8 వ తేదీన 10 గంటలకు పురాండ్లపల్లి యువజన సంఘ సభ్యులు శ్రీ కా. ఆదినారాయణరెడ్డి (సర్పంచ్) శ్రీ పి. చెంగల్ రాజు (వి. డి. ఒ) గార్ల అధ్వర్యమున వయోజన విద్య, చిన్నతరహా పొదుపు ఉద్యమములు, గ్రామస్థుల చిన్న తగాదాలపై న్యాయస్థానములకు వెళ్ళుటను నివారించుట, అను అంశములపై చర్చలు జరుపబడెను. సమితి అధ్యక్షులు శ్రీ ఆర్. ఓబులురెడ్డి యువజన సంఘము వారు నిర్మించిన భవనానికి ప్రారంభోత్సవము చేశారు. సాయంత్రము 3 గంటలకు సమితి కార్యాలయ ఆవరణములో వారోత్సవముల ముగింపు వేడుకలు జరుపబడెను.

శ్రీ పి. రామస్వామిరెడ్డి (జిల్లాపరిషత్ ఛైర్మన్) అధ్యక్షత వహించారు.

చిత్తూరుజిల్లాలో కరవునివారణ కార్యక్రమం

చిత్తూరుజిల్లా కలెక్టరు శ్రీ వల్లియప్పన్ గత సోమవారం నాడు పత్రికా ప్రతినిధులతో మాట్లాడుతూ కరువు నివారణ పథకం క్రింద చిత్తూరుజిల్లాకు రు. 13 లక్షలు మంజూరుచేశారని అన్నారు. జిల్లాలలోని కరువు తీవ్రతను గూర్చి ప్రభుత్వానికి అప్పుడే తెల్పడం జరిగిందనికూడా ఆయన తెలియజేశారు.

జిల్లాలో బావులను లోతుచేసే 6 యంత్రాలు పనిచేస్తున్నాయి. రు. 16 లక్షల ఖర్చుతో చిన్నతరహా నీటిపారుదల పనులను చేపట్టారు. నిరుద్యోగ సమస్యను పరిష్కరించడానికి మరికొన్ని ప్రాంతాలలో అదనంగా మరో రు.10 లక్షల ఖర్చుతో పనులను చేపట్టారని కలెక్టరు అన్నారు.

ఆపత్కాల తక్కావీరుణాల పంపిణీ నిమిత్తం ప్రభుత్వం యీజిల్లాకు రు. 5 లక్షలు మంజూరుచేసింది. ఈ కార్యక్రమం క్రింద గ్రామీణప్రాంతాలలో అవసరమైన వ్యక్తులకు రుణాలు మంజూరుచేయడానికి సిబ్బందిని ఆయత్తంచేశారు. జిల్లాలలో కరువు పరిస్థితులను నివారించడానికి ప్రభుత్వంనుండి మరింత సహాయం అందుతుందనే ఆశాభావాన్ని జిల్లాకలెక్టరు వ్యక్తంచేశారు.

కీసరాజపల్లిలో హరిజన కాలనీ

నల్గొండ జిల్లా కలెక్టరు శ్రీ ఎల్. సుబ్బయ్య, ఆగస్టు 15 వ తేదీన నల్గొండ తాలూకా కీసరాజపల్లి గ్రామంలో 29 యిండ్ల హరిజన కాలనీకి ప్రారంభోత్సవం జరిపారు. ఈ కాలనీ నిర్మాణానికి రూ. 60,000 ఖర్చు అయింది. కాలనీకి డాక్టరు అంబేద్కర్ పేరు పెట్టారు. ఈ సందర్భంలో జరిగిన బహిరంగ సభలో కలెక్టరు ప్రసంగిస్తూ హరిజనులు తదితర బలహీన వర్గాల శ్రేయస్సుకై ప్రభుత్వం తీసుకొంటున్న సంక్షేమ పథకాలను వివరించి చెప్పారు. హరిజనులు తమ పిల్లలను క్రమం తప్పకుండా పాఠశాలలకు పంపి వారికి విద్యాబుద్ధులు గరపాలని ఉద్బోధించారు. విద్యావంతులు కానిదే ప్రభుత్వం ఎంత సహాయం చేసినా ఇది అంత ప్రయోజనకారిగా ఉండదని అన్నారు. 3,000 యిండ్లతో 75 హరిజన కాలనీనిర్మాణం జరుగుతున్నదని ఆయన తెలిపారు. జిల్లా పరిషత్తు అధ్యక్షులు శ్రీ కె. రంగారెడ్డి కూడా ప్రసంగించారు.

ప్రకాశం శతజయంతి సంఘం


నల్గొండలో జిల్లా కలెక్టరు శ్రీ ఎల్. సుబ్బయ్య అధ్యక్షతన శ్రీ ప్రకాశం శత జయంతి ఉత్సవాల సంఘం ఆగస్టు 17 న జిల్లా పరిషత్తు ఆవరణలో సమావేశమయింది. ప్రకాశం పేరుతో టౌను హాలులో ఒక క్రొత్త విభాగాన్ని నిర్మించడానికి రూ.75,000 లు విరాళాల రూపంలో సేకరించాలని యీ సంఘం నిర్ణయించింది. జిల్లాలో ఉత్తమ ఉన్నత పాఠశాలగా ఎంపిక అయినదానికి రోలింగ్ షీల్డును బహూకరించాలని కూడా నిర్ణయం జరిగింది. ఈ శతజయంతి ఉత్సవాల సందర్భంగా ఆగస్టు 23 న బహిరంగ సభలు కవి సమ్మేళనం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని కూడా యీ సంఘం నిర్ణయించింది. ఈ సమావేశంలో డి.ఆర్.ఓ. శ్రీ పి. వి. విలియమ్స్, సిటీ మునిసిపల్ అధ్యక్షులు శ్రీ రాజరత్నం, మాజీ ఎం. ఎల్. సి. శ్రీ శంకరరావు, శ్రీ పి. రంగారావు, శ్రీ జి. వి. హెచ్. శర్మ, శ్రీ సి. గోపాల రెడ్డి, శ్రీమల్లా రెడ్డి మున్నగు అధికారులు, అనధికారులు పాల్గొన్నారు.

పెదకొండూరులో పాఠశాల

నల్గొండ జిల్లా రామన్నపేట పంచాయతీ సమితి అధ్యక్షులు శ్రీ జి. అనంత రెడ్డి, పెద్దకొండూరు గ్రామంలో రూ. 7,700 ల ఖర్చుతో ఇటీవల నిర్మించబడిన ఒకేగది పాఠశాల భవనానికి ప్రారంభోత్సవం జరిపారు. ఈ సందర్భంలో ఆయన ప్రసంగిస్తూ తల్లి దండ్రులు తమ పిల్లలను తప్పనిసరిగా పాఠశాలలకు పంపాలని ఉద్బోధించారు. పాఠశాలకు అవసరమైన పరికరాలను సరఫరా చేస్తానని ఆయన హామీ యిచ్చారు.

గుంటూరు జిల్లాలో కరువు సహాయక పనుల సమీక్ష

విద్యుచ్ఛక్తి మహిళా సంక్షేమశాఖల మంత్రిణి శ్రీమతి జయప్రద ఇటీవల గుంటూరు జిల్లాలోని అనావృష్టి ప్రాంతాలలో పర్యటన చేశారు. మంగళగిరిలో ఏర్పాటైన సమావేశంలో ఆమె ప్రసంగిస్తూ రాష్ట్రంలోని దుర్భిక్షానికి గురియైన ప్రాంతాలలో బోరింగు బావులు త్రవ్వడానికి ప్రభుత్వం 1.25 కోట్ల రూపాయలు ఖర్చు పెట్టడానికి సంకల్పించిదని, పట్టణప్రాంతాలలో త్రాగునీటి సౌకర్యాలు కల్పించేందుకు రూ. 35 లక్షలు కేటాయించడం జరిగినదని వెల్లడిచేశారు. మంగళగిరి పట్టణానికి రక్షిత నీటి సరఫరా పథకం మంజూరు కాగలదని ఆమె హామీ యిచ్చారు. మందడం గ్రామంలో జరిగిన బహిరంగ సభలో ఆమె ప్రసంగిస్తూ అనావృష్టికి గురియైన ప్రజలకు సహాయంచేయడానికి కేంద్రప్రభుత్వం చేస్తున్న సహాయం చాలక పోవచ్చునని ఆమె చెప్పారు. మాచర్ల



ముఖ్య మంత్రి శ్రీ పి.వి. నరసింహారావు సెప్టెంబరు 9వ తేదీన నెల్లూరు జిల్లా కోవూరులో తాళ్ళ నారాయణ సెట్టి ప్రభుత్వ జూనియర్ కాలేజికి ప్రారంభోత్సవం చేశారు

సబ్ తాలూకా బాగా దెబ్బతిన్నదని ప్రజలు డెల్టా ప్రాంతాలకు వలస పోతున్నారని ఆమె చెప్పారు.

తూళ్లూరు గ్రామంలో ఆమె ప్రసంగిస్తూ వైకుంఠపురం పంపింగు స్కీము త్వరలో చేపట్టబడుతుందని పరిసర గ్రామాలకు త్రాగునీటి సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని ఆమె చెప్పారు. పునాస పంటలు పూర్తిగా చెడిపోవడంవల్ల గుంటూరు జిల్లా తీవ్రమైన అనావృష్టి పరిస్థితులను ఎదుర్కొంటున్నదని ఆమె చెప్పారు.

లోక్‌సభ సభ్యుడు శ్రీ కె. రఘురామయ్య ప్రసంగిస్తూ పీడిత ప్రజల శ్రేయస్సుకై ప్రధానమంత్రి శ్రేయోదాయకమైన సంస్కరణలను అమలు జరుపడానికి తీవ్రకృషి చేస్తున్న యీ తరుణంలో దేశమంతా తీవ్ర అనావృష్టి పరిస్థితులను ఎదుర్కొంటుందని చెప్పారు. కేంద్రంరాష్ట్ర ప్రభుత్వాలు బీద ప్రజలకు తక్షణమే సహాయం చేయడానికి తగిన చర్యలు తీసుకోవాలని చెప్పారు.

తాడికొండ పంచాయతీ సమితి అధ్యక్షులు శ్రీ. పి. అప్పారావు ప్రసంగిస్తూ చౌకధరల దుకాణాలద్వారా మేజర్ పంచాయతీకు వారానికి 8 టన్నుల బియ్యం. మైనర్ పంచాయతీలకు 3 టన్నుల బియ్యం సరఫరా కావాలని సూచించారు.

ఈ పర్యటన సందర్భంలో శ్రీమతి జయప్రద, పెదపరిమి గ్రామంలో 7,000 రూపాయల ఖర్చుతో నిర్మించబడిన ప్రాథమిక పాఠశాల భవనానికి ప్రారంభోత్సవం జరిపారు.

ఖమ్మంలో భూసంస్కరణల దినోత్సవం

ఖమ్మంలో భూసంస్కరణల దినోత్సవ సందర్భంగా యిటీవల ఒక చర్చాగోష్టి ఏర్పాటు చేయబడింది. జిల్లా కలెక్టరు శ్రీ గులాం జిలాని చర్చాగోష్టికి ప్రారంభోత్సవం జరుపుతూ బలహీనవర్గాల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని భూసంస్కరణల కార్యక్రమం ప్రవేశ పెట బడిందని చెప్పారు. ఈ కార్యక్రమం విజయవంతంగా అమలు జరుగడానికి పీలైనంతగా ప్రజలు ప్రభుత్వానికి సహాయ సహకారాలు అందజేయాలని విజ్ఞప్తి చేశారు.

చర్చాగోష్టికి అధ్యక్షత వహించిన శ్రీ ఆర్. భువనసుందరరెడ్డి ప్రసంగిస్తూ భూసంస్కరణల చట్టాన్ని అమలు పరిచే విషయంలో తమ పర భేదం లేకుండా ప్రతి ఒక్కరూ సహకరించాలని చెప్పారు.


ఈ సందర్భంలో సర్వ శ్రీ రామకృష్ణారావు. విశ్వనాథం. జి. కేశవరావు, డా. జి. ఉపేంద్ర రావుగారలు ప్రసంగించారు.

పటమటలో ఒక కొత్త కర్మాగారానికి ముఖ్యమంత్రి ప్రారంభోత్సవం

విజయవాడ వద్ద పటమటలో సెప్టెంబరు 10వ తేదీన ముఖ్యమంత్రి శ్రీ పి. వి. నరసింహారావు ఒక కొత్త సాల్వెంట్ ఎక్స్‌ట్రాక్షన్ ప్లాంటుకు ప్రారంభోత్సవం చేశారు. ఇది సహకార రంగంలో ఏర్పాటు చేయబడింది. దీనిలో 100 మందికి ఉపాధి అవకాశాలు కల్పించబడ్డాయి. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ సహకార సంఘాలు యీ నాడు దోపిడీవర్గాల చేతుల్లో పడి పోయాయనీ, ఇందుకు ఎవరినీ తప్పు పట్టడంవల్ల ఏ ప్రయోజనంలేదనీ, వెంటనే యీ అవకతవకలను సరిదిద్ది సహకార వ్యవస్థలను మళ్ళీ వెలుగులోకి తీసుకు రావడానికి తోడ్పడం చాలా అవసరమనీ అన్నారు.

ఈ కార్యక్రమానికి వ్యవసాయ శాఖా మంత్రి శ్రీ కాకాని వెంకటరత్నం అధ్యక్షత వహించారు. సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి ఎం. వి. కృష్ణారావు, పార్లమెంటు సభ్యురాలు శ్రీమతి టి. లక్ష్మీకాంతమ్మ యీ సందర్భంగా ప్రసంగించారు.

రాష్ట్ర సహకార మార్కెటింగ్ సమాఖ్య అధ్యక్షులు శ్రీ వి.గ. జపతిరావు సభికులకు స్వాగతం పలికారు.



వరంగల్లు జిల్లా రెవిన్యూ అధికారి శ్రీ ఎం.డి అలి, సెప్టెంబరు 11 న భూసంస్కరణల సమావేశంలో ప్రసంగించారు.

ధర్మవరప్పాడు గ్రామంలో గిరిజనులకు ఋణం

విజయవాడవద్దగల ధర్మవరప్పాడులో సహకార సంఘాల రిజిష్ట్రారు శ్రీ కె. ఎం. అహమద్ ఇటీవల గిరిజనులు, బలహీన వర్గాల వారి నిమిత్తం ఒక ఉమ్మడి ఋణ పథకాన్ని ప్రారంభించారు. గిరిజనులకు వివిధ సహకార సంఘాల ద్వారా సహాయ పడడమే యీ పథకం ప్రత్యేకత అని ఆయన పేర్కొన్నారు. జిల్లా కలెక్టరు శ్రీ జి. కుమారస్వామి రెడ్డి యీ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు.

ఈ పథకం వల్ల ధర్మవరప్పాడు గ్రామంలో 22 సుగాలీ కుటుంబాలకు మేకలు, గొర్రెలు, పాడి ఆవులు మొదలైనవి కొనుక్కోడానికి గాను 22 వేల రూపాయలు ఋణంగా యివ్వబడుతున్నది.

కేంద్ర మంత్రి కరువు నివారణ చర్యల సమీక్ష

కేంద్ర కంపెనీ వ్యవహారాల స్టేట్ మంత్రి శ్రీ కె. పి. రఘునాథరెడ్డి సెప్టెంబరు 16 వ తేదీన పిడుగురాళ్ల సమితి సభ్యులను ఉద్దేశించి మాట్లాడుతూ ఉత్పత్తి ప్రధానంగాగల పథకాలను చేపట్టడంద్వారా కరువు పరిస్థితులను శాశ్వతంగా నివారించేందుకు ప్రణాళికా సంఘం తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. సామాన్యుడి అవసరాలను తీర్చేవిధంగా ఒకే ఏజన్సీద్వారా ఆహార పదార్థాలను సరఫరా చేయడానికి వెంటనే కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకొంటుందనకూడా ఆయన చెప్పారు.

మొత్తం సాగుభూమి 29 వేల ఎకరాలలో ప్రస్తుతం 8 వేల ఎకరాలలోనే నాట్లు జరిగాయని, జాతీయం చేయబడిన బ్యాంకులు ఋణాలను మంజూరు చేయడంలేదని సమితి అధ్యక్షుడు శ్రీ ఎస్. ఆంజనేయులు రెడ్డి పేర్కొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వానికి వత్తిడిలేకుండా చేయడానికి నాగార్జున సాగర్ ప్రాజెక్టును కేంద్రం చేపట్టాలని శాసనసభ్యుడు శ్రీ ఎం. నాగిరెడ్డి సూచించారు.

రాజుపాలెం సమితి ప్రాంతంలో రెవిన్యూ వసూళ్ళను వాయిదా వేయవలసిందనీ, కరువు నివారణ చర్యల నిమిత్తం రూ. 10 లక్షలను మంజూరుచేయవలసిందనీ రాజుపాలెం సమితి అధ్యక్షుడు శ్రీ వై. నాగిరెడ్డి రాజుపాలెంలో కేంద్రమంత్రిని అర్థించారు.

విజయవాడలో భూసంస్కరణల దినం

విజయవాడలోని రాష్ట్ర సమాచార కేంద్రంలో భూ సంస్కరణల దినం సెప్టెంబరు 10 న జరుపబడింది. దీనికి శ్రీ ఎ. వెంకటేశ్వరరావు అధ్యక్షతవహించారు. ఈ సందర్భంలో శాసన సభ్యులు శ్రీ డి. రామారావు మాట్లాడుతూ చిన్న కమతాలు వుంటే ఎక్కువ శ్రద్ధతో సేద్యంచేసుకోవడానికి వీలవుతుందనీ, యితరులద్వారా సేద్యంచేయించే పద్ధతి తొలగిపోతుందనీ అన్నారు.

విజయవాణి పత్రిక సంపాదకులు శ్రీ ఎం. శ్రీరామమూర్తి మాట్లాడుతూ ప్రభుత్వ యంత్రాంగం చిత్తశుద్ధితో, మనస్ఫూర్తిగా పనిచేయకపోతే యీ సంస్కరణల అసలు ఉద్దేశమే దెబ్బతినగలదని హెచ్చరించారు.

న్యాయవాది శ్రీ కె. దామోదరయ్య మాట్లాడుతూ భూసంస్కరణలకు ఒక చట్టాన్ని చేసి శ్రీకారం చుట్టిన ముఖ్య మంత్రిగారే, జమీందారులు వేసే ఎత్తులు పారకుండా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు.

తూర్పుగోదావరిజిల్లాలో కరువు నివారణ సహాయ చర్యలు

తూర్పుగోదావరిజిల్లా పరిషత్తు సర్వసభ్యసమావేశం సెప్టెంబరు 24 న జరిగింది. జిల్లా పరిషత్తు అధ్యక్షుడు, శ్రీ ఎస్. బి. పి. బి.కె. సత్యనారాయణరావు సమావేశానికి అధ్యక్షత వహించారు. తూర్పుగోదావరిజిల్లా మెట్ట ప్రాంతాన్ని కరువు ప్రాంతంగా ప్రకటిస్తూ కరువు నివారణ చర్యలకు రూ. 2 కోట్లు మంజూరు ప్రభుత్వాన్ని కోరుతూ ఏకగ్రీవంగా ఒక తీర్మానాన్ని సమావేశంలో ఆమోదించారు. కరువు కాలంలో పని కల్పించడానికి వీలుగా భవనాల నిర్మాణంపైగల నిషేధాన్ని తొలగించాలని ప్రభుత్వాన్ని కోరుతూ మరో తీర్మానాన్ని ఆమోదించారు.

జిల్లా కలక్టరు శ్రీ సయ్యద్ హైదర్ రజా సమావేశంలో ప్రసంగిస్తూ తూర్పుగోదావరి జిల్లాకు యింతవరకు రూ. 67 లక్షలు కేటాయించారని తెల్పారు. మంజూరైన మొత్తాన్ని సకాలంలో ఖర్చుచేస్తే మరికొన్ని నిధులను పొందడంలో ఇబ్బందులేమీ ఉండవని ఆయన హామీయిచ్చారు. కొండకు పద్ధతికి స్వస్తిచెప్పి స్థానికులకు పనులను యివ్వాలని ప్రభుత్వం ఆదేశించిందని ఆయన అన్నారు. జిల్లాలో ఆహారధాన్యాల కొరత లేదని హామీయిస్తూ ప్రత్యేకమైన ఆహారధాన్యాలు ఎక్కువ లభిస్తాయని అన్నారు.

జిల్లా పరిషత్తు అధ్యక్షుడు ప్రసంగిస్తూ పంచాయతీరాజ్ సంస్థలను విశ్వసించి, వారి సహకారం పొందినప్పుడూ పనుల ప్రాతిపదికపైగా గ్రామాల ప్రాతిపదికపై నిధులు కేటాయించినప్పుడూ సత్ఫలితాలు కలుగుతాయని అన్నారు. 1973 మార్చి ఏప్రిల్ నెలలో నీటిపారుదల పనులను చేపట్టడానికి అవకాశం కల్పించాలని ఆయన సూచించారు. పార్లమెంటు సభ్యులు శ్రీ ఎం. ఎస్. సంజీవరావు ప్రసంగిస్తూ కేంద్రంనుండి రూ. 28 కోట్ల సహాయాన్ని పొందడంలో తూర్పుగోదావరి జిల్లా ఎం.పి. లు ప్రముఖ పాత్ర వహించిన దృష్ట్యా కరువు నివారణ సహాయక కార్యక్రమాలకు యీ జిల్లాకు ఎక్కువ నిధులను కేటాయించాలని అన్నారు. ఎరువులకు కొరత ఏర్పడే ప్రమాదం ఉన్నదృష్ట్యా యీ జిల్లాకు తగినన్ని ఎరువులు సంపాదించడానికి ముందుగానే చర్యలు తీసుకోవాలని కలక్టరుకు, జిల్లా పరిషత్తు అధ్యక్షునికీ ఆయన విజ్ఞప్తి చేశారు.

నెల్లూరుజిల్లాలో అనావృష్టి పరిస్థితులు: అధికారులతో మునిసిపల్ మంత్రి చర్చలు

రాష్ట్ర మునిసిపల్ శాఖామంత్రి మాణిక్‌రావు యిటీవల నెల్లూరులో జిల్లా అధికారుల సమావేశంలో అనావృష్టి పరిస్థితులను గురించి చర్చలు జరుపుతూ ప్రభుత్వం అనావృష్టి పరిస్థితులు గమనించి, తగిన సహాయకచర్యలు తీసుకోవడానికి కృతనిశ్చయంతోవుందని చెప్పారు. ఆయన ఇంకా ఇలా అన్నారు. త్రాగునీటి సరఫరా పథకాలను అమలు జరపడానికి ప్రభుత్వం యెంతైనా ఖర్చుపెట్టడానికి సిద్ధంగావుంది. రాష్ట్రంలో అన్ని గ్రామాల్లో త్రాగు నీటి సౌకర్యాలు కల్పించేందుకు రూ.15 కోట్లు మంజూరుచేయవలసిందని కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం అభ్యర్థించింది. కేంద్రం రూ. 5 కోట్లు మంజూరు చేసింది. ఈ మొత్తంలో సగం డబ్బు త్రాగు నీటి పథకాలకొరకై ఖర్చుపెట్టబడుతుంది. మిగిలి పోయిన పనులను పూర్తి చేయడానికి

ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తున్నది. జిల్లాలో అనావృష్టి పరిస్థితులను ఎదుర్కొనేందుకు జిల్లాకు తగినవాటా లభిస్తుందని, మంత్రి సభ్యులకు హామీ ఇచ్చారు.

జిల్లా కలెక్టరు శ్రీ ఆర్. పార్థసారథి ప్రత్యేకంగా అనావృష్టిని ఎదుర్కొనడానికి రూ 173 లక్షల ఖర్చుకాగల పనులు తయారుచేసి అమలు జరుపుతున్నట్లు చెప్పారు.

పశుగ్రాసం ఈ జిల్లా నుంచి ఇతర చోటులకు రవాణా కాకుండా తగిన చర్యలు తీసుకోబడుతాయని కలెక్టరు చెప్పారు. జిల్లాలో ప్రతి రెండు పంచాయతీలకు ఒకటి చొప్పున చౌకధర దుకాణాలు తెరవబడుతాయనీ, సర్పంచ్ గ్రామాధికారి వి. యల్. డబ్ల్యూలతో కూడిన సంఘంతో ఈ దుకాణాలను నిర్వహిస్తారని కూడా ఆయన వెల్లడిచేశారు

ఈ సమావేశంలో జిల్లా పరిషత్తు అధ్యక్షులు శ్రీ యం. గోపాలకృష్ణారెడ్డి, సమితుల అధ్యక్షులు కూడా పాల్గొన్నారు

శ్రీ మాణిక్యరావు నెల్లూరు రూరల్‌లో గ్రామసుంకరులకు 518 బంజరు పట్టాలు 183 నివేశనస్థలాల పట్టాలు పంపిణీచేశారు. వంద మంది రైతులకు తలకు రూ 50 ల చొప్పున రూ. 5000 వరకు ఆయన పశుగ్రాస రుణాలు కూడా పంచిపెట్టారు

N. S. F.

NIFA SWEETS

CATTLE FEED AND POULTRY FEED

The Nizam Sugar Factory Ltd (one of the biggest sugar factories in India), are now in the market with their improved quality NIFA SWEETS manufactured in their factory at Azamabad, cattle and poultry feeds manufactured in their factory at Shakarnagar.

NONE NICER THAN NIFA SWEETS FOR QUALITY AND TASTE

Nizam Sugar Factory animal feeds are made from quality raw materials, are balanced, vitaminised and stabilised to meet the nutritional requirements of livestock.

Nizam Sugar Factory cattle feeds ensure high milk production

Nizam Sugar Factory poultry feeds yield increased productivety and profit

THE NIZAM SUGAR FACTORY LTD.

(A Government Company)
"Shakar Bhavan", Fateh Maidan Road,
HYDERABAD.

Factory : Shakarnagar, Nizamabad district (A.P.)

మీ భూములకు బ్యాంక్ ఆఫ్ బరోడా వారిచ్చే ఒక క్రొత్త రకపు 'ఎరువు'...

వ్యవసాయదారులకు వ్యవసాయ అప్పులు

డబ్బే ముఖ్యమైన ఎరువు
మీ భూములు బాగుగా పండుటకు మంచి విత్తనములు ఆధునికమైన పరికరములు మరియు
ఉపకరణములు మంచి నీటి పారుదల వసతులే కాక ఎరువులు కూడ కావాలి. వాటిని కొనుటకు
మీకు డబ్బు కావాలి
డబ్బును ఆశ్చర్యకరమైనంత సులభముగా పొందగలరు
మీరు చేయవలసినదంతా, బ్యాంక్ ఆఫ్ బరోడాకు వచ్చి, వ్యవసాయ అప్పు కావాలని అడిగితే చాలును.
మీకు వీలైన ఒడంబడికల మీద అప్పు యిస్తాము.
మమ్మల్ని వెంటనే సంప్రదించండి మా వ్యవసాయ అప్పు మీకు ఎంత మంచి ఎరువో చూపుటకు
మేము ఎదురు చూస్తున్నాము

సిరిసంపదలకు అక్షయపాత్ర

బ్యాంక్ ఆఫ్ బరోడా

భారతదేశమంతటా మరియు విదేశములలో—
యు. కె., తూర్పు ఆఫ్రికా, మారిషస్, ఫిజీ ద్వీపములు
మరియు గియానా — 650 పైగా బ్రాంచీలు కలవు.



Shilpi BOB. 8/72 Tel.

PUBLISHED BY THE DIRECTOR OF INFORMATION, PUBLIC RELATIONS & TOURISM, ANDHRA PRADESH HYDERABAD
PRINTED BY THE DIRECTOR OF PRINTING, GOVT OF ANDHRA PRADESH, AT THE GOVT CENTRAL PRESS HYDERABAD

సమైక్యతా సందేశం

ఆంధ్రప్రదేశ్ అవతరణ
దినోత్సవ సందర్భమున
ముఖ్యమంత్రి సందేశం

"ఆంధ్రప్రదేశ్ అవతరించి పదిహేడవ సంవత్సరం ప్రారంభమైనది. భవిష్యత్తులో ప్రగాఢవిశ్వాసంతో మన రాష్ట్రం పురోగమిస్తున్నది. అనేక జటిల సమస్యలను ధైర్యంగా యెదుర్కొని వాటిని సామరస్యంగా పరిష్కరించేందుకు మన రాష్ట్రం కృతనిశ్చయంతో వున్నది. సమైక్యతా ప్రాతిపదిక బలపడి రాష్ట్రానికి నూతన స్థిరత్వం చేకూరింది. బలహీన వర్గాల స్థితిగతులను చక్కబరచడానికి అనేక సత్వర చర్యలను తీసుకొన్నది. గ్రామీణ సమాజ వ్యవస్థలో వున్న అసమానత్వాలను తొలగించడానికి భూసంస్కరణలు సమర్థవంతంగా అమలు పరచబడుతాయి.

అనేకరంగాలలో రాష్ట్రాన్ని ఈ సంవత్సరం యెదుర్కొన్న సమస్యల పరిష్కారంలో చైతన్యవంతమైన నూతన దృక్పథం అవలంబించి అధిగమించడం జరిగింది. ఈ సంవత్సరం తీవ్రమైన అనావృష్టి ఏర్పడినందువల్ల, ప్రధానమంత్రి సూచించినట్లు ఇది చాల క్లిష్టమైనకాలం అనావృష్టివల్ల ఏర్పడిన పరిస్థితిని ధైర్యంగా యెదుర్కొని దారిద్ర్యం, నిరుద్యోగ సమస్యలను పారద్రోలడంలో ప్రజాసహకారం లభించగలదనే విశ్వాసం నాకు వుంది.

సమైక్యరాష్ట్రంలో నాలుగున్నర కోట్ల తెలుగు ప్రజల సమిష్టి భవితవ్యంపట్ల విశ్వాసంతో సత్వర ఆర్థికప్రగతికీ, రాష్ట్రాభివృద్ధికీ అందరూ కలిసి కట్టుగా కృషి చేస్తూ, మనం పురోగమించగలము. రాష్ట్రంలో ఉభయప్రాంతాల ప్రయోజనాలను న్యాయదృష్టితో కాపాడి రాష్ట్రసమైక్యతను కాపాడడం మన కర్తవ్యం. అనేక ఒడుదుడుకులకు గురిఅయినప్పటికీ బహుముఖ ప్రగతిసాధించి తెలుగు ప్రజలకు బలిష్టమైన ఒక రాష్ట్రాన్ని నిర్మించి భావితరాలవారి కృతజ్ఞతలు చూరగొందాము."


Reg o. H. 133